అనుదినం... జనస్వరం

www.navatelangana.com

# నవతెలంగాణ

సోమవారం 18-3-2024

సమగ్ర తెలుగు దినపత్రిక

సంపుటి : 10 సంచిక : 77

Published from Hyderabad, Rangareddy, Khammam, Karimnagar

14 పేజీలు వెల : 6.50

## సీఏఏపై స్టే విధించాలి

### సుప్రీంలో కేరళ పిటిషన్



న్యూఢిల్లీ: సవరించిన పౌరసత్వ చట్టం (సీఏఏ) అమలుపై స్టే విధించాలంటూ కేరళ ప్రభుత్వం మరోసారి సుప్రీంకోర్టును ఆశ్రయించింది. సీఏఏ వివక్షాపూరితం, రాజ్యాంగ మౌలిక సూత్రాల్లో ఒకటి అయిన లౌకికవాదానికి విరుద్ధం అని కేరళ ప్రభుత్వం తన పిటిషన్‌లో పేర్కొంది. సవరించిన పౌరసత్వ చట్టం అమలుకు ఈ నెల 11న కేంద్ర ప్రభుత్వం నోటిఫికేషన్ జారీ చేసింది. డిసెంబర్ 31, 2014 కి ముందు ఎలాంటి గుర్తింపు కార్డులు లేకుండా పాకిస్తాన్, బంగ్లాదేశ్, ఆఫ్ఘనిస్తాన్ నుంచి మతపరమైన హింస కారణంగా ...13లో

# ఆదాయం పెంచుతాం... పేదలకు పంచుతాం

## ఇదే ప్రభుత్వ విధానం

- సామాజిక న్యాయానికి తొలి ప్రాధాన్యత
- బతుకమ్మ, బోనాలు వేడుకల్లో ప్లాస్టిక్ పూలు ఉండవు
- విద్యుత్ రంగాన్ని గాడిన పెడుతున్నాం
- వ్యవస్థలోని గంజాయి మొక్కల్ని పెకలిస్తాం
- చేరికలకు తెరిచింది ఒకే గేటు...
- ఫోన్‌ట్యాపింగ్‌పై కేంద్రం విచారణకు ఆదేశించాలి
- ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాలు కావాలంటే దరఖాస్తులు చేసుకోవాల్సిందే...
- నిజాంకు నకలు కేసీఆర్ : వందరోజుల పాలనపై మీట్ ది ప్రెస్‌లో సీఎం రేవంత్‌రెడ్డి



మీట్ ది ప్రెస్‌లో మాట్లాడుతున్న ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి

నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

రాష్ట్రంలో ఆదాయం పెంచి, పేదలకు పంచడమే తమ ప్రభుత్వ విధానమని ముఖ్యమంత్రి ఏ రేవంత్‌రెడ్డి స్పష్టం చేశారు. దానికోసం వ్యవస్థల్ని ప్రక్షాళన చేస్తూ, దుబారాను కట్టడి చేస్తున్నామనీ, అనవసర వ్యయాలు తగ్గిస్తే ఆదాయం పెరిగినట్టేనని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ఏర్పడిన తర్వాత వంద రోజుల పాలన పూర్తయిన సందర్భంగా తెలంగాణ స్టేట్ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్స్ (టీయూడబ్ల్యూజే) ఆధ్వర్యంలో ఆదివారంనాడిక్కడి బషీర్‌బాగ్ దేశోద్ధారక భవన్‌లో 'మీట్ ది ప్రెస్' నిర్వహించారు. దీనిలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పాల్గొని వందరోజుల పాలన, ప్రభుత్వ ప్రాధాన్యతలు, భవిష్యత్ ప్రణాళికలు వివరించారు. విలేకరులు అడిగిన పలు ప్రశ్నలకు సమాధానాలు చెప్పారు. "దుబారా తగ్గిస్తే, సంపద సృష్టించినట్టే. ప్రాధాన్యతలు నిర్ణయించుకొని, దుర్వినియోగాన్ని నియంత్రిస్తున్నాం. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మధ్య మ్యాచింగ్ గ్రాంట్‌లు ఉంటాయి. ఇది సాగునీటి ప్రాజెక్టులకూ వర్తిస్తుంది. 2015లో మోడీ సర్కారు జాతీయ ప్రాజెక్టుల విధానాన్నే రద్దు చేసింది. మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ ఎప్పుడు ఢిల్లీ వెళ్లినా జాతీయ ప్రాజెక్ట్ ఇవ్వాలని లెటర్ ఇచ్చి వచ్చేవారు. ఆ స్కీమే లేనప్పుడు లెటర్లు ఇచ్చి ఏం ప్రయోజనం. కేంద్రం పీఎమ్‌కేఎస్‌వై అనే కొత్త పథకం తెచ్చింది. దానిలో నిర్ణీత ఫార్మాట్‌లో దరఖాస్తు చేసుకుంటే కేంద్రం నుంచి నిధులు వస్తాయి. 60 శాతం కేంద్ర నిధులు ఇస్తే, ...5లో


ఈడీ కార్యాలయంలో కేటీఆర్, కవిత భర్త అనిల్

# కవితను కలిశారు

### భర్త అనిల్‌తో పాటు కేటీఆర్, హరీశ్‌రావు భేటీ

- తొలిరోజు పరిణామాలపై ఆరా
- ధైర్యంగా ఉండాలి.. న్యాయ సహాయం అందిస్తామని భరోసా

నవతెలంగాణ-న్యూఢిల్లీ బ్యూరో

ఢిల్లీ లిక్కర్ స్కాంలో ఎన్ ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) కస్టడీలో ఉన్న బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవితను ఆదివారం కుటుంబ సభ్యులు కలిశారు. ప్రతిరోజు సాయంత్రం 6 నుంచి 7 గంటల వరకు కుటుంబ సభ్యులు, ఆమె న్యాయవాదులు కలిసేలా రౌస్ ఎవెన్యూ కోర్టు కస్టడీ ఆర్డర్‌లో మినహాయింపు ఇచ్చింది. దీంతో ఆదివారం సాయంత్రం న్యాయవాది మోహిత్ రావుతో కలిసి కవిత భర్త అనిల్, సోదరుడు కేటీఆర్, బావ హరీశ్ రావులు ఆమెను కలిశారు. దాదాపు గంట పాటు సాగిన ఈ ములాఖాత్‌లో... కస్టడీలో తొలి రోజు జరిగిన




పరిమాణాలు, అధికారుల తీరు, ఆరోగ్య పరంగా ఎదురైన సమస్యలు, ఇతర అంశాలపై చర్చించినట్టు తెలిసింది. కవిత కస్టడీలో ఉన్న ఏపీజే అబ్దుల్ కలాం రోడ్ లోని ఈడీ ప్రధాన కార్యాలయం (ప్రవర్తన్ భవన్)కు సాయంత్రం 6 గంటలకు ముందే అనిల్, కేటీఆర్, ...13లో

## బీజేపీ ఎంపీ బాండ్ల గేమ్




- రూ.45 కోట్ల బాండ్లు కొనుగోలు చేసిన రిత్విక్ ప్రాజెక్ట్స్
- దాని వ్యవస్థాపకుడు సీఎం రమేష్

వివరాలు 3లో

## తమిళనాడులో రెండు స్థానాలకు సీపీఐ(ఎం) అభ్యర్థులు..



- మదురై నుంచి సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత ఎస్.వెంకటేశన్
- డిండిగల్ అభ్యర్థిగా ఆర్. సచ్చితానందం



వివరాలు 13లో

# వెబ్‌సైట్‌లో ఎలక్టోరల్ బాండ్ల డేటా

### మరోసారి వివరాలను పెట్టిన ఈసీ

- బాండ్లను స్వీకరించని వామపక్ష పార్టీలు




నవతెలంగాణ-న్యూఢిల్లీ బ్యూరో

ఎలక్టోరల్ బాండ్ల వివరాలను ఆదివారం కేంద్ర ఎన్నికల సంఘం మళ్లీ వెబ్‌సైట్‌లో పెట్టింది. సుప్రీంకోర్టు సూచనతో బాండ్ల వివరాలను ఈసీ వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచింది. మరోసారి వివరాలు వెబ్‌సైట్‌లో పొందుపరిచినట్టు ఎక్స్‌లో ఈసీ పేర్కొంది. సుప్రీం కోర్టు ఆదేశాల మేరకు స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్‌బీఐ) ఇటీవల ఈసీకి ఎలక్టోరల్ బాండ్ల వివరాలను పీడీఎఫ్ రూపంలో అందించిన విషయం తెలిసిందే. ఆ తరువాత ఈసీ డేటాను వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచింది.

అయితే, ఎస్‌బీఐ బాండ్ల ఆల్ఫా న్యూమరిక్ నంబర్లను ఎన్నికల కమిషన్‌కు అందించకపోవడంపై ఇటీవల సుప్రీంకోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. సీజేఐ జస్టిస్ డివై చంద్రచూడ్, జస్టిస్ సంజీవ్ ఖన్నా, జస్టిస్ బిఆర్ గవాయ్, జస్టిస్ జెబి పార్దివాలా, జస్టిస్ మనోజ్ మిశ్రా ధర్మాసనం ఎస్‌బీఐ తీరును తప్పుపట్టింది. ఎలక్టోరల్ బాండ్ల వివరాల వెల్లడిపై 11న తాము ఇచ్చిన ఆదేశాలను పూర్తిస్థాయిలో పాటించలేదంటూ మండిపడింది.

బాండ్ల ఆల్ఫా న్యూమరిక్ నంబర్స్ లేకపోవడంతో ఏ కంపెనీ ఏ పార్టీకి ఎంత విరాళాలు ఇచ్చిందో స్పష్టంగా తెలియడం లేదని.. బాండ్లతో ముడిపడిన అన్ని వివరాలను గతంలోనే స్పష్టం చేశామని.. అయినా ఆ సమాచారం ఎందుకు ఇవ్వలేదంటూ ఆగ్రహం వ్యక్తం చేసింది. కేసు విచారణను 18కి వాయిదా వేసిన సర్వోన్నత న్యాయస్థానం.. ఎస్‌బీఐకి నోటీసులు జారీ చేసింది. ఆదేశాలను ఎందుకు అమలు ...13లో

# బీజేపీకి అంత సీన్‌లేదు

- రాజ్యాంగాన్ని మార్చేంత ధైర్యమూ లేదు : రాహుల్ గాంధీ



ముంబయి న్యాయ్ సంకల్ప్ ముగింపు పాదయాత్రలో రాహుల్, ప్రియాంక గాంధీ

ముంబయి : బీజేపీది హడావుడి మాత్రమేనని, రాజ్యాంగాన్ని మార్చేంత ధైర్యం లేదని కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ వ్యాఖ్యానించారు. రాజ్యాంగ సవరణలకు, అవసరమైన మార్పులకు పార్లమెంటు ఉభయ సభల్లో తమ పార్టీకి మూడోవంతు మెజార్టీ అవసరమని బీజేపీ ఎంపీ అనంత్‌కుమార్ హెగ్డే ఇటీవల వివాదాస్పద వ్యాఖ్యలు చేసిన సంగతి తెలిసిందే. ఆదివారం ప్రియాంకగాంధీతో కలిసి ముంబయిలో 'జోడో న్యాయ్ సంకల్ప్ పాదయాత్ర' నిర్వహించారు. ఈ సందర్భంగా రాహుల్ గాంధీ మాట్లాడారు. సత్యం, ప్రజల మద్దతు తమవైపే ఉన్నాయని అన్నారు. ప్రస్తుతం జరుగుతోన్న యుద్ధం బీజేపీ, కాంగ్రెస్‌ల మధ్య మాత్రమే కాదని, రెండు సిద్ధాంతాల మధ్య పోటీ నెలకొందని అన్నారు. అధికారం మొత్తం ఒకే దగ్గర ఉండాలని ఆ పార్టీ కోరుకుంటోందని, అధికార వికేంద్రీకరణ జరగాలని, ప్రజల గొంతుకను వినిపించాలని తాము భావిస్తున్నామని తెలిపారు. జ్ఞానం ఒకరి దగ్గరే ఉంటుందని, రైతులు, కార్మికులు, నిరుద్యోగ యువతకు జ్ఞానం ఉండదని బీజేపీ, ఆర్ఎస్ఎస్‌లు భావిస్తున్నాయని విమర్శించారు. ఓ వ్యక్తి ఐఐటీ డిగ్రీ పొందినంత మాత్రాన అతను రైతు కంటే ఎక్కువ తెలివైనవాడని కాదని రాహుల్ గాంధీ అన్నారు. జనవరి 14న మణిపూర్‌లో ప్రారంభించిన భారత్ జోడో న్యాయ్ యాత్రను 63వ రోజైన శనివారం సాయంత్రం ముంబయిలోని డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ స్మారకం 'చైత్యభూమి' వద్ద ముగించారు. ఈ సందర్భంగా అంబేద్కర్‌కు నివాళు లర్పించారు. రాజ్యాంగ ప్రవేశికను చదివారు.


కాంగ్రెస్‌పార్టీలో చేరుతున్న చేవేళ్ల ఎంపీ రంజిత్‌రెడ్డి, దానం నాగేందర్

# గేట్లెత్తిన కాంగ్రెస్

### కారు దిగుతున్న నేతలు

- కమలాన్ని దాటుకుంటూ హస్తం గూటికి...
- మొన్న జితేందర్‌రెడ్డి, పసునూరు
- నేడు ఎంపీ రంజిత్‌రెడ్డి, ఎమ్మెల్యే దానం
- గ్రేటర్ హైదరాబాద్ బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు త్వరలో ఖాళీ.!
- ఆ తర్వాత ఒకరికి మంత్రి పదవి
- బీజేపీ ఎంపీ సోయంబాపూరావు కూడా..

ఇదే దారిలో ఇంకొంత మంది నేతలు..

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

"మేం గేట్లు తెరిస్తే బీఆర్ఎస్ ఖాళీ అవుతుంది". ఇవి ఇటీవల సీఎం రేవంత్‌రెడ్డి అన్న మాటలు. ఇప్పుడు అన్నంత పని చేశారు. బీఆర్ఎస్ నేతలు కారు దిగి హస్తం గూటికి వరుస కడుతున్నారు. ఒకవైపు ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత అరెస్టుతో బీఆర్ఎస్ నేతలు బాధలో ఉన్నారు. మరోవైపు పాత వారిని కాదని బీజేపీ కొత్త వారికి టికెట్లు ఇచ్చి, పెద్ద పీట వేయడంతో ఆ పార్టీలో అంతర్గత అసంతృప్తి రగులుతున్నది. ఆ రెండు పార్టీలు అంతర్గత ఇబ్బందులను ఎదుర్కొటున్న నేపథ్యంలో కాంగ్రెస్ పార్టీ వ్యూహాత్మకంగా గేట్లెత్తేయడంతో ప్రత్యర్థి పార్టీలకు ఊహించని షాకులు తగులుతున్నాయి. ఈ పరిణామాలు ప్రస్తుతం రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశమవుతున్నాయి. మొన్న బీజేపీ నేత, మాజీ ఎంపీ జితేందర్‌రెడ్డి, బీఆర్ఎస్ సిట్టింగ్ ఎంపీ పసునూరి దయాకర్ కాంగ్రెస్ గూటికి చేరారు. నిన్న చేవెళ్ల ఎంపీ రంజిత్‌రెడ్డి, గ్రేటర్ హైదరాబాద్‌లో బలమైన బీఆర్ఎస్ నేత, ఎమ్మెల్యే దానం నాగేందర్‌లు కాంగ్రెస్ కండువా కప్పుకోవడంతో ఈ చేరికలు ఊపందుకున్నాయి. ఇదే ఊపులో గ్రేటర్ హైదరాబాద్ పరిధిలోని ఎమ్మెల్యేలు ...5లో

## జూన్ 2నే అరుణాచల్, సిక్కిం అసెంబ్లీల కౌంటింగ్




న్యూఢిల్లీ : అరుణాచల్ ప్రదేశ్, సిక్కిం అసెంబ్లీ ఎన్నికల షెడ్యూల్‌లో ఎన్నికల కమిషన్ (ఈసీ) మార్పులు చేసింది. ఈ రెండు రాష్ట్రాల అసెంబ్లీల గడువు జూన్ 2తో ముగియనున్నందున కౌంటింగ్ తేదీని జూన్ 4కి బదులుగా జూన్ 2కు మార్పు చేసినట్టు ఇసి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపింది. లోక్‌సభ ఎన్నికలతోపాటు నాలుగు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికల కౌంటింగ్ జూన్ 4న చేపట్టనున్నట్టు శనివారం ప్రకటించిన ఈసీ, ఆదివారం ఈ మేరకు మార్పులు చేసింది. ఆ రెండు రాష్ట్రాల్లోని పార్లమెంట్ నియోజకవర్గాల కౌంటింగ్‌లో ఎలాంటి మార్పు ఉండదని పేర్కొంది. అరుణాచల్ ప్రదేశ్, సిక్కిం రాష్ట్రాలతోపాటు ఆంధ్రప్రదేశ్, ఒడిశా రాష్ట్రాలలోనూ అసెంబ్లీ ఎన్నికలు జరగనున్నాయి.

## కేజ్రీవాల్‌కు మరోసారి ఈడీ సమన్లు

### ఇది మరో తప్పుడు కేసు : ఆప్



న్యూఢిల్లీ : ఢిల్లీ ముఖ్యమంత్రి కేజ్రీవాల్‌కు ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) ఆదివారం మరోసారి సమన్లు జారీ చేసింది. ఢిల్లీ లిక్కర్ స్కామ్ కేసులో ఈ నెల 21న విచారణకు హాజరుకావాలని ఆదేశించినట్లు అధికారిక వర్గాలు తెలిపాయి. కేజ్రీవాల్‌కు ఇడి సమన్లు జారీ చేయడం వరుసగా ఇది తొమ్మిదోసారి. మనీలాండరింగ్ నిరోధక చట్టం (పీఎంఎల్ఎ) కింద కేజ్రీవాల్ వాంగ్మూలాన్ని నమోదు చేసేందుకు తొమ్మిదవసారి సమన్లు జారీ చేసినట్టు ఆ వర్గాలు వెల్లడించాయి.

ఢిల్లీ లిక్కర్ పాలసీ కేసులో సమన్లకు కేజ్రీవాల్ స్పందించడం లేదంటూ ఢిల్లీ కోర్టులో ఈడీ రెండు ఫిర్యాదులు నమోదు చేసింది. ఈ ఫిర్యాదులపై విచారణ సందర్భంగా ...13లో

# వాట్సాప్ గ్రూపులు సిద్ధం

### ఇన్‌ఫ్లూయెన్సర్లకు డిమాండ్

- సోషల్ మీడియాలో వినూత్న ప్రచారాలు
- ఎన్నికల ప్రచారం షురూ కావటంతో రాజకీయ పార్టీల వ్యూహాలు



**ప్రపంచంలోనే అతిపెద్ద ఎన్నికల కసరత్తుకు భారత్ సిద్ధమవుతున్నది. రాజకీయ పార్టీలు ఇప్పటికే తమ ప్రచారాన్ని షురూ చేశాయి. ఈ నేపథ్యంలో వాట్సప్ గ్రూపులు, సోషల్ మీడియా ఇన్‌ఫ్లుయెన్సర్‌లకు డిమాండ్ పెరుగుతున్నది. ఓటర్లను ఆకర్శించేందుకు రాజకీయ పార్టీలు వీటితో పాటు పలు వ్యూహాలను పన్నుతున్నాయి. వివిధ మార్గాల్లో ముందుకు వెళ్తున్నాయి. 2024 లోక్‌సభ ఎన్నికలకు ముందు రాజకీయ పార్టీలు తమ విజయాలను, ప్రత్యర్థి పార్టీల వైఫల్యాలను ప్రచారం చేయటానికి, ఓటర్ల నుంచి మద్దతు పొందడానికి సోషల్ మీడియాను విస్తృతంగా ఉపయోగిస్తున్నాయి.**

న్యూఢిల్లీ: భారత్‌లో ప్రతినెలా 50 కోట్లకు పైగా యాక్టివ్ యూజర్లను కలిగి ఉన్న వాట్సాప్‌లో.. 'ప్రధానమంత్రి నుంచి లేఖ'ను పంపటం ద్వారా బీజేపీ ఓటర్లతో సన్నిహితంగా ఉండటానికి ప్రయత్నిస్తున్నది. ఇందులో మోడీ ప్రభుత్వ విజయాలను హైలైట్ చేస్తూ.. ఓటర్ల నుంచి బీజేపీ అభిప్రాయాన్ని కోరుతున్నది. పార్టీ 'మై ఫస్ట్ ఓటు ఫర్ మోడీ' అనే వెబ్‌సైట్‌ను ప్రారంభించింది. ఇది యూజర్లు మోడీకి ఓటు వేస్తామని ప్రతిజ్ఞ చేయటానికి, వారి ఎంపిక వెనుక ఉన్న కారణాన్ని తెలిపే ...13లో

## బీఆర్‌ఎస్‌లో చేరుతున్నా

- బీఎస్‌పీ మాజీ అధ్యక్షులు ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

బీఆర్ఎస్ అధ్యక్షులు కేసీఆర్ సమక్షంలో సోమవారం నేను ఆ పార్టీలో చేరుతున్నట్టు బీఆర్ఎస్ మాజీ అధ్యక్షులు ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ ఆదివారం ట్వీట్ చేశారు. "నేను నా రాజకీయ భవితవ్యంపై ఆదివారం రోజు హైదరాబాదులో వందలాది శ్రేయోభిలాషులు, ఆప్తులు, అభిమానులందరితో మేథోమధనం జరిపాను. ఆ సభలో రకరకాల అభిప్రాయాలు వచ్చాయి. కానీ నా మీద నమ్మకంతో నేను ఏ నిర్ణయం తీసుకున్నా...నా వెంటనే నడుస్తామని మాట ఇచ్చిన అందరికీ నా హృదయపూర్వక ధన్యవాదాలు. తెలంగాణ విశాల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని, దేశంలో లౌకికత్వాన్ని కాపాడడం కోసం, రాజ్యాంగ రక్షణ కోసం, బహుజనుల అభ్యున్నతి కోసం బీఆర్ఎస్‌లో చేరుతున్నాను.నేను ఎక్కడున్నా బహుజన మహనీయుల సిద్ధాంతాన్ని గుండెలో పదిలంగా దాచుకుంటా. వాళ్ల కలలను నిజం చేసే దిశగా పయనిస్తా. దయచేసి నిండు మనసుతో ఆశీర్వదించండి' అని పేర్కొన్నారు

## రెఫ్యూజీ క్యాంప్‌పై ఇజ్రాయిల్ దాడి

- 12 మంది మృతి • అనేక మందికి గాయాలు

**జెరూసలేం :** గాజాపై ఇజ్రాయిల్ దాడులు కొనసాగుతూనే ఉన్నాయి. శనివారం సెంట్రల్ గాజాలో డెయిర్ అల్ బలాహ్‌లోని నుసిరత్ రెఫ్యూజీ క్యాంప్‌పై ఇజ్రాయిల్ సైన్యం దాడి చేయడంతో 12 మంది మరణించారు. చిన్నారులు, మహిళలతో సహా అనేక మంది గాయపడ్డారు. రెఫ్యూజీ క్యాంప్‌లోని మాతిర్ కుటుంబానికి చెందిన ఒక అపార్ట్‌మెంట్‌పై ఈ దాడి జరిగింది. దాడితో ఆ ప్రదేశమంతా యుద్ధభూమిని తలపించింది. గాజాపై ఇజ్రాయిల్ దాడులతో ఇప్పటి వరకూ 31,645 మరణించినట్టు అధికారులు చెప్పారు. అలాగే 73,676 మంది గాయపడ్డారు. అలాగే, మరోవైపు ఇజ్రాయిల్ అదుపులో దాదాపు 10 వేల మంది పాలస్తీనీయన్లు ఉన్నట్టు స్వచ్ఛంద్ధ సంస్థలు అంచనా వేస్తున్నాయి.

### చర్చలు పునఃప్రారంభం

గాజాలో ఇజ్రాయిల్ కాల్పుల విరమణపై చర్చలు ఆదివారం నాడు ఖతార్‌లో పునఃప్రారంభం కానున్నాయి. మొస్సాద్ చీఫ్ నేతృత్వంలో ఈ చర్చలు జరగనున్నాయి. కాల్పులను ముగించడానికి హమాస్ ప్రతిపాదించిన మూడు దశల ప్రణాళికపై ఈ చర్చల్లో వాదనలు జరిగే అవకాశం ఉందని భావిస్తున్నారు. కాగా, గాజాలో 30 వేలకు పైగా ప్రజల్ని హత్య చేయడానికి అమెరికా తయారు చేసిన ఆయుధాలనే ఇజ్రాయిల్ ఉపయోగించిందని ఆమ్నెస్టీ ఇంటర్నేషనల్ ఆరోపించింది. ఈ మేరకు ఆమ్నెస్టీ ఎక్స్ ఖాతాలో ఒక పోస్ట్ చేశారు. గాజాలో కాల్పుల విరమణను అమలు చేయాలని, ఇజ్రాయిల్‌కు అమెరికా ఆయుధాల సరఫరాను ఆపాలని కూడా ఆమ్నెస్టీ ఈ పోస్టులో విజ్ఞప్తి చేసింది.

## టిఎం కృష్ణకు సంగీత కళానిధి నీనా ప్రసాద్‌కు నృత్య కళానిధి అవార్డులు

**చెన్నై :** మ్యూజిక్ అకాడమీకి చెందిన సంగీత కళానిధి అవార్డు 2024కు ప్రముఖ కర్ణాటక గాయకులు వయోలిస్టు టిఎం కృష్ణ ఎంపికయ్యారు. మ్యూజిక్ అకాడమీ ఎగ్జిక్యూటివ్ కమిటీ ఇటీవల సమావేశంలో ఈ మేరకు నిర్ణయం తీసుకుంది. అలాగే ఈ ఏడాది నృత్య కళానిధి అవార్డును డాక్టర్ నీనా ప్రసాద్‌కు అందచేయాలని కమిటీ నిర్ణయం తీసుకుంది. సంగీత కళా ఆచార్య అవార్డులను మృదంగ వాద్యకారుడు పరసాల రవి (వి.రవీంద్ర నాయర్), వయోలిస్టు గీతా రాజాకు అందచేయాలని నిర్ణయం తీసుకున్నారు. టిటికె అవార్డులను తిరువైయ్యారు బ్రదర్స్‌గా పేరుగాంచిన ఎస్. నరసింహన్, ఎస్ వెంకటేశన్‌లకు ప్రకటించారు. అలాగే వయోలిస్టు హెచ్.కె. నరసింహమూర్తికి కూడా టిటికె అవార్డును ఇవ్వనున్నారు. మ్యూజికొలజిస్టు అవార్డును డాక్టర్ మార్గరేట్ బస్టిన్‌కు ప్రకటించారు. మ్యూజిక్ అకాడమీ యొక్క 98వ వార్షికోత్సవం సందర్భంగా ఈ ఏడాది డిసెంబరు 15 నుంచి వచ్చే ఏడాది జనవరి 1 వరకూ జరిగే సమావేశాలు, కచేరీల్లో సంగీత కళానిధి అవార్డు, సంగీత కళా ఆచార్య, టిటికె అవార్డులు, మ్యూజికొలజిస్టు అవార్డులను ప్రదానం చేయనున్నారు. వచ్చే ఏడాది జనవరి 3న జరిగే మ్యూజిక్ అకాడమీ 18వ వార్షిక నృత్యోత్సవం ప్రారంభోత్సవ కార్యక్రమంలో నృత్య కళానిధి అవార్డును అందచేయనున్నారు.

# మారని ఫీల్డ్ అసిస్టెంట్ల బతుకులు

- న్యాయం కోసం రేవంత్ సర్కారువైపు ఎదురుచూపులు
- రెండు పూటలా ఫొటోలనే కేంద్రం మెలికతో ఇబ్బందులు
- బీఆర్ఎస్ పాలనలో మూడేండ్లు తొలగించి ముప్పుతిప్పలు
- కొత్తసర్కారు తమను పట్టించుకోవాలని వేడుకోలు



నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

మహాత్మాగాంధీ ఉపాధి హామీ చట్టం నిర్వహణలో క్షేత్రస్థాయిలో ఫీల్డు అసిస్టెంట్లదే కీలక పాత్ర. అలాంటి వారిని బీఆర్ఎస్ ప్రభుత్వం ముప్పుతిప్పలు పెట్టింది. మూడేండ్లపాటు విధుల నుంచి తొలగించి అరిగోస తీయించింది. 'కాళ్లమొక్కుతాం విధుల్లో తీసుకోండి' అని బతిమాలించుకున్నది. ప్రభుత్వంపై ఎక్కడ ప్రజల్లో వ్యతిరేకతను నూరిపోస్తారో అన్న భయంతో అసెంబ్లీ ఎన్నికలకు కొన్ని నెలల ముందు విధుల్లోకి తీసుకున్నది. అదే సమయంలో కేంద్ర ప్రభుత్వం పని ప్రదేశం నుంచి ఉపాధి హామీ కూలీల ఫొటోలను రోజుకు రెండు సార్లు ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయాలని తీసుకొచ్చిన నిబంధన వారికి ప్రాణసంకటంగా మారింది. క్షేత్రస్థాయిలో ప్రజలతో నిత్యం సంబంధముండే తమ పట్ల రాష్ట్ర సర్కారు వ్యవహరించిన తీరు..మరోవైపు కాంగ్రెస్ పార్టీ తాము అధికారంలోకి వస్తే ఉద్యోగ భద్రత కల్పించి వేతనాలు పెంచుతామని హామీ ఇవ్వడంతో ఫీల్డ్ అసిస్టెంట్లంతా ఒక్కటై కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థులను గెలిపించేందుకు తమ వంతు ప్రయత్నం చేసి సక్సెస్ అయ్యారు. బీఆర్ఎస్ ప్రభుత్వం పోయి కాంగ్రెస్ సర్కారు వచ్చినా ఫీల్డు అసిస్టెంట్లు వ్యథలు మాత్రం మారలేదు. తమ సమస్యలపై ఇప్పటికే ఫీల్డ్ అసిస్టెంట్లు ఎమ్మెల్యేలకు, మంత్రులకు పలుమార్లు వినతిపత్రాలు అందజేశారు. మొన్నటి ఓటాన్ అకౌంట్ బడ్జెట్ సమావేశాలకు ముందు 'మీరు పదేపదే హైదరాబాద్‌కు వచ్చి డబ్బులను వృథా చేసుకోవద్దు. మీ సమస్య మా దృష్టిలో ఉంది. కచ్చితంగా పరిష్కరిస్తాం. అవసరమైతే ఫీల్డు అసిస్టెంట్ల బృందంతో మాట్లాడి సలహాలు, సూచనలు తీసుకుని ముందుకెళ్తాం' అని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి సీతక్క తమకు చెప్పిందని పలువురు ఫీల్డు అసిస్టెంట్లు చెప్పారు. ఆ సమావేశాలు అయిపోయి నెల కావస్తున్నా ఇప్పటి వరకూ ఫీల్డ్ అసిస్టెంట్ల సమస్యల పరిష్కారం విషయంలో ఒక్కడు అడుగు కూడా ముందుకు పడలేదు. రేవంత్‌రెడ్డి సర్కారు తమకు న్యాయం చేస్తుందనే కొండంత ఆశతో ఫీల్డు అసిస్టెంట్లు ఎదురుచూస్తున్నారు.

### కేంద్రం తెచ్చిన కొత్త తంటా

కేంద్ర ప్రభుత్వం ఉపాధి హామీ చట్టానికి ఏటేటా నిధులను తగ్గిస్తూ నిర్వీర్యం చేయడానికి పూనుకున్నది. కొత్తకొత్త నిబంధనలు తీసుకొచ్చి కూలీలే పనులకు దూరమయ్యేలా చేస్తున్నది. అందులో భాగంగానే ప్రతిరోజూ రెండుపూటలా కూలీల అటెండెన్స్ ఆన్‌లైన్‌లో ఫేస్ రికగ్నైజ్డ్ ద్వారా తీసుకోవాలనే నిబంధన ఫీల్డ్ అసిస్టెంట్లకు ప్రాణసంకటంగా మారుతున్నది. ఉన్నతాధికారులు కేవలం సిమ్‌కార్డు ఇచ్చి చేతులు దులుపుకున్నారు. 'సెల్‌ఫోన్‌లో కెమెరా మంచిగా లేకుంటే ఫొటోలు సరిగారావడంలేదు. అటెండెన్స్ పూర్తికాదు. దీంతో అప్పుచేసి రూ.20 వేలు పెట్టి ఫొటోలు బాగా వచ్చే కొత్త ఫోన్ కొన్నాను. ఊర్లల్లో సిగ్నల్ కూడా సరిగా ఉండటం లేదు. నెట్ బ్యాలెన్స్ కూడా మేమే వేయించుకోవాల్సి వస్తున్నది' అంటూ నల్లగొండ జిల్లాకు చెందిన ఓ ఫీల్డ్ అసిస్టెంట్ తన బాధలను పంచుకున్నాడు. 'మా ఊరిలో ఐదారేండ్ల కిందటి దాకా 500 మంది దాకా ఉపాధి పనులకు వచ్చేవారు. ఆ సంఖ్య ఏటేటా తగ్గిపోతున్నది. ఇప్పుడు రోజుకు 50 మంది కూడా రావడం లేదు' అని మహబూబ్‌నగర్ జిల్లాలో భూత్పూర్ మండలానికి చెందిన ఓ ఫీల్డు అసిస్టెంటు ఆవేదన వ్యక్తం చేశాడు. మరోవైపు కూలీలు పనికి రావడం లేదని ఉన్నతాధికారులు ఫీల్డ్ అసిస్టెంట్లను వేధిస్తున్నారు. కూలీల హాజరుశాతాన్ని బట్టి గ్రేడులు విడగొట్టి ఇచ్చే పదివేల రూపాయల్లోనూ తెగ్గోస్తున్నారు.

### జీతాలు రాక మూడు నెలలు దాటే..

కూటి కోసం కోటి విద్యలు. ఎవరైనా ఎంతో కొంత జీతం వస్తే దానిపై ఆధారపడి కుటుంబాన్ని నెట్టుకొస్తారు. పొద్దస్తమానం పనిప్రదేశాల చుట్టూ పనులను పర్యవేక్షించడం, కూలీలకు సౌకర్యాలు కల్పించడం, కొలతలు వేయడం, ఆన్‌లైన్‌లో హాజరు నమోదు చేయడం వంటి పనులను ఫీల్డ్ అసిస్టెంట్లుమ చేస్తున్నారు. ఇంత పనిచేస్తున్నా వారికి నెలనెలా జీతం రావడం లేదు. రాష్ట్రంలో 7500 మందికిపైగా ఎఫ్ఏలుండగా..వారికి రాష్ట్ర సర్కారు మూడు నెలల నుంచి జీతాలు ఇవ్వడం లేదు. ఇచ్చే పదివేల రూపాయలు చేతికందకపోవడంతో అప్పులు చేసి బతుకుతున్న దైన్యపరిస్థితి ఉంది. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సమయంలో తమ ప్రభుత్వం అధికారంలోకి రాగానే ఉద్యోగ భద్రత కల్పిస్తాం..వేతనాలు పెంచుతాం అని హామీనిచ్చింది. కానీ, అది నేటికీ పట్టాలెక్కలేదు. పైగా, వేతన బకాయిలు కూడా పెండింగ్‌లో ఉంటున్న పరిస్థితి. ఉపాధి హామీ చట్టంలో క్షేత్రస్థాయిలో కూలీలతో పనిచేయిస్తూ రాష్ట్రానికి కేంద్రం నుంచి అధిక నిధులు తెప్పించడంలో కీలక పాత్ర పోషిస్తున్న తమను రేవంత్‌రెడ్డి సర్కారు ఆదుకోవాలని కోరుతున్నారు.

## ఎయిమ్స్ ఢిల్లీలో తొలిసారిగా...

- విజయవంతంగా రెండు కిడ్నీల మార్పిడి
- ప్రస్తుతం గ్రహీతకు నాలుగు కిడ్నీలు

**న్యూఢిల్లీ :** ఎయిమ్స్ ఢిల్లీలో తొలిసారిగా రెండు కిడ్నీల మార్పిడి ఆపరేషన్‌ను వైద్యులు విజయవంతంగా నిర్వహించారు. గ్రహీత అయిన డయాలిస్‌తో బాధపడుతున్న 51 ఏళ్ల మహిళా రోగికి ఉన్న రెండు మూత్ర పిండాలను తొలగించకుండానే హెటెరోట్రోపిక్ పద్ధతిలో తాజాగా ఈ రెండు కిడ్నీలను అమర్చారు. దీంతో ప్రస్తుతం గ్రహీతకు నాలుగు కిడ్నీలు ఉన్నాయి. గత ఏడాది డిసెంబరు 22న ఆర్గాన్ రిట్రీవల్ బ్యాంకింగ్ ఆర్గనైజేషన్ (ఓఆర్‌బిఓ) సహకారంతో ఎయిమ్స్ ఢిల్లీ యొక్క సర్జికల్ విభాగాల విభాగం, నెఫ్రాలజీ విభాగాం ద్వారా ఈ ఆపరేషన్‌ను నిర్వహించారు. ఈ వివరాలను శస్త్రచికిత్సలో పాల్గొన్న అడిషనల్ ప్రొఫెసర్ డాక్టర్ అసూరి కృష్ణ శనివారం మీడియాకు వెల్లడించారు. శస్త్రచికిత్స విజయవంతంగా జరగడం, గ్రహీత బాగానే ఉన్నట్లు నిర్ధారణ కావడంతో ఈ విషయాలను వెల్లడిస్తున్నట్లు చెప్పారు. దాత 78 ఏళ్ల మహిళ అని డాక్టర్ కృష్ణ తెలిపారు. కిందపడి తలకు బలమైన గాయం కావడంతో గత ఏడాది డిసెంబరు 19న ఎయిమ్స్ ట్రామా సెంటర్‌లో ఈ మహిళ చేరారని తెలిపారు.

తరువాత బ్రెయిన్ డెడ్ అని వైద్యులు ప్రకటించడంతో అవయవ దానానికి ఆమె కుటుంబ సభ్యులు అంగీకరించారని చెప్పారు. అయితే దాత 78 ఏళ్ల వయస్సు వారు కావడంతో గ్రహీతకు ఒక్క కిడ్నీ సరిపోయే అకాశం లేదని, అందుకే రెండు కిడ్నీలు అమర్చవలసి వచ్చిందని తెలిపారు. రెండు కిడ్నీలనూ కూడా గ్రహీతకు కుడివైపునే ఒకదానిపై ఒకటి వుంచినట్లు చెప్పారు. సాధారణంగా వృద్ధ దాతల నుంచి అవయవాలను తిరస్కరిస్తూ ఉంటారని, అయితే ఈ శస్త్రచికిత్సను విజయవంతంగా పూర్తి చేయడం ద్వారా దేశంలో అవయవాల భారీ డిమాండ్‌కు, తక్కువ సరఫరాకు మధ్య ఉన్న అంతరాన్ని తగ్గించడానికి ఒక ప్రయత్నంగా డాక్టర్ అసూరి కృష్ణ వివరించారు.

## సీపీఎస్ రద్దుపై రాజకీయ పార్టీల వైఖరి ఏంటి?

- ఏఐఎస్ టీఎఫ్ జాతీయ అధ్యక్షులు ఇంద్రశేఖర్ మిశ్రా




నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

ఉద్యోగుల పెన్షన్ బడ్జెట్ పెరుగుతున్నదన్న సాకు చూపించి 2004 నుంచి ఉద్యోగులకు సీపీఎస్ విధానాన్ని అమలు చేయడం దుర్మార్గమని ఆల్ ఇండియా సెకెండరీ టీచర్స్ ఫెడరేషన్ (ఏఐఎస్ టీఎఫ్) జాతీయ అధ్యక్షులు ఇంద్రశేఖర్ మిశ్రా విమర్శించారు. ఆదివారం హైదరాబాద్ కాచిగూడలోని ఎస్టీయూ భవన్‌లో ఏఐఎస్ టీఎఫ్ జాతీయ కార్యవర్గ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా మిశ్రా మాట్లాడుతూ ఎంపీ, ఎమ్మెల్యేలుగా ఎన్నికైన ప్రజా ప్రతినిధుల ఐదు సంవత్సరాల పదవీ కాలానికే పెన్షన్ పొందుతుండగా, మూడు దశాబ్దాలకుపైగా ప్రభుత్వ ఉద్యోగిగా ప్రభుత్వ కార్యక్రమాలను విజయ వంతం చేసిన ఉద్యోగులకు సీపీఎస్ విధానాన్ని అమలు చేయడం సరి కాదని అభిప్రాయపడ్డారు. దేశంలో సాధారణ ఎన్నికల నోటిఫికేషన్ విడుదలైన నేపథ్యంలో దేశంలోని అన్ని రాజకీయ పార్టీలు సీపీఎస్ రద్దుపై తమ వైఖరిని మ్యానిఫెస్టోలో తెలపాలని డిమాండ్ చేశారు. కొఠారి కమిషన్ సిఫారసుల మేరకు కేంద్ర బడ్జెట్‌లో ఆరు శాతం, రాష్ట్ర బడ్జెట్ లో 30 శాతం నిధులు కేటాయించాల్సి ఉండగా ఇప్పటి వరకు కేంద్ర బడ్జెట్‌లో 3 శాతం, రాష్ట్ర బడ్జెట్ లో 11 శాతం మించడం లేదని విమర్శించారు. అనేక దేశాలు విద్యారంగానికి ప్రాధాన్యతనివ్వడం ద్వారా అభివృద్ధి చెందాయని ఆయన తెలిపారు. ఆదాయ పన్ను పరిమితిని రూ.8 లక్షల వరకు పెంచాలనీ, కేంద్ర, రాష్ట్ర బడ్జెట్‌లో విద్యారంగానికి నిదుల కేటాయింపు పెంచాలని సమావేశంలో తీర్మానించారు. ఈ సమావేశంలో వర్కింగ్ ప్రెసిడెంట్ కత్తి నరసింహారెడ్డి, సెక్రటరీ జనరల్ సదానందం గౌడ్, ఆర్థిక కార్యదర్శి జోసఫ్ సుధీర్ బాబు, డిప్యూటీ సెక్రటరీ జనరల్ అన్సారీ, తెలంగాణ ఎస్టీయూ అధ్యక్షులు యం.పర్వత్ రెడ్డి, ఆంధ్రప్రదేశ్ ఎస్టీయూ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎల్.సాయి శ్రీనివాస్, ఎం.రఘునాథ రెడ్డి, వివిధ రాష్ట్రాల నుంచి కార్యవర్గ సభ్యులు సమావేశంలో పాల్గొన్నారు.

**ప్రకటన**

నేషనల్ కంపెనీ లా ట్రిబ్యునల్ హైదరాబాద్ వద్ద
(కంపెనీ పిటిషన్ నెం. 35/241/హెచ్‌డిబి/2022)

వీరి మధ్య :
ఓపస్ డెవలపర్స్ మరియు బిల్డర్స్ ప్రైవేట్ లిమిటెడ్ .....పిటిషనర్

మరియు

సన్‌వే ఓపస్ ఇంటర్నేషనల్ ప్రైవేట్ లిమిటెడ్ మరియు ఇతరులు ....... ప్రతివాదులు

సన్‌వే ఓపస్ ఇంటర్నేషనల్ ప్రైవేట్ లిమిటెడ్ మరియు ఇతరులకు వ్యతిరేకంగా ఓపస్ డెవలపర్స్ మరియు బిల్డర్స్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీ దాఖలు చేసిన పిటిషన్ నెం.35 ఆఫ్ 2022(ఐ.ఎ 272 ఆఫ్ 2023లో) పై తేది:15.02.2024న నేషనల్ కంపెనీ లా ట్రిబ్యునల్ హైదరాబాద్ బెంచ్-1 ఇచ్చిన ఆదేశానికి అనుగుణంగా శ్రీ ప్రదీప్ నూతలపాటి మరియు మెసర్స్ ఎస్.ఎస్.శ్రావణ్ & అసోసియేట్స్‌కు ఇక్కడ నోటీస్ జారీ చేస్తున్నాం. **శ్రీ ప్రదీప్ నూతలపాటి (తండ్రి శ్రీ సాంబశివరావు) నూతలపాటి, ఆర్/ఓ. ఫ్లాట్ నెం.301, తులసి అపార్ట్‌మెంట్స్, శ్రీనగర్ కాలనీ, హైదరాబాద్-500073) (ప్రతివాది నెం.9) మరియు మెసర్స్ ఎస్.ఎస్. శ్రావణ్ & అసోసియేట్స్** (ఇంటి నెం. 6-3-354/9, ఫ్లాట్ నెం.501, శ్రీ రామచంద్రన్ నిలయం, ద్వారకాపురి కాలనీ, హిందీ నగర్, పంజాగుట్ట, హైదరాబాద్-500082) (ప్రతివాది నెం.11) లకు పైన చెప్పబడిన కంపెనీ పిటిషన్‌మేరకు నోటీస్ ఇవ్వబడినది మరియు **28.03.2024న** గౌరవనీయ ఎన్‌సిఎల్‌టి ముందు వ్యక్తిగతంగా లేదా కౌన్సెల్ ద్వారా హాజరై కంపెనీ పిటిషన్‌కు వ్యతిరేకంగా కారణాలు చూపాలని పిలువబడినారు, విఫలమైనప్పటికీ చెప్పబడిన అభ్యర్థనపై విచారణకు నిర్ణయించబడినది. పైన పేర్కొన్న రోజున మీరు హాజరు కావడంలో విఫలమైనప్పటికీ పిటిషన్‌పై విచారణ జరుగునని మరియు మీరు గైర్హాజరైనప్పటికీ నిర్ణయించబడినదని గుర్తించగలరు.

టిపిఎస్ హర్ష
(పిటిషనర్ కొరకు కౌన్సెల్),
301, సౌత్‌బ్లాక్, మైత్రీ విల్లా,
రోడ్ నెం. 13, బంజారాహిల్స్,
హైదరాబాద్-500034



**homefirst** We'll take you home

**Home First Finance Company India Limited,**
**CIN:L65990MH2010PLC240703,**
**Website: homefirstindia.com**
**Phone No.: 180030008425**
**Email ID: loanfirst@homefirstindia.com**

**స్వాధీనతా ప్రకటన**

**రిఫరెన్స్: ది సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్, 2002 లోని రూల్ 8 యొక్క సబ్-రూల్ (1) క్రింద స్వాధీనతా ప్రకటన**

**ఏదైతే,** క్రింది సంతకందారు హోమ్ ఫస్ట్ ఫైనాన్స్ కంపెనీ ఇండియా లిమిటెడ్ యొక్క అధీకృత అధికారిగా, ది సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంట్రెస్ట్ చట్టం, 2002 (చట్టం నెం.54 ఆఫ్ 2002) క్రింద మరియు సెక్యూరిటీ ఇంట్రెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002 యొక్క రూల్ 3తో చదవగల సెక్షన్ 13(12) క్రింద సంక్రమించిన అధికారాలను వినియోగిస్తూ దిగువ ఇచ్చినట్లుగా దీని సంబంధిత తేదీలపై జారీచేసిన డిమాండ్ నోటీసు అనుసరించి, సదరు నోటీసుల స్వీకరణ తేది నుండి 60 రోజుల్లో బకాయి మొత్తాలను చెల్లించవలసిందిగా మిమ్మల్ని/ రుణగ్రహీతలను కోరడమైనది. మీరు/ రుణగ్రహీతలందరూ, నిర్దేశ సమయంలోగా సదరు బకాయి మొత్తాలను చెల్లించుటలో విఫలం చెందినందున, SARFAESI చట్టం, 2002లోని సెక్షన్ 13 యొక్క సబ్-సెక్షన్ (4) నియమాల క్రింద దాని రూల్స్‌తో చదవబడే హక్కులను సంక్రమించిన అధికారాలను **హోమ్ ఫస్ట్ ఫైనాన్స్ కంపెనీ ఇండియా లిమిటెడ్** కలిగియుండి మరియు వినియోగిస్తుంది. దిగువ పేర్కొన్నట్లు సెక్యూర్డ్ అసెట్స్‌ను స్వాధీనం చేసుకుంది.

| క్ర. సం. | రుణగ్రహీతలు/ సహ-రుణగ్రహీతలు/ హామీదారుల పేరు | తాకట్టుపెట్టిన యొక్క ఆస్తి వివరణ | సెక్షన్ 13(2) క్రింద డిమాండ్ నోటీసు తేది | డిమాండ్ నోటీసు తేదినాటికి పూర్తి బాకీపడినమొత్తం(రూ.లో) | స్వాధీనతా తేది |
|---|---|---|---|---|---|
| 1. | శ్రీరామ్ నరేష్, శ్రీరాముల శివ, అందాలు శ్రీరామ్ | ఇంటి నెం. సర్వే నెం. 13/ఏ/2, ఇనామ్‌గూడ గ్రామం, అబ్దుల్లాపూర్ మండలం, హయత్‌నగర్ రెవెన్యూ మండలం, రంగారెడ్డి జిల్లా, లష్కర్‌గూడ గ్రామపంచాయతీ, రిజిస్ట్రేషన్ సబ్-జిల్లా, అబ్దుల్లాపూర్, హైదరాబాద్, తెలంగాణ-501512 | 03-01-2024 | 9,82,780 | 13-03- 2024 |
| 2 | పగడాల రాంమోహన్, పి ఉష్మశ్రీ | యూనిట్ నెం.5, మొదటి అంతస్తు, ఎం.సి.నెం.1164, మున్సిపల్ నెం. 17-1-391/ఏ/4, సరస్వతి నగర్, సరూర్ నగర్, హైదరాబాద్, తెలంగాణ-500059 | 03-01-2024 | 10,75,960 | 13-03- 2024 |
| 3 | జమాల్‌పూర్ సందీప్ కుమార్, జమాల్‌పూర్ భాగ్య లక్ష్మి | ఫ్లాట్ నెం-88/బి, సర్వే నెం.612/ఏ, 613 మరియు 610, శ్రీ దివ్య సాయినగర్, గ్రామం మరియు గ్రామపంచాయతీ లాల్‌గడి మలక్‌పేట్ మండలం, శామీర్‌పేట్, హైదరాబాద్, తెలంగాణ-500078 | 03-01-2024 | 12,73,498 | 13-03- 2024 |
| 4 | బొడిగె అనంత రాములు, బొడిగె అనురాధ | ప్లాట్ నెం.16, సర్వే నెం.169, 170, 171, బాగ్ హయత్‌నగర్ గ్రామం, హయత్‌నగర్ రెవెన్యూ మండలం, రంగారెడ్డి జిల్లా, వార్డ్ నెం.4, బ్లాక్ నెం9, జిహెచ్ఎంసి హయత్‌నగర్ సర్కిల్, హైదరాబాద్, తెలంగాణ-501505 | 03-01-2024 | 9,98,114 | 13-03- 2024 |
| 5 | అనసూయ పిట్టల, సంపూర్ణ పిట్టల | ఇంటి నెం.6-2-19/2, సర్వే నెం. 147లో ఓపెన్ ప్లాట్, కాటేదాన్ గ్రామం రాజేంద్రనగర్ సర్కిల్, హైదరాబాద్, తెలంగాణ-500052 | 03-01-2024 | 9,81,947 | 13-03- 2024 |
| 6 | నారపల్ల నవీన్ కుమార్, హెచ్ మంజువాణి | బ్లాక్ నెం.16, వెంకట్ రెడ్డినగర్, రామంతపూర్ గ్రామం, ఉప్పల్, హైదరాబాద్, తెలంగాణ-500039లో ఉన్న సర్వే నెం.200, 201, 202లో ఫ్లాట్ నెం.363/పార్ట్‌లో నెం.3-16-109/363/1 ఉన్న ఇంటి ఆస్తిమొత్తం | 03-01-2024 | 10,56,069 | 13-03- 2024 |
| 7 | గడ్డంపల్లి రాజేందర్ రెడ్డి, గడ్డంపల్లి రాణి | ఫ్లాట్ నెం.401, 3వ అంతస్తు, మారుతి రెసిడెన్సీ, జిహెచ్ఎంసి నెం.8-2-45/401, ప్లాట్ నెం.28 మరియు 31, సర్వే నెం.140 & 142/1, వార్డ్ నెం.8, బ్లాక్ నెం.2, మారుతీ నగర్, కర్మన్‌ఘాట్ గ్రామం, సరూర్‌నగర్, రంగారెడ్డి, హైదరాబాద్, తెలంగాణ-500035 | 03-01-2024 | 27,05,876 | 13-03- 2024 |
| 8 | వడేమాన్ రామకృష్ణ, పి ప్రసన్న | ఇంటి నెం.2-6-555, వార్డ్ నెం.2, బ్లాక్ నెం.6, శైఫూరి కాలనీ, నాగోల్, జిహెచ్ఎంసి హయత్‌నగర్ సర్కిల్ పరిధి ఉప్పల్ మండలం, మేడ్చల్ మల్కాజ్‌గిరి జిల్లా, ఎస్ఆర్ఓ, ఉప్పల్, హైదరాబాద్, తెలంగాణ-500064 | 03-01-2024 | 13,05,206 | 13-03- 2024 |

రుణగ్రహీత మొత్తాలను తిరిగిచెల్లించుటలో విఫలం చెందియున్నందున, రుణగ్రహీత/ హామీదారు మరియు సాధారణ ప్రజలకు ఇందుమూలంగా ప్రకటన ఇవ్వడమేమనగా, పై పేర్కొన్న తేదీన సదరు రూల్స్ యొక్క రూల్ 8తో చదువబడే సదరు చట్టంలోని సెక్షన్ 13(4) క్రింద అతనికి/ఆమెకు సంక్రమించిన అధికారాలను వినియోగించి దిగువ వివరించిన ఆస్తిని క్రింది సంతకందారు స్వాధీనంలోకి తీసుకున్నారు.

**రుణగ్రహీతలు/హామీదారులు** మరియు సాధారణ ప్రజలకు ఇందుమూలంగా హెచ్చరించడమేమనగా, పై పేర్కొన్న ఆస్తులు/ సెక్యూర్డ్ ఆస్తులు లేదా అందులోని ఏదేని భాగంతో లావాదేవీలు జరుపరాదని మరియు సదరు ఆస్తులు/ సెక్యూర్డ్ అసెట్స్‌తో ఏవేని లావాదేవీలు జరుపుట అనునది పూర్తిగా చెల్లించు వరకు దానిపై తదుపరి వడ్డీతో చెల్లింపుల ప్రాతిపదికన ఆస్తులు/ సెక్యూర్డ్ అసెట్లపై ఎగువ పేర్కొన్న మొత్తాలను **హోమ్ ఫస్ట్ ఫైనాన్స్ కంపెనీ ఇండియా లిమిటెడ్** వారికి చెల్లించుటకు లోబడి ఉంటుంది.

సెక్యూర్డ్ అసెట్ విడిపించుకొనుటకు అందుబాటులోగల సమయానికి సంబంధించి, చట్టం యొక్క సెక్షన్ 13 యొక్క సబ్-సెక్షన్ (8) నియమాలపై రుణగ్రహీత శ్రద్ధ వహించ వలసిందిగా కోరబడుచున్నది.

తేది: 18-03-2024,
ప్రదేశం: హైదరాబాద్

సం/- అధీకృత అధికారి,
హోమ్ ఫస్ట్ ఫైనాన్స్ కంపెనీ ఇండియా లిమిటెడ్

**kotak**

## కోటక్ మహీంద్రా బ్యాంక్ లిమిటెడ్

**రిజిస్టర్డు ఆఫీసు:** 27బికెసి, సి 27, జి బ్లాక్, బంద్రా కుర్ల కాంప్లెక్స్, బంద్రా (ఈస్ట్), ముంబయి-400051
**కార్పొరేట్ ఆఫీసు:** కోటక్ ఇన్ఫినిటి, బిల్డింగ్ నెం.21, ఇన్ఫినిటి పార్క్, జెనరల్ ఎకె వైద్య మార్గ్, మలాడ్ (ఈస్ట్), ముంబయి-400097. www.kotak.com

### వేలం- ప్రకటన

దిగువ పేర్కొనబడిన రుణగ్రహీత/లు దిగువ సూచించినట్లు బంగారు ఆభరణాలు/ వస్తువుల హామీపై బంగారు రుణ సదుపాయం పొందియున్నారు. రుణగ్రహీత/లు వాయిదాలు మరియు బాకీయున్న బకాయి మొత్తాలను తిరిగిచెల్లించుటలో డిఫాల్టిచెందారు మరియు ఫలితంగా బకాయి మొత్తాలను తిరిగి చెల్లించవలసిందిగా రుణగ్రహీత/లను కోరుతూ బ్యాంకు నోటీసులను జారీచేసింది. అయితే, రుణగ్రహీత/లు వారిబాకీయున్న బకాయిలను తిరిగిచెల్లించుట/ క్లియర్ చేయుటలో విఫలం చెందియున్నందున, బ్యాంకుపేరున తాకట్టుపెట్టిన బంగారు ఆభరణాలను బ్యాంకు వేలం వేస్తుంది. దిగువ పేర్కొన్న బంగారు ఆభరణాలవేలం దిగువ ఇచ్చిన ప్రదేశాల వద్ద నిర్వహించబడును.

**దిగువ పేర్కొన్న బంగారు ఆభరణాల వేలం తేది/తర్వాత ఇక్కడ నిర్వహించబడుతుంది:-**
**తేది: 27 మార్చి, 2024, సమయం: ఉ.11.00 గం.లకు, ప్రదేశం: సంబంధిత బ్రాంచ్ ఆవరణలలో**

| ApplApac | వినియోగదారుని పేరు | రాష్ట్రం | సబ్ లోకేషన్ | బ్రాంచి పేరు | స్థూల బరువు | వేలం తేది |
|---|---|---|---|---|---|---|
| GLN2755355 | పాలపోలు మనోజ | తెలంగాణ | హైదరాబాద్ | బంజారాహిల్స్ | 16.10 | 27-03-2024 తేదిన/ తరువాత |
| GLN2747132 | షేక్ గౌస్ ఆజం | తెలంగాణ | హైదరాబాద్ | చంపాపేట్ | 49.60 | 27-03-2024 తేదిన/ తరువాత |
| GLN2788207 | వల్లపు రాజు | తెలంగాణ | హైదరాబాద్ | సుబేదారి | 28.70 | 27-03-2024 తేదిన/ తరువాత |
| GLN2787317 | అబ్దుల్ లతహరున్నీసా | తెలంగాణ | హైదరాబాద్ | సుబేదారి | 101.70 | 227-03-2024 తేదిన/ తరువాత |
| GLN2819482 | ఆడెపు మార్కండేయ | తెలంగాణ | హైదరాబాద్ | ఎస్‌పిఎన్ రోడ్ | 32.90 | 27-03-2024 తేదిన/ తరువాత |
| GLN2976650 | అశ్విరా మనీషా | తెలంగాణ | హైదరాబాద్ | చంద్రలోక్ | 25.30 | 27-03-2024 తేదిన/ తరువాత |
| GLN3022214 | అప్పల ప్రశాంత్ | తెలంగాణ | హైదరాబాద్ | సుచిత్ర సిటి | 9.70 | 27-03-2024 తేదిన/ తరువాత |
| GLN2672219 | బండారి వెంకటేశ్వర్లు | తెలంగాణ | హైదరాబాద్ | కూకట్‌పల్లి | 63.90 | 27-03-2024 తేదిన/ తరువాత |
| GLN2841744 | బస్సీ గణేష్ | తెలంగాణ | హైదరాబాద్ | కామారెడ్డి | 20.70 | 227-03-2024 తేదిన/ తరువాత |
| GLN2962132 | బస్సీ గణేష్ | తెలంగాణ | హైదరాబాద్ | కామారెడ్డి | 31.80 | 27-03-2024 తేదిన/ తరువాత |
| GLN2983240 | బెందాడి ప్రత్యూష | తెలంగాణ | హైదరాబాద్ | హిమాయత్‌నగర్ | 227.90 | 27-03-2024 తేదిన/ తరువాత |
| GLN2700420 | బొబ్బల మణికంఠ రెడ్డి | తెలంగాణ | హైదరాబాద్ | ఏఎస్‌రావునగర్ | 102.40 | 27-03-2024 తేదిన/ తరువాత |
| GLN2834947 | బోగినేని జయకృష్ణ | తెలంగాణ | హైదరాబాద్ | కూకట్‌పల్లి | 48.00 | 27-03-2024 తేదిన/ తరువాత |
| GLN3030422 | చల్లా గురుమూర్తి | తెలంగాణ | హైదరాబాద్ | కూకట్‌పల్లి | 13.70 | 27-03-2024 తేదిన/ తరువాత |
| GLN2806173 | చల్లమల్ల విజయ్ | తెలంగాణ | హైదరాబాద్ | మిర్యాలగూడ | 64.20 | 27-03-2024 తేదిన/ తరువాత |
| GLN3012810 | చల్లమల్ల విజయ్ | తెలంగాణ | హైదరాబాద్ | మిర్యాలగూడ | 24.40 | 27-03-2024 తేదిన/ తరువాత |
| GLN2870158 | చింతా శిరీష | తెలంగాణ | హైదరాబాద్ | కూకట్‌పల్లి | 82.10 | 27-03-2024 తేదిన/ తరువాత |
| GLN2823157 | చింతా వరలక్ష్మి | తెలంగాణ | హైదరాబాద్ | సనత్‌నగర్ | 137.00 | 27-03-2024 తేదిన/ తరువాత |
| GLN3019690 | డి సత్యనారాయణ | తెలంగాణ | హైదరాబాద్ | చందానగర్ | 20.20 | 27-03-2024 తేదిన/ తరువాత |
| GLN3020748 | డి సత్యనారాయణ | తెలంగాణ | హైదరాబాద్ | చందానగర్ | 13.10 | 27-03-2024 తేదిన/ తరువాత |
| GLN2632690 | దాసరి నర్సిములు | తెలంగాణ | హైదరాబాద్ | ఆబిడ్ రోడ్ | 32.40 | 27-03-2024 తేదిన/ తరువాత |
| GLN2810499 | దశరథం గొడిశెల | తెలంగాణ | హైదరాబాద్ | మంచిర్యాల | 47.20 | 27-03-2024 తేదిన/ తరువాత |
| GLN3003060 | దొడ్డ శ్రీనివాస్ | తెలంగాణ | హైదరాబాద్ | సిద్దిపేట్ | 59.70 | 27-03-2024 తేదిన/ తరువాత |
| GLN3027479 | ఎప్పా భీమన్నా | తెలంగాణ | హైదరాబాద్ | ఆర్మూర్ | 11.00 | 27-03-2024 తేదిన/ తరువాత |
| GLN3032780 | గడ్డిపాటి అనిల్ కుమార్ | తెలంగాణ | హైదరాబాద్ | కూకట్‌పల్లి | 113.50 | 27-03-2024 తేదిన/ తరువాత |
| GLN2904789 | గామర్ బేగం | తెలంగాణ | హైదరాబాద్ | కామారెడ్డి | 42.50 | 27-03-2024 తేదిన/ తరువాత |
| GLN2699731 | గంగరాయి వెంకట లక్ష్మి | తెలంగాణ | హైదరాబాద్ | కావేరి హిల్స్ | 40.40 | 27-03-2024 తేదిన/ తరువాత |
| GLN2761427 | గంగుల రమేష్ | తెలంగాణ | హైదరాబాద్ | మిర్యాలగూడ | 11.20 | 27-03-2024 తేదిన/ తరువాత |
| GLN2980155 | జలాల్ బేగ్ | తెలంగాణ | హైదరాబాద్ | చంపాపేట్ | 51.60 | 27-03-2024 తేదిన/ తరువాత |
| GLN2622123 | కమలాకర్ రెడ్డి జాప | తెలంగాణ | హైదరాబాద్ | కరీంనగర్ | 65.40 | 27-03-2024 తేదిన/ తరువాత |
| GLN2615721 | కంచర్ల విజయభాస్కర్ రెడ్డి | తెలంగాణ | హైదరాబాద్ | కరీంనగర్ | 31.50 | 27-03-2024 తేదిన/ తరువాత |
| GLN2124808 | కంకణాల రమ్య | తెలంగాణ | హైదరాబాద్ | బంజారాహిల్స్ | 55.90 | 27-03-2024 తేదిన/ తరువాత |
| GLN2684772 | కంకణాల రమ్య | తెలంగాణ | హైదరాబాద్ | బంజారాహిల్స్ | 28.70 | 27-03-2024 తేదిన/ తరువాత |
| GLN2998193 | కనుమూరి శివనాగ రాజు | తెలంగాణ | హైదరాబాద్ | కావేరి హిల్స్ | 45.80 | 27-03-2024 తేదిన/ తరువాత |
| GLN2812019 | కారుకూరి రవీందర్ | తెలంగాణ | హైదరాబాద్ | రామంతాపూర్ | 110.60 | 27-03-2024 తేదిన/ తరువాత |
| GLN2926618 | కాట్రావత్ రమేష్ | తెలంగాణ | హైదరాబాద్ | శంషాబాద్ | 29.80 | 27-03-2024 తేదిన/ తరువాత |
| GLN2990925 | కేతావత్ లక్ష్మి | తెలంగాణ | హైదరాబాద్ | సుచిత్ర | 20.10 | 27-03-2024 తేదిన/ తరువాత |
| GLN2814025 | కొక్కిరాల పద్మ ప్రియ | తెలంగాణ | హైదరాబాద్ | అమీర్‌పేట్ | 30.10 | 27-03-2024 తేదిన/ తరువాత |
| GLN2991048 | కోసూరి పవన్ కుమార్ | తెలంగాణ | హైదరాబాద్ | కావేరిహిల్స్ | 18.40 | 27-03-2024 తేదిన/ తరువాత |
| GLN3010113 | కుమ్మరి సాయిలు | తెలంగాణ | హైదరాబాద్ | కామారెడ్డి | 28.90 | 27-03-2024 తేదిన/ తరువాత |
| GLN2950123 | ఎం అవంతి | తెలంగాణ | హైదరాబాద్ | కూకట్‌పల్లి | 19.50 | 27-03-2024 తేదిన/ తరువాత |
| GLN2991477 | మద్దికుంట బాలరాజు | తెలంగాణ | హైదరాబాద్ | సిద్దిపేట్ | 114.30 | 27-03-2024 తేదిన/ తరువాత |
| GLN2821473 | మహేంద్ర కుమార్ శర్మ | తెలంగాణ | హైదరాబాద్ | బోయిన్‌పల్లి | 37.60 | 27-03-2024 తేదిన/ తరువాత |
| GLN2834710 | మహేష్ చంద్ర. కె | తెలంగాణ | హైదరాబాద్ | సనత్‌నగర్ | 39.60 | 27-03-2024 తేదిన/ తరువాత |
| GLN2991723 | మహేష్ చంద్ర. కె | తెలంగాణ | హైదరాబాద్ | సనత్‌నగర్ | 14.30 | 27-03-2024 తేదిన/ తరువాత |
| GLN2992260 | మహేష్ చంద్ర. కె | తెలంగాణ | హైదరాబాద్ | సనత్‌నగర్ | 19.40 | 27-03-2024 తేదిన/ తరువాత |
| GLN2523940 | మాల మల్లమ్మ | తెలంగాణ | హైదరాబాద్ | మహబూబ్‌నగర్ | 20.10 | 27-03-2024 తేదిన/ తరువాత |
| GLN3009437 | మండలపు హరీష్ | తెలంగాణ | హైదరాబాద్ | కూకట్‌పల్లి | 27.50 | 27-03-2024 తేదిన/ తరువాత |
| GLN2990800 | మంజ జగదీష్ | తెలంగాణ | హైదరాబాద్ | కామారెడ్డి | 24.90 | 27-03-2024 తేదిన/ తరువాత |
| GLN2514900 | మంథా శంకర్ (26-02-1968) | తెలంగాణ | హైదరాబాద్ | కామారెడ్డి | 20.20 | 27-03-2024 తేదిన/ తరువాత |
| GLN2791444 | మేడిచెలిమిల సంజీవ్ | తెలంగాణ | హైదరాబాద్ | కరీంనగర్ | 17.40 | 27-03-2024 తేదిన/ తరువాత |
| GLN2750051 | మేషమన జక్కుల | తెలంగాణ | హైదరాబాద్ | సనత్‌నగర్ | 12.60 | 27-03-2024 తేదిన/ తరువాత |
| GLN2750110 | మేషమన జక్కుల | తెలంగాణ | హైదరాబాద్ | సనత్‌నగర్ | 17.90 | 27-03-2024 తేదిన/ తరువాత |
| GLN3001425 | మెంగిలి వెంకన్న | తెలంగాణ | హైదరాబాద్ | మలక్‌పేట్ | 16.00 | 27-03-2024 తేదిన/ తరువాత |
| GLN2991202 | మహ్మద్ సాజిద్ అలీ | తెలంగాణ | హైదరాబాద్ | కామారెడ్డి | 40.60 | 27-03-2024 తేదిన/ తరువాత |
| GLN2782196 | మొహమ్మద్ అర్షద్ | తెలంగాణ | హైదరాబాద్ | ముషీరాబాద్ | 23.50 | 27-03-2024 తేదిన/ తరువాత |
| GLN2863235 | ముడావత్ శ్రీను | తెలంగాణ | హైదరాబాద్ | కావేరిహిల్స్ | 20.00 | 27-03-2024 తేదిన/ తరువాత |
| GLN2891299 | నడిమిల్లోలు భవాని | తెలంగాణ | హైదరాబాద్ | చంద్రలోక్ | 15.00 | 27-03-2024 తేదిన/ తరువాత |
| GLN2797435 | నాయుడు ముసలయ్య | తెలంగాణ | హైదరాబాద్ | సరూర్‌నగర్ | 10.80 | 27-03-2024 తేదిన/ తరువాత |
| GLN2761239 | నరసింగ శ్రీకాంత్ రెడ్డి | తెలంగాణ | హైదరాబాద్ | కూకట్‌పల్లి | 62.00 | 27-03-2024 తేదిన/ తరువాత |
| GLN2513016 | నాయక్ వంశీ కుమార్ | తెలంగాణ | హైదరాబాద్ | ఎఎస్‌రావునగర్ | 10.20 | 27-03-2024 తేదిన/ తరువాత |
| GLN2610413 | పైడి సునీత | తెలంగాణ | హైదరాబాద్ | కామారెడ్డి | 42.40 | 27-03-2024 తేదిన/ తరువాత |
| GLN2713459 | పల్లె రాజశేఖర్ | తెలంగాణ | హైదరాబాద్ | బిహెచ్ఇఎల్ టౌన్స్ | 40.30 | 27-03-2024 తేదిన/ తరువాత |
| GLN2641880 | పానుగంటి శిరీష | తెలంగాణ | హైదరాబాద్ | చంపాపేట్ | 19.90 | 27-03-2024 తేదిన/ తరువాత |
| GLN3024607 | పసుల రీగన్ | తెలంగాణ | హైదరాబాద్ | కావేరిహిల్స్ | 20.40 | 27-03-2024 తేదిన/ తరువాత |
| GLN2835340 | పొన్నా భీమ్‌రావు | తెలంగాణ | హైదరాబాద్ | మంచిర్యాల | 24.00 | 27-03-2024 తేదిన/ తరువాత |
| GLN2960965 | పుష్పలా మాధురి | తెలంగాణ | హైదరాబాద్ | చందానగర్ | 16.20 | 27-03-2024 తేదిన/ తరువాత |
| GLN2963577 | పుష్పలా మాధురి | తెలంగాణ | హైదరాబాద్ | చందానగర్ | 43.10 | 27-03-2024 తేదిన/ తరువాత |
| GLN2988094 | పుష్పలా మాధురి | తెలంగాణ | హైదరాబాద్ | బిహెచ్ఇఎల్ టౌన్స్ | 48.60 | 27-03-2024 తేదిన/ తరువాత |
| GLN2995186 | రాజు నద్ది | తెలంగాణ | హైదరాబాద్ | కరీంనగర్ | 52.80 | 27-03-2024 తేదిన/ తరువాత |
| GLN2629920 | రాకేష్ ఉదుత | తెలంగాణ | హైదరాబాద్ | సుబేదరి | 28.80 | 27-03-2024 తేదిన/ తరువాత |
| GLN2655650 | రామగిరి రవీందర్ | తెలంగాణ | హైదరాబాద్ | సుబేదరి | 53.40 | 27-03-2024 తేదిన/ తరువాత |
| GLN2824572 | రామగిరి రవీందర్ | తెలంగాణ | హైదరాబాద్ | సుబేదరి | 31.10 | 27-03-2024 తేదిన/ తరువాత |
| GLN2740044 | రామవత్ వెంకటేష్ నాయక్ | తెలంగాణ | హైదరాబాద్ | మిర్యాలగూడ | 39.50 | 27-03-2024 తేదిన/ తరువాత |
| GLN2805992 | రేఖా సత్యనారాయణ | తెలంగాణ | హైదరాబాద్ | మిర్యాలగూడ | 9.10 | 27-03-2024 తేదిన/ తరువాత |
| GLN2771380 | సభావత్ పిర్యా | తెలంగాణ | హైదరాబాద్ | కామారెడ్డి | 30.00 | 27-03-2024 తేదిన/ తరువాత |
| GLN3023832 | సామలేటి హేమలత | తెలంగాణ | హైదరాబాద్ | కామారెడ్డి | 24.60 | 27-03-2024 తేదిన/ తరువాత |
| GLN2735291 | షేక్ అమీర్ | తెలంగాణ | హైదరాబాద్ | బంజారాహిల్స్ | 20.00 | 27-03-2024 తేదిన/ తరువాత |
| GLN2926342 | షేక్ అర్షద్ అలీ | తెలంగాణ | హైదరాబాద్ | మంచిర్యాల | 15.30 | 27-03-2024 తేదిన/ తరువాత |
| GLN2783588 | సిరంశెట్టి సాయికుమార్ | తెలంగాణ | హైదరాబాద్ | సుబేదరి | 20.00 | 27-03-2024 తేదిన/ తరువాత |
| GLN2848529 | శ్రీకాంత్ దుర్గె | తెలంగాణ | హైదరాబాద్ | బిహెచ్ఇఎల్ టౌన్స్ | 271.00 | 27-03-2024 తేదిన/ తరువాత |
| GLN1904710 | సుర్వి మణికంఠ గౌడ్ | తెలంగాణ | హైదరాబాద్ | వనస్థలిపురం | 15.60 | 27-03-2024 తేదిన/ తరువాత |
| GLN2809529 | సూర్యదేవర భారతి | తెలంగాణ | హైదరాబాద్ | కూకట్‌పల్లి | 218.40 | 27-03-2024 తేదిన/ తరువాత |
| GLN2915966 | ఠాకూర్ పృథ్వీరాజ్ సింగ్ | తెలంగాణ | హైదరాబాద్ | సుబేదరి | 48.80 | 27-03-2024 తేదిన/ తరువాత |
| GLN2779210 | తమ్మిశెట్టి శోభ | తెలంగాణ | హైదరాబాద్ | సుబేదరి | 186.50 | 27-03-2024 తేదిన/ తరువాత |
| GLN2871347 | తలమంచి పెద్దమాలాద్రి | తెలంగాణ | హైదరాబాద్ | చందానగర్ | 63.50 | 27-03-2024 తేదిన/ తరువాత |
| GLN2756602 | తప్పెట మంజునాథ్ రెడ్డి | తెలంగాణ | హైదరాబాద్ | అమీర్‌పేట్ | 39.60 | 27-03-2024 తేదిన/ తరువాత |
| GLN2757767 | తప్పెట మంజునాథ్ రెడ్డి | తెలంగాణ | హైదరాబాద్ | అమీర్‌పేట్ | 56.80 | 27-03-2024 తేదిన/ తరువాత |
| GLN2637120 | తౌట్ అరవింద్ కుమార్ | తెలంగాణ | హైదరాబాద్ | ఆర్మూర్ | 23.90 | 27-03-2024 తేదిన/ తరువాత |
| GLN3004823 | వరికుప్పి స్నేహలత | తెలంగాణ | హైదరాబాద్ | ఎఎస్‌రావునగర్ | 45.50 | 27-03-2024 తేదిన/ తరువాత |
| GLN2957168 | వెంకటశ్రీనివాసరావు కన్నెగంటి | తెలంగాణ | హైదరాబాద్ | అమీర్‌పేట్ | 48.40 | 27-03-2024 తేదిన/ తరువాత |
| GLN2716302 | విద్యావతి గోపాల్ బిరాదార్ | తెలంగాణ | హైదరాబాద్ | సనత్‌నగర్ | 181.20 | 27-03-2024 తేదిన/ తరువాత |
| GLN2716297 | విద్యావతి గోపాల్ బిరాదార్ | తెలంగాణ | హైదరాబాద్ | సనత్‌నగర్ | 196.30 | 27-03-2024 తేదిన/ తరువాత |
| GLN2773754 | యార్ల వెంకటేశ్వరరావు | తెలంగాణ | హైదరాబాద్ | బిహెచ్ఇఎల్ టౌన్స్ | 10.40 | 27-03-2024 తేదిన/ తరువాత |

వేలం రోజున రెండు ఇటీవలి ఫోటోగ్రాఫులతో పాటు వెరిఫికేషన్ కొరకు వారి ఒరిజినల్‌తోపాటు వారి ఫోటో-గుర్తింపు, సంతకం మరియు నివాస రుజువు యొక్క కాపీని దాఖలు చేయవలసిందిగా బిడ్డరుదారులను కోరబడుచున్నది. బిడ్డరుదారులకు ఏ విధమైన నోటీసు ఇవ్వకుండానే వేలం నిర్వహించు యొక్క వేదిక/ తేది/ సమయం మార్పుచేయు లేదా రద్దుచేయు అధికారాలను బ్యాంకు కలిగియుంటుంది.

వేలం ప్రక్రియ యొక్క ఖర్చును వినియోగదారుని ఖాతాకు డెబిట్ చేయబడుతుంది. ఖాతా మొత్తానికి బిడ్ మొత్తం సరిపోని విషయంలో మిగతా మొత్తాన్ని వినియోగదారుని నుండి రికవరీచేయు అధికారాలు బ్యాంకు కలిగియుంటుంది.

వేలం యొక్క నియమ & నిబంధనలకు సంబంధించి ఏవేని తదుపరి వివరాల కొరకు, మీరు దిగువ పేర్కొన్న వ్యక్తి/లను సంప్రదించవలసిందిగా కోరబడుచున్నది.

కొటక్ మహీంద్రా బ్యాంక్ లిమిటెడ్., ఫోన్: 9700699936



# ప్రాంతీయ పార్టీలకూ భారీగా విరాళాలు

## 8 దశల విక్రయాల్లో వాటిదే హవా

## టాప్‌లో తృణమూల్, బీఆర్ఎస్

పందేలు కాసే వారి దృష్టి ఎప్పుడూ గెలుపు గుర్రాల పైనే ఉంటుంది. ఎన్నికల బాండ్ల కొనుగోలు ద్వారా రాజకీయ పార్టీలకు విరాళాలు అందించే వ్యక్తులు, సంస్థలు కూడా ఇదే సూత్రాన్ని పాటించడం సహజం. కానీ ఈ కొనుగోళ్ల వ్యవహారంలో ఇందుకు భిన్నంగా కొన్ని ఆశ్చర్యపరిచే ఉదంతాలు చోటుచేసుకున్నాయి. మొత్తంమీద రాజకీయ పార్టీలు రూ.12,769 కోట్ల విలువ కలిగిన బాండ్లను నగదుగా మార్చుకున్నాయి. వీటిలో దాదాపు సగం అంటే రూ.6,060 కోట్లు బీజేపీ జేబులోకే వెళ్లాయి. తృణమూల్ కాంగ్రెస్ రూ.1,609 కోట్లు, కాంగ్రెస్ రూ.1,421 కోట్లు, బీఆర్ఎస్ రూ.1,214 కోట్లు విరాళాలుగా అందుకున్నాయి. ఇవేవీ ఆశ్చర్యపరిచే విషయాలు కావు.

**న్యూఢిల్లీ :** 2018 నుండి 30 దశలుగా ఎన్నికల బాండ్ల విక్రయాలు జరిగాయి. 2018 మార్చి 1 నుండి 10వ తేదీ వరకూ తొలి దశలో బాండ్లను అమ్మారు. సంవత్సరానికి నాలుగు సార్ల చొప్పున పదేసి రోజుల పాటు బాండ్లను ఎస్‌బీఐ విక్రయించింది. ఎన్నికల సంవత్సరాల్లో మరిన్ని దశల్లో బాండ్లను అమ్మింది. బాండ్లను జారీ చేసిన తేదీ నుండి 15 రోజుల్లోగా వాటిని పార్టీలు నగదుగా మార్చుకోవాల్సి ఉంటుంది. కాగా ఎన్నికల కమిషన్ తొలుత 22 దశలకు సంబంధించిన ఎన్నికల బాండ్ల సమాచారాన్నే విడుదల చేసింది. ఈ బాండ్లు 2019 ఏప్రిల్ (తొమ్మిదవ దశ) నుండి ఈ సంవత్సరం జనవరి (30వ దశ) వరకూ విక్రయించినవి. ఈ 22 దశల్లో అమ్మిన బాండ్ల సమాచారాన్ని విశ్లేషిస్తే కొన్ని ఆసక్తికరమైన, ఆశ్చర్యకరమైన విషయాలు వెలుగు చూశాయి. 13 దశల్లో అమ్మిన బాండ్లలో అధిక భాగం బీజేపీ ఖాతాకే చేరాయి. వీటిలో నాలుగు దశల్లో బీజేపీకి రూ.3,012 కోట్లు వచ్చాయి. గత సంవత్సరం అక్టోబరులో అమ్మిన బాండ్లలో మాత్రం కాంగ్రెస్‌కు ఎక్కువ మొత్తం లభించింది. 2019, 2024 సార్వత్రిక ఎన్నికలకు ముందు విక్రయించిన బాండ్లను సొమ్ము చేసుకోవడంలో సైతం బీజేపీయే ప్రత్యర్థి పార్టీల కంటే బాగా ముందంజలో ఉంది.

**తృణమూల్, బీఆర్ఎస్‌కే ఎక్కువ లబ్ది**

మొత్తంమీద 22 దశల్లో జరిగిన బాండ్ల విక్రయాల్లో తృణమూల్ కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు ఒక్కోటి మూడు దశల్లో అత్యధికంగా విరాళాలు పొందాయి. 2020 జూలైలో రూ.45.38 కోట్ల విలువ కలిగిన బాండ్లు విక్రయించగా తృణమూల్‌కు అత్యధికంగా రూ.15.38 కోట్లు అందాయి. అలాగే 2021 జనవరిలో రూ.42.07 కోట్ల విలువైన బాండ్లు అమ్మగా ఆ పార్టీకి రూ.26 కోట్లు వచ్చాయి. అదే సంవత్సరం జూలైలో రూ.150.51 కోట్ల బాండ్లు విక్రయిస్తే తృణమూల్ ఖాతాలో రూ.107 కోట్లు చేరాయి.

బీఆర్ఎస్ విషయానికి వస్తే 2021 అక్టోబరులో రూ.614.33 కోట్ల విలువైన బాండ్లను అమ్మితే ఆ పార్టీకి రూ.153 కోట్ల విరాళాలు అందాయి. 2022 ఏప్రిల్‌లో రూ.648.48 కోట్ల బాండ్లు అమ్మగా బీఆర్ఎస్ ఖాతాలో రూ.410 కోట్లు పడ్డాయి. 2023 జూలైలో రూ.812.75 కోట్ల విలువ కలిగిన బాండ్లను విక్రయించగా ఆ పార్టీకి రూ.318 కోట్లు వచ్చాయి.

2022 ఏప్రిల్‌లో 20వ దశ అమ్మకాలు జరిపారు. ఈ దశలో కూడా బీఆర్ఎస్ పార్టీకే ఎక్కువ విరాళాలు వచ్చాయి. ఈ దశలో వివిధ పార్టీలకు రూ.648 కోట్ల విరాళాలు అందితే ఒక్క బీఆర్ఎస్‌కే రూ.410 కోట్లు వచ్చాయి. డీఎంకేకు రూ.100 కోట్లు, బీజేపీకి రూ.98.5 కోట్లు అందాయి. ఈ దశలో ఫ్యూచర్ గేమింగ్ (రూ.100 కోట్లు), యశోద సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ (రూ.80 కోట్లు), చెన్నయ్ గ్రీన్ ఉడ్స్ ప్రైవేట్ లిమిటెడ్ (రూ.50 కోట్లు), డీఎల్ఎఫ్ కమర్షియల్ డెవలపర్స్ లిమిటెడ్ (రూ.40 కోట్లు), హల్దియా ఎనర్జీ (రూ.25 కోట్లు), మేఘా ఇంజనీరింగ్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ (రూ.25 కోట్లు) ఎక్కువ విరాళాలు ఇచ్చాయి. 2020 అక్టోబరులో జరిగిన 14వ దశ విక్రయాల్లో వైసీపీకి అత్యధిక విరాళాలు వచ్చాయి. వివిధ పార్టీలకు రూ.282.29 కోట్ల విరాళాలు అందితే అందులో వైసీపీకి రూ.89 కోట్లు వచ్చాయి. 2021 జూలైలో జరిగిన 21వ దశ విక్రయాల్లో బీజేడీ అత్యధికంగా రూ.107 కోట్లు (మొత్తం రూ.389.5 కోట్లు) పొందింది.

**ఎన్నికలకు ముందే జోరు**

అసలు ఎన్నికలే జరగని సమయంలో లేదా అక్కడక్కడా ఎన్నికలు జరిగినప్పుడు బాండ్ల విక్రయం చాలా తక్కువగానే ఉంది. కానీ ఎన్నికలు జరగడానికి ముందు మాత్రం అమ్మకాలు ఊపందుకున్నాయి. ఉదాహరణకు 2019 లోక్‌సభ ఎన్నికలకు ముందు రాజకీయ పార్టీలు రూ.2,107 కోట్ల విలువైన బాండ్లను నగదుగా మార్చుకున్నాయి. వీటిలో బీజేపీ వాటా ఏకంగా 84% (రూ.1,770 కోట్లు). ఎన్నికల్లో బీజేపీ విజయం సాధిస్తుందన్న నమ్మకంతో పలు కంపెనీలు ఆ పార్టీకి విరాళాలు ముట్టజెప్పాయి. ఎన్నికలు ముగిసిన తర్వాత జూలైలో లావాదేవీలు ఒక్కసారిగా పడిపోయాయి. ఆ నెలలో దాతలు కొనుగోలు చేసిన బాండ్ల విలువ కేవలం రూ.45.38 కోట్లే. హర్యానా, జార్ఖండ్, మహారాష్ట్ర శాసనసభలకు ఎన్నికలు జరగడానికి అప్పటికి ఇంకా ఆరు నెలల సమయం ఉంది.

గత సంవత్సరం అసెంబ్లీ ఎన్నికలు జరిగినప్పుడు కూడా ఎన్నికల బాండ్ల విక్రయం జోరుగా సాగింది. 2023 అక్టోబర్, నవంబర్ నెలల్లో 28, 29 దశల విక్రయాలు జరిగాయి. రాజస్థాన్, ఛత్తీస్‌గఢ్, మిజోరం, తెలంగాణ, మధ్యప్రదేశ్ శాసనసభ ఎన్నికలకు ముందు వీటి జారీ జరిగింది. గోవా, ఉత్తరాఖండ్, పంజాబ్, మణిపూర్, ఉత్తరప్రదేశ్ శాసనసభ ఎన్నికలకు ముందు 2022 జనవరిలో కూడా బాండ్ల విక్రయం ముమ్మరంగా జరిగింది. ఆ సమయంలో రూ.1,212 కోట్ల విలువైన బాండ్లు అమ్మగా వాటిలో సగం బీజేపీ ఖాతాలో చేరాయి. 2021 జనవరిలో జరిగిన పశ్చిమ బెంగాల్ అసెంబ్లీ ఎన్నికల్లో తృణమూల్ కాంగ్రెస్ విజయం సాధించింది. ఆ తర్వాత మూడు నెలలకు జరిగిన 17వ దశ బాండ్ల విక్రయంలో తృణమూల్‌కు అత్యధికంగా రూ.107 కోట్లు వచ్చాయి. 2022 ఏప్రిల్‌లో జరిగిన విక్రయాల్లో బీఆర్ఎస్ అత్యధికంగా రూ.410 కోట్లు పొందింది. అప్పటికి తెలంగాణ శాసనసభ ఎన్నికలకు ఇంకా సంవత్సరంన్నర సమయం ఉంది.

### ఓడిన పార్టీలకూ అధిక విరాళాలు

ప్రాంతీయ పార్టీల విషయానికి వస్తే ఎనిమిది దశల్లో తృణమూల్ కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేడీ, వైసీపీ పార్టీలకు ఎక్కువ విరాళాలు అందాయి. బాండ్లలో చాలా వరకూ లోక్‌సభ, శాసనసభ ఎన్నికలకు ముందు కొనుగోలు చేసినవే. అప్పటికే అధికారంలో ఉన్న పార్టీకి లేదా అధికారంలోకి వచ్చే అవకాశం ఉన్న పార్టీకి ఎక్కువగా విరాళాలు అందాయి. ఇందుకు రెండు మినహాయింపులు కూడా ఉన్నాయి. గత సంవత్సరం అక్టోబరులో 28వ దశ బాండ్ల విక్రయం జరిగింది. ఐదు రాష్ట్రాల శాసనసభ ఎన్నికలకు ముందు జరిగిన ఈ అమ్మకాల్లో కాంగ్రెస్‌కు అత్యధికంగా విరాళాలు వచ్చాయి. అయితే ఆ పార్టీ ఒక్క తెలంగాణలోనే విజయం సాధించింది. అదే విధంగా 2022 నవంబరులో హిమాచల్ ప్రదేశ్ శాసనసభ ఎన్నికలకు ముందు బీజేపీకి ఎక్కువ నిధులు వచ్చాయి. కానీ ఆ ఎన్నికల్లో కమలదళం పరాజయం పాలైంది.

### అధిక విరాళాలు ఇచ్చింది వీరే

2021 జూలైలో జరిగిన 17వ దశ బాండ్ల విక్రయాలకు సంబంధించి రాజకీయ పార్టీలు రూ.150.51 కోట్లను నగదుగా మార్చుకున్నాయి. వీటిలో తృణమూల్ రూ.107.06 కోట్లు పొందగా బీజేపీకి వచ్చింది కేవలం రూ.18 కోట్లే. ఈ దశలో ఎక్కువగా విరాళాలు అందించిన సంస్థల్లో ఫ్యూచర్ గేమింగ్ అండ్ హోటల్ సర్వీసెస్ పీఆర్ (రూ.30 కోట్లు), ఎంకేజే ఎంటర్‌ప్రైజెస్ లిమిటెడ్ (రూ.22.4 కోట్లు), సంజీవ్ గోయెంకా నేతృత్వంలోని హల్దియా ఎనర్జీ లిమిటెడ్ (రూ.20 కోట్లు) ఉన్నాయి. 2021 అక్టోబరులో జరిగిన 18వ దశ విక్రయాలను పరిశీలిస్తే...రాజకీయ పార్టీలకు అందిన రూ.614.33 కోట్ల విరాళాల్లో బీజేపీకి వచ్చింది కేవలం పది శాతమే. ఈ దశలో బీఆర్ఎస్‌కు అత్యధికంగా రూ.153 కోట్లు, తృణమూల్‌కు రూ.141.94 కోట్లు, బీజేడీకి రూ.125 కోట్లు, డీఎంకేకు రూ.99 కోట్ల విరాళాలు లభించాయి. ఈ దశలో ఫ్యూచర్ గేమింగ్ (రూ.195 కోట్లు), మేఘా ఇంజనీరింగ్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ లిమిటెడ్ (రూ.100 కోట్లు), ఎస్సెల్ మైనింగ్ అండ్ ఇండస్ట్రీస్ లిమిటెడ్ (రూ.50 కోట్లు), హల్దియా ఎనర్జీ లిమిటెడ్ (రూ.30 కోట్లు) అత్యధికంగా ఎన్నికల బాండ్లు కొనుగోలు చేశాయి.

# బీజేపీ ఎంపీ బాండ్ల గేమ్

## రూ.45 కోట్ల బాండ్లు కొనుగోలు చేసిన రిత్విక్ ప్రాజెక్ట్స్


## దాని వ్యవస్థాపకుడు సీఎం రమేష్

బీజేపీకి చెందిన రాజ్యసభ సభ్యుడు సీఎం రమేష్ తెలుగు ప్రజలందరికీ సుపరిచితులే. ఆయన 2019లో టీడీపీకి రాజీనామా చేసి కమలదళంలో చేరారు. నిధుల దారి మళ్లింపునకు సంబంధించి అంతకుముందే ఐటీ శాఖ ఆయనపై ఆరోపణలు మోపింది. రమేష్‌తో పాటు మరో ముగ్గురు పార్టీ ఎంపీలు పార్టీని వీడడంతో టీడీపీకి భారీ షాక్ తగిలింది. ఎన్నికల్లో పార్టీ ఓటమి పాలైన కొద్ది వారాలకే వీరంతా టీడీపీకి గుడ్‌బై చెప్పారు. పార్టీ అధినేత చంద్రబాబు నాయుడు యూరప్ పర్యటనలో ఉన్నప్పుడు ఈ ఫిరాయింపులు జరిగాయి.




**న్యూఢిల్లీ :** ఇదంతా ఎందుకు చెప్పాల్సి వచ్చిందంటే మౌలిక సదుపాయాల సంస్థ రిత్విక్ ప్రాజెక్ట్స్ ప్రైవేట్ లిమిటెడ్‌కు రమేష్ వ్యవస్థాపకులు. ఈ కంపెనీ వ్యవహారాలు, కొనుగోలు చేసిన ఎన్నికల బాండ్లపై స్వతంత్ర మీడియా సంస్థలు న్యూస్‌లాండ్రీ, స్క్రోల్, ది న్యూస్ మినిట్‌తో పాటు పలువురు స్వతంత్ర పాత్రికేయులు ఓ నివేదికను రూపొందించారు. దాని ప్రకారం... గత సంవత్సరం రుత్విక్ ప్రాజెక్ట్స్ ఐదు కోట్ల రూపాయల విలువైన ఎన్నికల బాండ్లను కొనుగోలు చేసింది. దానికి రెండు వారాల ముందు ఆ కంపెనీకి హైడ్రో ఎలక్ట్రిక్ పవర్ ప్రాజెక్టుకు సంబంధించిన లెటర్ ఆఫ్ కాంట్రాక్ట్ లభించింది. కాంగ్రెస్ నేతృత్వంలోని హిమాచల్ ప్రదేశ్ ప్రభుత్వ పాలనలో జనవరి 14న ఈ ఎల్‌ఓసీ వచ్చింది. 2023 మార్చి 23న ప్రభుత్వ రంగంలోని స్వచ్ఛ ఇంధన సంస్థ ఎస్‌వీజేఎన్ లిమిటెడ్ ఇదే ప్రాజెక్టుకు రూ.1,098 కోట్ల కాంట్రాక్ట్ ఒప్పందంపై సంతకాలు చేసింది. మూడు వారాల తర్వాత రిత్విక్ ప్రాజెక్ట్స్ మళ్లీ రూ.40 కోట్ల విలువైన బాండ్లు కొనుగోలు చేసింది.

రిత్విక్ ప్రాజెక్ట్స్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీ మైనింగ్, నీటి పారుదల నుండి హైవేలు, మౌలిక సదుపాయాల వరకూ అనేక రంగాల్లో కార్యకలాపాలు నిర్వహిస్తోంది. కాశ్మీర్ వలసవాదుల కోసం మినీ టౌన్‌షిప్, పాలేరు ఎర్త్ డ్యామ్ వంటి ప్రాజెక్టులను కూడా ఈ కంపెనీ చేపట్టింది. 2012 నుండి రిత్విక్ వ్యవహారాలతో తనకేమీ సంబంధం లేదని రమేష్ చెబుతున్నారు. అయితే ఆయన సోదరుడు ఇప్పటికీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టరుగా, రమేష్ కుమారుడు ఆపరేషన్స్ విభాగానికి అధిపతిగా వ్యవహరిస్తున్నారు.




రిత్విక్ ప్రాజెక్ట్స్ కంపెనీ జాడ లేని లావాదేవీల ద్వారా రూ.74 కోట్లు, అనుమానాస్పద బిల్లులతో రూ.25 కోట్లు దారి మళ్లించిందని ఆదాయపన్ను శాఖ 2018లో ఆరోపించింది. ఆ శాఖ అధికారులు హైదరాబాద్, కడపలోని రమేష్ కార్యాలయాల్లో సోదాలు చేశారు. అనేక పత్రాలు స్వాధీనం చేసుకున్నారు. రమేష్ బీజేపీలో చేరడానికి కొద్ది నెలల ముందు ఆ పార్టీ ప్రతినిధి జీవీఎల్ నరసింహారావు రాజ్యసభ ఎథిక్స్ కమిటీకి ఓ లేఖ రాశారు. ఆదాయపన్ను అధికారులు చేసిన ఆరోపణలకు సంబంధించి రమేష్‌పై విచారణ జరపాలని కోరారు. అంతేకాదు...రమేష్‌ను 'ఆంధ్ర మాల్యా'గా అభివర్ణించారు.

ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక హోదా ఇవ్వనందుకు నిరసనగా తెలుగుదేశం పార్టీ 2018లో ఎన్డీఏ నుండి బయటకు వచ్చింది. టీడీపీ అధినేత చంద్రబాబుకు ఎన్డీఏ ద్వారాలు శాశ్వతంగా మూసేశామని 2019లో కేంద్ర హోం మంత్రి అమిత్ షా స్పష్టం చేశారు. అయితే ఈ నెల ప్రారంభంలో చంద్రబాబు ఎన్డీఏ గూటికి చేరిపోయారు. ఏపీ ప్రజల ఆకాంక్షలు నెరవేర్చేందుకే ఎన్డీఏలో చేరామని ఆయన సమర్థించుకున్నారు. కాగా రమేష్ ఇప్పటికీ రాజ్యసభ సభ్యుడుగా కొనసాగుతున్నారు. ఆయన పదవీకాలం వచ్చే నెలలో ముగుస్తుంది. ఆయనపై ఐటీ శాఖ పెట్టిన కేసు ఇప్పటికీ పెండింగులోనే ఉంది. ఆంధ్రప్రదేశ్‌కు చెందిన అత్యధిక సంపన్నులైన ఎంపీలలో రమేష్ కూడా ఒకరని అసోసియేషన్ ఆఫ్ డెమొక్రటిక్ రిఫామ్స్ సంస్థ గత సంవత్సరం ఓ నివేదికలో తెలియజేసింది.


అక్రమ మైనింగ్‌కు పాల్పడినందుకు రిత్విక్ ప్రాజెక్ట్స్‌కు గత సంవత్సరం రెండు కోట్ల రూపాయల జరిమానా విధించారు. వంశధార వాటర్ ప్రాజెక్టులో ఉపయోగించడానికి అని చెప్పి గ్రావెల్, మెటల్‌ను తరలించిన రిత్విక్ కంపెనీ వాటిని ప్రైవేటు వారికి అమ్ముకున్నదని జిల్లా విజిలెన్స్ అధికారి ఒకరు 'ది న్యూ ఇండియా ఎక్స్‌ప్రెస్' పత్రికకు తెలిపారు.

# పేదల గుడిసెలపై పోలీసుల దౌర్జన్యం

## తెలంగాణ ప్రజా సంఘాల పోరాట వేదిక రాష్ట్ర కన్వీనర్ ఎస్ వీరయ్య

**నవతెలంగాణ బ్యూరో–హైదరాబాద్**

పేదల గుడిసెలపై పోలీసుల దౌర్జన్యం దుర్మార్గమని తెలంగాణ ప్రజా సంఘాల పోరాట వేదిక కన్వీనర్ ఎస్ వీరయ్య విమర్శించారు. ఈ మేరకు ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. జనగామ జిల్లా బచ్చన్నపేట గోపాల్‌నగర్‌లోని సర్వేనెంబర్ 174లో ఉన్న ప్రభుత్వ భూమిలో నిరుపేదలు గుడిసెలేసుకున్నారనీ, వాటిని పోలీసులు బలవంతంగా తొలగించి దౌర్జన్యం చేశారని పేర్కొన్నారు. ప్రజాస్వామ్యవాదులందరూ ఈ ఘటనను ఖండించాలని కోరారు. ప్రభుత్వం అర్హులైన పేదలందరికీ ఇందిరమ్మ ఇండ్లు కట్టిస్తామని చెప్తూనే పేదల గుడిసెలపై దౌర్జన్యం చేయటమేంటని ప్రశ్నించారు. మహిళలపై మగ పోలీసులు పిడి గుద్దులు గుద్దటం అన్యాయమని తెలిపారు. ప్రభుత్వ భూమిలో గుడిసెలేసుకున్న పేదలకు పట్టాలివ్వాలని డిమాండ్ చేశారు. వారికి ఇందిరమ్మ గృహ నిర్మాణ పథకం ద్వారా రూ. ఐదు లక్షలివ్వాలని విజ్ఞప్తి చేశారు. రాష్ట్రవ్యాప్తంగా భూ పోరాట కేంద్రాల్లో ప్రజాసంఘాల నాయకులు, ప్రజలపై పెట్టిన అక్రమ కేసులను ఎత్తేయాలని డిమాండ్ చేశారు.



# మాదక ద్రవ్యాలకు యువత దూరంగా ఉండాలి




## ప్రభుత్వం, పోలీసు అధికారులు నిరంతర నిఘా పెట్టాలి : ఎస్ఎఫ్ఐ, డీవైఎఫ్ఐ అధ్యక్ష, కార్యదర్శులు

## ఓయూ ఎన్‌సీసీ గేట్ నుంచి ఆర్ట్స్ కాలేజీ వరకు 2కే రన్

**నవతెలంగాణ–సిటీబ్యూరో**

మాదక ద్రవ్యాలకు యువత దూరంగా ఉండాలని, వాటిని నిర్మూలించడంలో ప్రభుత్వం, పోలీసు అధికారులు నిరంతర నిఘా పెట్టాలని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు ఆర్.ఎల్.మూర్తి, టి.నాగరాజు, డీవైఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు కోట రమేష్, ఆనగంటి వెంకటేష్ కోరారు. షహీద్ భగత్ సింగ్ వర్ధంతి స్మారక యువజన ఉత్సవాల్లో భాగంగా ఆదివారం ఎస్ఎఫ్ఐ, డీవైఎఫ్ఐ హైదరాబాద్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో "సే నోటు డ్రగ్స్" నినాదంతో ఉస్మానియా యూనివర్సిటీలో ఎన్సీసీ గేట్ నుంచి ఆర్ట్స్ కాలేజీ వరకు 2కే రన్ నిర్వహించారు. అంతకు ముందు 2కే రన్ ప్రారంభించి.. వారు మాట్లాడారు. తెలంగాణ రాష్ట్రంలో, హైదరాబాద్ జిల్లా వ్యాప్తంగా డ్రగ్స్–మాదక ద్రవ్యాల సరఫరా ఎక్కువైందని, వాటిని అరికట్టడంలో ప్రభుత్వం విఫలమైందన్నారు. డ్రగ్స్, మత్తు పదార్థాలు స్కూళ్లలో, కాలేజీల్లో గ్రామీణ ప్రాంతాల్లో చాక్లెట్స్, మత్తు పానీయాలు రూపంలో విరివిగా దొరుకుతున్నాయని తెలిపారు. వాటికి విద్యార్థి, యువత బానిసై అనారోగ్యాలకు గురవుతున్నారన్నారు. ఇప్పటికైనా వీటిని అరికట్టడంలో ప్రభుత్వం, పోలీసులు మరింత నిఘా పెట్టాలని డిమాండ్ చేశారు. ఎస్ఎఫ్ఐ, డీవైఎఫ్ఐ రాష్ట్ర కమిటీలు ఆధ్వర్యంలో 'సే నో టు డ్రగ్స్' నినాదంతో అహగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని, భగత్ సింగ్, రాజగురు, సుఖ్‌దేవ్ వర్ధంతి సందర్భంగా రక్తదాన శిబిరాలు, సే నో టూ డ్రగ్స్ సెమినార్లు, వ్యాసరచన, చిత్రలేఖనం పోటీలను నిర్వహిస్తున్నామన్నారు. భగత్ సింగ్ స్ఫూర్తితో యువతలో ఐక్యతకు విద్యార్థులు, యువకులకు ఆటల పోటీలు, క్రికెట్ పోటీలు, షటిల్, వెయిట్ లిఫ్టింగ్, చెస్ పోటీలను, యువ కవి, గాయక సమ్మేళనం వంటి బహుముఖ కార్యక్రమాలు నిర్వహిస్తూ.. వారిలో ఉన్న ప్రతిభను ప్రోత్సహిస్తున్నామని తెలిపారు. నేడు దేశం ఎదుర్కొంటున్న సామాజిక వివక్షతలకు వ్యతిరేకంగా కులం, మతం పేరుతో జరుగుతున్న దాడులకు వ్యతిరేకంగా.. భగత్ సింగ్ కోరుకున్న అసమానతలు, వివక్షలు లేని సమాజాన్ని నిర్మించాలని, మతోన్మాదంపై పోరాడాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ, డీవైఎఫ్ఐ మాజీ నాయకులు శ్రీనివాస్, మహేందర్, విజయ్, శ్రీనివాసరావు, మారయ్య, డీవైఎఫ్ఐ హైదరాబాద్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు హస్మి బాబు, ఎండీ జావిద్, ఎస్ఎఫ్ఐ హైదరాబాద్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు అశోక్ రెడ్డి, లెనిన్ గువెరా, ఓయూ కార్యదర్శి రవి, నాయకులు స్టాలిన్, వినయ్, ప్రశాంత్, వీరేందర్, శ్రీమన్, హస్మీత, సాహన, సాయి, వేమన తదితరులు పాల్గొన్నారు.



# వయా ఎక్స్

## రాజకీయ నాయకులు, ప్రధాన స్రవంతి మీడియా మధ్య వారధి

## ట్వీట్లే వార్తలు, చర్చలకు కేంద్ర బిందువులు



న్యూఢిల్లీ : ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం ప్రపంచ తీరు తెన్నులను మార్చింది. అప్పట్లో ప్రభుత్వ పెద్దలు, రాజకీయ నాయకుడు ఏదైనా విషయంపై స్పందించాలంటే లేఖ ద్వారానో, మీడియా సమావేశం ద్వారానో జరిగేది. అయితే, ఎప్పుడైతే సోషల్ మీడియా విప్లవం వచ్చిందో అప్పటి నుంచి ఈ తీరు మారింది. ప్రభుత్వ పెద్దలు, రాజకీయ నాయకులు సామాజిక మాధ్యమాలే వేదికగా తమ భావాలను పంచుకుంటున్నారు. తమ స్పందనలను తెలియజేస్తున్నారు. ముఖ్యమైన అంశాలపై వారి అభిప్రాయాలను తెలియజేస్తున్నారు. ఇందుకు, ఎక్స్ (గతంలో ట్విట్టర్) ప్రధానంగా వేదికవుతున్నది. రాజకీయ నాయకులు తమ అధికారిక ఎక్స్ ఖాతాల్లో తమ అభిప్రాయాలు, భావాలు, స్పందనలు తెలియజేస్తున్నారు. ప్రస్తుతం వీటి ఆధారంగానే ప్రధాన స్రవంతి మీడియాకు రాజకీయ నాయకుల నుంచి సమాచారం అందుతున్నది. అంటే, ఎక్స్.. రాజకీయ నాయకులు, ప్రధాన స్రవంతి మీడియాకు మధ్య వారధిగా మారిందని సాంకేతిక నిపుణులు, విశ్లేషకులు అంటున్నారు.

2017 నుంచి 2020 మధ్య భారతదేశంలో ఎక్స్(ట్విట్టర్)కు దాదాపు 2.5 నుంచి 3 కోట్ల మంది వినియోగదారులు ఉన్నారు. ఇతర ప్లాట్‌ఫారమ్‌ల పెద్ద యూజర్ బేస్‌ల నుంచి వచ్చిన డేటా కంటే ఎక్స్ అందించిన రియల్–టైమ్ డేటా (నిజ–సమయ సమాచారం) చాలా ఉపయోగకరంగా ఉన్నదని నిపుణులు చెప్తున్నారు. ఎక్స్ అనేది బ్రేకింగ్ న్యూస్‌కి మూలంగా మారిందనీ, ఇది ఎప్పుడైనా ప్రపంచ పల్స్‌కు ఉత్తమ సూచిక అని అంటున్నారు. ఫేస్‌బుక్ వంటి ప్లాట్‌ఫారమ్‌ల గోప్యతా పరిమితులు కొంత గందరగోళపర్చే అంశాలని నిపుణులు చెప్తున్నారు. కానీ, ఎక్స్ అలా కాదనీ, రియల్ టైమ్ ప్రాతిపదికన అత్యంత సంబంధిత, ప్రాంత–కేంద్రీకృత పోకడలను అందిస్తుందని అంటున్నారు.

**పలు ఉద్యమాలకు వేదిక**

మీటూ, బ్లాక్ లివ్స్ మ్యాటర్ వంటి హ్యాష్ ట్యాగ్ ఉద్యమాలకు ఇతర సోషల్ మీడియా ప్లాట్‌ఫారమ్‌ల కంటే ఎక్స్‌లోనే ట్రెండ్‌గా మారి ప్రపంచంలో ఒక విప్లవాన్ని సృష్టించాయని నిపుణులు చెప్తున్నారు. వార్తలు, సమాచారం ట్విట్టర్‌లో అత్యంత వేగంగా ప్రయాణిస్తుందనీ, ఎందుకంటే ప్లాట్‌ఫారమ్ దాని కంటెంట్‌ను చూడటానికి సైన్ అప్ చేయాలని వినియోగదారులు కానివారిని బలవంతం చేయదని వివరిస్తున్నారు. మెజారిటీ వినియోగదారులు తమ ట్వీట్లను పబ్లిక్‌గా అలాగే ఉంచుతారు. అంటే పాఠకుడికి ట్విట్టర్ ఖాతా ఉన్నా లేకున్నా వాటిని ఎవరైనా చదవవచ్చు.

భారత్‌లో 2019 లోక్‌సభ ఎన్నికల సమయంలో రాజకీయ వ్యాప్తిపై చేసిన ఒక అధ్యయనం భాషా వినియోగాన్ని విశ్లేషించింది. రాజకీయ నాయకులు, నటులు, ప్రధాన స్రవంతి మీడియా మధ్య సంభాషణలకు మధ్యవర్తిత్వం వహించడానికి ట్విట్టర్ తన పనితీరును ఎలా విస్తరించిందో హైలైట్ చేసింది. భారత్‌లోని మిగిలిన వారితో పోలిస్తే హిందీ మాట్లాడే రాష్ట్రాలకు చెందిన రాజకీయ నాయకులు ట్విట్టర్‌లో ఇంగ్లీషను ఉపయోగించటం చాలా తక్కువగా ఉన్నదని తేల్చింది. ప్రభుత్వ హ్యాండిల్స్, రాజకీయ పార్టీలతో పోలిస్తే ఆంగ్లంలో ట్వీట్ చేసే అవకాశం ఉన్నదని వివరించింది.

ఎక్స్‌తో రాజకీయ పార్టీలు, రాజకీయ నాయకులు తమ అధికారిక ఖాతాల్లో చేసే పోస్టులు కొన్ని సందర్భాల్లో తీవ్రంగా వైరల్ కావటం, వివాదాలకు దారి తీయటం వంటివి జరుగుతాయి. కొన్ని సందర్భాల్లో రాజకీయ నాయకులు ట్విట్టర్ వేదికగా సవాళ్లు, ప్రతిసవాళ్లు.. విమర్శలు, ప్రతి విమర్శలు.. అభినందనలు, కృతజ్ఞతలు వంటి పోస్టులు కనిపిస్తాయి. ట్విట్టర్ ఖాతాదారులే కాకుండా సాంకేతిక పరిజ్ఞానంపై కొంత అవగాహన ఉన్నవారెవరైనా వీటిని చూడవచ్చు. అయితే, అలాంటి సాంకేతిక పరిజ్ఞానం వినియోగించే అవగాహన లేని వారు ప్రధాన స్రవంతి మీడియాలో ఆ సమాచారాన్ని పొందుతారని నిపుణులు చెప్పారు. ఉదాహరణకు, ఆప్ కన్వీనర్, ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ ఒక ట్వీట్ ద్వారా ఢిల్లీకి పూర్తి రాష్ట్ర హోదా కల్పించే అంశాన్ని లేవనెత్తినప్పుడు, అది టీవీ, రేడియో, ప్రింట్ మీడియాలో ముఖ్యాంశాలుగా మారింది. అది ట్విట్టర్‌లో కేజ్రీవాల్‌కు ఉన్న ఫాలోవర్ల కంటే ఎక్కువ మందికి చేరింది. 2017 గుజరాత్ అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో, నిత్యావసర వస్తువుల ధరల పెరుగుదల గురించి కాంగ్రెస్ నాయకుడు రాహుల్ గాంధీ చేసిన గ్రాఫిక్‌లోని తప్పులు సాంప్రదాయ మీడియా అంతటా ప్రచారమయ్యాయి. మరో సందర్భంలో, 2018లో కర్నాటక అసెంబ్లీ ఎన్నికల ఫలితంగా హంగ్ అసెంబ్లీ ఏర్పడింది. గవర్నర్ బీజేపీని ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయాలని ఆహ్వానించిన తర్వాత రాహుల్ గాంధీ ట్విట్టర్‌లో బీజేపీపై దాడి చేసినప్పుడు.. సాంప్రదాయ మీడియా హెడ్‌లైన్‌లు, సంపాదకీయాలతో రంగంలోకి దిగింది. చర్చా కార్యక్రమాలు నిర్వహించింది. డిసెంబర్ 2019లో, కర్నాటకలో జరిగిన ఉపఎన్నికల్లో బీజేపీ 15 సీట్లకు 12 గెలిచి సాధారణ మెజారిటీని సాధించినప్పుడు, రాష్ట్ర ప్రజలకు మద్దతు ఇచ్చినందుకు ప్రధాని మోడీ ట్విట్టర్‌లో కృతజ్ఞతలు తెలిపారు. ఇది కూడా అన్ని టెలివిజన్, ప్రింట్ మీడియా ప్లాట్‌ఫారమ్‌లలో జాతీయ ముఖ్యాంశంగా మారింది.


నవతెలంగాణ దర్వాజ 4
సోమవారం 18-3-2024 || హైదరాబాద్

తెలుగు సాహిత్యం

# అనువాదం జరగాల్సి వుంది



'బాధల బందిఖానాలో శుష్కించిన గుండెలకు.. ఉపశమన చేదను అందించటం.. ఉత్తమ కవిత్వ ఉదాత్తాశయం.. సూర్యబింబాన్ని బొట్టు చేసి.. తూర్పు నుదుటి మీద అతికించేది కవిత్వం.. సుడిగాలికి జడివానకూ జడవని.. మడమతిప్పని కర్తవ్య పరాయణత్వం కవిత్వం...' అనే ఎలనాగ అనువాద సాహిత్యానికి విశేష సేవలందిస్తున్నారు. అంగ్ల సాహిత్యాన్ని తెలుగు పాఠకులకు, తెలుగు సాహిత్యాన్ని అంగ్ల పాఠకులకు అందిస్తున్నారు. ఇటీవల 'గాలిబ్ నాటి కాలం' అనువాదానికి కేంద్ర సాహిత్య అకాడిమీ పురస్కారనికి సైతం ఎంపికయ్యారు. ఈ సందర్భంగా ఆయనతో జరిపిన ముఖాముఖీ...



**మీ కుటుంబ నేపథ్యం, మీ రచనా వ్యాసంగం ఎలా మొదలయిందో చెప్తారా..?**

కరీంనగర్ దగ్గర ఎలగందుల మా స్వగ్రామం. మా నాన్న నాగరాజు తిరుమలయ్య ఆయుర్వేదం వైద్యులు. అప్పట్లో గ్రామంలో మంచి పేరు ఉండేది. అమ్మ నాగరాజు రంగమ్మ, గృహిణి. నా అసలు పేరు నాగరాజు సురేంద్ర. ఊరు పేరు, ఇంటి పేరు కలిసి వచ్చేలా ఎలనాగా అని నా కలం పేరు పెట్టుకున్నాను. పాఠశాల విద్య మొత్తం స్వగ్రామంలో జరిగింది. మంచి విద్యార్థిగా పేరు తెచ్చుకున్నాను. అయితే రచయిత కావాలని నేనెప్పుడూ అనుకోలేదు. అది సహజంగా అలా జరిగిపోయింది. మా నాన్న అప్పటికప్పుడు కొన్ని పద్యాలు రాసేవారు. చిన్నప్పటి నుండి పత్రికలు, స్కూల్ లైబ్రరీలో పుస్తకాలు చదివేవాడిని. స్కూల్లో తెలుగు గురువు ప్రభావం నాపై చాలా ఉండేది. అలాగే మా అన్నయ్య నాగరాజు రామస్వామి సుమారు 15 పుస్తకాలు రాశారు. ఆయన ప్రభావం కూడా నాపై ఉంది. అన్నయ్య కరీంనగర్, వరంగల్ నుండి సినారే, దాశరథి పుస్తకాలు బాగా తెచ్చేవారు. ఇలా చదువుతున్న క్రమంలోనే కవిత్వం రాయడం మొదలుపెట్టాను. మా తమ్ముడు కూడా సంస్కృతంలో పద్యాలు బాగా రాస్తాడు.

**అసలు అనువాదం చేయాలనే ఆలోచన ఎలా వచ్చింది..?**



ఎలనాగకు అభినందనలు తెలుపుతున్న తెలంగాణ సాహితీ రాష్ట్ర కార్యదర్శి కె.ఆనందాచారి, నాయకులు

గాంధీ మెడికల్ కాలేజీలో ఎంబీబీఎస్ పూర్తి చేసి 1972లో 1980 నుండి 1986 వరకు నైజీరియాలో డాక్టర్‌గా పని చేశా. అక్కడ తెలుగు పుస్తకాలు దొరకవు. ఇక అనివార్యంగా ఇంగ్లీష్ పుస్తకాలు కొన్ని చదవేవాడిని. అలా సోమర్సెట్ మామ్‌తో పాటు ప్రముఖ ఇంగ్లీష్ రచయితల పుస్తకాలన్నీ కొని చదివాను. చదవడం అంటే ఏదో ఊసుపోక కాదు. అర్థం తెలియని పదాలకు డిక్షనరీలో వెదికి మరీ అర్థాలు తెలుసుకునేవాడిని. దాంతో ఇంగ్లీష్‌పై మంచి పట్టు సంపాదించగలిగాను. అలా ఇంగ్లీష్ పుస్తకాలు చదువుతున్నపుడే మొదటిసారి సోమర్సెట్ మామ్ రాసిన The Alien Corn అనే ఆంగ్ల నవలిక 1986 కంటే ముందే 'కలుపుమొక్క' పేరుతో తెలుగులోకి అనువాదం చేశాను. 2005లో దాన్ని వాహినీ పబ్లికేషన్ వారు ప్రింట్ వేశారు.

**అనువాదం చేసే క్రమంలో ఎలాంటి సవాళ్లు ఎదుర్కొన్నారు?**

సవాళ్లు కచ్చితంగా ఉంటాయి. సాధ్యమైనంత వరకు సరైన పదం వెదికేందుకు చాలా ప్రయత్నిస్తాను. అనువాదంలో నాకు కేంద్ర సాహిత్య అకాడమీ వారు అవార్డు వచ్చిన గాలిబ్ పుస్తకం అనువాదం చేసేటపుడు ఒక పదానికి అర్థం దొరక్క ఆరు నెలలు వెదికాను. ఏదో వేసేద్దాంలే అని అనుకుంటే వాక్యానికి సరైన అర్థం రాదు. ఇలా వెదకడం పెద్ద పని, కష్టం కూడా. కానీ వెదకడం నాకు అలవాటుగా మారిపోయింది. అలాగే మన జాతియాలకు ఇంగ్లీష్‌లో పదాలు దొరకవు. ఉదాహరణకు బతుకమ్మ, బొడ్రాయి వంటివి. ఈ పదాలను ఇంగ్లీష్‌లోకి అనువదించలేం. అలాంటి పదాలను ఇంగ్లీష్‌లోనే పెట్టి కింద ఫుట్ నోట్స్‌లో వివరంగా రాస్తాను. అలాగే 'శవాలని మోసేవాడి కథ' అనువాదం చేసేటప్పుడు టారో అనే ఓ పదం వచ్చింది. అది పార్శి పదం. ఎంత వెదికినా దాని అసలైన అర్థం దొరకలేదు. దాంతో నాకు తెలిసిన ఇరానీ ఫ్రెండ్ ఒకరు అమెరికాలో ఉంటే అతన్ని అడిగాను. ఇలా ఎంతో ప్రయత్నిస్తే చివరకు అది మనం ఒంటికి రాసుకునే సెంట్‌కు సంబంధించిన ఒక బ్రాండ్ అని తెలిసింది. ఇలా ఏదైనా ఒక తపస్సులా భావించి చేస్తాను. అలా అనువాదం చేసినప్పుడే సరిగ్గా వస్తుంది. అలా అని అన్ని పదాలకు పర్ఫెక్ట్‌గా పెట్టాలనేమి లేదు. ప్రతి వాక్యంలో రెండో మూడో కీలకమైన పదాలు ఉంటాయి. వాటిని సరిగ్గా అనువాదం చేస్తే చాలు. నాకు సందేహాలు వచ్చినప్పుడు పెద్ద పెద్ద పండితులను అడుగుతుంటాను.

**ఇతర భాషల్లో ముఖ్యంగా పాశ్చాత్య సాహిత్యంలో తెలుగు సాహిత్యం కంటే భిన్నంగా ఏమైనా ఉందంటారా?**

కచ్చితంగా ఉంది. ఉదాహరణ లాటిన్ అమెరికా స్టోరీలు కొన్ని అనువాదం చేశాను. శిల్ప పరంగా అద్భుతమైన కథలు అవి. అవి చదువుతుంటే నిజంగానే మనం లాటిన్ అమెరికాలో ఉన్నామా అనిపిస్తుంది. అలాంటి వాటి నుండి చాలా నేర్చుకోవచ్చు. ఇలా ఇతర భాషల నుండి కొన్ని కొత్త విషయాలు తెలుసుకోవచ్చు.

**మీ పుస్తకాల గురించి చెబుతారా..?**

మొత్తం 37 పుస్తకాలు రాశాను. అందులో పదహారు తెలుగులో, రెండు ఇంగ్లీషులో రాశాను. పది ఇంగ్లీష్ నుండి తెలుగులోకి, తొమ్మిది తెలుగు నుండి ఇంగ్లీష్‌లోకి అనువాదం చేశాను. 'వాగంకురాలు' అనేది తెలుగులో నా మొదటి కవితా సంపుటి. అలాగే వట్టికోట ఆళ్వార్ స్వామి కథలు, కాళోజి కథలు, కాళోజి నా గొడవ, అమ్మంగి వేణుగోపాల్ గారి సాహిత్యం ఇంగ్లీష్‌లోకి అనువదించాను. ఈ మధ్యనే డాజలర్స్ అని ఇంగ్లీష్‌లో మినీ కవిత్వం రాశాను. వాటిని నేనే తెలుగులోకి అనువదించుకున్నాను. శాస్త్రీయ సంగీతం పట్ల ఉన్న ప్రేమతో 'మెమొరబుల్ మెలోడి మేకర్స్ అండ్ అదర్ పోయమ్స్ ఫ్రం మ్యూజిక్' పేరుతో ఓ కవితా సంపుటి రాశాను. ఈ పుస్తకం మన భారతీయ భాషల్లోకి కూడా వచ్చింది. ఆ పబ్లికేషన్ వాళ్ళు 15 రోజుల్లోనే బుక్ పబ్లిష్ చేసి ఇచ్చేశారు. చాలా ఆశ్చర్యపోయాను. వాళ్ళే పొయిట్ ఆఫ్ ది ఇయర్‌కి అప్లయ్ చేయమంటే ముందు అంత ఆసక్తి చూపలేదు. తర్వాత చేస్తే అంతర్జాతీయ అవార్డు వచ్చింది. తర్వాత దాన్ని వాళ్ళే ఏడు అంతర్జాతీయ భాషల్లోకి అనువాదం చేశారు.

**అనువాదం చేస్తున్న నేటితరానికి మీరిచ్చే సూచనలు..?**

ముందు భాషపై పట్టు సాధించాలి. ఒక్క ఇంగ్లీష్ అనే కాదు వాళ్లు అనువాదం చేసే ఏ భాషనైనా వంద శాతం మనకు వచ్చి ఉండాలి. కనీసం 90శాతమైన ఆ భాష నేర్చుకోవాలి. ఒక్క మాటలో చెప్పాలంటే మన మాతృభాషపైన ఎంత పట్టు ఉంటుందో అనువాదం చేయాలనుకునే భాషపై కూడా అంతే ఉండాలి. అప్పుడే అనువాదానికి న్యాయం చేయగలం. దానికోసం ఒక భూమికను తయారు చేసుకోవాలి. అనువాదానికి భాష చాలా కీలకం. అందుకు చాలా అధ్యయనం చేయాలి.

**అసలు కవిత్వ అనువాదం సాధ్యమేనంటారా?**

కవిత్వ అనువాదం ఎవరు చేసినా ఓ పది శాతం పోతుంది. వాస్తవానికి అందరూ కవిత్వ అనువాదం కన్నా వచన అనువాదం చాలా సులభం అనుకుంటారు. కానీ అదేంటో నాకు కవిత్వ అనువాదమే సులభంగా ఉంటుంది. బహుశా స్వతహాగా నేను కవిని కావడం వల్లనో ఏమో! వచనానికన్నా కవిత్వాన్ని అనువదించడానికే ఇష్టపడతాను. ఎందుకంటే ఇంగ్లీష్ గ్రామర్ చాలా కష్టం. ఎంత ప్రయత్నించినా కచ్చితంగా తప్పులు వస్తాయి. కవిత్వంలో కూడా గ్రామర్ సమస్య ఉంటుంది. కానీ వచనంతో పోలిస్తే కాస్త తక్కువే అని చెప్పాలి. కవిత్వంలో లైన్లు తక్కువ. పూర్తి వాక్యం ఉండదు. ఇదే అనువాదానికి అనుకూలం. కానీ వచనం అలా కాదు. చాలా కష్టంగా అనిపిస్తుంది. సరైన పదాలు దొరక్క ఇబ్బంది పడాలి. అనువాదం చేసే క్రమంలో నా సొంత అనుభవాలు ఇవి.

**మన తెలుగు సాహిత్యం ఇతర భాషల్లోకి పెద్దగా అనువాదం జరగడంలేదు, ఎందుకంటారు..?**

ఇతర భాషా సాహిత్యాన్ని తెలుగులోకి తీసుకొచ్చే ప్రయత్నం కొంత వరకు జరుగుతుంది. కానీ మన తెలుగు సాహిత్యం ఇతర భాషల్లోకి అనువాదం అసలే జరగడం లేదు. మన దగ్గర రాసే వాళ్ళు చాలా మంది ఉన్నారు. కానీ ఒకరిద్దరివి మాత్రమే ఇతర భాషల్లో కనిపిస్తున్నాయి. మన దక్షిణ భారత దేశంలో తెలుగు పరిస్థితి మరీ ఘోరం అనే చెప్పుకోవచ్చు. ఈ సమస్య పరిష్కారం కావాలంటే విశ్వవిద్యాలయాలు, అకాడమీలు పూనుకొని అనువాదాలు చేయాలి, చేయించాలి.

కవిత్వ అనువాదం ఎవరు చేసినా ఓ పది శాతం పోతుంది. వాస్తవానికి అందరూ కవిత్వ అనువాదం కన్నా వచన అనువాదం చాలా సులభం అనుకుంటారు. కానీ అదేంటో నాకు కవిత్వ అనువాదమే సులభంగా వుంటుంది. బహుశా స్వతహాగా నేను కవిని కావడం వల్లనో ఏమో! వచనానికన్నా కవిత్వాన్ని అనువదించడానికే ఇష్టపడతాను.



- సలీమ,
94900 99083

## జైలు గోడలు దాటి..



వంచితుల వాక్కువయినందుకే
సత్యాన్ని సమాధి చేయాలని
తరగతి గదిలోంచి నిన్ను
చీకటి గుహలోకి బదిలీ చేశారు
కానీ, సత్యం కూడా శక్తి నిత్యత్వ నియమమేనని
కాలం మరో మారు నిరూపించింది
దేహం అచేతనత్వ గేహమైనా
గాయాలను కానుకిచ్చిన కాల సర్పాలు
అడుగు కదపజాలని అతి సున్నితునికి
అండాసెల్ ఓ అనకొండ కౌగిలి
అసహన శక్తుల ఆజ్ఞల అగ్నిపరీక్షలో
నిప్పుల గుండం లోంచి విరిసిన నిజాయితీ పుష్పానివి
ఈ దేశపు మానవహక్కుల ప్రతీకవై
ప్రపంచ యవనికపై ప్రదర్శితమైన
పాలకుల పరిహాస ప్రయోగానివి నువ్వు
ఏం చేయగలిగింది రాజ్యం నిన్ను.
కనురెప్పలు దాటనీయకుండా కొన్ని కలల్ని కత్తిరించింది
మోడు వారిన నిన్ను చిగురింపజేస్తున్న
వాత్సల్యపు 'వసంతా'నికి బలవంతపు శిశిరాన్ని బహూకరించింది
విలువైన నీ జీవన వృక్షపు
కొమ్మల్ని కొన్నింటిని కొట్టివేసింది
భుజాలపై మోసి అక్షరాలకు చేరువ చేసిన
అమ్మ ఆఖరి చూపుకు అడ్డుగోడై నిలిచి
పేగు బంధపు పెనుగులాటల పెంజీకట్లు పరిచింది
నిషేధిని వెక్కిరించిన ఋషిత్వం నీది
నిజాయితీని కత్తిమొనపై మోపిన సాహసం నీ ఆశయానిది
నిన్ను వాడిపోనీయకుండా
తలా చెంబెడు కరుణ జలాలను పోసి
కాపాడుకున్న సమాజ చలనాల సమిష్టి విజయం నీ విడుదల
కదలిక లేని నీ పాదాలు నిరంకుశ చట్టాలను తొక్కుకుంటూ
వేచి ఉన్న వేల కరచాలనాల కోసం
విముక్తి గీతాలు ఆలపిస్తూ వస్తున్నావు
రా.. చావును నిరాకరించిన నిశ్శబ్ద యుద్ధ వీరుడా
నియంతలు నిర్మూలించలేనిది
నిర్బంధాలు నిరోధించజాలనిది
సత్యమొక్కటేనన్న సందేశాన్ని మోసుకుంటూ
జైలు గోడలను దాటి ..జన సమూహంలోకి రా..
వీల్ ఛేర్ పై విస్ఫులింగ దృశ్యమై రా..

- గాజోజు నాగభూషణం, 9885462052

## విషోన్మాదం!



చిగురిస్తున్న ఉన్మాద కాలమిది
బీభత్సాలకు పురుడు పోస్తున్న ఋతువులివి
హింసతప్ప ప్రతిహింస లేని జీవనమిది
గుడ్డి యంత్రమైపోయింది దేహం!
ఓ కన్ను కులం మడుగులో కొట్టుకుంటోంది
మరో కన్ను మతోన్మాదంలో మాయమైపోతోంది
ఉన్న మనోనేత్రం మాయం కాక తప్పదు
సర్వం కోల్పోతున్న సహజత్వాలు రాక్షస రాజకీయ పద్మవ్యూహాల్లోకి
రక్తసిక్త ధనదాహాల్లోకి ఆధిపత్య సర్ప పరిష్వంగాల్లోకి
ఉర్గంధ ఉప్పెనల్లోకి నెట్టేస్తున్నది పాలక బైరూపులోళ్లే కదా!
మనకున్న సహజత్వాన్ని వొట్టి తొర్రను చేసి కుల గింజల్నీ మతోన్మాద విత్తనాల్నీ
ఈ సుజల సుఫలాలతో శుద్ధి చేయడమెందుకో!
మానవ వృక్షాలకు మనోపుష్పాలు పూయక పోతే యెలా?
పాలక మందిరాల ముందు ప్రజలు ధ్వజస్తంభాలు కావల్సిందేనా?
ఓటు శిలా ప్రతిమై పోవాల్సిందేనా? రాజకీయ కాలమేఘాల వృత్సులో బలికే బిడ్డలారా?
మనుషులు చేసిన దేవుళ్లారా? దేవుడు చేసిన మనుషుల్లారా?
ఇది రాజకీయ రణకాలం మనోఖడ్గాలకు మరింత పదును పెట్టండి!

- డా॥నాళేశ్వరం శంకరం, 9440451960

### 'తెలంగాణ సాంస్కృతిక పదకోశం' పుస్తకావిష్కరణ

'తెలంగాణ సాంస్కృతిక పదకోశం (పండుగలు, జాతరలు)' పుస్తకావిష్కరణ సభ మార్చి 20 వ తేదీ సాయంత్రం 5: 00 గం.లకు రవీంద్రభారతి, రెండవ అంతస్తులో జరగనుంది. ప్రొ. సాగి కమాలాకర శర్మ, డా. నందిని సిధారెడ్డి, ప్రొ. పిల్లలమర్రి రాములు, ప్రొ. పమ్మి పవన్ కుమార్, ప్రొ. రెడ్డి శ్యామల, ప్రొ. సి. కాశీం, పాల్గొంటారు. శ్రీ చెరుకూరి మల్లేష్, డా. డి. ఉదయ్ భాను, డా. ఎస్. చంద్రయ్య శ్రీ మహేందర్ పాల్గొంటారు.

- డా. నామోజు బాలాచారి

### 'నాగలి కూడా ఆయుధమే.!' పరిచయ సభ

ప్రముఖ కవి విల్సన్ రావు కొమ్మవరపు కవితా సంపుటి 'నాగలి కూడా ఆయుధమే' పరిచయ సభ ఈ నెల 21వ తేదీ సాయంత్రం 4 గంటలకు తిరుపతిలోని యూత్ హాస్టల్ నందు జరుగుతుంది. తోట వెంకటేశ్వర్లు, భూమన్, ఆచార్య పి.సి.వెంకటేశ్వర్లు, డా. వై.సుభాషిణి, ఆర్.సి.కృష్ణస్వామిరాజు, పల్లిపట్టు నాగరాజు, డా.కొత్వాలు అమరేంద్ర, కవి కొమ్మవరపు విల్సన్ రావు పాల్గొంటారు.

### కర్నముత్తారెడ్డి స్మారక కవితల పోటీలు

తెలంగాణ సాయుధ పోరాట యోధులు కర్క ముత్తారెడ్డి గారి జ్ఞాపకార్థం రెండు తెలుగు రాష్ట్రాల స్థాయిలో కవితల పోటీ నిర్వహిస్తున్నది. పదవతరగతి లోపు విద్యార్థులకు 'పర్యావరణ హితమే సామాజిక హితం' అంశం మీద, అన్ని వయసుల వారికి మతసామరస్యం-భారతీయత అంశం మీదా పోటీలు నిర్వహిస్తున్నారు. కవితలు 25 లైన్లకు మించికుండా పోస్ట్ ద్వారానే కవితలు పంపాలి. చివరితేది మార్చి 30. కవితలు పంపాల్సిన చిరునామా - సుమలత, కన్వీనర్ ఇం.నెం. 13-1-3/3/6/2E, అవంతినగర్ తోట. మోతి నగర్, హైదరాబాద్ -500018. వివరాలకు సెల్: 8688603130.

### కవిత 2023 కోసం

సాహితీమిత్రులు, విజయవాడ నుండి ఈ సంవత్సరం మే 1 న వెలువడబోయే కవిత 2023 కోసం కవితల ఎంపిక కోసం ఆహ్వానం పలుకుతున్నారు. కవితలు 2023 జనవరి నుండి డిసెంబర్ మధ్య ఏదైనా ప్రింట్ లేదా ఆన్ లైన్ పత్రికలలో ప్రచురితమైనవై ఉండాలి. కవితల సాఫ్ట్ కాపీని editor.kavita2023@gmail.com కు మార్చ్ 30వ తేదీలోగా మెయిల్ చెయ్యగలరు.


## 'రాయకూడని పద్యం' రాస్తున్న ధీర మౌమితా ఆలం

ఒక్కొక్కసారి ఒక పుస్తకమో, ఒక వ్యక్తో, ఒక సంఘటనో మన దృక్కోణంలో మార్పు (Paradigm Change) కి కారణం అవుతారు. అప్పుడు మన లోపల కొన్ని విస్ఫోటనాలు జరిగి, మనం లోకం పట్ల చూసే చూపు నిశితమవుతుంది. జరుగుతున్న విషయం విధ్వంసమా, వినిర్మాణమా అర్థం చేసుకొనే సామర్థ్యం పెరుగుతుంది. ఆ పని చేసిన ఒక పుస్తకం గురించి ఇక్కడ నేను మాట్లాడదలుచుకున్నాను. ఈ పుస్తకం ఒక సాధారణ బాలిక తన కల్లోలిత బాల్య తలపోతల గురించి, ఒక ముస్లిం యువతి తనకెదురైన చేదు అనుభవాల గురించి, ఒక సామాజిక బాధ్యత కలిగిన ఒక భారతీయ పౌరురాలు తన దేశ అల్లకల్లోలాల గురించి, అంతర్జాతీయంగా బడుగు దేశాల మీద పెట్టుబడిదారులు చేస్తున్న యుద్ధోన్మాద దాడుల గురించి ఏమాత్రం వెరవని ఒక దృఢ స్వరంతో, ఒక ప్రజా కార్యకర్త వేదనతో మాట్లాడుతున్న విషయాల గురించి చర్చిస్తుంది. ఆ పుస్తకమే మౌమితా ఆలం అనే బెంగాలీ కవయిత్రి రాసిన కవిత్వం తెలుగులో అనువదితమైన 'రాయకూడని పద్యం'.

ఎందుకు 'రాయకూడని పద్యం' అని పేరు పెట్టారంటే ఈ పుస్తకానికి పేరు లేని సంపాదకురాలిగా వ్యవహరించిన రమాసుందరిగారు మౌమితా కవిత్వం గురించి ఇలా అంటున్నారు. 'ఆమె పద్యాలు కాలాతీతంగా న్యాయం కోసం అలమటిస్తున్న వారి గురించి పుంఖానుపుంఖాలుగా, నిరంతరంగా మాట్లాడతాయి. స్త్రీగా, ముస్లిం స్త్రీగా, వెనుకబడిన ఉత్తర బెంగాల్ ప్రాంతానికి చెందిన ముస్లిం స్త్రీగా, ఒంటరి తల్లిగా - ఆమె అస్తిత్వం అంతటితో పరిమితం అవకుండా ప్రాంతాలు, భాషలు, దేశాలు, జాతులు, మతాలు దాటి - విశ్వ బాధితుల పక్షాన నిలబడింది'. బాధితుల పక్షాన నిలబడటమంటే రాజ్య ధిక్కారమే కదా.

పైగా మౌమితా అంటుంది 'నిజానికి రాజ్యానికి కావాల్సింది (ప్రతి విషయంలోనూ) మౌనాంగీకారమే. ఇక్కడే, నిరసనకారులు నిశ్శబ్దాన్ని ఛేదించేది. గడ్డకట్టిన మౌనాలను ఛేదించి తమ గొంతు వినిపించే ప్రయత్నం చేస్తారు. అందుకే జైళ్ళు, సంకెళ్ళు. ఈ మౌనాన్ని వెక్కిరించడానికే, బద్దలు కొట్టడానికే నేను రాస్తాను'. మరి రాజ్యానికి ఎదురుగా నిలబడి రాసేది రాజ్యద్రోహంలే కదా. అందుకే మౌమితా రాసేది 'రాయకూడని పద్యం' అయింది.

కవిత్వం హృదయాన్ని కదిలించాలనుకుంటే ఈ కవిత్వం హృదయాన్ని పెల్లగిస్తుంది. మనసును మూగబోయేలా చేస్తుంది. కవిత్వం ఎక్కడ వుందీరోజుల్లో అనేవాళ్ళకి చేయి పట్టుకొని 'ఢిల్లీలో ఒక హాస్పటల్' కవిత చూపించండి. అక్కడ ఒక తల్లి తన కొడుకు ఖండిత అవయవాలు వేసిన బస్తా పట్టుకొని గాజుకళ్ళతో ఎదురు చూస్తుంటుంది. సమస్తాన్ని సంచిలో కుక్కుకుని కరోనా కాలంలో గమ్యం చేరని నడక నడుస్తూ శవమై తేలనున్న 'మంగూరాం' కనపడతాడు. కరోనా తరిమి కొడితే దిక్కుతోచక కడుపు పట్టుకొని బిక్కుబిక్కుమంటూ సిమెంట్ మిక్సర్ ట్యాంకర్ చీకట్లోంచి ప్రయాణించి బయటపడే మట్టికొట్టుకుపోయిన మనుషులు కనపడతారు. పాలకూరని కూడా గొడ్డు మాంసంగా కావాలని పొరబడేవారు, భయపడుతూ ప్రయాణం చేసే 'రైల్లో ముస్లింలు' తగులుతారు. జకియా దు:ఖం ఘనీభవించినపుడు, బిల్కిస్ ముక్కలై గుమిగూడినపుడు, వాళ్ళ కోసం నిలిచిన తీస్తా సెతల్వాడ్ పరిచయం అవుతుంది. 'సరిహద్దు ముళ్ళ కంచెకు/ చిరిగిన వస్త్రాలై వేలాడే' ఫేలానీ, సముద్ర తీరానికి శవమై కొట్టుకొచ్చిన బాలుడు అలాన్ కుర్దీలు తారసపడతారు. మొత్తంగా జవజవలాడే మనిషి కొనజీవంతో ఒక చిన్ని సహాయ హస్తం కోసం చేతులు చాస్తూ ఈ కవిత్వం నిండా కనిపిస్తారు.



ఆశ్చర్యంగా మౌమితా ఆలం కవిత్వంలోని తీవ్రత, గాఢత నివ్వెరపరుస్తుంది. ఎందుకంటే రాజకీయ అంశాలను కవిత్వం చేసేటపుడు సాధారణంగా వచనం జారిపోతూ వుంటుంది. కానీ మౌమిత ఎక్కడా వచనమై జారిపోదు. చిక్కని కవిత్వమై మదిలో మంట పెడుతుంది. ఊహించని ఉపమానాలతో, ఊహకందని వస్తువుతో కవితని దట్టిస్తుంది. వ్యక్తీకరణలో అవసరమైనచోట ఒకసారి ఆర్ద్రంగా, ఒకసారి వ్యంగ్యంగా, ఒకసారి నిరసనగా, ఒకసారి ధిక్కారంగా, ఒకసారి ప్రేమమయిగా అనేక రూపాల్లో వ్యక్తమవుతుంది. ఒక బాలికగా, ఒక యువతిగా, ఒక ముస్లిం స్త్రీగా, ఒక సామాజిక కార్యకర్తగా, ఒక అమ్మగా తనని తాను వ్యక్తీకరించుకున్న కవిత్వం ఇందులో వుంది. ఉటంకించాలంటే ఇందులో ప్రతి కవితలోనూ పేర్కొనవలసిన వాక్యాలు వున్నాయి. శీర్షికలు కూడా కవిత్వం మాట్లాడతాయి.

"మాట్లాడాల్సిన చోట/మౌనంలోకి జారుకునే..

'ఎముకలు కుళ్ళిన, రక్తం చచ్చిన/ సమస్త పరాన్నజీవుల ప్రతినిధిని" అని బానిస కవుల్ని ఛీత్కరించినా..

'చావడానికి/ మనకు కారణాలుంటాయేమో గాని/ చంపడానికి/ వాళ్ళకు ఏ కారణమూ ఉండక్కరలేదు' అని రాజ్యాన్ని ఈసడించినా.. 'ప్రేమే విప్లవం../ విప్లవమే ప్రేమ' అని యుద్ధరంగాన్ని ఒక తెంపరితనంతో ముద్దాడుదాం అన్నా..

'మేం గర్భ సంచులం గాదు/ పురుషాధిక్యతపై పిడికిలెత్తిన/ సమరయోధుల' మని ప్రకటించినా..

'మా సమాధి పలక మీద ఏం రాస్తారో/మీ పేరే మీ చావుకు కారణం'/ అని కచ్చితంగా చెక్కిపెడతారు.' అని

విద్వేషాన్ని నిలదీసినా... 'వికసించే మొగ్గలోనూ/ పెగులుకొచ్చే మొక్కలోనూ/ మోసులెత్తే కలల్లోనూ/ కవి ఉంటాడు/ అక్కడ నువ్వుంటావు... ప్రతి కొండ గుండె నీ కోసం/ స్వాతంత్ర్య పాలస్తీనా కోసం ప్రతిధ్వనిస్తుంది" అని పాలస్తీనా కవి రెఫాత్ అలరీర్ గురించి వలపోసినా.. మౌమితా కవిత్వం గొప్ప జవంతో, అనుకంపనతో పఠితను చుట్టుకుంటుంది.

'పద్యాన్ని ఇలా మాత్రం రాయకూడదు', 'జెండా పండుగకు జేజేలు', నేనెవర్నీ', గణతంత్ర దినోత్సవ శుభాకాంక్షలు', 'రాజు గారూ - రాజ్యమూ' లాంటి కవితల్లో మౌమిత వ్యంగ్యంతో ముంచెత్తుతుంది. చదివి తీరాల్సిన కవితలు ఇవి. రాజ్యం విసిరే పెనుకొమ్ముల మధ్య పొగరుగా నిలబడి వాక్యంతో ఢీకొనడం మాటలు కాదు. ఇంత మాట్లాడినా తన ఇస్లాం సహన మార్గం విడవదు. "మేమిక్కడే వుంటాం/ తుఫాను గడిచాక/ నిటారుగా నిలబడే గడ్డిపోచల్లాగ/ సడలని మా విశ్వాసాల్తో కదం తొక్కుతుంటాం/ మసీదులో నిర్భయంగా అజా వినిపిస్తాం/ ప్రేమ, శాంతి, సోదర భావం కోసం/ అలుపెరుగని పిలుపునిస్తాం" అని తన లక్ష్యం ప్రకటిస్తుంది. అందుకే మౌమితా ఆలం ధీర.

ఈ కవితలు చక్కగా అనువాదం చేసిన ఉదయమిత్ర గారు అక్కడక్కడా ఇంగ్లీషు మాతృక కవితల నుంచి కొంత విస్తరించి రాసి, కొంచెం ఎడంగా పోయినట్టు కనిపిస్తుంది. అయితే సారం చెడకుండా రాయడం ఊరట. Brevity is the soul of the poetry అంటారు కదా.. అనువాదం చేసేటప్పుడు ప్రాంతీయ భాషను వాడగా నేను చాలా అరుదుగా చూసాను. అనువాదకుడు తన తెలంగాణ పాలమూరు మాండలికం అక్కడక్కడా ఉపయోగించడం అందంగా అమరింది. సమకాలీనంగా ప్రపంచవ్యాప్తంగా ఆందోళన కలిగిస్తున్న అంశాలను శక్తివంతంగా సృజించిన మౌమితా ఆలం కవితలను తెలుగు చేసి పాఠకులకు అందించడం 'మాతృక' ప్రచురణలు బాధ్యతగా చేసిన గొప్ప పని. వాళ్ళకి కృతజ్ఞతలు చెప్పి తీరాలి. నస్రీన్ ఖాన్ విపులమైన ముందుమాట పుస్తక ద్వారాన నిలబడిన ఒక ఆహ్వాన వీచిక.

ప్రస్తుత ప్రపంచ రాజకీయ యుద్ధోన్మాద సందర్భంలో పెచ్చుమీరుతున్న అరాచక అభివృద్ధిని, వినాశనాన్ని పలు విధాలుగా మనకి అర్థం చేయించే శక్తివంతమయిన పుస్తకం ఈ 'రాయకూడని పద్యం'. ఈ పుస్తకం చదవడం ఒక ఉద్విగ్న అనుభవం.



- పి.శ్రీనివాస్ గౌడ్, 9949429449



## భువనగిరి పార్లమెంటు బరిలో సీపీఐ(ఎం) అభ్యర్థి

- ఏం కుట్రలు చేసి బీజేపీ 400 స్థానాలు గెలవాలనుకుంటుంది..?: సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు ఎండీ అబ్బాస్

నవతెలంగాణ జనగామ

పార్లమెంట్ ఎన్నికల బరిలో భువనగిరి నియోజకవర్గం నుంచి సీపీఐ(ఎం) పోటీ చేయనున్నట్టు ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు ఎండీ అబ్బాస్ తెలిపారు. ఆదివారం జనగామ జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో జనగామ నియోజకవర్గంలోని ఆయా మండలాల పార్టీ నియోజకవర్గ స్థాయి సమావేశం పార్టీ జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఇర్రి అహల్య అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీ సొంతంగా 400 స్థానాలు గెలుచుకుంటుందని ఆపార్టీ నాయకులు జోస్యం చెబుతున్నారని అన్నారు. ఈ మాటల్లో ఆ పార్టీ మతలబు ఏంటని ప్రశ్నించారు. రాజ్యాంగాన్ని మార్చాలంటే తమకు 400 స్థానాలు కావాలంటూ బీజేపీ ఎంపీ బహిరంగంగా చేసిన ప్రకటనకు ప్రధాని నరేంద్రమోడీ, సంఘ్ పరివార్ రహస్య అజెండాలో భాగమేనని తెలిపారు. త్వరలో నిర్వహించబోయే పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీ గెలవకుండా ప్రజలు చిత్తుగా ఓడించాలని పిలుపునిచ్చారు. బీజేపీ అధికారంలోకి రాకుండా అడ్డుకునేందుకు సీపీఐ(ఎం) అన్ని విధాలా ప్రయత్నం చేస్తుందని, అందులో భాగంగానే భువనగిరి పార్లమెంట్ బరిలో సీపీఐ(ఎం) ఉంటుందని స్పష్టం చేశారు. దేశంలో న్యాయాన్ని, సమానత్వాన్ని, పౌరహక్కులను, ప్రజాస్వామ్యాన్ని బీజేపీ ద్వేషిస్తుందని తెలిపారు.

సమాజాన్ని విభజించడం, భావప్రకటనా స్వేచ్ఛను పరిమితం చేయడం, స్వతంత్ర సంస్థలను అణచివేయడం ద్వారా గొప్ప ప్రజాస్వామ్య వ్యవస్థను సంకుచిత నియంతృత్వంగా మార్చాలని ప్రయత్నిస్తున్నారని విమర్శించారు. ప్రతిపక్షాన్ని నిర్మూలించాలని కుట్ర పన్నుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. దేశంలో ప్రధాన స్రవంతి మీడియా ఇప్పటికే ప్రభుత్వ అనుకూల కార్పొరేట్ శక్తుల చేతుల్లోకి వెళ్లిపోయి సర్కారు వాణిగా మారిపోయిందని తెలిపారు. ఇక దేశంలో మతస్వేచ్ఛకు కూడా విఘాతం కలుగుతోందన్నారు. మైనారిటీల ప్రజాస్వామిక హక్కులకు భంగం కలిగించేందుకు, సమాజంలోని బలహీనవర్గాలపై దాడి చేసేందుకు పాలకులు ప్రయత్నాలు చేస్తూనే ఉన్నారని విమర్శించారు. బీజేపీ అధికారంలోకి వచ్చిన పదేండ్లలో ప్రజాస్వామ్య వ్యవస్థకు చెందిన మూలస్తంభాలను, ఈడీ, సీబీఐ, ఐటీ, ఈసీ వంటి రాజ్యాంగ సంస్థలను తన చెప్పుచేతల్లో ఉంచుకుందన్నారు. ఎలక్టోరల్ బాండ్స్ పేరుతో బీజేపీకి వేలకోట్ల రూపాయలు విరాళాలు అందాయని తెలిపారు. పాలకవర్గ స్వభావాన్ని తక్కువగా అంచనా వేయొద్దని, దేశ ప్రజల భవిష్యత్తు ఈ ఎన్నికల ఫలితాలపై ఆధారపడి ఉందన్నారు. రానున్న సార్వత్రిక ఎన్నికల్లో ప్రజా సమస్యలే తమ ఏజెండాగా పనిచేసే సీపీఐ(ఎం) అభ్యర్థికి ఓటు వేసి గెలిపించాలని పిలుపునిచ్చారు. సమావేశంలో పార్టీ జిల్లా కార్యదర్శి మోకు కనకారెడ్డి, పట్టణ కార్యదర్శి సభ్యులు జోగు ప్రకాష్, జిల్లా కమిటీ సభ్యులు ఎస్. విజేందర్, బి. నరేందర్, పి. ఉపేందర్, నాయకులు డి. సందీప్, బి. వెంకటమల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

## సీయూఈటీ-యూజీ పరీక్ష తేదీల్లో ఎటువంటి మార్పు లేదు : యూజీసీ చీఫ్



న్యూఢిల్లీ : లోక్‌సభ ఎన్నికల షెడ్యూల్ విడుదలైనప్పటికీ.. కామన్ యూనివర్శిటీ ఎంట్రన్స్ టెస్ట్ (సీయూఈటీ) యుజి పరీక్ష తేదీల్లో ఎలాంటి మార్పు ఉండదని యూజీసీ చైర్మెన్ జగదీష్ కుమార్ ఆదివారం ప్రకటించారు. సియుఇటి-యుజి పరీక్షలను ముందుగా విడుదల చేసిన షెడ్యూల్ ప్రకారం ఈ ఏడాది మే 15, మే 31 మధ్య యథావిధిగా నిర్వహిస్తామని తెలిపారు. రిజిస్ట్రేషన్ ప్రక్రియ పూర్తయిన అనంతరం తేదీ షీట్ విడుదల చేయనున్నట్లు తెలిపారు.

## మోడీ ప్రభుత్వాన్ని యువత నిలదీయాలి : పివైఎల్

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

ఏడాదికి రెండు కోట్ల ఉద్యోగాలు ఇస్తాననీ, ఉపాధి అవకాశాలు కల్పిస్తానని హామీనిచ్చిన మోడీ అధికారంలోకి వచ్చిన పదేండ్లలో యువతను మోసం చేశారని, యావత్ యువతరం మోడీ ప్రభుత్వాన్ని నిలదీయాలని ప్రగతిశీల యువజన సంఘం (పీవైఎల్) రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు కెఎస్ ప్రదీప్, వి అజయ్ ఆదివారం ఒక ప్రకటనలో విమర్శించారు. హైదరాబాద్‌లోని మార్క్స్ భవన్‌లో ఆ సంఘం రాష్ట్ర కమిటీని నిర్వహించారు. మోడీ పాలనలో నిరుద్యోగం పెరిగిందని తెలిపారు. ఉపాధి అవకాశాలు తగ్గాయని పేర్కొన్నారు. కార్పొరేట్లకు మాత్రం లక్షల కోట్లు రుణ మాఫీ చేశారని తెలిపారు. ప్రభుత్వ రంగ సంస్థలను ప్రయివేటు పరం చేస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. దీంతో ప్రభుత్వ ఉద్యోగాల్లో కోత పడుతున్నదని తెలిపారు. ప్రభుత్వ రంగ సంస్థల్లో ఉద్యోగ భర్తీలను చేపట్టకుండా కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ పద్ధతిని కొనసాగిస్తున్నారని పేర్కొన్నారు. మార్చి 23న షహీద్ భగత్ సింగ్, రాజ్‌గురు, సుఖదేవ్‌ల వర్ధంతి సభలు రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహిస్తున్నట్టు తెలిపారు. సమావేశంలో పీవైఎల్ రాష్ట్ర ఉపాధ్యక్షులు ఈశ్వర్, రవికుమార్, సహాయ కార్యదర్శులు ప్రతాప్, రాకేశ్, కోశాదికారి బుచ్చిరాజు తదితరులు పాల్గొన్నారు.

## బచ్చన్నపేట గోపాల్ నగర్‌లో గుడిసెల కూల్చివేత దుర్మార్గమైన చర్య

- పారా మిలటరీ ద్వారా నాయకులపై భౌతిక దాడి, అక్రమ కేసులను ఖండించండి: తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

నిలువ నీడలేని పేదలు సర్వే నెంబర్ 174 లో ఉన్న ప్రభుత్వం భూమిలో గుడిసెలు వేసుకున్న వారిపై పార మిలటరీ ద్వారా దాడి చేయించడాన్ని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం ఖండించింది. ఈ మేరకు ఆదివారం తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్ష కార్యదర్శులు జి.నాగయ్య, ఆర్. వెంకట్ రాములు ఒక ప్రకటన విడుదల చేశారు. అరెస్టు చేసిన నాయకులను తక్షణమే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. గుడిసెవాసులు, నాయకులపై భౌతిక దాడికి పాల్పడిన పారా మిలటరీ సిబ్బందిపై శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని వారు కోరారు జనగామ జిల్లా బచ్చన్నపేట గోపాల్ నగర్‌లో సర్వే నెంబర్ 174లో ఉన్న ప్రభుత్వ భూమిపై నిలువ నీడలేని పేదలు గుడిసెలు వేసుకుని నివాసం గత కొంతకాలంగా ఉంటున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం పారామెలటరీని ఉపయోగించి పేదలు వేసుకున్న గుడిసెలను దౌర్జన్యంగా కూల్చింది. అడ్డువచ్చిన నాయకులను కార్యకర్తలపై పిడి గుద్దులు గుద్దుతూ భౌతిక దాడికి పాల్పడింది. అడ్డొచ్చిన సీపీఐ(ఎం) జిల్లా కమిటీ సభ్యులు చుంచు విజయేందర్‌తో పాటు మరో ఏడు మందిని ఈడ్చుకుంటూ లాక్కెళ్లి నర్మెట్ట పోలీస్ స్టేషన్‌లో నిర్బంధించి ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేసింది...అని వారు తెలిపారు. తక్షణమే అరెస్టు చేసిన నాయకులను కార్యకర్తలను ఎలాంటి కేసులు లేకుండా భేషరతుగా విడుదల చేయాలని కోరారు. గుడివాసులు నష్టపోయిన వస్తువులకు జిల్లా కలెక్టర్ నష్టపరిహారం చెల్లించాలనీ, గుడిసెలు వేసుకున్న పేదలందరికీ ఇండ్ల జాగా ఇచ్చి ఇంటి నిర్మాణానికి ఆర్థిక సాయం అందించాలని వారు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

# ఆదాయం పెంచుతాం... పేదలకు పంచుతాం

(మొదటిపేజీ తరువాయి)

రాష్ట్రం 40 శాతం నిధుల్ని ఖర్చు చేస్తుంది. పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల ప్రాజెక్టుకు ఆ ఫార్మెట్‌లో దరఖాస్తు చేసుకోమని చెప్తే, కేసీఆర్ వినలేదు. కేంద్రమంత్రి షెకావత్ ఇదే విషయాన్ని మాకు చెప్పారు. వెంటనే ఫార్మెట్ మార్చి మేం దరఖాస్తు చేసుకున్నాం. కేంద్ర పథకాలను వినియోగించుకోవడం రాష్ట్రాల హక్కు. దీనివల్ల ప్రాజెక్టుల కోసం కొత్తగా అప్పులు చేయాల్సిన అవసరం ఉండదు. అది సంపద సృష్టే. గత ప్రభుత్వానికి ఈ మాత్రం సోయి లేకుండా పోయింది. జీఎస్టీలో నచ్చినోళ్లకు వేలకోట్ల రూపాయలు వదిలేశారు. దీనిపై మా ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారిస్తే మొదటి నెలలో రూ.289 కోట్ల అదనపు ఆదాయం వచ్చింది. రెండో నెలలో రూ.550 కోట్లు, ఈ నెల రూ.700 కోట్లకు ఆదాయం చేరుతున్నది. వచ్చే మూడు నెలల్లో ప్రభుత్వానికి ప్రతినెలా కనీసం రూ.వెయ్యి కోట్ల ఆదాయం దీనినుంచే వస్తుంది. ఎక్సైజ్ శాఖ టానిక్ అనే సంస్థపై దాడులు చేసి, లెక్కల్ని బయటకు తీస్తే



ఒక్కనెలలోనే దాదాపు రూ.200 కోట్ల పన్ను ఎగవేత బయటపడింది. గత ప్రభుత్వం నచ్చితే నజరానా లేకుంటే జరిమానా అన్నట్టే వ్యవహరించింది. దోపిడీ దారులకు సహకరించింది. ప్రతినెలా రూ.వెయ్యి కోట్లు అదనంగా వస్తే ఆ సొమ్ము సంక్షేమ పథకాలకు అక్కరకు వస్తుంది" అని రేవంత్‌రెడ్డి వివరించారు. గృహజ్యోతి స్కీంపై 'నవతెలంగాణ' అడిగిన ప్రశ్నపై స్పందిస్తూ రేషన్‌కార్డులు ఉన్నవారందరికీ కరెంటు కనెక్షన్లు ఉండవు. కొందరు ఆరోగ్య శ్రీ కోసం, మరికొందరు బియ్యం కోసం రేషన్‌కార్డులు తీసుకున్నారు. గ్రామసభల్లో గృహజ్యోతి కోసం 62 లక్షల దరఖాస్తులు వచ్చాయి. డేటా ఎనాలిసిస్‌తో సరిపోల్చితే 42 లక్షల దరఖాస్తులు అర్హమైనవిగా తేలాయి. వారిలో 38 లక్షల మందికి 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ అందిస్తున్నాం. ఇది నిరంతర ప్రక్రియ. అర్హులందరికీ ఇస్తాం. అనర్హులకు ఒక్కరికీ ఇవ్వం" అని స్పష్టం చేశారు.

**సామాజిక న్యాయం...**

"కాంగ్రెస్‌పార్టీ సామాజిక న్యాయానికి తొలి ప్రాధాన్యత ఇస్తుంది. సీఎంఓ నుంచి కిందిస్థాయి వరకు పగడ్బందీగా సామాజిక సమతుల్యత బాధ్యతను తీసుకుంటాం. ఉద్దేశ్యపూర్వకంగా విమర్శలు చేసేవారిపట్ల జాలి పడటం తప్ప, మనం ఏమీ చేయలేం" అంటూ ఇటీవలి నియామకాల వివరాలు వెల్లడించారు.

**విచారణలు చేస్తున్నాం**

"గత ప్రభుత్వ అవినీతి వందల కోట్లు కాదు. వేలకోట్లకు వెళ్లింది. దానిపై విచారణలకు ఆదేశించాం. ఎవర్నీ వదలం. రాజ్యాగబద్ధంగా క్రమపద్ధతిలోనే విచారణలు జరుగుతాయి. వ్యక్తిగత కక్షసాధింపు చర్యలు ఉండవు. పారదర్శక విచారణలు చేస్తాం. బాధ్యులను శిక్షిస్తాం" అని చెప్పారు.

**ప్లాస్టిక్ పూలు ఉండవు**

"బలగం సినిమాకు, పాటలకు ప్రభుత్వానికి ఎలాంటి సంబంధం లేదు. సినిమా ద్వారా కొందరు వ్యాపారం చేసుకున్నారు" అని ముఖ్యమంత్రి ఓ ప్రశ్నకు సమాధానంగా చెప్పారు. బతుకమ్మ అమ్మమ్మ, నాయనమ్మల కాలం నుంచి సంప్రదాయంగా నడుస్తుంది. గత ప్రభుత్వం మాదిరి ప్లాస్టిక్ పూలతో ఈసారి బతుకమ్మలు ఉండకపోవచ్చు. బంతిపూలు, ప్రకృతి సిద్ధంగానే వేడుకలు జరుగుతాయి. బతుకమ్మ, బోనాలు వంటి పండుగలు కాలంతో పాటే కొనసాగుతూ ఉంటాయి" అని చెప్పారు.

**జీవోలు దాచం**

"ప్రభుత్వ జీవోలు దాచాల్సిన అవసరం మాకు లేదు. దీనిపై ఇటీవలే ప్రభుత్వ ప్రధాన కార్యదర్శితో మాట్లాడాను. పూర్తి పారదర్శకంగా వ్యవహరిస్తాం. అన్నీ ఆన్‌లైన్‌లో పెడతాం. త్వరలోనే సమాచార శాఖ కమిషనర్ల నియామకం చేపడతాం" అని అన్నారు.

**సైకో ఫ్యాన్స్...**

"ఈ ఏడాది వర్షాలు సరిగా పడలేదు. కరువు పరిస్థితులు నెలకొన్నాయి. అవసరానికి మించి విద్యుత్ ఇస్తున్నా, కోతలు విధిస్తున్నారు. ఎక్కడ వీఐపీలు ఉంటే అక్కడ కరెంటు కోతలు పెడుతున్నారు. ఏంటని విచారణ చేస్తే, కొందరు పిచ్చోళ్లు గత వాసనలు పోగొట్టుకోలేక, ఈ ప్రభుత్వాన్ని బదనాం చేయాలని ప్రయత్నిస్తున్నారని తేలింది. దీనితో కరెంటు కట్‌చేస్తే ఉద్యోగాలు ఊడగొడతామని చెప్పాల్సి వచ్చింది. కొందరిపై చర్యలు తీసుకున్నాం. ఇప్పుడిప్పుడే వ్యవస్థ కొంత గాడిన పడుతుంది. సైకో ఫ్యాన్స్ కొందరు ఉన్నారు. ప్రభుత్వం మారేసరికి వాళ్లు సహించలేకపోతున్నారు. గత ఏడాది ఇదే రోజు ఎంత కరెంటు ఇచ్చారు...ఇప్పుడు ఎంత కరెంటు ఇస్తున్నారనే లెక్కలు తీసి మీడియాకు ఇస్తున్నాం. ప్రభుత్వానికి స్పష్టత ఉంది. వ్యవస్థల్లో కొన్ని గంజాయి మొక్కలు పాతుకొని ఉన్నాయి. వాటిని పీకే ప్రయత్నం చేస్తున్నాం" అని అన్నారు.

**ఈఆర్సీ చైర్మెన్‌కు ఝలక్**

'గృహజ్యోతి స్కీంకు తెలంగాణ విద్యుత్ నియంత్రణ మండలి(టీఎస్‌ఈఆర్సీ) అతి తెలివి ప్రదర్శిస్తూ ఉత్తర్వులు ఇచ్చింది. ప్రభుత్వం మొదట డిస్కంలకు డబ్బు చెల్లించి, ఆ తర్వాత గృహలక్ష్మి అమలు చేసుకోవాలని ఆ ఉత్తర్వుల్లో పేర్కొంది.

ఆ సంస్థను నడిపే 'తన్నీరు'ను అడుగుతున్నా. ఇలాంటి ఆర్డర్ గత ప్రభుత్వంలో ఎందుకు ఇవ్వలేదు. రైతులకు ఉచిత కరెంటు ఇస్తామని ఆ ప్రభుత్వం దరఖాస్తు చేసుకున్నప్పుడు చైర్మెన్ ఏం చేస్తున్నారు. కొన్ని వ్యవస్థల్లో కొందరు పాతవాసనలతో కూర్చుని ఉన్నారు. వారు మమ్మల్ని ఏదో విధంగా ఇబ్బంది పెట్టాలని చూస్తున్నారు. కానీ ఎక్కువ కాలం వారిని అక్కడ ఉండనివ్వం' అని తేల్చిచెప్పారు.

**ధరణిపై...**

"ధరణి నిర్వహణ గతంలో ప్రయివేటు సంస్థ చేతిలో ఉంటే, దాన్ని సీజీజీకి అప్పగించాం. ఈ పోర్టల్‌ను ఫోరెన్సిక్ ఆడిట్ చేయిస్తే తప్ప, మరిన్ని వివరాలు వెల్లడయ్యే పరిస్థితి లేదు. 2014 కు ముందు ఉన్న భూములు ఎవరి పేర్లపై ఉన్నాయి. తర్వాత పేర్లు ఎలా మారాయి. ప్రభుత్వ భూములు పెద్దల పేర్లపైకి ఎలా వచ్చాయనే విషయాలు తేలాలంటే ఫోరెన్సిక్ ఆడిట్ తప్పనిసరి. ఆ దిశగా చర్యలు తీసుకుంటున్నాం. తప్పులకు కారకులను గుర్తించి, కచ్చింతంగా చట్ట ప్రకారం శిక్షిస్తాం" అని చెప్పారు.

**కుక్క కాటుకు...**

"ఈ వంద రోజులు మా దృష్టి పరిపాలనపైనే పెట్టాం. కానీ ప్రభుత్వాన్ని పడగొడతామని బీజేపీ, బీఆర్ఎస్ ప్రకటనలు చేస్తుంటే, దాన్ని తిప్పి కొట్టాల్సిన బాధ్యత మాపై ఉంది. ఈ వంద రోజుల్లో మేం ఎలాంటి ఫిరాయింపులు కానీ, ఇతర ప్రయత్నాలు ఏమీ చేయలేదు. కానీ కుక్క కాటుకు చెప్పుదెబ్బ అన్నట్టు... కొట్టకుండా ఉండలేం. ఇప్పటి వరకు ముఖ్యమంత్రిగా పనిచేశా. ఎన్నికల నగారా మోగింది కాబట్టి ఇకనుంచి పార్టీ అధ్యక్షుడిగా నా రాజకీయం చూపిస్తా. దానిలో భాగంగానే ఈరోజే ఒక గేటు ఓపెన్ చేసి, చేరికల్ని ఆహ్వానించాం" అని అన్నారు.

**ఉద్యోగాలు...**

"ఉద్యోగ నోటిఫికేషన్లు ఇచ్చే బోర్డులన్నీ స్వతంత్ర సంస్థలు అనీ, పరీక్షలు, లీకేజీలు, ప్రశ్నాపత్రాల అమ్మకాలతో తమకేం సంబంధం లేదని 'బావాబామ్మర్దులు చెప్పారు. అదే



ఉద్యోగాలను అవే బోర్డులు ఇస్తే మేమే ఇచ్చాం అని ఎలా క్లెయిమ్ చేసుకుంటారు? మంచి మీదైతే, చెడూకూ మీరే బాధ్యత వహించాలి కదా? మూడు నెలల్లో మేం 30వేల ఉద్యోగాలు ఇచ్చాం. బోర్డుల్లో పెట్టిన చిక్కుముడులు అన్నీ ఒక్కొక్కటిగా విప్పుతూ, పూర్తి ప్రక్షాళన చేపట్టాం" అని తెలిపారు.

**విచారణ చేసుకోండి**

"ఫోన్‌ట్యాపింగ్‌పై ఈటల రాజేందర్‌కు చెందిన పార్టీనే కేంద్రంలో ఉంది. విచారణకు ఆదేశించమని చెప్పండి. ఎదుర్కొవడానికి సిద్ధంగా ఉన్నాం. గత ప్రభుత్వంలో ఫోన్ ట్యాపింగ్‌లు చేసినవాళ్లు ఇప్పుడు ఎక్కడ ఉన్నారో అందరూ చూస్తూనే ఉన్నారు. చిల్లర మల్లర ఆరోపణల ద్వారా ఈటల ఎలాంటి ప్రయోజనం పొందరు. నిన్న వాళ్ల దగ్గరి మిత్రుడి దగ్గర రూ.7 కోట్లు పట్టుబడ్డాయి. బహుశా ఫోన్ ట్యాపింగ్ వల్ల సమాచారం తెలిసిందని ఆయన అనుకుంటున్నారేమో...అలాంటిదేం లేదు. అక్కడ ఉన్నవారే సమాచారం ఇచ్చారు. డబ్బులు దొరికాయి" అని విలేకరులు అడిగిన ఓ ప్రశ్నకు సమాధానంగా చెప్పారు.

**ఆందోళన వద్దు**

రైతు భరోసాపై ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదు. ఇప్పటి వరకు 5 ఎకరాలు ఉన్న 68 లక్షల మందికి ఖాతాల్లో డబ్బులు పడ్డాయి. ప్రభుత్వం ఇచ్చే ఏ సంక్షేమ కార్యక్రమం కావాలన్నా దరఖాస్తు చేసుకోవాలి. దాన్ని పరిశీలిస్తాం. అనర్హులకు ఇవ్వం. 30 ఏండ్ల క్రితం ఏర్పడిన కాలనీలకూ లక్షల రూపాయలు రైతుబంధు కింద వస్తున్నాయి. నిజమైన లబ్దిదారులకే అమలు చేస్తాం" అని స్పష్టత ఇచ్చారు.

**వెల్ఫేర్ బోర్డ్...**

"విదేశాల్లో ఉన్నవారికోసం వెల్ఫేర్ బోర్డు ఏర్పాటు చేయాలని మంత్రివర్గ సమావేశాల్లో నిర్ణయం తీసుకున్నాం. విధివిధానాలకు ఆదేశించాం. ఎలక్షన్ కోడ్ ముగిశాక దీనికి శాశ్వత పరిష్కారం కల్పిస్తాం. విదేశీ దళారుల వ్యవస్థ లేకుండా చేయాలని ఆలోచిస్తున్నాం. ప్రభుత్వమే వివిధ దేశాలతో సంప్రదించి, అక్కడి ఉద్యోగాల వివరాలు తెప్పించి, ఇక్కడి నుంచి వెళ్లాలనుకునే వారి వివరాలు నమోదు చేయించి, శిక్షణ ఇప్పించే శాశ్వత వ్యవస్థను ఏర్పాటు చేస్తాం. త్వరలో మంచి పాలసీతో ముందుకొస్తాం. ఏజెంట్లు కూడా ప్రభుత్వం వద్దే రిజిస్టర్ చేసుకోవాలి. దీనివల్ల ప్రభుత్వ పర్యవేక్షణ ఉంటుంది. ప్రజలు మోసగాళ్ల బారిన పడకుండా ఉంటారు" అని వివరణ ఇచ్చారు.

**రియల్ స్తబ్దత తాత్కాలికం**

"రియల్ ఎస్టేట్‌రంగంలో నగదు బదిలీ ఎక్కువ ఉంటుంది. ఈ స్తబ్దత ఎన్నికల సమయంలో సహజం. పార్లమెంటు ఎన్నికల తర్వాత రాష్ట్రంలో రియల్ ఎస్టేట్ రంగం మరింత పుంజుకుంటుంది. ఆ రంగానికి సంబంధించి కూడా ఓ పాలసీ తీసుకొస్తాం" అని చెప్పారు.

**కేసీఆర్ నిజాంకు నకలు**

"గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో నిజాం తరహాలో రాచరికాన్ని తీసుకురావాలని అప్పటి ముఖ్యమంత్రి కేసీఆర్ చూశారు. తమ వారసులే అధికారంలో ఉండాలని నిజాం నవాబు ఎలాగైతో కోరుకున్నారో... కేసీఆర్ కూడా అలాగే చేయాలని భావించారు" అని విమర్శించారు.

**ఆర్ఎస్ మంచి మిత్రుడు**

"ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ నాకు మంచి మిత్రుడు. ఆయనకు బలహీనవర్గాల పట్ల నిబద్ధత ఉంది. టీఎస్‌పీఎస్సీ చైర్మెన్‌గా ఉండాలని మొదట ఆయన్నే కోరాను. తిరస్కరించారు. ఇతర సామాజిక బాధ్యతలు ఉన్నాయని చెప్పారు. కానీ రామాయణంలో వాలి మాదిరి కేసీఆర్ కూడా ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్‌లోని సగం బలాన్ని గుంజుకుంటారు. ఆయన బీఆర్ఎస్‌లో చేరితే దానిపై నేనేం కామెంట్ చేయను. ఆయనపై అప్పట్లో ఎంత గౌరవం ఉందో...ఇప్పుడూ అంతే గౌరవం ఉంది" అని అన్నారు.

కార్యక్రమానికి మీడియా అకాడమీ చైర్మెన్ శ్రీనివాసరెడ్డి అధ్యక్షత వహించారు. మంత్రి జూపల్లి కృష్ణారావు, టీయూడబ్ల్యూజే రాష్ట్ర కార్యదర్శి విరాహత్ తదితరులు పాల్గొన్నారు.

## గేట్లెత్తిన కాంగ్రెస్

(మొదటిపేజీ తరువాయి)

వరదలా వస్తారని కాంగ్రెస్ నేతలు చెబుతున్నారు. ఎన్నికలలోపు అందరూ చేరడం పూర్తి కాగానే, గ్రేటర్ నుంచి ఒకరిద్దరికి మంత్రి పదవులు కూడా ఇస్తారనే టాక్ నడుస్తోంది. అసెంబ్లీ ఎన్నికల్లో రాష్ట్రమంతటా కాంగ్రెస్ గాలి వీచినా, గ్రేటర్ హైదరాబాద్‌లో మాత్రం కాంగ్రెస్‌కు ఎదురు గాలి వీచింది. ఈ లోటు పూడ్చుకునేందుకు చాలా కాలంగా కాంగ్రెస్ ప్రయత్నిస్తున్నది. ఇదిలా ఉండగా, రాష్ట్రంలో 14 సీట్లు గెలువాలనే ఎన్నికల వ్యూహంలో భాగంగానే కాంగ్రెస్ నాలుగు నియోజకవర్గాలకే అభ్యర్థులను ప్రకటించింది. మిగతా 13 నియోజకవర్గాలకు అభ్యర్థులను ప్రకటించకుండా వ్యూహాత్మకంగా ఆపింది. ఇతర పార్టీల నుంచి బలమైన నేతలు వచ్చే అవకాశం ఉండటంతో వారి కోసమే టికెట్లను ఆపిందని ఆ వర్గాలు అంటున్నాయి. బీఆర్ఎస్ పార్టీకి చెందిన 26 మంది ఎమ్మెల్యేలు కలిసి కట్టుగా బీఆర్ఎస్ ఎల్పీని సీఎల్పీలో విలీనం చేస్తారనే టాక్ వైరల్ అవుతున్నది. అయితే కాంగ్రెస్ పార్టీని నమ్ముకున్న వారు అసంతృప్తికి గురి కాకుండా కాంగ్రెస్ ముందుస్తు చర్యలు చేపట్టింది. అందులో భాగంగానే 37 కార్పొరేషన్లకు చైర్మెన్లను ప్రకటించి జాతరను తలపించింది. అసెంబ్లీ ఎన్నికల సమ యంలో టికెట్ దక్కని నాయకులకు, అనుబంధ సంఘాల నాయకులకు చైర్మెన్ పదవులిచ్చి అసంతృప్తిని చల్లారించింది. త్వరలోనే మరికొంత మందికి కార్పొరేషన్ పదవులు ఇచ్చే అవకాశం ఉందని తెలుస్తోంది. ఇప్పటికే బీఆర్ఎస్ 7 సీట్లకు అభ్యర్థులను ఎంపిక చేసింది. ఆ పార్టీ ప్రకటించిన అభ్యర్థుల్లో కూడా చాలా మంది నాయకులు కాంగ్రెస్ వైపు చూస్తున్నారు. చెవెళ్ల నుంచి రంజిత్‌రెడ్డిని ప్రకటించినప్పటికీ ఆయన కాంగ్రెస్‌లో చేరారంటే బీఆర్ఎస్ పరిస్థితిని అర్థం చేసుకోవచ్చు. బీజేపీ 15 పార్లమెంటు నియోజక వర్గాలకు అభ్యర్థులను ప్రకటించింది. మరో రెండింటికి ప్రకటించాల్సి ఉన్నది. ఈ క్రమంలో సీటు దక్కని బీజేపీ ఎంపీ సోయంబాపూ రావు కూడా కాంగ్రెస్‌లో చేరే అవకాశం ఉన్నదని పార్టీ నేతలు చెబుతున్నారు. ఎన్నికల దగ్గర పడే కొద్దీ ఈ చేరికలు మరింత ఊపందుకునేలా కాంగ్రెస్ పార్టీ వ్యూహత్మంగా ముందుకు సాగుతున్నది.


## టికెట్.. టెన్షన్..!

- ఆశావహుల్లో హైరానా.. పార్టీ శ్రేణుల్లో ఉత్కంఠ
- తెరపైకి రోజుకో కొత్త పేరు
- మల్కాజ్‌గిరి హస్తం టికెట్ ఎవరికో..?





(ఫైల్)



నవతెలంగాణ-సిటీబ్యూరో

మల్కాజిగిరి లోక్‌సభ సెగ్మెంట్ పరిధిలోని కాంగ్రెస్ నాయకులు, పార్టీ శ్రేణులకు టికెట్ టెన్షన్ పట్టుకుంది. మల్కాజిగిరి అభ్యర్థిని ఎంపిక చేయడం కాంగ్రెస్‌కు కత్తి మీద సాములా మారినట్టు తెలుస్తోంది. సీఎం రేవంత్‌రెడ్డి సిట్టింగ్ స్థానం కావడం, బలమైన అభ్యర్థులు లేకపోవడంతో ఎంపిక క్లిష్టంగా మారినట్టు సమాచారం. ఇప్పటికే బీఆర్ఎస్, బీజేపీ తమ అభ్యర్థులుగా రాగిడి లక్ష్మారెడ్డి, ఈటల రాజేందర్‌ను ప్రకటించాయి. బలమైన అభ్యర్థిని రంగంలోకి దింపేందుకు కాంగ్రెస్ కసరత్తు చేస్తున్నట్టు తెలుస్తుండగా.. రోజుకో కొత్త పేరు తెరపైకి వస్తోంది.

**అభ్యర్థి వేటలో అధిష్టానం**

మేడ్చల్, మల్కాజిగిరి, ఉప్పల్, కుత్బుల్లాపూర్, కూకట్‌పల్లి, ఎల్బీనగర్, కంటోన్మెంట్ అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలోకి వచ్చే మల్కాజిగిరి పార్లమెంట్ స్థానానికి కాంగ్రెస్ అభ్యర్థి విషయంలో అంతా టెన్షన్ వాతావరణం నెలకొంది.ప్రత్యర్థులకు దీటైన అభ్యర్థిని రంగంలోకి దించాలని పార్టీ రాష్ట్ర, జాతీయ నాయకత్వం ఆలోచిస్తోంది. దాంతో మల్కాజిగిరి అభ్యర్థి ఎంపిక రసకందాయంలో పడింది. గెలుపే లక్ష్యంగా ప్రణాళికలు రచిస్తున్న అధికార కాంగ్రెస్.. ఆ దిశగా మల్కాజిగిరి స్థానంపై కసరత్తు ముమ్మరం చేసింది. అభ్యర్థుల ఎంపిక విషయంలో అన్ని అంశాలనూ పరిగణలోకి తీసుకుంటోంది. సామాజిక సమీకరణాలు, అంగ, అర్థబలం ఆధారంగా బలమైన నాయకులను బరిలో దించేందుకు కసరత్తు చేస్తోంది. ఈ నెల 14, 15 తేదీల్లో అభ్యర్థిని ప్రకటిస్తామని మేడ్చల్ ప్రజా దీవెన సభలో సీఎం రేవంత్‌రెడ్డి ప్రకటించినా.. ఆ దిశగా అడుగులు పడలేదు.

**తెరపైకి కొత్త పేర్లు**

మల్కాజిగిరి అభ్యర్థి విషయంలో రోజుకో పేరు తెరపైకి వస్తోంది. ఇప్పటి వరకు సినీనటుడు అల్లు అర్జున్ మామ కంచర్ల చంద్రశేఖర్‌రెడ్డి పేరు ప్రముఖంగా వినిపించినా, రెండు, మూడు రోజులుగా జరుగుతున్న రాజకీయ పరిణామాలను చూస్తుంటే కొత్త వారు బరిలో ఉండేలా కనిపిస్తోంది. నాగర్‌కర్నూల్ మాజీ ఎమ్మెల్యే మర్రి జనార్దన్‌రెడ్డి, చేవెళ్ల సిట్టింగ్ ఎంపీ రంజిత్‌రెడ్డి, వికారాబాద్ జెడ్పీ చైర్‌పర్సన్ సునీతా మహేందర్‌రెడ్డి పేర్లు ఇప్పుడు తెరపైకి వచ్చాయి. ఈ ముగ్గురిలో ఎవరో ఒకరు పోటీలో ఉంటారని జోరుగా ప్రచారం జరుగుతోంది.

**సునిత లేదా మర్రి జనార్ధన్‌రెడ్డికే ఛాన్స్**

పార్లమెంట్ ఎన్నికల ముహూర్తం దగ్గర పడింది. కేంద్ర ఎన్నికల సంఘం షెడ్యూల్ కూడా ప్రకటించింది. దాంతో మల్కాజిగిరి కాంగ్రెస్ అభ్యర్థి ఎవరనే ఉత్కంఠకు ఇంకా తెర పడలేదు. నాలుగు, ఐదు పేర్లు ప్రముఖంగా వినిపిస్తున్నా.. వికారాబాద్ జెడ్పీ చైర్మెన్ సునీతా మహేందర్‌రెడ్డి, నాగర్‌కర్నూల్ మాజీ ఎమ్మెల్యే మర్రి జనార్దన్‌రెడ్డిలో ఎవరికో ఒకరికి టికెట్టు దక్కేలా కనిపిస్తోంది. ఇక చేవేళ్ల సిట్టింగ్ ఎంపీ రంజిత్‌రెడ్డి పోటీ చేస్తారని తొలుత ప్రచారం జరిగిన సమయంలో బీజేపీ అభ్యర్థిగా ఈటల రాజేందర్‌ను బరిలో నిలవడంతో రంజిత్‌రెడ్డి యూటర్న్ తీసుకుని తన సిట్టింగ్ స్థానమైన చేవేళ్ల నుంచి కాంగ్రెస్ అభ్యర్థిగా బరిలో దిగుతున్నట్టు సమా చారం. మర్రి జనార్ధన్‌రెడ్డి నుంచి ఇప్పటి వరకు ఎలాంటి స్పందన రాకపోవడంతో చేవెళ్ల సీటు ఆశించి పార్టీలో చేరిన సునీతా మహేందర్‌రెడ్డికే మల్కాజిగిరి టికెట్ కేటాయిస్తారని చర్చ నడుస్తోంది. మల్కాజిగిరి అభ్యర్థి ఎవరో తెలియాలంటే మరో రెండు, మూడు రోజులు వేచి చూడాల్సిందే..!

## భాషా పండితులకు న్యాయం చేయండి

- త్రిసభ్య కమిటీకి రాష్ట్రీయ ఉపాధ్యాయ పండిత పరిషత్తు వినతి



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

భాషా పండితులు, ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని రాష్ట్రీయ ఉపాధ్యాయ పరిషత్తు, తెలంగాణ రాష్ట్రం (ఆర్‌యుపీపీటీఎస్) కోరింది. ఈ మేరకు ఆదివారం పరిషత్తు రాష్ట్ర అధ్యక్షులు సి.జగదీశ్, కోశాధికారి కట్టా గిరిజారమణ శర్మ, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్.నర్సిములు తదితరులు త్రిసభ్య కమిటీ (ఉపాధ్యాయ సమస్యల పరిష్కార కమిటీ) సభ్యులు ప్రొఫెసర్ కోదండరాంకు సమస్యలను పరిష్కారం కోరుతూ వినతి పత్రాన్ని అందజేశారు. గ్రేడ్ 2 భాషా పండితుల పోస్టుల అప్‌గ్రేడేషన్ కోసం నూతన జీవోలు 2, 3, 9, 10 లను డివిజన్ బెంచ్ తీర్పుకు అనుగుణంగా వెంటనే పోస్టులను అప్ గ్రేడ్ చేసి ఆ పోస్టుల్లో గ్రేడ్ 2 పండితులకు పదోన్నతులు కల్పించాలని కోరారు. గత 20 ఏండ్లు పరిష్కారానికి నోచుకోని ఈ సమస్యపై కోర్టు తీర్పు ప్రభుత్వానికి అనుకూలంగా వచ్చిందని గుర్తుచేశారు. గ్రేడ్ 2 పండితులకు టెట్ నుంచి మినహాయింపునిచ్చి గ్రేడ్ 1 పోస్టుకు పదోన్నతి కల్పించాలని విజ్ఞప్తి చేశారు. హిందీని నాలుగవ తరగతి నుంచే ప్రవేశపెట్టాలనీ, తెలుగు, హిందీ భాషా బోధన నిమిత్తం ప్రత్యేకంగా ప్రాథమిక స్థాయిలో భాషా పండితులను నియమించాలని కోరారు. తెలుగుకు తొమ్మిది పీరియడ్లు, హిందీకి ఆరు పీరియడ్లు కేటాయించాలనీ, పాఠ్యపుస్తకాల్లో, భాషా వాచకాల్లో పాఠాల సంఖ్యను 12 నుంచి 10కి తగ్గించాలని విజ్ఞప్తి చేశారు.

## యూఎస్ సిటెల్ నగరంలో కాంగ్రెస్ వంద రోజుల పాలన వేడుకులు

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ పాలన పగ్గాలు చేపట్టి వంద రోజులు పూర్తి చేసుకున్న సందర్భంగా అమెరికాలోని సీటెల్ నగరంలో ఈ వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమాన్ని ఇండియన్ ఓవర్సీస్ కాంగ్రెస్ తెలంగాణ రాష్ట్ర నేషనల్ సోషల్ మీడియా కోఆర్డినేటర్, సీటెల్ ఐఓసీ అధ్యక్షులు రాహుల్, సూర్యోదయ సిటెల్ ఐఓసీ నాయకులు యశ్వంత్ రిషి, సాయి చరణ్‌ల ఆధ్వర్యంలో నిర్వహించారు. ముఖ్య అతిథిగా రేవంత్ రెడ్డి సోదరులు జగదీశ్వర్ రెడ్డి అనుముల హాజరయ్యారు. వీరితో పాటు ఐఓసీ నేషనల్ టీం సభ్యులు సందీప్ వంగల, నరేందర్ ఎల్మారెడ్డి, మాధవ నెమలి, శ్రీనివాస్ రామసహాయం, తిరుపతి పోచంపల్లి, రామ రాజు, సుధీర్ రెడ్డి, నర్స ప్రణయ్ ముత్యాల, అజయ్ గౌడ్, బీవీ రెడ్డి, వివిధ రాష్ట్రాల నుంచి పాల్గొన్నారు. ముఖ్య అతిథులు, వరంగల్ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి కుమార్తె డాక్టర్ గోదా నాయిని పాల్గొన్నారు. తెలంగాణలో రేవంత్ రెడ్డి వంద రోజుల పాలన బాగుందని చెప్పారు.

## నమాజ్ చేస్తుండగా ఎస్ఐ దాడిపై నివేదిక ఇవ్వండి

- ఢిల్లీ పోలీసులకు కోర్టు ఆదేశం



(ఫైల్)

**న్యూఢిల్లీ :** దేశరాజధానిలో నమాజ్ చేస్తుండగా ముస్లింలపై ఎస్ఐ దారుణంగా దాడికి పాల్పడిన ఘటనపై మే 1లోగా నివేదిక ఇవ్వాలని ఢిల్లీలోని ఒక కోర్టు డీసీపీని ఆదేశించింది. ఢిల్లీలోని మక్కా జామా మసీదు సమీపంలోని ఇంద్రలోక్ ప్రాంతంలో రోడ్డుపై ఈ నెల 8వ తేదీ మధ్యాహ్నం ప్రార్థనలు చేస్తున్న ముస్లింలను స్థానిక ఎస్ఐ మనోజ్ తోమర్ కాలితో తన్నాడు. వారిని తన్నడం, తొక్కడం, వారు ఉపయోగించే చాపలను తొక్కడానికి సంబంధించిన వీడియోలు సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి. దేశవ్యాప్తంగా ఈ ఘటనపై ఆగ్రహావేశాలు వ్యక్తమవడంతో ఉన్నతాధికారులు ఎస్ఐ మనోజ్‌తోమర్‌ను సస్పెండ్ చేశారు. ఢిల్లీలోని తీస్ హజారీ కోర్టులో న్యాయవాది ఫరజ్ ఖాన్ ఈ ఘటనపై పిటీషన్ వేశారు. ప్రజల ప్రాథమిక హక్కులకు భంగం కలిగించడంతోపాటు సమాజంలో సామరస్యాన్ని, శాంతిని ఈ ఘటన భంగపరిచిందని పేర్కొన్నారు. నిందితులపై విచారణ జరిపి, తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ పిటీషన్‌ను స్వీకరించిన కోర్టు విచారించింది. ఈ ఘటనపై మే 1లోగా నివేదిక ఇవ్వాలని, నిందితుడిపై తీసుకున్న చర్యలు కూడా వివరించాలని ఢిల్లీ పోలీసులను ఆదేశించింది.

## నమాజ్ చేస్తుంటే..





### గుజరాత్ యూనివర్సిటీ హాస్టల్‌లో నలుగురు విదేశీ విద్యార్థులపై దాడి.. గాయాలు

- ఇద్దరి పరిస్థితి సీరియస్
- హిందూత్వ శక్తుల దాడిగా ఆరోపణలు

**గాంధీనగర్ :** అహ్మదాబాద్‌లోని గుజరాత్ యూనివర్సిటీ అంతర్జాతీయ బాలుర హాస్టల్‌లో రంజాన్ సందర్భంగా నమాజ్ చేస్తున్నందుకు శనివారం అర్థరాత్రి ఒక గుంపు దాడి చేయటంతో నలుగురు విదేశీ విద్యార్థులు గాయపడ్డారు. దీనిని హిందూత్వ శక్తుల దాడిగా కొందరు విద్యార్థులు, సాక్షులు చెప్తున్నారు. ఘటనపై పోలీసులు ఎఫ్ఐఆర్ నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. వీరిలో తీవ్రంగా గాయపడిన ఇద్దరు విద్యార్థులు ఆస్పత్రిలో కోలుకుంటున్నారనీ, వారి పరిస్థితి ప్రమాదకరంగా ఉన్నదని చెప్పారు. ఘటన గురించి తెలుసుకున్న అహ్మదాబాద్ పోలీస్ చీఫ్ జీఎస్ మల్లిక్.. గుజరాత్ యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ నీర్జా గుప్తా ఆదివారం ఉదయం హాస్టల్‌కు చేరుకున్నారు. అనంతరం వైస్ ఛాన్సలర్ మాట్లాడుతూ.. దాడికి పాల్పడిన ఇరువర్గాల మధ్య గతంలో కొంత ఉద్రిక్తత చోటుచేసుకున్నట్టు తెలుస్తున్నదని చెప్పారు.

అధికారులు తెలిపిన వివరాల ప్రకారం.. ఆఫ్ఘనిస్తాన్, ఉజ్బెకిస్తాన్, శ్రీలంక, బంగ్లాదేశ్‌లకు చెందిన విద్యార్థులు గుజరాత్ విశ్వవిద్యాలయం అంతర్జాతీయ బాలుర హాస్టల్ బ్లాక్-ఎలో నిర్ణీత ప్రాంతంలో శనివారం అర్థరాత్రి తరావీ నమాజ్ చేస్తున్నారు. ఆ సమయంలో వారిపై దాడి జరిగినట్టు తెలిసింది. ఘటనకు సంబంధించిన వీడియోలు సోషల్ మీడియాలో చక్కర్లు కొట్టాయి. కొంతమంది వ్యక్తులు ద్విచక్ర వాహనాలను ధ్వంసం చేస్తున్నట్టు కూడా వీడియోల్లో కనిపించింది.

పోలీసు కమిషనర్ మాలిక్ మీడియాతో మాట్లాడుతూ.. రాత్రి 10.30 గంటల ప్రాంతంలో విదేశీ విద్యార్థులు నమాజ్ చేస్తున్నప్పుడు 20-25 మంది అక్కడ ఎందుకు ప్రార్థనలు చేస్తున్నారంటూ అడిగారనీ, మసీదుకు వెళ్లాలని హెచ్చరించారని చెప్పారు. అనంతరం వారిపై దాడికి దిగారనీ, హాస్టల్ గదుల్లో కూడా తోపులాట, రాళ్లదాడి, విధ్వంసానికి దారితీసిందని వివరించారు. "రాత్రి 10.51 గంటలకుపోలీసు కంట్రోల్ రూమ్‌కు సమాచారం అందింది. రాత్రి 10.56 గంటలకు పీసీఆర్ వ్యాన్ సంఘటనా స్థలానికి చేరుకున్నది" అని మాలిక్ చెప్పారు. సంఘటనను తీవ్రంగా పరిగణించామనీ, కఠిన చర్యలు తీసుకుంటామని వివరించారు. ఈ ఘటనపై దర్యాప్తు చేసేందుకు తొమ్మిది బృందాలను ఏర్పాటు చేశామనీ, ఒక నిందితుడిని గుర్తించామని చెప్పారు. పోలీసులు ఇతర నిందితులందరినీ అరెస్టు చేస్తారని తెలిపారు.

జమాల్‌పూర్ ఖాడియాకు చెందిన కాంగ్రెస్ ఎమ్మెల్యే ఇమ్రాన్ ఖేదావాలా మాట్లాడుతూ.. "రాత్రి 10.30 గంటలకు నమాజ్ సమయంలో 'జై శ్రీరాం' నినాదాలు చేస్తూ దాదాపు 30 మంది వ్యక్తులు ఆ ప్రాంతంలోకి ప్రవేశించి విద్యార్థులపై దాడి చేసినట్టు తెలిసింది. గాయపడిన నలుగురు విద్యార్థులలో ఇద్దరు సీరియస్‌గా ఉన్నారు" అని తెలిపారు. హాస్టల్ సెక్యూరిటీ సిబ్బంది సమక్షంలోనే ఈ ఘటన జరిగిందని ఖేదావాలా తెలిపారు.



## భౌ...భౌ

- పెరుగుతున్న కుక్క కాట్లు
- వీధి, పెంపుడు కుక్కల దాడులను విడివిడిగా నమోదు చేయండి : రాష్ట్రాలకు కేంద్రం ఆదేశం

**న్యూఢిల్లీ :** కుక్క కాటు సంఘటనలు, రేబిస్ కేసులపై నిఘాను మెరుగుపరచటానికి వీధి, పెంపుడు కుక్కల వల్ల కాటుకు గురైన సందర్భాలను వేర్వేరుగా నమోదు చేయాలని కేంద్రం.. రాష్ట్ర ప్రభుత్వాలను ఆదేశించింది. డైరెక్టర్ జనరల్ ఆఫ్ హెల్త్ సర్వీసెస్ (డీజీహెచ్ఎస్).. అన్ని ప్రజారోగ్య కేంద్రాలు, కమ్యూనిటీ హెల్త్ సెంటర్లు, జిల్లా ఆస్పత్రులు, తృతీయ సంరక్షణ సౌకర్యాల నుంచి జంతువుల కాటుపై నాణ్యమైన డేటాను అందించాలని ఆదేశిస్తూ రాష్ట్రాలకు లేఖ రాశారు. ఈ మేరకు మార్చి 7న ఒక ఉత్తర్వును జారీ చేసింది.

జంతువుల కాటు రిజిస్టర్‌లో కొత్త, తదుపరి రోగుల కోసం ప్రత్యేక రికార్డులను నిర్వహించటం ద్వారా ఒకే జంతువు కాటు బాధితుల బహుళ ఎంట్రీలను నివారించాలని రాష్ట్రాలకు సూచనలు అందాయి. పట్టణ ప్రాంతాల నుంచి వీధికుక్కలు, పెంపుడు కుక్కల కాటు వంటి అనేక కేసులు నమోదవుతున్న తరుణంలో కేంద్రం ఈ ఆదేశాలు జారీ చేసింది. 2018 నుంచి కుక్క కాటు కేసులలో గణనీయమైన తగ్గుదల ఉన్నప్పటికీ.. 2022 నుంచి కేసులు పెరుగుతున్నాయి. 2022-23 మధ్య కుక్క కాటు కేసులు 21.8 లక్షల నుంచి 27.5 లక్షలకు పెరిగాయని పార్లమెంటులో ఆరోగ్య కుటుంబ సంక్షేమ మంత్రిత్వ శాఖ పట్టికలో పేర్కొన్నది. 4.35 లక్షల కేసులతో మహారాష్ట్రలో గతేడాది అత్యధికంగా కుక్కకాటు కేసులు నమోదయ్యాయి.

## కడగండ్లు మిగిల్చిన వడగండ్లు

- కామారెడ్డి జిల్లాలో 20 వేల ఎకరాల్లో పంటకు నష్టం
- పరిశీలించిన అధికారులు, ఎమ్మెల్యేలు


పంటను పరిశీలిస్తున్న నాయకులు

**నవతెలంగాణ-కామారెడ్డి/బోధన్/భిక్కనూర్**

అకాల వర్షం రైతన్నలను అతలాకుతలం చేసింది. వడగండ్లు కురిసి వారికి కడగండ్లు మిగిల్చింది. ఉమ్మడి నిజామాబాద్ జిల్లా వ్యాప్తంగా శనివారం సాయంత్రం నుంచి ఆదివారం తెల్లవారుజాము వరకు కురిసిన భారీ వడగండ్ల వర్షంతో తీవ్ర నష్టం వాటిల్లింది. ఈదురుగాలుల ధాటికి వరి పైరు నేలకొరగగా, వడ్లు రాలిపోయాయి. పంట చేతికి వస్తున్న దశలో కురిసిన అకాల వర్షం తీవ్రంగా నష్టపరిచిందని రైతులు వాపోతున్నారు. వరితో పాటు మొక్కజొన్న, జొన్న, మామిడికి తీవ్ర నష్టం కలిగింది. కాగా పంటలను ఎమ్మెల్యే పరిశీలించారు. అయితే పలు చోట్ల అధికారులు, ఎమ్మెల్యేలు పత్తా లేకపోవడంతో రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

కామారెడ్డి జిల్లా వ్యాప్తంగా 24 మండలాలు ఉండగా 15 మండలాల్లో భారీ ఎత్తున పంట నష్టం జరిగినట్టు జిల్లా వ్యవసాయ విస్తీర్ణ అధికారి భాగ్యలక్ష్మి తెలిపారు. 15 మండలాల్లో 130 గ్రామాల్లో 14,553 మంది రైతులకు చెందిన 20,071 ఎకరాల్లో పంటలకు నష్టం వాటిల్లినట్టు తెలిపారు. వరి, మొక్కజొన్న, గోధుమ, జొన్న, వేరుశనగ, పెసర తదితర పంటలు వేయగా 33 శాతం పంటలు దెబ్బతిన్నాయన్నారు. కామారెడ్డి మండలం కొట్టాలపల్లి గ్రామంలో 250 ఎకరాల్లో ఉల్లిగడ్డ, వరి, మొక్కజొన్న, పెసర, మినుము, మామిడి తోటలు, కూరగాయలు.. తదితర పంటలు 90 శాతం వరకు నష్టపోయాయి. కామారెడ్డి రూరల్ మండలంతో పాటు భిక్కనూర్, దోమకొండ మండలాల్లో నేలవాలిన పంటలను కామారెడ్డి ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి, ప్రభుత్వ సలహాదారు షబ్బీర్‌అలీ, మాజీ విప్ గంపగోవర్ధన్, అధికారులు, నాయకులు పరిశీలించారు. బాన్సువాడలో మాజీ స్పీకర్, ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డి పరిశీలించారు. బోధన్, సాలూర, ఎడపల్లి మండలాల్లో దెబ్బతిన్న వరి పంటను ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి, వ్యవసాయాధికారులు పరిశీలించారు. రైతులు అధైర్య పడొద్దని, పంట నష్టం వివరాలు సేకరించి నివేదిక సమర్పించిన తర్వాత ప్రభుత్వం సాయం చేస్తుందని తెలిపారు. గత ప్రభుత్వం తీరుతో రైతుల పంటలకు బీమా లేకుండా పోయిందని, దాంతో రైతులు నష్టపోతున్నట్టు తెలిపారు. సహకార సంఘాలను నిర్వీర్యం చేసి ఇన్సూరెన్స్ లేకుండా చేశారని, కాంగ్రెస్ ప్రభుత్వం వాటిని పునరుద్ధరించి పంటలకు బీమా సదుపాయం కల్పిస్తామని ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి హామీ ఇచ్చారు. బిచ్కుంద మండలంలో వరితో పాటు మొక్కజొన్న, మామిడికి తీవ్ర నష్టం వాటిల్లింది. అయినా అధికారులు, పాలకులు ఎవరూ వచ్చి పరిశీలించలేదని, నష్టం అంచనా వేయలేదని రైతులు వాపోతున్నారు.



## సహాయక శిబిరంపై ఇజ్రాయిల్ పాశవిక దాడి

- 12 మంది మృతి
- పలువురికి తీవ్రగాయాలు
- 31,645కి పెరిగిన మరణాలు

**జెరూసలేం :** గాజాపై ఇజ్రాయిల్ పాశవిక దాడులు కొనసాగుతూనే ఉన్నాయి. శనివారం సెంట్రల్ గాజాలో డెయిర్ అల్ బలాహ్‌లోని నుసిరత్ సహాయక శిబిరంపై ఇజ్రాయిల్ సైన్యం దాడి చేయడంతో 12 మంది మరణించారు. చిన్నారులు, మహిళలతోసహా అనేక మంది గాయపడ్డారు. రెఫ్యూజీ క్యాంప్‌లోని మాతిర్ కుటుంబానికి చెందిన ఒక అపార్ట్‌మెంట్‌పై ఈ దాడి జరిగింది. దీంతో, ఆ ప్రదేశమంతా యుద్ధభూమిని తలపించింది. గాజాపై ఇజ్రాయిల్ దాడులతో ఇప్పటి వరకూ 31,645 మరణించినట్లు అధికారులు చెప్పారు. 73,676 మంది గాయపడ్డారు. మరోవైపు ఇజ్రాయిల్ అదుపులో దాదాపు 10 వేల మంది పాలస్తీనీయన్లు ఉన్నట్లు స్వచ్ఛంద్ధ సంస్థలు అంచనా వేస్తున్నాయి.

**చర్చలు పునఃప్రారంభం**

గాజాలో ఇజ్రాయిల్ కాల్పుల విరమణపైచర్చలు ఆదివారం నాడు ఖతార్‌లో పునఃప్రారంభమయ్యాయి. కాల్పులను ముగించడానికి హమాస్ ప్రతిపాదించిన మూడు దశల ప్రణాళికపై ఈ చర్చల్లో వాదనలు జరిగే అవకాశం ఉందని భావిస్తున్నారు.

**అమెరికా ఆయుధాలతోనే గాజాలో నరమేధం : ఆమ్నెస్టీ**

గాజాలో 30 వేలకు పైగా ప్రజల్ని హత్య చేయడానికి అమెరికా తయారు చేసిన ఆయుధాలనే ఇజ్రాయిల్ ఉపయోగించిందని ఆమ్నెస్టీ ఇంటర్నేషనల్ విమర్శించింది. ఈ మేరకు ఆమ్నెస్టీ ఎక్స్ ఖాతాలో పోస్ట్ చేసింది. గాజాలో కాల్పుల విరమణను అమలు చేయాలని, ఇజ్రాయిల్‌కు అమెరికా ఆయుధాల సరఫరాను ఆపాలని ఆమ్నెస్టీ విజ్ఞప్తి చేసింది.

## పశుమిత్రలను కార్మికులుగా గుర్తించాలి

- సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి జె వెంకటేశ్

**నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్**

పశు మిత్రలను కార్మికులుగా గుర్తించి, వారికి కనీస వేతనాలు ఇవ్వాలని సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి జె వెంకటేశ్ డిమాండ్ చేశారు. ఆదివారం హైదరాబాద్‌లోని సీఐటీయూ కార్యాలయంలో పశుమిత్రల సంఘం అధ్యక్షులు శారద అధ్యక్షతన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తొమ్మిదేండ్లుగా పశుమిత్రలు ఎలాంటి వేతనం, పారితోషకాలు లేకుండా పనిచేస్తున్నారన్నారని చెప్పారు. దేశంలో వ్యవసాయ రంగం తర్వాత దానికి అనుబంధంగా ఉన్న పశు సంపదను కాపాడటంలో పశుమిత్రలు కీలక పాత్ర వహిస్తున్నారని తెలిపారు. పశువులకు సోకే 12 నుంచి 20 రకాల వ్యాధులకు వైద్యం చేస్తున్నారనీ, వీరి సేవలను గత బీఆర్ఎస్ ప్రభుత్వం పట్టించుకోలేదని విమర్శించారు. కొత్తగా అధికారంలోకొచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వమయినా వారి పనిని గుర్తించాలని కోరారు. సంఘం ప్రధాన కార్యదర్శి కాసు మాధవి, నాయకులు సమ్రీన్, ప్రియాంక, విజయ, వీరమ్మ రాజేశ్వరి, సంధ్య, తార, మెహరాజ్, లలిత తదితరులు మాట్లాడారు.



మాట్లాడుతున్న జాన్ వెస్లీ

## మతోన్మాద, అవినీతి బీజేపీని చిత్తుగా ఓడించాలి

- కుల, మతాల మధ్య చిచ్చుపెట్టి ఓట్లు రాబట్టుకునే ప్రయత్నం : సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు జాన్‌వెస్లీ

**నవతెలంగాణ - కల్వకుర్తి**

మతోన్మాద, అవినీతి కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం రాబోయే పార్లమెంటు ఎన్నికల్లో చిత్తుగా ఓడించాలని సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు జాన్‌వెస్లీ అన్నారు. నాగర్‌కర్నూల్ జిల్లా కల్వకుర్తి పట్టణంలోని టీఎస్ యూటీఎఫ్ భవన్‌లో ఆదివారం జరిగిన సీపీఐ(ఎం) జిల్లా విస్తృతస్థాయి సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రధానమంత్రి నరేంద్ర మోడీ కుల, మతాల మధ్య చిచ్చు పెట్టి ఓట్లు రాబట్టుకునే ప్రయత్నం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రతి రాష్ట్రంలో ఏదో ఒక రూపంలో అలజడి సృష్టించి ప్రజల మధ్య అశాంతి కలిగిస్తూ లబ్ధి పొందేందుకు చూస్తున్నారని అన్నారు. పదేండ్ల నరేంద్ర మోడీ పాలనలో పేద, మధ్యతరగతి ప్రజలకు ఒరిగింది ఏమీలేదని ఆరోపించారు. స్వాతంత్రం వచ్చిన నాటి నుంచి ఏ ప్రభుత్వం కూడా మనం తినే ఆహారంపై టాక్స్ విధించలేదని, నరేంద్ర మోడీ ప్రభుత్వం వచ్చిన తర్వాత చిన్నపిల్లలు తాగే పాలు, బ్రెడ్ లాంటి వస్తువుల పైనా జీఎస్టీ విధించి ప్రజల నడ్డి విరిచారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వ రంగ సంస్థలు మొత్తం కార్పొరేట్ శక్తులకు దారాదత్తం చేస్తూ ప్రజాధనాన్ని దోచి పెట్టారన్నారు. ఇన్ని సమస్యల నడుమ మోడీకి ఓట్లు అడిగే నైతిక హక్కు లేదన్నారు. ఎన్నికల సమయంలో గ్యాస్, పెట్రోల్, డీజిల్ ధరలు తగ్గించినంత మాత్రాన ప్రజలు ఆయనకు ఓటు వేస్తారనుకుంటే పొరపాటేనని తెలిపారు. ఎన్నికల బాండ్ల పేరుతో బీజేపీ అవినీతి అక్రమాలకు పాల్పడిందని చెప్పారు. ఈ విషయంలో సుప్రీంకోర్టు ఇచ్చిన ఆదేశాలను సైతం కేంద్ర ప్రభుత్వం తుంగలో తొక్కిందని తెలిపారు. ప్రజా వ్యతిరేక విధానాలను అవలంబిస్తున్న నరేంద్ర మోడీ ప్రభుత్వానికి ఈ ఎన్నికల్లో ప్రజలు తగిన గుణపాఠం చెప్పాలని విజ్ఞప్తి చేశారు. సమావేశంలో సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి పర్వతాలు, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఆంజనేయులు, ఆర్ శ్రీనివాసులు, ఆంజనేయులు, జిల్లా కమిటీ సభ్యులు ఏపీ మల్లయ్య, బాల్ రెడ్డి, బాలస్వామి నరసింహ ఈశ్వర్, శంకర్, మల్లేష్, దశరథం, అశోక్, శివ వర్మ తదితరులు పాల్గొన్నారు.



## సీఎం విమానంలో సాంకేతిక లోపం

**నవతెలంగాణ - శంషాబాద్**

శంషాబాద్ రాజీవ్ గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయంలో సాంకేతిక లోపంతో సమయానికి బయలుదేరాల్సిన ఇండిగో విమానం ఆలస్యమైంది. ఆదివారం ఎయిర్ పోర్టు నుంచి మధ్యాహ్నం రెండున్నర గంటలకు ముంబాయి వెళ్లాల్సిన ఇండిగో విమానం (6ఈ 5099) ఓవర్ హీట్ సమస్య తలెత్తడంతో ఏసీ సమస్య మొదలై ఆలస్యమైంది. ఈ విమానంలో తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, కాంగ్రెస్ రాష్ట్ర ఇన్‌చార్జి దీపాదాస్ మున్షీ, మంత్రి పొన్నం ప్రభాకర్‌తోపాటు పలువురు ప్రముఖులు ఉన్నారు. అధికారులు స్పందించి సమస్య పరిష్కారించడంతో విమానం ముంబాయికి బయలుదేరింది.

## ఐస్‌లాండ్‌లో మరోసారి బద్దలైన అగ్నిపర్వతం

**రెగ్జావిక్ (ఐస్‌లాండ్) :** ఐస్‌లాండ్‌లో మరోసారి భారీ అగ్నిపర్వతం బద్దలైంది. అగ్నిపర్వతం ఇలా బద్దలవడం మూడు మాసాల్లో ఇది నాలుగవసారి. అగ్నిపర్వతం నుంచి లావా, దుమ్ము, ధూళి పెద్ద ఎత్తున గాల్లోకి ఎగసిపడ్డాయని వాతావరణ కేంద్రం తెలిపింది. రాజధాని రెగ్జావిక్ ప్రాంతంలో ఉన్న ఈ అగ్నిపర్వతం బద్దలవ్వబోతోందని అధికారులు కొన్నిరోజుల ముందే హెచ్చరించారు. లావా జనావాసాలను ముంచెత్తింది. రెగ్జావిక్‌లో పోలీసులు అత్యవసర పరిస్థితిని ప్రకటించారు. ఐస్‌లాండ్‌లో 30 వరకు అగ్నిపర్వతాలున్నాయి. ఇక్కడికి అగ్నిపర్వతాలను చూసేందుకు విదేశాల నుంచి పర్యాటకులు ఎక్కువగా వస్తుంటారు.

## ఆఫ్ఘనిస్థాన్‌లో ఘోర రోడ్డు ప్రమాదం .. 21 మంది మృతి

**కాందహార్ :** దక్షిణ ఆఫ్ఘనిస్థాన్‌లో ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. ఈ ఘటనలో 21 మంది మరణించగా, 38 మంది గాయపడినట్లు ప్రావిన్షియల్ ట్రాఫిక్ విభాగం తెలిపింది. గాయపడిన వారిలో 11 మంది పరిస్థితి విషమంగా ఉన్నట్లు పేర్కొంది. దక్షిణ కాందహార్, పశ్చిమ హెరాత్ ప్రావిన్సుల మధ్య హెల్మాండ్ ప్రావిన్స్‌లోని గెరాష్క్ జిల్లా ప్రధాన రహదారిపై ఆదివారం ఉదయం ఈ ప్రమాదం జరిగిందని హెల్మండ్‌లోని ట్రాఫిక్ డిపార్ట్‌మెంట్ ఓ ప్రకటనలో తెలిపింది. కాందహార్ నుండి హెరత్ ప్రావిన్స్‌కు వెళుతున్న బస్సును ఓ మోటార్ బైక్ ఢీ కొట్టింది. అదుపుతప్పిన బస్సు ఎదురుగా వస్తున్న ఆయిల్ ట్యాంకర్‌పైకి దూసుకువెళ్లిందని హెల్మాండ్ పోలీస్ చీఫ్ ప్రతినిధి హజ్‌తుల్లా హక్కానీ తెలిపారు. గాయపడిన వారిని ఆస్పత్రులకు తరలించామని చెప్పారు.

## ఎన్నికల్లో పేపర్ వాడకాన్ని తగ్గించండి..

### రాజకీయ పార్టీలకు ఈసీ విజ్ఞప్తి

**న్యూఢిల్లీ :** సార్వత్రిక ఎన్నికల తేదీలను ప్రకటించిన ఎన్నికల సంఘం ఎన్నికలను పర్యావరణ హితంగా నిర్వహించేందుకు పలు మార్గదర్శకాలను కూడా జారీ చేసింది. మార్గదర్శకాల ప్రకారం.. ఎన్నికల సమయంలో పేపర్‌ను తక్కువగా ఉపయోగించాలని.. అదే సమయంలో సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌ను ఉపయోగించొద్దని ఈసీ విజ్ఞప్తి చేసింది. ఎన్నికల సమయంలో పర్యావరణ అనుకూల వాహనాలను వినియోగించాలని, ఎక్కువ వాహనాలను ఉపయోగించకుండా కార్ పూల్‌లను ఉపయోగించేలా ప్రోత్సహించాలని ఎన్నిక సంఘం రాజకీయ పార్టీలతో పాటు అధికార యంత్రాంగానికి సూచించింది.ప్రధాన ఎన్నికల కమిషనర్ రాజీవ్ కుమార్ మాట్లాడుతూ.. 'ఎన్నికలను పర్యావరణహితంగా నిర్వహించేందుకు ప్రయత్నిస్తున్నాం. ఈ ప్రయత్నాలలో భాగంగా, సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌ను ఉపయోగించొద్దు. పేపర్‌ను తక్కువ ఉపయోగించాలి. పర్యావరణ అనుకూల విధానాలను అనుసరించాలని విజ్ఞప్తి చేస్తున్నాం' అని పేర్కొన్నారు. రాజకీయ పార్టీలు, ఎన్నికల యంత్రాంగం స్థానిక వ్యర్థ పదార్థాల నిర్వహణ యూనిట్ల సహాయంతో వ్యర్థాలను రీసైకిల్ చేయడానికి ప్రయత్నించాలని ఎన్నికల సంఘం సూచించింది. ఓటరు జాబితాలు, ఎన్నికల సామగ్రిలో పేపర్ వాడకాన్ని తగ్గించాలని.. కాగితాలకు రెండువైపులా ముద్రించాలని.. తద్వారా పేపర్ సేవ్ అవుతుందన్నారు. ఎన్నికల ప్రచార సమయంలో వాహనాల వినియోగాన్ని తగ్గించాలని.. సిఎన్‌జి, ఎలక్ట్రిక్ వాహనాలను వినియోగించాలని కోరింది.

## బీజేపీలో చేరిన అరూరి రమేష్



**నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్**

370 స్థానాలు బీజేపీకి, ఎన్డీయే కూటమితో 400 పైగా గెలవాలని కృషి చేస్తున్నామని బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు, కేంద్ర మంత్రి జి కిషన్‌రెడ్డి తెలిపారు. ఆదివారం హైదరాబాద్‌లో వర్ధన్న పేట బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే అరూరి రమేష్ బీజేపీలో చేరారు. ఆయనకు కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా కిషన్‌రెడ్డి మాట్లాడుతూ కవిత అరెస్ట్ పార్టీకి, ప్రభుత్వానికి ఎలాంటి సంబంధం లేదన్నారు. అవినీతికి పాల్పడితే ఎవరినీ వదలమని చెప్పారు. విద్యావంతులు, మేధావులు, బడుగు బలహీన వర్గాలు బీజేపీలో చేరాలని పిలుపునిచ్చారు. వచ్చే ఎన్నికలతో బీఆర్ఎస్ పూర్తిగా కనుమరుగవుతుందని చెప్పారు. కేసీఆర్‌ది అహంకార, నియంతృత్వ విధానమని విమర్శించారు. కల్వకుంట్ల కవిత రాష్ట్ర ప్రజలకు మేలు చేసేందుకు ఢిల్లీలో బారు, బ్రాందీ వ్యాపారం చేశారా? అని ప్రశ్నించారు. కాంగ్రెస్ అధికారంలోకొచ్చిన 100 రోజుల్లో ఆరు గ్యారెంటీలు అమలుచేస్తామన్నారనీ, అవినీతి కుంభకోణాలపై చర్యలు తీసుకుంటామన్నారనీ, ఇప్పటి వరకు ఒక్క కేసు కూడా నమోదు చేయలేదని ఎద్దేవా చేశారు.

## 18 మంది పాక్ హిందూ శరణార్థులకు భారత పౌరసత్వం

**అహ్మదాబాద్:** అహ్మదాబాద్‌లో నివాసముంటున్న పాకిస్థాన్‌కు చెందిన 18 మంది హిందూ శరణార్థులకు భారత పౌరసత్వం లభించింది. జిల్లా కలెక్టర్ కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన ప్రత్యేక క్యాంపునకు హాజరైన గుజరాత్ హోంశాఖ సహాయ మంత్రి హర్ష్ సంఘవి వారికి పౌరసత్వం ఇచ్చారు. 2016, 2018 గెజిట్ నోటిఫికేషన్ ప్రకారం పాకిస్థాన్, ఆఫ్ఘనిస్థాన్, బంగ్లాదేశ్ మైనారిటీలకు భారత పౌరసత్వాన్ని మంజూరు చేయడానికి గుజరాత్‌లోని అహ్మదాబాద్, గాంధీనగర్, కచ్ జిల్లా కలెక్టర్లకు అధికారం ఉందని ప్రకటన తెలిపింది. ఇప్పటి వరకు 1,167 మందికి పౌరసత్వం ఇచ్చినట్లు పేర్కొంది.

## చల్లా నర్సింహా రెడ్డికి ఘన సన్మానం



నవతెలంగాణ- బడంగ్‌పేట్

తెలంగాణ రాష్ట్ర అర్బన్ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్‌గా ఎన్నికైన రంగారెడ్డి జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు చల్లా నర్సింహా రెడ్డిని ఆదివారం రంగారెడ్డి జిల్లా చేనేత విభాగం కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మస్న రవి కుమార్ ఆధ్వర్యంలో ఆయన నివాసంలో పూలమాలలు, శాలువాలతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో జల్‌పల్లి మున్సిపల్ వర్కింగ్ ప్రెసిడెంట్ మహమ్మద్ అబ్దుల్ బారీ, నాయకులు జహంగీర్ ఖాన్, వంశీ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ఆలయంలో నిరుపేద జంటకు వివాహం



నవతెలంగాణ - చైతన్యపురి

కొత్తపేటలోని వాసవి కన్యకాపరమేశ్వరి దేవాలయంలో నిరుపేద జంటకు ఆదివారం వివాహం జరి పించారు. మహేశ్వరం నియోజకవర్గం బీఆర్ఎస్ పార్టీ మహిళా విభాగం వర్కింగ్ ప్రెసిడెంట్ పటేల్ సునీత రెడ్డి, తెలంగాణ టింబర్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్యవైశ్య సంఘం నాయకుడు చక్కిలం రమణయ్య గుప్త నేతృత్వంలో కూచిపూడి వరుడు వెంకటేష్, వధువు మామిడి మధునతో సాంప్రదాయబద్ధంగా వివాహ కార్యక్రమం జరిగింది. సుమారు 100 మంది పాల్గొని నూతన వధూవరులను ఆశీర్వదించారు. అనంతరం ఖిల్లా మైసమ్మ దేవాలయం ఆవరణలో విందు కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు.

## ఎంపీ రంజిత్ రెడ్డి దిష్టిబొమ్మ దహనం



నవతెలంగాణ - చైతన్యపురి

చేవెళ్ల ఎంపీ రంజిత్‌రెడ్డి కాంగ్రెస్ పార్టీ కండువా కప్పుకొని పార్టీ మారడంతో నిరసనగా ఆయన దిష్టిబొమ్మను ఆర్కేపురంలో డివిజన్ వర్కింగ్ ప్రెసిడెంట్ కంచర్ల శేఖర్, డివిజన్ ప్రధాన కార్యదర్శి వెంకటేష్ గౌడ్ ఆధ్వర్యంలో ఆదివారం దహనం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బీఆర్ఎస్ పార్టీ అధికారంలో ఉన్నన్నీ రోజులు పదవులు అనుభవించి, పార్టీ మారడం సిగ్గుచేటు అని అన్నారు. ప్రజాసేవ కోసమే రాజకీయాల్లోకి రావాలి కానీ.. అధికారమే పరమావధిగా పార్టీలు మారడం దివాలా కోరుతనానికి నిదర్శనం అన్నారు.

ఎంతమంది వచ్చిపోయినా పార్టీకి ఉద్యమకారులు అండగా ఉంటారని అన్నారు. ఈ కార్యక్రమంలో న్యాలకొండ శ్రీనివాస్ రెడ్డి, కొంద్ర శ్రీనివాస్, మల్లేష్ ముదిరాజ్, వలిగొండ దీపు, రమేష్ కురుమ, మల్లేష్ గౌడ్, రూపేష్, సంజయ్ వీరాస్వామి, జావీద్ పటేల్, పదిరే శంకర్, సిద్ధగోని శివ, ఈర్ల జగదీశ్, సామేష్, ఈశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

## మౌలిక సదుపాయాల కల్పనకు కృషి

- ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి



నవతెలంగాణ - తుర్కయంజాల్

నూతన కాలనీలల్లో మౌలిక సదుపాయాల కల్పనకు కృషి చేస్తానని ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి అన్నారు. తుర్కయంజాల్ మున్సిపాలిటీ పరిధి మునగనూర్ 15వ వార్డులో అంజనాపురి కాలనీ ముఖద్వారాన్ని స్థానిక కౌన్సిలర్ వేముల స్వాతి అమరేందర్ రెడ్డితో కలిసి ఆదివారం ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కాలనీవాసులు ఐక్యమత్యంతో కలిసి మెలిసి కాలనీలను అభివృద్ధి చేసుకోవాలని సూచించారు. నూతన కాలనీలల్లో మౌలిక సదుపాయాల కల్పనకు తన వంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. మున్సిపాలిటీ చైర్ పర్సన్ అనురాధ రాంరెడ్డి ఆధ్వర్యంలో ప్రతి వార్డును ఆదర్శంగా తీర్చిదిద్దుతున్నామని అన్నారు. కాలనీలల్లో ఎలాంటి సమస్యలు ఉన్నా తమ దృష్టికి తీసుకురావాలన్నారు.

ఈ కార్యక్రమంలో టీపీసీసీ సభ్యులు, కౌన్సిలర్ కాకుమాను సునీల్, కౌన్సిల్ కాంగ్రెస్ ఫ్లోర్ లీడర్ కొశికె ఐలయ్య, కౌన్సిలర్లు కొత్తకుర్మ మంగమ్మ శివకుమార్, నక్క శివలింగం గౌడ్, డైరెక్టర్ అంజయ్య, నాయకులు కుంట గోపాల్ రెడ్డి, మేకం అంజయ్య, నక్క శ్రీనివాస్ గౌడ్, వెంకట్ రెడ్డి, రేవల్లె యాదగిరి, వాసు, కాలనీ అధ్యక్షుడు దొంతుల శ్రీకాంత్ రెడ్డి, ఉపాధ్యక్షులు గుర్రం రాజరత్నం, గంగాపురం కృష్ణ గౌడ్, ప్రధాన కార్యదర్శి ర్యాలి శ్రీనివాస్ రావు తదితరులు పాల్గొన్నారు.

## న్యాయ కళాశాలలో రక్తదాన శిబిరం





నవతెలంగాణ -ఎల్బీనగర్

ఎల్బీనగర్‌లోని మహాత్మా గాంధీ న్యాయ కళాశాలలో ఆదివారం ఉచిత రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ప్రముఖ విద్యావేత్త ప్రొఫెసర్ కోదండరాం హాజరై మాట్లాడారు. రక్తదానంతో విలువైన ప్రాణాలు నిలబెట్టవచ్చని పేర్కొన్నారు. ప్రతిరోజు తగిన రక్తం లభించకపోవడం వలన అనేకమంది ఇబ్బంది పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇలాంటి రక్తదాన శిబిరాలు ఎంతోమంది ప్రాణాలను నిలబెడతాయని కొనియాడారు. ప్రతి ఒక్కరూ ముందుకు వచ్చి రక్తదాన శిబిరంలో పాల్గొనాలని కోరారు. విద్యార్థులు ఇటువంటి కార్యక్రమాలు నిర్వహించడం గొప్ప విషయం అన్నారు. సుమారు వందమంది రక్తదానంలో పాల్గొన్నట్టు పేర్కొన్నారు. తర్వాత సేకరించిన రక్తన్ని ఉస్మానియా హాస్పిటల్‌కు అందజేశారు. అనంతరం 2019 పుల్వామా అమరవీరుల త్యాగాలను గుర్తు చేసుకుని వారికి శ్రద్ధాంజలి ఘటించారు. రక్త దానం చేసిన వారికి కోదండరాం సర్టిఫికెట్స్ అందజేశారు. మహాత్మా గాంధీ లా కళాశాల సెక్రెటరీ గంగుల గోవర్ధన్ రెడ్డి, ప్రిన్సిపాల్ డాక్టర్ శ్రీనివాస్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ సత్యం, అధ్యాపకులు డాక్టర్ శ్రీ లక్ష్మి, సుధా, దేవి, మూర్తి అధ్యాపకులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## రోడ్, భవనాల కార్పొరేషన్ చైర్మన్‌గా మల్‌రెడ్డి రాంరెడ్డి



నవతెలంగాణ - ఎల్బీనగర్

తెలంగాణ రాష్ట్ర రోడ్ భవనాల కార్పొరేషన్ చైర్మన్‌గా మల్‌రెడ్డి రంగారెడ్డిని రాష్ట్ర ప్రభుత్వం నియమించింది. మల్‌రెడ్డి రాంరెడ్డి ఎల్బీనగర్ నియోజకవర్గం నుండి కాంగ్రెస్ పార్టీ తరపున ఎమ్మెల్యే టికెట్ ఆశించారు. చివరిలో బీసీ కోటలో మధు యాష్కీ గౌడ్‌కు టికెట్ ఇచ్చారు. ముఖ్య మంత్రి రేవంత్ రెడ్డికి సన్నిహితులుగా ఉన్నారు. పార్లమెంట్ ఎన్నికల వేల ఎల్బీనగర్ నియోజకవర్గం నుండి మల్‌రెడ్డి రాంరెడ్డికి చైర్మన్‌గా అవకాశం కల్పించి నందుకు సీఎం రేవంత్ రెడ్డిని ఆదివారం కలిసి, అభినందనలు తెలియజేశారు. ఈ సందర్భంగా మల్ రెడ్డి రాంరెడ్డి మాట్లాడుతూ ప్రజలకు ఎల్లవేళలా అందుబాటులో ఉంటానని భరోసా ఇచ్చారు. రోడ్ల అభివృద్ధికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. అనంతరం మంత్రులకు, ఎమ్మెల్యేలకు కృతజ్ఞతలు తెలియజేశారు.

**మల్ రెడ్డి రాంరెడ్డికి శుభాకాంక్షల వెల్లువ**

నవతెలంగాణ-తుర్కయంజాల్

రోడ్, భవనాల కార్పొరేషన్ చైర్మన్‌గా నియమితులైన మల్ రెడ్డి రాంరెడ్డి కి తుర్కయంజాల్ మున్సిపాలిటీ ఇంజాపూర్ ఆపిల్ కాలనీ, తిరుమల నగర్, తుల్జా భవాని కాలనీ వాసులు ఆదివారం పుష్పగుచ్చం అందజేసి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మల్ రెడ్డి రాంరెడ్డి కాంగ్రెస్ పార్టీకి చేసిన సేవలకు గుర్తింపు లభించిందన్నారు. శుభాకాంక్షలు తెలిపిన వారిలో కాంగ్రెస్ నాయకులు ధనరాజ్ గౌడ్, సామ భీంరెడ్డి, బొక్క వంశీధర్ రెడ్డి, లక్ష్మీ టౌన్ షిప్ అధ్యక్షుడు బారు శ్రీనివాస్ రావు(బొగ్గు శ్రీను), తిరుమల కాలనీ అధ్యక్షులు శ్రీనివాస్ గౌడ్, ఆపిల్ కాలనీ అధ్యక్షులు చెన్నా రెడ్డి, తుల్జా భవాని కాలనీ అధ్యక్షులు నరేందర్, ప్రసూన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



## సైదాబాద్‌లో వాహనాల తనిఖీ



నవతెలంగాణ - సంతోష్ నగర్

ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చిన క్షణమే ఇంటిగ్రేటెడ్ ఇంటర్ కమిషనరేట్ ఆదేశానుసారం సైదాబాద్ ఏసీపీ వెంకన్న నాయక్, సీఐ రాఘవేందర్ పోలీసుల సిబ్బందిలతో సైదాబాద్ డివిజన్ గ్రీన్ పార్క్ కాలనీ పరిధిలో ఆదివారం వాహనాల తనిఖీని ముమ్మరం చేశారు. ప్రతి వాహనాన్నీ క్షణ్ణంగా తనిఖీ చేసిన తరువాతే వదిలేశారు. సైదాబాద్‌లో నిత్యం వాహనాల తనిఖీ చేస్తామని పోలీసులు వెల్లడించారు. ఈ తనిఖీలకు వాహనాదారులు సహకరించాలని, లేకుంటే చట్టపరంగా తగిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. డ్రైవింగ్ పత్రాలు, ఆర్సీలు వెంట పెట్టుకోవాలని సూచించారు. డబ్బుంటే దానికి సంబంధించిన ఆధారాలను చూపాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో సీఐఎస్ఎఫ్, ఆర్టీఏ సిబ్బంది, డీఐలు, ఎస్ఐలు, పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## రాజ్యలక్ష్మికి మహిళా సాధికారత అవార్డు



నవతెలంగాణ - చైతన్యపురి

కొంగరకలాన్‌లోని రంగారెడ్డి జిల్లా కలెక్టరేట్‌లో ఆదివారం మహిళా దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. మహిళా వికలాంగుల సాధికారిక సంఘం తెలంగాణ రాష్ట్ర అధ్యక్షురాలు కే. రాజ్యలక్ష్మికి మహిళా సాధికారత అవార్డు లభించిందింది. ఈ మేరకు అడిషనల్ కలెక్టర్, డిజేబుల్ వెల్ఫేర్ ఆఫీసర్ చేతుల మీదుగా ఆదివారం రాజ్యలక్ష్మి అవార్డు అందుకున్నారు. ఈ సందర్భంగా రాజ్యలక్ష్మి మాట్లాడుతూ మహిళలు అన్ని రంగాల్లోనూ రాణిస్తూ తమ సత్తా చాటుతున్నారని హర్షం వ్యక్తం చేశారు. అవార్డు రావడం ఎంతో సంతోషంగా ఉందని, మరింత బాధ్యత పెరిగిందన్నారు. మహిళల అభ్యున్నతికి తన సహాయ సహకారాలు ఎల్లప్పుడూ ఉంటాయన్నారు.

## రాష్ట్ర అధ్యక్షుడిగా కృష్ణ నాయక్, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్‌గా రాజేష్ నాయక్



నవతెలంగాణ - సంతోష్‌నగర్

జాతీయ బంజారా మిషన్ (ఇండియా) తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడిగా కృష్ణా నాయక్, జనరల్ సెక్రెటరీగా రాజయ్య, రంగారెడ్డి జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్‌లుగా రాజేష్ నాయక్, ప్రసాద్ నాయక్‌లు ఎన్నికయ్యారు. హైదరాబాద్ జిల్లా కార్యాలయంలో ఆదివారం ఏర్పాటు చేసిన సమావేశంలో నూతనంగా ఎన్నికైన వారిని పూలు మాలలు, శాలువాలతో ఘనంగా సత్కరించారు. తర్వాత వారికి నియామక పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్షులు మాట్లాడుతూ ప్రజలు ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యలను పరిష్కరించేందుకు తన వంతు కృషి చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో రామావత్ భిచ్య బవోజి నాయక్, రవి నాయక్, తులసి రామ్ నాయక్, సేవాలాల్, వెంకట్ రాథోడ్, లక్ష్మీబాయి, దుర్గాబాయి, మంగ్లీబాయి, శ్రీదేవి, సుజాత, అలివేలు, సీమా రాథోడ్, స్థానిక నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## 19న 'ఆర్ఎన్సీ'లో ఉచిత డయాబెటిక్ శిబిరం

నవతెలంగాణ - సిటీబ్యూరో

ఈ నెల 19వ తేదీన ఉచిత డయాబెటిక్ క్యాంపును నిర్వహిస్తున్నట్టు ఆర్ఎన్సీ హాస్పిటల్ ప్రకటించింది. ఈ క్యాంపులో షుగర్ టెస్ట్, కన్సల్టేషన్, బీపీ చెకప్ సహా ఉచిత చెకప్‌లను అందించనున్నారు. ముందస్తు అపాయింట్‌మెంట్ అవసరం లేకుండా, రోగులు ఉచిత పరీక్షలు చేయించుకోవచ్చు. ఈ క్యాంపులో కన్సల్టెంట్ జనరల్ అండ్ ఫ్యామిలీ ఫిజీషియన్లు డాక్టర్ నవనీత, డాక్టర్ సుధీర్ దావాలా అందుబాటులో ఉంటారు. ఈ క్యాంపు ప్రతి నెలా 3, 19 తేదీల్లో నిర్వహిస్తారు. ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 1 గంటల వరకు కొనసాగుతుంది. చింతల్ బస్టాండ్ దగ్గర ఉన్న ఆర్ఎన్సీ హాస్పిటల్‌లో ఈ క్యాంపు ఉంటుంది.

## 'సోనాలికా' రెండు కొత్త ప్లాంట్లకు శంకుస్థాపన



నవతెలంగాణ - సిటీబ్యూరో

సోనాలికా ట్రాక్టర్స్ పంజాబ్ రాష్ట్రంలోని ప్రముఖ ఓఈఎంలలో ఒకటిగా ఉంది. రాష్ట్రంలో రెండు కొత్త ప్లాంట్లకు పంజాబ్ ముఖ్యమంత్రి భగవంత్ మాన్ శంకుస్థాపన చేశారు. గతేడాది చివర్లో ప్రకటించిన కొత్త రౌండ్ పెట్టుబడులకు అనుగుణంగా, సోనాలికా కొత్త ట్రాక్టర్ అసెంబ్లింగ్ ప్లాంట్ ఏర్పాటుకు రూ.1000 కోట్లు, అదనంగా కొత్త హై ప్రెజర్ ఫౌండ్రీ ఏర్పాటుకు రూ.300 కోట్లు పెట్టుబడి పెట్టనుంది.

సోనాలికా ట్రాక్టర్స్ వైస్ చైర్మెన్ డాక్టర్ అమృత్ సాగర్ మిట్టల్ మాట్లాడుతూ "పంజాబ్‌లో కొత్త ప్రాజెక్టుల స్థాపనకు వీలుగా సింగిల్ విండో ఛానల్ ద్వారా ప్రభుత్వ సహకారం అసాధారణంగా ఉంది. ప్రయివేటు రంగం, ప్రభుత్వం మధ్య సహకార ప్రయత్నాలు వ్యాపార అభివృద్ధికి, ఆవిష్కరణలకు అనువైన వాతావరణాన్ని ప్రోత్సహిస్తున్నాయి" అన్నారు.

## ఎన్నికల ప్రచార రథాన్ని ప్రారంభించిన కార్పొరేటర్



నవతెలంగాణ - నాగోల్

మల్కాజిగిరి పార్లమెంట్ బీజేపీ ఎంపీ అభ్యర్థి ఈటల రాజేందర్ ప్రచార రథాన్ని ఆదివారం నాగోల్ డివిజన్ కార్పొరేటర్ చింతల అరుణ సురేంద్రనాథ్ యాదవ్ జెండా ఊపి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు బద్దం బాలకృష్ణ గౌడ్, సిద్దాల ఐలయ్య, పాల్వాయి సంజీవరెడ్డి, కేసిరెడ్డి పద్మా రెడ్డి, వస్పరి మల్లేష్, రావుల శ్రీనివాస్ గౌడ్, నరేందర్ సింగ్, రాము గౌడ్, మనోజ్ కుమార్, చరణ్ సాగర్, గోపాల్ శర్మ, శ్రీకాంత్, మనోజ్ పాల్గొన్నారు.

## ఆత్మ రక్షణకు కరాటే ఎంతో అవసరం



- మేయర్ పారిజాత నర్సింహారెడ్డి

నవతెలంగాణ - బడంగ్‌పేట్

నేటి సమాజంలో ప్రతి ఒక్కరికీ ఆత్మరక్షణ కోసం కరాటే ఎంతో అవసరం అని మేయర్ చిగిరింత పారిజాత నర్సింహారెడ్డి అన్నారు. మహేశ్వరం నియోజకవర్గం బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్‌లోని మున్సిపల్ గ్రౌండ్‌లో ఇటీవల జరిగిన కరాటే పోటీలలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు కేటగిరీల వారీగా కరాటే బెల్టులను టీపీసీసీ ప్రధాన కార్యదర్శి, మేయర్ చిగిరింత పారిజాత నరసింహారెడ్డి ఆదివారం ప్రదానం చేశారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ విద్య, క్రీడల్లోనూ రాణించి జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో మంచి గుర్తింపు తెచ్చుకోవాలని విద్యార్థులకు సూచించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ పెద్దబావి సుదర్శన్ రెడ్డి, నాయకులు లిక్కి కృష్ణారెడ్డి, విద్యార్థులు పాల్గొన్నారు.

**అల్మాస్ గూడలో రోబోటిక్ మెగా ఈ వెంట్..**

బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని అల్మాస్‌గూడలో ఉన్న శ్రీ భారతి విద్యాలయంలో రోబోటిక్ మెగా ఈవెంట్‌ను ఆదివారం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి టీపీసీసీ ప్రధాన కార్యదర్శి, మేయర్ చిగిరింత పారిజాత నర్సింహారెడ్డి హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో పోరెడ్డి భాస్కర్ రెడ్డి, ప్రతాప్ రెడ్డి, పాఠశాల యాజమాన్యం జయరాం, సరిత, ఆనందం పాల్గొన్నారు.



నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
మేడ్చల్-మల్కాజిగిరి-ఉప్పల్
సోమవారం | మార్చి, 18, 2024 | www.navatelangana.com

## ప్రీతంకు శుభాకాంక్షల వెల్లువ



నవతెలంగాణ-బోడుప్పల్

తెలంగాణ రాష్ట్ర ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్‌గా నియమితులైన నాగరిగారి ప్రీతమ్‌ను పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ అధ్యక్షులు పంగా రాజు ఆదివారం చెంగిచెర్లలో ఆయన నివాసంలో కలిసి శుభాకాంక్షలు తెలియ చేశారు. ఈ సందర్భంగా ప్రీతం మాట్లాడుతూ తనపై నమ్మకంతో రాష్ట్ర ఎస్సీ కార్పొరేషన్ చైర్మెన్‌గా నియమించిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి,డిప్యూటి సీఎం మల్లు బట్టి విక్ర మార్కలకు ధన్యవాదాలు తెలిపారు.కాంగ్రెస్ పార్టీలో కష్టపడిన ప్రతి కార్య కర్తకు భవిష్యత్‌లో మంచి అవకాశాలు ఉంటాయని తెలిపారు.

## పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ చైర్మెన్‌గా గుర్నాథ్ రెడ్డి



నవతెలంగాణ-కొడంగల్

రాష్ట్ర పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ చైర్మెన్‌గా ఆర్ గుర్నాథ్‌రెడ్డిని నియమిస్తూ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశాలు జారీ చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత కొడంగల్ ప్రాంతానికి చెందిన గుర్నాథ్ రెడ్డి రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గెలుపులో ప్రముఖ పాత్ర వహించడంతో రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్‌గా గురునాథ్‌రెడ్డి నియమించారు. పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ చైర్మెన్‌గా అవకాశం కల్పించినందుకు రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి గుర్నాథ్‌రెడ్డి కృతజ్ఞతలు తెలిపారు. కొడంగల్ పట్టణంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్దఎత్తున శాలువా, పూలమాలతో సన్మానించి అభినందనలు తెలియజేశారు.

## సీసీ కెమెరాలు ప్రారంభోత్సవంలో పాల్గొన్న ఎమ్మెల్యే

నవతెలంగాణ-కాప్రా



మల్లాపూర్ డివిజన్ కేఎల్‌రెడ్డి నగర్‌లో సీసీ కెమెరాలను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి, స్థానిక కార్పొరేటర్ పన్నాల దేవేందర్‌రెడ్డి ముఖ్య అతిథులుగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లడుతూ దుకాణాలు, కార్యాలయాల వద్దే కాకుండా ఇంటి వద్ద, కాలనీ లలో కూడా సీసీ కెమెరాలను అమర్చు కుంటున్నారన్నారు. ఇటీవలి కాలంలో భద్రతా కోసం స్థానిక ప్రజలు సీసీ కెమెరాలపై ఆధార పడుతున్నారన్నారు. ఇండ్లలోకాని, కాలనీలలో దొంగతనాలు జరగకుండా సీసీ కెమెంాలను అమర్చుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో కాలనీ ప్రెసెడెంట్ మహేందర్‌రెడ్డి, యాకుబ్‌రెడ్డి, లక్ష్మి , జయశ్రీ, బీఆర్ఎస్ నాయకులు వాసుగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డికి సన్మానం



నవతెలంగాణ-కాప్రా

కాప్రా, సాయి బాబానగర్‌లో ప్రధాన సమస్య లిఫ్ట్ వాటర్ సమస్యను ఆదివారం అసోసియేషన్ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. అనంతరం సాయిబాబానగర్‌లోని పలు సమస్యలను వారికి వివరించారు. దానికి ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు, అనం తరం డబుల్ బెడ్ రూమ్ దగ్గర ఎమ్మెల్యేను సన్మానించారు. ఈ కార్యక్రమంలో బంకా వెంకటేష్ , గౌస్, విజయ్ , వెంకటేష్, భార్గవి, రవిందర్‌రెడ్డి, దుర్గేష్ పాల్గొన్నారు.

## కంటిచూపుని కబలించేది 'గ్లకోమా'

నవతెలంగాణ-కాప్రా



గ్లకోమా వీక్ సందర్భంగా ఈసీఎల్ క్రాస్‌రోడ్స్‌లో సోలిస్ ఆసుపత్రి యాజమాన్య బృందం, సిబ్బంది , డాక్టర్స్ (డాక్టర్ అశోక్, డాక్టర్ ఆనంద్ , డాక్టర్ నమ్రత)లు అవగాహనా సదస్సులు, ర్యాలీలు నిర్వహించి ప్రజలలో గ్లకోమాపై అవగాహనా కల్పించినట్లు తెలిపారు. దీనిలో భాగంగా డాక్టర్స్ మాట్లాడుతూ గ్లకోమా అనేది ఆప్టిక్ నరాలకి హాని కలిగించే వ్యాధి అని, ఆప్టిక్ నరాల దెబ్బతినడం వల్ల అంధత్వం ఏర్పడవచ్చని, వయస్సుతో పాటు గ్లకోమా ముప్పు పెరుగుతుందన్నారు. 40 ఏండ్లు పైబడిన వారిలో ఈ సమస్య ఎక్కువ వస్తుందని పేర్కొన్నారు. కోలుకోలేని దృష్టి నష్టానికి గ్లకోమా ప్రధాన కారణమని, గ్లకోమాను ముందుగా గుర్తించడం వలన మరింత దృష్టి నష్టాన్ని నివారించవచ్చన్నారు.

## రేవంత్‌రెడ్డి మర్యాదపూర్వకంగా కలిసిన పత్తికుమార్



నవతెలంగాణ-కాప్రా

రాష్ట్ర ప్రభుత్వం 37 కార్పొరేషన్ల చైర్మెన్‌లను నియమించినందుకు అందులో ఎస్సీ కార్పొరేషన్ చైర్మెన్ గా నగరి ప్రీతంకి అవకాశం కల్పించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డిని మేడ్చల్ జిల్లా ఎస్సీ విభాగం అధ్యక్షులు పత్తికుమార్ ముఖ్యమంత్రి నివాసంలో మర్యాదపూర్వకంగా కలిసి ధన్యవాదాలు తెలియజేశారు.

## రాష్ట్ర ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ ప్రీతమ్‌కు సన్మానం

నవతెలంగాణ-కాప్రా



రాష్ట్ర ఎస్సీ కార్పొరేషన్ చైర్మెన్‌గా ఎన్నికైన ప్రీతమ్‌ను ఏఐటీయూసీ కాప్రా మండల కార్యదర్శి మిరియాల సాయిలు నేతృత్వంలో ఆయన నివాసం వద్ద కలిసి శాలువాతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఏఐటీయూసీ కాప్రా మండల కార్యదర్శి మిరియాల సాయిలు మాట్లాడుతూ అణగారిన వర్గాల అభివృద్ధికి నూతనంగా ఎన్నికైన ఎస్సీ కార్పొరేషన్ శాఖ కృషి చేయాలని, ప్రభుత్వం ద్వారా వచ్చే ప్రతి సంక్షేమ పథకాలను లబ్ధిదారులకు అందేలా చూడాలని వారు కోరారు. ప్రధానంగా అణగారిన వర్గాలలో కార్మికులు అధికమని, ఆ కార్మికులు ఎదుర్కొంటున్న న్యాయమైన సమస్యల పరిష్కారం కోసం అవిరాళంగా కృషి చేయాలని వారు అన్నారు.ఈ కార్యక్రమంలో సీనియర్ నేత పత్తి కుమార్ పాల్గొన్నారు.

## అంబేద్కర్ ప్రపంచంలోనే గొప్ప మహనీయుడు

- బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి రాగుల అశోక్ ముదిరాజ్



నవతెలంగాణ-కీసర

అంబేద్కర్ ప్రపంచంలోనే గొప్ప శక్తిమంతుడని,గొప్పమహనీయుడని బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి రాగుల అశోక్ ముదిరాజ్ అన్నారు. కీసర మండలం అంబేద్కర్ సంఘం ఆధ్వర్యంలో ఆదివారం 112 వ వారం జ్ఞానమాల కార్యక్రమం అధ్యక్షుడు కొమ్ము సుదర్శన్, ప్రధాన కార్యదర్శి తుడుం శ్రీనివాస్ ఆధ్యర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి రాగుల అశోక్ ముదిరాజ్ ముఖ్య అతిథిగా పాల్గొన్ని అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో కీసర మండల అంబేద్కర్ సంఘం ఉపాధ్యక్షులు బక్కాని కుమార్, వేణుగోపాల్, సంయుక్త కార్యదర్శులు మొరుగు నవీన్, బత్తుల ఆంజనేయులు, ఐలయ్య, మండల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# చెంగిచర్ల కబేళాను ప్రక్షాళన చేయాలంటూ కాలనీ వాసుల ధర్నా



నవతెలంగాణ-బోడుప్పల్

చెంగిచెర్లలోని కబేళా నుంచి వచ్చే దుర్వాసనను అరికట్టాలని డిమాండ్ చేస్తూ బోడుప్పల్ కార్పొరేషన్ మొదటి డివిజన్ కార్పొరేటర్ బింగి జంగయ్యయాదవ్ ఆధ్వర్యంలో వివిధ కాలనీల ప్రజలు ఆదివారం కబేళా ముందు భారీ ఎత్తున ధర్నా నిర్వహించారు. కార్పొరేటర్ బింగి జంగయ్య యాదవ్ మాట్లా డుతూ.. కబేళా నుంచి ప్రతి రోజు భరించలేని దుర్వాసన వస్తున్నా అధికారులు ఏమా త్రం పట్టించుకోవడం లేదన్నారు.దుర్వాసన కారణంగా పరిసర కాల నీల ప్రజలు అనారోగ్యానికి గురై ఇబ్బందులు పడుతున్నారని కార్పొంటర్ ఆవేదన వ్యక్తం చేశారు.కబేళా మూలంగా చెంగిచర్ల ప్రజలకు ఎదు రవుతున్న ఇబ్బందులను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లేందుకు తనవంతు కృషిచేస్తానన్నారు. ఇకనుంచి దుర్వాసన రాకుండా సంబంధిత అధికారులు తక్షణమే చర్యలు తీసుకోవాలని కార్పొరేటర్ జంగయ్యయాదవ్ డిమాండ్ చేశారు. ఈ ధర్నాలో వివిధ కాలనీల ప్రజలు పాల్గొన్నారు.

## గంగపుత్రులకు ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు అభినందనీయం



ముఖ్యమంత్రి, చిత్రపటానికి పాలాభిషేకం

నవతెలంగాణ-ఉప్పల్ (రామంతపూర్):

తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన వంద రోజుల్లోనే వివిధ బీసీ కులాలకు సంబంధించిన కార్పొరేషన్లు ఏర్పాటు చేయడం చాలా అభినంద నీయ మని గంగపుత్ర సంఘం నాయకుడు తవిడబోయిన గిరిబాబు తెలిపారు. అందులో భాగంగా ముదిరాజులకు, గంగపుత్రులకు కలిసి ఉండే కార్పొరేషన్‌ను ప్రత్యేకంగా గంగపుత్రులకు ఒక కార్పొరేషన్ ఏర్పాటు చేయడం పట్ల ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి ఈ సందర్భంగా ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. రామంతాపూర్‌లో రామంతపూర్ బెస్త గంగపుత్ర సంఘం, తెలంగాణ గంగపుత్ర సంఘం నాయకులు గిరిబాబు ఆధ్వర్యంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి,బీసీ మంత్రి పొన్నం ప్రభాకర్ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. గంగపుత్రుల అభివృద్ధికి ఇటు రాజకీయంగా అటు సామాజికంగా అభివృద్ధి చెందాలని వారి హక్కుల కాపాడడం కోసం ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేసినందుకు ధన్యవాదాలు తెలిపారు. 6ఏ జీఓను రద్దు చేయాలని, గంగ పుత్రుల సమస్యలను అన్ని ప్రభుత్వం పరిష్కరించే దిశగా కృషి చేయాలని నాయకులు కోరారు.ఈ కార్యక్రమంలో గంగపుత్ర సంఘం నాయకులు పూస సత్తయ్య ,వెంపటి సైదులు, చుక్కల సత్యనారాయణ, గుండు సాయిలు ,మంగ రవి, గొంగిడి సుబ్రహ్మణ్యం, సత్యనారాయణ ,పెద్దపల్లి కృష్ణ, పబ్బు గణేష్ ,కాయ ఉపేందర్, అంబటి వెంకటేష్, సత్యనగర్ కృష్ణ, కాయ వెంకటేష్ ,పెద్ద సంఖ్యలో గంగపుత్రులు తదితరులు పాల్గొన్నారు.

## మల్కీ జ్ గూడలో ఓ ఇంట్లో చోరీ

- రూ.30వేల నగదు, తులం బంగారం, 12 తులాల వెండి ఎత్తుకెళ్లిన దొంగలు
- దైవదర్శనానికి వెళ్లొచ్చేసరికి ఇల్లు గుల్ల



నవతెలంగాణ-యాచారం

ఓ ఇంట్లో దొంగతనం జరిగిన సంఘటన యాచారం పోలీస్ స్టేషన్ పరిధిలోని మల్కీజ్ గూడలో శనివారం రాత్రి జరిగింది. సీఐ శంకర్ కుమార్ తెలిపిన విరాల ప్రకారం యాచారం మండల పరిధిలోని మల్కీజ్ గూడ గ్రామానికి చెందిన వరికుప్పల యాదయ్య, భారతమ్మ దంపతులు దైవ దర్శనానికి యాదాద్రికి వెళ్లారు. ఇది గమనించిన దొంగలు శనివారం రాత్రి ఇంట్లో ఎవరూ లేని సమయంలో చోరీకి పాల్పడ్డారు. ఇంట్లో ఉన్న రూ. 30వేల నగదు, తులం బంగారం, 12 తులాల వెండి ఎత్తుకెళ్లారు. ఆదివారం వరికుప్పల యాదయ్య ఇంటి దర్వాజా తెరిచి ఉండడంతో స్థానికులు గమనించి ఆయనకు ఫోన్లో సమాచారం అందించారు. వారు ఇంటికి వచ్చి చూసేసరికి ఉన్న అల్మారా ధ్వంసం చేసి దాదాపు రూ. లక్ష విలువచేసే వస్తువులను గుర్తుతెలియని దొంగలు ఎత్తుకెళ్లారని బాధితుడు యాచారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని సీఐ వెల్లడించారు.

## వీరశైవ లింగాయత్ సమక్షంలో మహిళా దినోత్సవ వేడుకలు



నవతెలంగాణ-గండిపేట్

వీర శైవ లింగాయత్ సమక్షంలో మహిళా దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహి ంచారు. ఆదివారం అంతర్జాతీయ మహిళా దినోత్సవం వేడుకలు లయన్స్ భవన్ పారడైజ్‌లోని మహిళా దినోత్సవ వేడుకలను నార్సింగి కౌన్సిలర్ కోటి గారి ఉషమ్మ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర మహిళా గౌరవ అధ్యక్షురాలు లక్ష్మి సోమశేఖర్, అధ్యక్షురాలు శ్రావణి ముఖ్యంగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వీరశైవ లింగాయత్ అసోసియేషన్ తరపున మహిళలు అన్ని రంగాల్లో రాణించేందుకు కృషి చేయాలని కోరారు. మహిళా హక్కుల కోసం ప్రతి ఒక్కరూ ప్రశ్నించేందుకు కృషి చేయాలన్నారు. ప్రజా సమస్యలను పరిష్కరించడంతో పాటు మహిళల అభివృద్ధి కోసం ముందుకు రావాలన్నారు. కార్యక్రమంలో వీర శైవ లింగాయత్ అసోసియేషన్ మహిళా సభ్యులు మంజుల, గుండ్ల రాధిక జూనియర్ సివిల్ జడ్జి, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

## ఆల్వాల్ ప్రభుత్వ కళాశాల మంచి జీపీఏ సాధించిన వారికి పదివేల నగదు



నవతెలంగాణ-ఆల్వాల్

ప్రభుత్వ బాలికలు అండ్ బాలుర ఉన్నత పాఠశాలలో 10వ తరగతి పరీక్షలు రాయబోతున్న 150 మంది విద్యార్థులకు వాగ్మి కరావు ఫౌండేషన్ వీవీఆర్ (గ్రూప్స్ వారు పరీక్షా ప్యాడ్లు, స్టేషనరీ వస్తువులను పంపిణీ చేశారు. వారికి శుభాకాంక్షలు తెలియజేశారు.(గ్రూప్స్ చైర్మెన్ వెన్నమనేని విష్ణురావు మాట్లా డుతూ10వ పరీక్షల్లో మంచి జీపీఏ సాధించిన వారికి 10,000 నగదు అందిస్తామన్నారు.ఈ కార్యక్రమంలో వీవీఆర్ (గ్రూప్స్ చైర్మెన్ విష్ణు రావు,(గ్రూప్స్ డైరెక్టర్ ప్రమీలారావు, అనిష్ తదితరులు పాల్గొన్నారు

## అందరూ సహకరించాలి

### బీజేపీ ఎంపీ అభ్యర్థి ఈటెల రాజేందర్



నవతెలంగాణ-కీసర

రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీ గెలుపునకు ప్రజలందరూ సహకరించాలని మల్కాజిగిరి పార్లమెంట్ బీజేపీ ఎంపీ అభ్యర్థి ఈటెల రాజేందర్ అన్నారు.ఆదివారం నాగారం పద్మశాలి సంక్షేమ సంఘం ఆత్మీయ సమ్మేళనం కార్యక్రమానికి మల్కాజిగిరి పార్లమెంట్ బీజేపీ ఎంపీ అభ్యర్థి ఈటెల రాజేందర్ , నాగారం మున్సిపల్ చైర్మెన్ కౌకుంట్ల చంద్రారెడ్డి పాల్గొన్నారు.ఈ సం దర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రధానమంత్రి మోడీ దేశం లో మరోమారు హ్యాట్రిక్ సాధిస్తారన్నారు.మల్కాజిగిరి పార్లమెంట్ కు పోటీ చేసే అవకాశం రావ డం చాలా సంతోషం అన్నారు. ప్రజలందరూ దీవించి నన్ను గెలిపించాలని కోరారు.కార్యక్రమంలో కౌన్సిలర్ బిజ్జ శ్రీనివాస్, పద్మశాలి సంఘం అధ్యక్షులు కూరపాటి నాగేశ్వర్ రావు, ఉపాధ్యక్షులు వెంగల మధుసూదన్, అక్కాలా సురేష్, దుడుక రమేష్, మంత్రి వెంకటేష్, మాస్న ఆనంద్,నాయకులు, పాల్గొన్నారు.

## శ్రీ మహాలక్ష్మి దేవాలయం వార్షికోత్సవం



వతెలంగాణ-అల్వాల్

శ్రీ మహాలక్ష్మి దేవాలయం టెంపుల్ ఆల్వాల్ వారి నాలుగో వార్షికో త్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మల్కాజగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి దంపతులు పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మమత రెడ్డి స్థానిక కార్పొరేటర్ శాంతి శ్రీనివాస్‌రెడ్డి ఆలయంలో మహాపూర్ణాహుతి మూల మూర్తు లకు కుంభాభి షేకం అమ్మవారికి వెండి చీరాలంకరణ దర్శనం భక్తులకు గావించారు. తదనంతరం అన్న ప్రసాద వితరణ చేశారు. ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు సూర్యప్రకాశ్‌రెడ్డి సుధాకర్ సుబ్రహ్మణ్యం అర్జున్ రావు రమేష్ మనోజ్ మాతూర్ పెద్ద ఎత్తున భక్తులు పాల్గొన్నారు.

## అంబేద్కర్ యువజన సంఘం అధ్యక్షులుగా రాపోలు ఉపేందర్



నవతెలంగాణ-బోడుప్పల్

బోడుప్పల్ మున్సిపల్ కార్పొరేషన్ అంబేద్కర్ యువజన సంఘం అధ్య క్షులుగా కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు రాపోలు ఉపేందర్ నియ మితులయ్యారు. అది వారం సంఘం కార్యాల యంలో జరిగిన కమిటీ సమావేశంలో ఉపేందర్‌ను కమిటీ అధ్యక్షులుగా, చంటి శ్రీని వాస్ ప్రధానా కార్యదర్శిగా, సీహెచ్. వినయ్‌ను కోశాధి కారిగా ఎన్నుకున్నట్లు తెలి పారు. కమిటీ సలహా దారులుగా చినింగిల కుమార్, దానగళ్ల యాదగిరి,చీరాల జంగయ్య, మీసాల కృష్ణ, రాపోలు రామస్వామి, మీసాల యాదగిరిలను ఎన్నుకున్నట్లు తెలిపారు.

## సాయికుమార్‌ను సన్మానించిన షాద్‌నగర్ నాయకులు



నవతెలంగాణ-కేశంపేట

తెలంగాణ ఫిషరీస్ కో ఆపరేటివ్ సొసైటీ చైర్మన్‌గా మెట్టు సాయికుమార్ ఎన్నికయ్యారు. ఆదివారం షాద్‌నగర్ నియోజకవర్గం నాయకులు ఆయనను మర్యాదపూర్వకంగా కలిసి శాలువా పూలమాలతో సన్మానించారు. పూల బొకేను అందజేసి శుభాభినందనలు తెలిపారు. తెలంగాణ ఫిషరీస్ కో ఆపరేటివ్ సొసైటీ చైర్మెన్‌గా మెట్టు సాయికుమార్‌ను నియమించడం పట్ల తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి, రాష్ట్ర మిత్రులందరికీ ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో షాద్‌నగర్ నియోజకవర్గ నాయకులు గంగనమోని సత్తయ్య తుమ్మల గోపాల్, మంకాల శ్రీశైలం, అంబడి అంజి యాదవ్, బుడ్డ నర్సింహ, బుగ్గ శ్రవణ్, గునుగుర్తి రాజశేఖర్, అంజనాద్రి, విజయ్ తదితరులు పాల్గొన్నారు.

# బోడుప్పల్ వక్ఫ్ భూముల సమస్యకు పరిష్కారం చూపుతాం

- మీట్ దా మీడియా సమావేశంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి



నవతెలంగాణ-బోడుప్పల్

గత కొన్ని సంవత్సరాలుగా బోడుప్పల్ మున్సిపల్ కార్పొరేషన్ పరిదిలో ప్రజలు ఎదుర్కొంటున్న వక్ఫ్ బోర్డు భూమి సమస్యకు త్వరలోనే పరిష్కారం చూపేలా చర్యలు తీసుకుంటామని ముఖ్యమంతి రేవంత్‌రెడ్డి అన్నారు. అదివారం నగరంలోని బషీర్‌బాగ్ ప్రెస్ క్లబ్‌లో రేవంత్ రెడ్డి ముఖ్యమంత్రిగా వంద రోజులు పూర్తి చేసు కున్న సందర్భంగా టీయూడబ్ల్యూజే అధ్వర్యంలో ఏర్పాటు చేసిన మీట్ దా మీడియా సమావేశంలో బోడుప్పల్ వక్ఫ్ బోర్డు భూముల సమస్యపై బోడుప్పల్ వాసి సీనియర్ జర్నలిస్టు రాములు కల్కురి అడిగిన ప్రశ్నకు సమాధానంగా ముఖ్య మంత్రి రేవంత్ రెడ్డి మాట్లాడతూ బోడుప్పల్ వక్ఫ్ బోర్డు సమస్యపై తనకు పూర్తి స్థాయిలో అవగాహన ఉందని ఎన్నికలకు ముందే అ సమస్యపై పలు కాలనీల వాసులు వినతి పత్రాలు కూడా అందించారన్నారు. త్వరలోనే అధికారులతో నివేదికలు తెప్పించుకుని సమస్యకుని పరిష్కారం చూపేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు.

## నాణ్యత ప్రమాణాలు పాటించాలి

● కార్పొరేటర్ రావులశేషగిరి



నవతెలంగాణ-జగద్గిరిగుట్ట

సీసీ రోడ్డు పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటించకుంటే ఉపేక్షించేది లేదని గాజులరామారం డివిజన్ కార్పొరేటర్, గ్రేటర్ స్టాండింగ్ కమిటీ సభ్యులు రావుల శేషగిరి సదరు కాంట్రాక్టర్లను హెచ్చరించారు. ఆదివారం డివిజన్ పరిధి కమలమ్మ నగర్ ప్రాంతంలో వేస్తున్న సీసీ రోడ్డు పనులను స్థానిక బస్తీ వాసులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల్లో ఇచ్చిన హామీలను పార్టీలకు అతీతంగా అందర్నీ కలుపుకుపోతూ పరిష్కరించడం జరుగుతుందన్నారు. పెండింగ్‌లో ఉన్న పనులను దశలవారీగా పూర్తి చేయిస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కమలమ్మ నగర్ కాలనీవాసులు రమణ రెడ్డి, రామ్ ప్రసాద్, రాంబాబు, వాసుదేవరావు, మాణిక్యం, తదితర బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.



వికారాబాద్ జిల్లా జెడ్‌పీ చైర్ పర్సన్ పి.సునీతా మహేందర్ రెడ్డిని, ఆమె నివాసంలో కూకట్‌పల్లి నియోజక వర్గము కాంగ్రెస్ పార్టీ ఎ బ్లాక్ అధ్యక్షులు డాక్టర్ పి.నాగిరెడ్డి, ఆయనతో పాటు బుచ్చిబాబు, అశోక్ ముదిరాజ్ సంతోష్ కుమార్‌లు కలసి, శుభాకాంక్షలు తెలిపారు.
నవతెలంగాణ-కూకట్‌పల్లి

## శ్రీనివాస్ స్ఫూర్తితో కాంగ్రెస్‌లో చేరికలు



నవతెలంగాణ-దుండిగల్

కుత్బుల్లాపూర్ నియోజకవర్గం నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ ఇందిరమ్మ కాలనీ ఫేస్ 1కు చెందిన 200 మంది బీఆర్ఎస్ కార్యకర్తలు కొలన్ శ్రీనివాస్ రెడ్డి నాయకత్వం స్ఫూర్తితో కాంగ్రెస్‌లో చేరారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆయన సేవ గుణం, పేద ప్రజలకు సాహయం చూసి, ఆయన అడుగుజాడల్లో మేము నడవాలనుకొని కొలన్ శ్రీనివాస్ రెడ్డి ఆధ్వర్యంలో కాంగ్రెస్‌లో ఆదివారం ఆయన నివాసంలో కాంగ్రెస్ పార్టీలో చేరాం. వారిని కొలను హనుమంత్ రెడ్డి, కొలను శ్రీనివాస్ రెడ్డిలు వారికి కాంగ్రెస్ పార్టీ జెండా కప్పి, పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో కుత్బుల్లాపూర్ నియోజక వర్గ ఎస్ఎంసీ ప్రెసిడెంట్ కొలన్ రాజశేఖర్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ కొలన్ కృష్ణారెడ్డి, లింగాల గంగాధర్, కొలన్ బాల రెడ్డి, కొలన్ వీరేందర్ రెడ్డి, మధుసూదన్ రెడ్డి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## విల్లాల బాధితుల సమస్యలు విజయలక్ష్మి పరిష్కరించాలి




● భావనా'స్ వెల్ఫేర్ అసోసియేషన్

నవతెలంగాణ-దుండిగల్

విల్లాల బాధితుల సమస్యలు ఎస్ఆర్ఐ విజయలక్ష్మీ పరిష్కరించాలని భావనాస్ వెల్ఫేర్ అసోసియేషన్ వారు అన్నారు. ఒక్కొక్క విల్లా కుటుంబీకులు లక్షల రూపాయలు చెల్లించి, విల్లాలవారికి శ్రీనివాస కన్స్ట్రక్షన్ వారు తెలిపిన వివరాల ప్రకారం... కనీస వసతులు నీరు, పార్కు, స్విమ్మింగ్ పూల్, డ్రయినేజీ, కరెంటు, కల్పించలేక పోయి బాధితులు కొనుగోలు చేసారు. విల్లాల దారులను బెదిరింపులకు, పార్కు స్థలాల స్థలాన్ని ఎవరికి తెలియకుండా మరికొందరికి రిజిస్ట్రేషన్ చేసి, వారి ద్వారా కబ్జా చేసేందుకు పాల్పడ్డారు. రిజిస్ట్రేషన్ పేరిట ఇబ్బందులు పెడుతున్నారు. విజయలక్ష్మి వెంటనే విల్లాల బాధితుల సమస్యలు పరిష్కరించాలని బాధితులు తెలిపారు. విల్లాల బాధితులు మల్లంపేట్ శ్రీనివాస కన్స్ట్రక్షన్‌లో భావనస్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో విల్లాల బాధితులు చేస్తున్న నిరసన దీక్ష ఆదివారం మూడవ రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా విల్లాల బాధితులు మాట్లాడుతూ సదరు శ్రీనివాస కన్స్ట్రక్షన్స్ యాజమాన్యం గుర్రం విజయలక్ష్మి విల్లాల కొనుగోలు దారుల వద్ద కోట్ల రూపాయలు తమ వద్ద వసూలు చేసుకుంది. కనీస వసతులు కల్పించకపోగా ఇప్పటికీ పేరుకు విల్లాల గృహాలు కానీ కరెంటు నీటి వసతులు లేవంటే ఎవరైనా నమ్మగలరా అటువంటి దుస్థితిలో ఈ విల్లాలు కొనుగోలుదారులు ఉన్నామని, మా దగ్గర వసూలు చేసిన డబ్బులు మోసం చేసింది. చాలనక చిన్నపిల్లల పార్కుల స్థలం సైతం వేరొకరికి కట్టబెట్టి వారి ద్వారా బెదిరింపులకు పాల్పడుతుంది. ఇప్పటికైనా శ్రీనివాస కన్స్ట్రక్షన్స్ గుర్రం విజయ లక్ష్మి ఇంకా ప్రజలను మోసం చేయక ముందే ప్రజలకు రావలసిన కనీస వసతులు కల్పించాలని బాధితులు కోరారు. మా సమస్యలు పరిష్కరించేంతవరకు విల్లాల బాధితులందరం సంఘటితంగా పరిష్కారమయ్యే వరకు పోరాడుతామని తెలిపారు.

## కవిత అరెస్ట్ అంతా రాజకీయమే



నవతెలంగాణ-జగద్గిరిగుట్ట

ఢిల్లీ లిక్కర్ స్కామ్‌లో ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత అరెస్టు అంతా జరగబోయే ఎన్నికల రాజకీయ లబ్ది కోసమేనని టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సొంటిరెడ్డి పున్నారెడ్డి విమర్శించారు. ఆదివారం కుత్బుల్లాపూర్ నియోజకవర్గం, గాజులరామారంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రతిసారి ఎన్నికల సమయంలో ప్రజలను మభ్యపెట్టి వారి దృష్టిమరల్చి ఓట్లు దండుకోవడానికే బీఆర్ఎస్, బీజేపీ పార్టీలు కుట్రలు కుతంత్రాలతో కపటనాటకాలు ఆడుతున్నాయని ఆరోపించారు. తెలంగాణ రాష్ట్ర ప్రజలు అన్ని గమనిస్తున్నారని తెలిపారు. బీజేపీ పార్టీకి చిత్తశుద్ధి ఉంటే లిక్కర్ స్కామ్‌లో దోషిగా నిరూపించబడిన కవితను ఎప్పుడో అరెస్టు చేసి జైల్లో పెట్టి వారని ఇదంతా కేవలం ఆయా పార్టీలు ఆడుతున్న రాజకీయ నాటక చదరంగం ఆరోపించారు. రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో ఆయా పార్టీలకు తగిన బుద్ధి చెప్పాలని తెలిపారు. రాష్ట్రంలో ఆరు గ్యారెంటీల తో జన రంజకపాలనతో పాలిస్తున్న కాంగ్రెస్ పార్టీని పార్లమెంట్ ఎన్నికల్లో అత్యధిక సీట్లు వచ్చేలా ఆశీర్వదించాలని రాష్ట్ర ప్రజలను కోరారు. ప్రధానిగా రాహుల్ గాంధీని చేసుకోవడమే తమ లక్ష్యమని స్పష్టం చేశారు.

## పనులను త్వరగా పూర్తి చేయండి



నవతెలంగాణ-కుత్బుల్లాపూర్

కుత్బుల్లాపూర్ నియోజకవర్గం, 132 జీడిమెట్ల డివిజన్ పరిధిలోని గాయత్రి నగర్‌లో నూతనంగా శాంక్షన్ అయినా భూగర్భ డ్రయినేజీ పనులతో ఇబ్బంది పడుతున్నామని కాలనీ వాసులు తెలియజేయడంతో స్థానికులతో కలిసి బీజేపీ మేడ్చల్ అర్బన్ జిల్లా కార్యదర్శి చెరుకుపల్లి భరత్ సింహా రెడ్డి పర్యటించారు. స్థానికులు పడుతున్న ఇబ్బందులను అడిగి తెలుసుకొని సమస్యను వెంటనే పరిష్కరించాలని ఇరిగేషన్, వాటర్ వర్క్స్ సంబంధిత అధికారులను ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో కాలనీ అధ్యక్షులు టి.మహేందర్ సింగ్, సంజీవ్ రెడ్డి, వి.శ్రీరాములు, మహేష్, ఎన్. వెంకట్, సురేష్, చంద్ర శేఖర్, గుండ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

**స్కోలా కిడ్జ్ ఎ డిజిటల్ ప్రి స్కూల్ ప్రారంభోత్సవ కార్యక్రమం...**

కుత్బుల్లాపూర్ నియోజకవర్గం 132 జీడిమెట్ల డివిజన్ పరిధిలో ఫస్ట్ ఎవెన్యూ కాలనీలో నాగదీప్ గౌడ్, చక్రి నూతనంగా ఏర్పాటు చేసిన స్కోలా కిడ్జ్ ఎ డిజిటల్ ప్రి స్కూల్ ప్రారంభోత్సవ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా బీజేపీ మేడ్చల్ అర్బన్ జిల్లా కార్యదర్శి చెరుకుపల్లి భరత్ సింహ రెడ్డి విచ్చేసి, రిబ్బన్ కట్ చేసి స్కాలర్ కిడ్స్ ఎ ప్రి స్కూల్ ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో బాలకృష్ణ గౌడ్, బాసుపల్లి సందీప్ గౌడ్, రాజయ్య, నరసింహ రెడ్డి, నార్లకంటి దుర్గయ్య, నార్లకంటి ప్రతాప్, నల్లనాగుల కృష్ణ, వీరా రెడ్డి, కూన మహేష్ గౌడ్, కుమార్ తదితరులు పాల్గొన్నారు.





కుత్బుల్లాపూర్ నియోజకవర్గం దుండిగల్ మున్సిపాలిటీ పరిధిలో ఆదివారం శ్రీశ్రీశ్రీ పెద్దమ్మ తల్లి వారి జాతర మహోత్సవ కార్యక్రమంలో కుత్బుల్లాపూర్ నియోజకవర్గ బీఆర్ఎస్ నేత కౌన్సిలర్ శంభీపూర్ క్రిష్ణ హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడు తూ జాతర మహోత్సవ కార్యక్రమంలో పాల్గొనటం ఎంతో సంతోషంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు గోపాల్ రెడ్డి, ఆనంద్ కుమార్, పాక్స్ వైస్ చైర్మెన్ నల్తుర్ క్రిష్ణ, సీనియర్ నాయకులు చిన్నంగి వెంకటేష్, జక్కుల శ్రీనివాస్ యాదవ్, ఎక్స్ ఎంపీటీసీ బండారి మహేష్, ఈ.శ్రీనివాస్, ఈదులకంటి యాదయ్య, దొంతి మహేష్, ఉప్పరి క్రిష్ణ, కొరివి నర్సింగ్ రావు, ఆలయ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.
నవతెలంగాణ-దుండిగల్

## మహిళలు ప్రశ్నించినప్పుడే మెరుగైన సమాజం

- వేధింపులు, అఘాయిత్యాలు లేని సమాజాన్ని నిర్మిద్దాం
- నేడు మహిళలు లేని రంగం లేదు
- వక్తలు అజయ్ మిశ్రా, శివకుమార్, ఆర్పీ పట్నాయక్
- 50 మందికి ఉమెన్ ఎంపవర్ మెంట్ అవార్డులు బహుకరణ



నవతెలంగాణ-సిటీబ్యూరో

మహిళలు ప్రశ్నించినప్పుడే మెరుగైన సమాజం ఏర్పడుతుందని పలువురు వక్తలు అభిప్రాయపడ్డారు. సమాజంలో వివిధ రంగాల్లో పని చేస్తూ, తమకంటూ ఒక ప్రత్యేక గుర్తింపుతో ముందుకు నడుస్తూ, ఎంతోమంది నేటి తరం మహిళలకు స్ఫూర్తిగా నిలుస్తున్న తెలంగాణకు చెందిన 50 మంది మహిళలను సేవ్ ద గర్ల్ చైల్డ్, ముందడుగు ఫౌండేషన్ సంయుక్తంగా ఆదివారం హరిత ప్లాజాలో జరిగిన కార్యక్రమంలో ఎంపవర్ ఉమెన్ అవార్డ్సు-2024 పేరుతో సత్కకరించారు. ఈ సందర్భంగా మాజీ అడిషనల్ చీఫ్ సెక్రెటరీ అండ్ రెడ్‌క్రాస్ చైర్మెన్ అజయ్ మిశ్రా, చంచల్‌గూడ జైలు సూపరిండెంటెంట్ శివకుమార్‌గౌడ్, ప్రముఖ సంగీత దర్శకులు ఆర్పీ పట్నాయక్, ముందడుగు ఫౌండేషన్ ఫౌండర్ రాజేంద్ర, సలహాదారులు కళింగకష్ణ, అసిస్టెంట్ ప్రొపెసర్ సుభాషిణి, ముందడుగు డైరెక్టర్ జయరాం మహిళామణులను అవార్డులతో ఘనంగా సత్కరించారు. అనంతరం అజయ్ మిశ్రా మాట్లాడుతూ నేటి సమాజంలో మహిళలు లేని రంగం లేదనీ, అన్ని రంగాల్లో ముందుకెళ్తున్నారని తెలిపారు. గ్రామ స్థాయి నుంచి మహిళల ప్రతిభను గుర్తించి వారిని సత్కరించడం మంచి పరిణామం అన్నారు. మహిళలను ప్రోత్సాహించినప్పుడే సమాజం ఉన్నతంగా ఎదుగుతుందన్నారు. ఎస్పీ శివకుమార్‌గౌడ్ మాట్లాడుతూ ఇప్పటి సమాజంలో ఆడపిల్లను కాపాడుకోవడం ప్రధాన బాధ్యతగా మారిందన్నారు. సమాజంలో, ఇంటా, బయటా ఏటు చూసినా అంతా మంచివాళ్లగానే కనబడుతున్నారు, కానీ ఆడపిల్లలపై ఎప్పుడు, ఎవరు, ఎలా అఘాయిత్యం చేస్తున్నారో, వేధిస్తారో అర్థం కాని పరిస్థితి నెలకొందన్నారు. ఆడపిల్లలకు రక్షణ లేకుండా పోయిందన్నారు. ఆడపిల్ల ఎప్పుడూ భారం కాదనీ, తల్లిదండ్రులకు ఒక ధైర్యం అన్నారు. ఆర్పీ పట్నాయక్ మాట్లాడుతూ ఈ సష్టికి, మహిళకు విడిపోలేని సంబంధం ఉందన్నారు. సష్టి నిర్మాణంలో మహిళదే ప్రముఖమైన పాత్ర అన్నారు. మహిళ ఒక శక్తి అనీ, తను తన కుటుంబం 24 గంటలూ ఆలసట లేకుండా శ్రమిస్తూ ఉంటుందన్నారు. మంచి సమాజ నిర్మాణం మహిళల చేతిలోనే ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో కొమటి రమేశ్ బాబు, బత్తిని రాజేశ్, వరికుప్పల గంగాధర్, కొక్కుల ప్రశాంత్, నూలి గుప్తా, హరి ప్రకాశ్, హరి, లక్ష్మికళ, గీత, తదితరులు పాల్గొన్నారు.

**అవార్డు గ్రహీతలు**

స్వాతి శర్మ, జర్నలిస్టు, దక్కన్ క్రానికల్, రేష్మి చక్రర్తి, జర్నలిస్టు, న్యూ ఇండియన్ ఎక్స్‌ప్రెస్, హేమ, జర్నలిస్టు, ఏబీఎన్, మోనికారెడ్డి, జర్నలిస్టు వీ6, శ్రద్ధా విజయలక్ష్మి, జర్నలిస్టు హిందీ మిలాప్, ఆస్కరి జఫర్, జర్నలిస్టు ద హన్స్ ఇండియా, రేష్మి ఏఆర్, జర్నలిస్టు, దక్కన్ క్రానికల్, శిఖా దుగ్గల్, జర్నలిస్టు, ది పయనీర్, నేహా సోని, జర్నలిస్టు, అన్నపూర్ణ గాడెపల్లి లైఫ్ స్కిల్స్ ట్రైనర్, సత్య శ్రీ గుప్తా, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్, నూలి వనిత గుప్తా డిజైనర్, జ్యోతిర్మయి జంధ్యం, అరుణ్మయి జంధ్యం, అమీనా నిలోఫర్ హుస్సేన్, తమ్మ తేజస్విని, జర్నలిస్టు, 10టీవీ, కిరణ్మయి వరిగొండ, డెబి డెబ్రో మోడల్ యాక్టర్, నేహా అడ్వకేట్, లోరా యాక్టర్, ఆర్తి అడ్కె, నిఖిని వర్మ, ట్రైబల్ అక్టివిస్ట్, కష్ణవేణి కల్చరల్ టీచర్, హిమబిందు ఉడుతనేని ఆర్జే, పద్మతేజ కేక్ మేకర్, భారతీరెడ్డి మహిళా రైతు, హేమ నళిని, ఆర్టిస్ట్, నిర్మల హరిప్రియ దేవదాసీ యోగ ట్రైనర్, స్వాతి బుస్స, సౌజన్య నల్ల ఎంటర్ ప్రూనర్, దీపికాదేవి తుర్రం, రాధిక పులి, పిడమర్తి స్నిగ్ధ, ఇతర రంగాలకు చెందిన అవార్డు గ్రహీతలు ఉన్నారు.

## మేడ్చల్ మున్సిపాలిటీలో బీఆర్ఎస్‌కు షాక్

● కాంగ్రెస్ పార్టీలోకి బీఆర్ఎస్ కౌన్సిలర్ మణికంఠ గౌడ్

నవతెలంగాణ-మేడ్చల్



తెలంగాణ ఉద్యమ నాయకుడు, బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నేత దివంగత మేడ్చల్ మాజీ సర్పంచ్ రామన్నగారి రాజేశ్వర్ గౌడ్ తనయుడు మేడ్చల్ మున్సిపాలిటీ బీఆర్ఎస్ 6వ వార్డు కౌన్సిలర్ రామన్నగారి మణికంఠ గౌడ్ బీఆర్ఎస్‌ను విడి కాంగ్రెస్ పార్టీలో చేరబోతున్నారు. మేడ్చల్ పట్టణంలోని ఇందిరా గాంధీ విగ్రహం వద్ద నిర్వహించే సమావేశంలో నేడు ఉదయం 9.30గంటలకు టీపీసీసీ ఉపాధ్యక్షుడు, మేడ్చల్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి తోటకూర వజ్రేష్ యాదవ్ సమక్షంలో 800మంది కార్యకర్తలతో కాంగ్రెస్‌లో చేరబోతున్నట్లుగా వెల్లడించారు. మేడ్చల్ మున్సిపాలిటీలో గత మున్సిపల్ ఎన్నికలలో అత్యధిక మెజార్టీతో గెలుపొందిన అతి చిన్న వయస్సు ఉన్న కౌన్సిలర్‌గా రికార్డు ఆయన సొంతం చేసుకున్నారు.

## కార్యకర్తల నిర్ణయమే శిరోధార్యం

● కార్పొరేటర్ వెంకటేష్ గౌడ్



నవతెలంగాణ-కూకట్‌పల్లి

ఆల్విన్ కాలని డివిజన్ కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్ గౌడ్ పార్టీ మారేందుకు సిద్ధమై, ఆదివారం కార్పొరేటర్ కార్యాలయం వద్ద, బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, మహిళా నాయకురాళ్లతో సమావేశమై వారి అభిప్రాయాలను తెలుసుకు న్నారు. ఈ క్రమంలో ఎక్కువ మంది కార్యకర్తలు పార్టీ మారుతున్నం దుకు బాధపడుతున్నారని కార్పొరేటర్ తెలుసుకున్నారు. ఇదే బీఆర్ఎస్ పార్టీలో కొన సాగాలని నిర్ణయించుకోవడం జరిగింది. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లా డుతూ అందరం కలిసి ఉండవలసిన కష్ట కాలంలో పార్టీని విడిచి వెళ్లడం మం చి పరిణామం కాదని కేటీఆర్ చెప్పడంతో, మనసు మార్చుకునట్లు తెలిపారు. ఎమ్మెల్యేలు మాధవరం కృష్ణారావు, ఆరేకపూడి గాంధీ, ఎమ్మెల్సీ నవీన్ రావుల ఆదేశాల మేరకు, బీఆర్ఎస్ పార్టీలోనే పని చేసేందుకు నిర్ణయించుకున్నానని అన్నారు. ఎప్పటికి కేసీఆర్, కేటీఆర్‌లతోనే ఉంటూ, వారి బాటలోనే పయనిస్తానని తెలిపారు. అదే విధంగా నా కుటుంబ సభ్యులైన కార్యకర్తలతో మాట్లాడిన తరువాత వారు పార్టీ మారేందుకు సిద్ధంగా లేరని, కాబట్టి వారి నిర్ణయాన్ని గౌరవించి, ఇదే బీఆర్ఎస్ పార్టీలో ఉంటూ ప్రజాసేవ కొనసాగిస్తానని పేర్కొన్నారు. ఎప్పటికి ఆల్విన్ కాలనీ గడ్డ బీఆర్ఎస్ పార్టీ అడ్డానే అని అన్నారు. ఆల్విన్ కాలనీ డివిజన్‌లో దాదాపు తొంభై శాతం అభివృద్ధి పనులు పూర్తయ్యాయి అని, మిగిలిన పనులను రాష్ట్ర ప్రభుత్వంతో పోరాడైనా సరే పూర్తి చేస్తామని అన్నారు. వచ్చే పార్లమెంట్ ఎన్నికలలో అధిష్టానం ఎంపీగా ఎవరికి టికెట్ ఇచ్చినా సరే బీఆర్ఎస్ పార్టీ విజయానికి ఎమ్మెల్యే ఆరేకపూడి గాంధీతో కలిసి పనిచేసి పార్టీ విజయానికి కృషి చేస్తానని అన్నారు. ఇకపై నేను పార్టీ మారుతున్నానని ఎలాంటి పుకార్లు వచ్చిన నమ్మవద్దన్నారు.

## పెండింగ్ పనులు పూర్తి చేయాలి



నవతెలంగాణ-కేపీహెచ్‌బీ

హైదర్ నగర్ డివిజన్‌లో పెండింగ్ పనులను త్వరితగతిన పూర్తి చేసి ప్రజలకు ఇబ్బందులు లేకుండా కృషి చేస్తామని హైదర్ నగర్ డివిజన్ కార్పొరేటర్ నార్నె శ్రీనివాస రావు అన్నారు. ఆదివారం డివిజన్ పరిధిలోని ఆదిత్య నగర్‌లో నెలకొన్న పలు సమస్యలు, వాటి పరిష్కారానికై తీసుకోవాల్సిన చర్యలపై, చేపట్టవలసిన పలు అభివృద్ధి పనులపై కాలనీ వాసులతో కలిసి కార్పొరేటర్ పాదయాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ ఆదిత్య నగర్ కాలనీ వాసులు, ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను, సమస్యలను పరిగణలోకి తీసుకోని, వారి విజ్ఞప్తి మేరకు కాలనీలో పాదయాత్ర చేపట్టడం జరిగిందన్నారు. ప్రజా సమస్యలే పరిష్కార ధ్యేయంగా ముందుకు వెళ్తున్నామన్నారు. కాలనీ వాసులు అందరూ కలిసి కాలనీ అభివృద్ధిలో భాగస్వాములు కావాలని తెలిపారు. కాలనీ వాసులందరి సమిష్టి కృషితో ఆదర్శవంత మైన కాలనీగా తీర్చిదిద్దుతామని పేర్కొన్నారు. ఏ చిన్న సమస్య ఐన తన దృష్టికి తీసుకువస్తే వెంటనే పరిష్కరిస్తానన్నారు. ఈ కార్యక్రమంలో కాలనీ వాసులు వెంకట్ రెడ్డి, గోపాల్ రెడ్డి, గోపి, అశోక్, శ్రీనివాస్, ప్రసాద్, రాజు, విజయ్ భాస్కర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్‌లో పలువురు చేరికలు



నవతెలంగాణ-దుండిగల్

తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేస్తున్న అభివృద్ధి కార్యక్రమాలని చూసి, కాంగ్రెస్ ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ కార్యక్రమాలకి ఆకర్షితులై కాంగ్రెస్ పార్టీలో పలువురి చేరికలు. కుత్బుల్లాపూర్ నియోజకవర్గం నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ కార్పొరేటర్ కొలన్ వీరేందర్ రెడ్డి, మాజీ వైస్ ఎంపీపీ కొలన్ కృష్ణ రెడ్డి, మాజీ ఉప సర్పంచ్ సుధీర్ రెడ్డి, కొలన్ బాల్ రెడ్డి, ఎస్ఎంసీ 18వ డివిజన్ బీఆర్ఎస్ ప్రెసిడెంట్ రాజేందర్, ధనరాజ్, వెంకటరెడ్డి, జిత్తు, సందీప్, ఫిరోజ్ ఆదివారం కుత్బుల్లాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి కొలన్ హన్మంత్ రెడ్డి అధ్వర్యంలో, నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కొలన్ రాజశేఖర్ రెడ్డి అధ్యక్షతన తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, కోఆపరేషన్ హ్యాండ్లూమ్స్ టెక్స్టైల్స్ శాఖ మంత్రివర్యులు తుమ్మల నాగేశ్వర రావు సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా కొలన్ హన్మంత్ రెడ్డి కాంగ్రెస్ పార్టీలో చేరిన వారికి కుత్బుల్లాపూర్ కాంగ్రెస్ పార్టీ తరుపున శుభాకాంక్షలు తెలియజేసారు. కొలన్ హన్మంత్ మాట్లాడుతూ మే 13న జరగబోయే పార్లమెంటరీ ఎలక్షన్స్‌లో మల్కాజిగిరి ఎంపీ అభ్యర్థిని అత్యధిక మెజారి తో గెలిపించే దిశలో ప్రతి ఒక్కరు తమ సాయశక్తులతో పని చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, మహిళా కాంగ్రెస్ నాయకులు, మైనారిటీ కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ భూమి కబ్జా అయ్యేందుకు ముస్తాబు



నవతెలంగాణ-దుండిగల్

కుత్బుల్లాపూర్ నియోజకవర్గం దుండిగల్ మున్సిపాలిటీ బౌరంపేట్ పరిధిలోని సర్వే నెంబర్ 166లో గల మిషన్ భగీరథ సమీపంలో సమీపంలో ఒక ఎకరా ప్రభుత్వ భూమిని కబ్జా చేసేందుకు ఓ వ్యక్తి లారీలతో మొరం మట్టి తెచ్చి చదును చేసి దాని ప్రక్కనే ఉన్న సర్వేనెంబర్191,192 లో గల తన స్వంత స్థలంలో బై నెంబర్ తో కలుపుకునేందుకు రంగ సిద్ధం చేశాడు. విషయం తెలిసిన రెవెన్యూ అధికారులు కాసులకు కక్కుర్తి పడుచు చోద్యం చూస్తూ... మౌనం దాలుస్తున్న వైఖరి పై అధికారుల తీరుపై, స్థానిక ప్రజలు విస్మయం చెందుతున్నారు. ఇప్పటికైనా పైఅధికారులు ప్రజా ప్రయోజనాల దృష్ట్యా చర్యలు చేపట్టి ప్రభుత్వ భూమిని పరిరక్షించాలని ప్రజలు తెలియజేస్తున్నారు.

## గుర్తు తెలియని వ్యక్తి మృతి



నవతెలంగాణ-శామీర్ పేట

గుర్తు తెలియని వ్యక్తిని వాహనం ఢీ కొట్టడంతో అతను అక్కడికక్కడే మృతి చెందిన ఘటన శామీర్ పేట పోలీస్ స్టేషన్ పరిధిలోని కట్టమైసమ్మ వద్ద ఆదివారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... శామీర్ పేట కట్టమైసమ్మ సమీపంలో బ్రిడ్జ్ దాటిన కొద్ది దూరంలో సోని ధాబా దగ్గరలో ఎస్ హెచ్-01 హైదరాబాద్ నుంచి కరీంనగర్ వైపు వెళ్లే దారిలో ఆదివారం తెల్లవారుజామున ఉదయం అందాజ సమయం 4 గంటల ప్రాంతంలో గుర్తు తెలియని వ్యక్తిని వాహనం ఢీ కొట్టడంతో అట్టి వ్యక్తి గాయాలతో అక్కడికక్కడే మృతి చెందారు. మృతు దేహాన్ని శామీర్ పేట్ పోలీసు శవ పరీక్ష నిమిత్తం నగరంలోని గాంధీ హాస్పిటల్ తరలించారు. వ్యక్తి వివరాలు ఎవరికైనా తెలిసినచో సంప్రదించల్సిన మొబైల్ నెం: 9490617142, 9490617231లకు సమాచారం అందించాలని ఎస్ హెచ్ఓ శ్రీనాథ్ తెలిపారు.

## వజ్రేష్ యాదవ్‌ను కలిసిన గడ్డం రమేష్



నవతెలంగాణ-శామీర్ పేట

మండలంలోని పొన్నాల గ్రామ మాజీ ఉపసర్పంచ్, కాంగ్రెస్ మండల వర్కింగ్ ప్రెసిడెంట్ గడ్డం రమేష్ ఆదివారం మేడ్చల్ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి తోటకూర వజ్రేష్ యాదవ్‌ను కలిశారు. ఈ సందర్భంగా గ్రామంలోని 120మంది నిరుపేద రైతులు గత 50 సంవత్సరాల నుంచి చిన్న కంచ భూమిలో సాగు చేసుకొని జీవిస్తున్నారని వారి గురించి ప్రభుత్వంతో మాట్లాడి పట్టాలు ఇప్పించాలని వజ్రేష్ యాదవ్‌ను కలిశానని రమేష్ తెలిపారు. సానుకూలంగా స్పందించిన వజ్రేష్ యాదవ్ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో మాట్లాడి పట్టాలు చేపిస్తానని హామీ ఇచ్చారని పేర్కొన్నారు. అలాగే గ్రామంలోని సంగమేశ్వర టెంపుల్‌కి దాని ప్రక్కనే ఉన్న కాలనీకి మిషన్ భగీరథ వాటర్ పైప్ లైన్ ఏర్పాటుకు రూ. 10లక్షల మంజూరు చేయడానికి చొరవ తీసుకున్నందుకు తోటకూర వజ్రేష్ యాదవ్‌కు పొన్నాల గ్రామ ప్రజల తరపున మాజీ ఉప సర్పంచ్ రమేష్ ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ సత్యనారాయణ గౌడ్, మండల కాంగ్రెస్ అధ్యక్షులు నర్సింలు యాదవ్, పొన్నాల గ్రామ అధ్యక్షులు నిరంజన్, నాగేశ్వర్, రమేష్, సత్తయ్య, బాల్ రాజ్, సంజీవ తదితరులు పాల్గొన్నారు.

## కుంటలో పడ్డ బాలుడు మృతి



నవతెలంగాణ-బంజారాహిల్స్

గొర్రెలు మేపటానికి వచ్చిన కాపరులు హకీంపేట్ కుంటలో ఒక వ్యక్తి మృతి చెందిన ఘటన ఫిల్మ్ నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. బీజే ఆర్ నగర్‌కు చెందిన జి.శ్రీనివాస్-స్వప్నల కొడుకు జి.పవన్ గొర్రెలు మేపటానికి హకీంపేట్ కుంట వద్దకు వచ్చి ప్రమాదవశాత్తు కుంటలో పడిపోయాడు. అతనిని కాపాడటానికి అతని స్నేహితులు ప్రయత్నించిన ఫలితం లేకపోయింది. పోలీస్ యంత్రాంగం పవన్ కోసం కుంటలో గాలిస్తున్నట్లు తెలిపారు.

## బెల్లయ్య నాయక్‌కు శుభాకాంక్షలు తెలిపిన ఓయూ విద్యార్థులు

నవతెలంగాణ-ఓయూ



తెలంగాణ గిరిజన కార్పొరేషన్ ఫైనాన్స్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మెన్‌గా నూతనంగా నియమితులైన తేజావత్ బెల్లయ్య నాయక్‌కి ఎల్ఎస్ఓ రాష్ట్ర అధ్య క్షుడు అశోక్ నాయక్ ఆధ్వర్యంలో ఓయూ విద్యార్థులు ఆదివారం ఆయన నివాసంలో సత్కరించి, హృదయ పూర్వక శుభా కాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమం లో ఉస్మానియా యూనివర్సిటీ విద్యార్థి నాయకులు విజయేందర్, వెంకటేష్ పవర్, శ్రవణ్, వెంకటేష్, చందు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# గెలుపే లక్ష్యంగా ముందుకు సాగాలి



### మల్లారెడ్డి నివాసంలో బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు..ఎమ్మెల్సీల సమావేశం

నవతెలంగాణ-కంటోన్మెంట్

మల్కాజగిరి పార్లమెంటు పరిధిలోని బీఆర్ఎస్ ఎమ్మెల్సీ, ఎమ్మెల్యేలతో మాజీ మంత్రి, మేడ్చల్ జిల్లా ఎమ్మెల్యే సీహెచ్ మల్లారెడ్డి ఆదివారం ఆయన నివాసంలో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు, ఎల్బీనగర్ ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి, ఉప్పల్ ఎమ్మెల్యేల లక్ష్మారెడ్డి, మల్కాజగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి, కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే వివేకానంద గౌడ్‌లు హాజరయ్యారు.అదే విధంగా ఎమ్మెల్సీలు శంభుపూర్‌రాజు, నవీన్ రావు దయానంద్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మల్లారెడ్డి మాట్లాడుతూ బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థిని భారీ మెజార్టీతో గెలిపించాలని గెలుపు కోసం చేయాల్సిన అంశాలను కూడా మల్లారెడ్డి ఎమ్మెల్యేలకు, ఎమ్మెల్సీలకు వివరించారు.ఈ సంద ర్భంగా పార్టీ అభ్యర్థి మాట్లాడుతూ కేసీఆర్ తనమీద నమ్మకం ఉంచి గెలుపొందుతానని నమ్మకంతో తనకు అవకాశం కల్పించారని తెలిపారు. నియోజకవర్గ ప్రజలు కార్యకర్తలు తనను గెలిపించాలని కోరారు. అందరూ కలిసి కట్టుగా పనిచేసి, గెలుపే లక్ష్యంగా ముందుకు సాగాలని సూచించారు. 10యేండ్ల బీఆర్ఎస్ పాలనలో తెలంగాణ రాష్ట్రం ఎంతో అభివృద్ధి చెందిందని, హైదరాబాద్‌లో ఐటి అభివృద్ధిని గణనీయంగా చేసిన ఘనత కేటీఆర్‌కు చెందుతుందన్నారు. అదే విధంగా హరీశ్ రావు ప్రజలతో మమేకమయ్యే బస్తీ దవాఖానాలు ఏర్పాటు చేసి పేదలకు వైద్యం అందించారన్నారు. రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో ప్రజలు కచ్చితంగా తనను ఆశీర్వదిస్తారని నమ్మకం ఉందని ఆశాభావం వ్యక్తం చేశారు లక్ష్మారెడ్డి.

# అనుమతులున్నా ఇబ్బందులకు గురిచేస్తున్న అధికారులు

### వేమిరెడ్డి ఎన్ క్లేవ్ సొసైటీ అధ్యక్షులు వేమిరెడ్డి నరసింహారెడ్డి, ఉపాధ్యక్షుడు ఎంఎల్ అగర్వాల్



నవతెలంగాణ-బంజారాహిల్స్

అన్ని అనుమతులు ఉన్నా జీహెచ్ఎంసీ అధికారులు తమ కాలనీ వాసులను తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తున్నారని బంజారాహిల్స్‌రోడ్ నెంబర్ 12లోని వేమిరెడ్డి ఎన్ క్లేవ్ సొసైటీ అధ్యక్షులు వేమిరెడ్డి నరసింహారెడ్డి, ఉపాధ్యక్షుడు ఎంఎల్ అగర్వాల్ ఆరోపించారు. బంజారారోడ్ నెంబర్ 12వేమిరెడ్డి ఎన్‌క్లేవ్‌లో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాటాడుతూ సుప్రీంకోర్టు తీర్పుకు అనుగుణంగా జీహెచ్ఎంసీ అనుమతులతోనే తాము కాలనీలో నిర్మాణాలు చేపడు తున్నామని, అయితే గత మూడు రోజులుగా తెలియని వ్యక్తుల ప్రమేయంతో నిర్మాణాలను నిలిపివేయడానికి జీహెచ్ఎంసీ అధికారులు తరచూ ఇక్కడికి వస్తే ఇబ్బందులకు గురి చేస్తున్నారని, ఇదెక్కడి న్యాయమని ప్రశ్నించారు. బంజారాహిల్స్‌రోడ్ నెంబర్ 12లోని వేమిరెడ్డి ఎన్‌క్లేవ్‌లో ఉన్న స్థలం సర్వేనంబర్ 129/68(పైకి) అని సుప్రీం కోర్టు 2017లో తమకు అను గుణంగా తీర్పునిచ్చిందని, అంతకముందే హైకోర్టు, సిటీ సివిల్ కోర్టు, ల్యాండ్ గ్రాబింగ్ కోర్టు కూడా ఇదే తరహా తీర్పులు ఇచ్చిందన్నారు. సుప్రీం తీర్పుతో హైకోర్టు ఇళ్ల నిర్మాణాన్ని జీహెచ్ఎంసి అనుమతి ఇవ్వాలంటూ జీహెచ్ఎంసి అనుమతులు పొంది 41 మంది సేల్ డీడ్లతో నిర్మాణాలు చేపట్టామన్నారు. ఎక్కడ నిబంధనలకు విరుద్ధంగా, కోర్టు తీర్పులకు విరుద్ధంగా తాము నిర్మాణాలు చేపట్టలేదన్నారు. సుకుమార్‌రెడ్డి అనే వ్యక్తి రెవెన్యూ, జీహెచ్ఎంసీ ఉన్నతాధికారులను తప్పుదోవ పట్టిస్తూ తప్పుడు ఫిర్యాదులు చేస్తున్నారని అతనిపై చట్టరీత్యా చర్యలు తీసుకొనేలా తాము ఫిర్యాదు చేయనున్నట్లు తెలిపారు. అనుమతులు ఇచ్చిన తర్వాత జీహెచ్ఎంసీ నిబంధనలు ఉల్లంఘించి నిర్మాణాలు చేపడితే జోక్యం చేసుకోవాలని లేదంటే ఆ స్థలంలోకి అడుగు పెట్టవద్దని హైకోర్టు నాట్ టు ఇంటర్ఫేర్ ఆర్డర్ జీహెచ్ఎంసికి ఇచ్చిందన్నారు. అయితే సుకుమార్ రెడ్డి మాటలు విని, కోర్టు ఉత్తర్వులను బేఖాతరు చేస్తూ జీహెచ్ఎంసీ అధికారులు అన్ని అనుమతులున్న తర్వాత నిర్మాణాలు నిలిపివేయాలంటూ ఎలా చెబుతారని ప్రశ్నించారు. ఈ స్థలం ప్రభుత్వానిదని కోర్టుకు వెళ్ళగా సర్వే నంబరు 129/68(పైకి) ప్రభుత్వానిది కాదని సుప్రీంకోర్టు కూడా తీర్పునిచ్చిందన్నారు. ఇలాంటి సమయంలో కోర్టు తీర్పులను ధిక్కరిస్తూ రెవెన్యూ అధికారులు ఎలా జోక్యం చేసుకుంటారని నిలదీశారు. వేమిరెడ్డి ఎన్‌క్లేవ్ ఉన్న స్థలం 129/51, 129/52 కాదని, ఇది 129/68(పైకి) అని అన్ని కోర్టులు తీర్పు ఇచ్చాయన్నారు. ఇందులో జోక్యం చేసుకో వడానికి రెవెన్యూ, జీహెచ్ఎంసీకి ఎలాంటి అధికారం లేదన్నారు. తమ నిబంధన గురి చేస్తే కోర్టు ధిక్కరణ కింద కేసు నమోదు చేస్తామని అన్నారు. సుకుమార్‌రెడ్డిపై చట్టరిత్య చర్యలు తీసుకోవాలంటూ పోలీసులకు ఫిర్యాదు చేస్తామని స్పష్టం చేశారు. ఈ విషయంలో కాలనీవాసులము జీహెచ్ఎంసీ కమిషనర్ రోనాల్డ్‌రాస్, ఆర్డీఓను కలిసి సుప్రీంకోర్టుల తీర్పు కాపీలను, జీహెచ్ఎంసీ నుంచి పొందిన అనుమతులను, కోర్టు ప్రతులను అందిస్తామన్నారు.

## 19న యునైటెడ్ స్టేట్స్ ఆఫ్ అమెరికా కెనడా అడ్మిషన్‌డే




### యూని ఎక్స్ పర్ట్స్ ఓవర్సీస్ ఎడ్యుకేషన్

నవతెలంగాణ-బంజారాహిల్స్

హైదరాబాద్ బీయుఎస్ఏ, కెనడా దేశాలలో ఉన్నత విద్యను అభ్యసించాలనుకునే విద్యార్థిని విద్యార్థుల కోసం యూని ఎక్స్ పర్ట్స్ ఓవర్సీస్ ఎడ్యుకేషన్ సంస్థ ఆధ్వర్యంలో ఈ నెల 19న సోమాజిగూడ లోని సంస్థ కార్యాలయంలో యుఎస్ఏ అడ్మిషన్ డేను నిర్వహిస్తున్నట్లు సంస్థ ఆపరేషన్‌హెడ్ ఉమా తెలిపారు. ఈ మేరకు ఆదివారం సోమాజిగూడ లోని సంస్థ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ యుఎస్ ఏ, కెనడా, చదువుకోవాలనుకునే విద్యార్థులకు ఇది ఒక సువర్ణ అవకాశమన్నారు. ఈ ఎడ్యుకేషన్ ఫెయిర్ లో పాల్గొనే విద్యార్థులు, తల్లిదండ్రులు వీసా రిక్రూట్మెంట్స్, అడ్మిషన్ రిక్రూ ట్మెంట్స్, స్కాలర్షిప్ ఆప్షన్స్, లాంగర్ స్టే బ్యాక్ ఆప్షన్స్, ట్రావెల్ అప్డేట్స్ ప్రవేశానికి హామీ తదితర అంశాలపై నేరుగా యూని వర్సిటీ ప్రతినిధులతో చర్చించి తమ సందేహాలను నివృత్తి చేసుకోవచ్చని తెలిపారు. మరిన్ని వివరాల కోసం 9912328645 నెంబర్ ను సంప్రదించవలసిందిగా కోరారు.

## కార్పొరేషన్ల ఏర్పాటుతో పాటు నిధులు మంజూరు చేయండి



జి.చెన్నయ్య.

నవతెలంగాణ-బంజారాహిల్స్

తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం వివిధ కులాల పేరుతో కార్పొరేషన్లు ఏర్పాటు చేయడాన్ని మాలమహానాడు స్వాగతిస్తు అభినందించారు. ముఖ్యంగా మాలల కోసం మాల కార్పొరేషన్ ఏర్పాటు చేస్తున్నందున మాల మహానాడు జాతీయ అధ్యక్షుడు జి చెన్నయ్య ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలియజేశారు.ఈ కార్పొరేషన్ల వల్ల బీసీల్లోని వివిధ కులాలు ఎస్సీల్లోని వివిధ కులాలు అభివృద్ధి చెందడానికి ఆస్కారం ఉంటుందనీ బీసీల్లోని కులాలకు ఎస్సీ లోని కులాలకు కార్పొరేషన్లు గత ప్రభుత్వం ఏర్పాటు చేయకపోవడం వలన చాలా నష్టపోయామనీ చెన్నయ్య తెలిపారు.ఎస్సీ ఎస్టీ సబ్ ప్లాన్ నిధులు గత ప్రభుత్వాలు దారి మళ్ళించడం వలన తీవ్ర నష్టం జరిగిందనీ ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం సబ్ ప్లాన్ నిధులు సక్రమంగా వినియోగించాలని కోరుతూ ఇప్పుడు ఏర్పాటు చేస్తున్న కార్పొరేషన్లకు సరైన నిధులు కేటాయించి అన్ని కులాల సమగ్ర అభివృద్ధికి తోడ్పడాలని ప్రభుత్వాన్ని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో మాల సంఘాల జేఏసీ వర్కింగ్ చైర్మన్లు గోపోజు రమేష్ ,బూర్గుల వెంకటేశ్వర్లు మాల మహానాడు తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు మన్నె శ్రీధర్ రావు,గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్షుడు బైండ్ల శ్రీనివాస్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బంగి ఆనందరావు,సిటీ వైస్ ప్రెసిడెంట్ గోకుల కళ్యాణ్,ఎల్ల స్వామి,జట్టిగిరి కమల్ కుమార్,శ్రీకాంత్,రాకేష్, ఓబులేష్ తదితరులు పాల్గొన్నారు.

## బోరబండలో రంజాన్ సందర్భంగా 6వ రోజు 'షహీర్ '



### ముఖ్య అతిథులుగా పాల్గొన్న జూబ్లీహిల్స్ కంటెస్టెడ్ ఎమ్మెల్యేలు అజారుద్దీన్, నవీన్‌యాదవ్

నవ తెలంగాణ - జూబ్లీహిల్స్

జూబ్లీహిల్స్ నియోజకవర్గం, బోరబండలో రంజాన్ మాసం సందర్భంగా ఆరవ రోజున మాజీ డిప్యూటీ మేయర్ ప్రస్తుత కార్పొరేటర్ బాబాఫసివుద్దీన్ ఆధ్వర్యంలో ఆదివారం తెల్లవారుజామున షహేర్ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ వర్కింగ్ ప్రెసిడెంట్, జూబ్లీహిల్స్ నియోజకవర్గం కాంగ్రెస్ కంటెస్టెడ్ ఎమ్మెల్యే అభ్యర్థి మమ్మద్ అజారుద్దీన్, జూబ్లీహిల్స్ కాంగ్రెస్ యువనేత 2018లో జూబ్లీహిల్స్ కంటెస్టెడ్ ఎమ్మెల్యే నవీన్ యాదవ్, ముఖ్య అతిథులుగా పాల్గొని కార్పొరేటర్ బాబాను అభినందించారు. అనం తరం ఆదివారం సెహర్ కార్యక్రమంలో ఉపవాస దీక్షలో ఉన్నవారికి భోజ నం ఏర్పాటు, వారికి ఆహార పదార్థాలను అందజేశారు. మహమ్మద్ అజారుద్దీన్ మాట్లాడుతూ బోరబండ డివిజన్‌లో కులమతాలకు అతీతంగా హిందూ, ముస్లిం బాయీ బాయీ అని తెలు పుతూ, గత కొన్ని సంవత్సరాలుగా రంజాన్ మాసంలో ఇటువంటి సేవా కార్యక్రమాన్ని చేపట్టిన బాబా ఫసియుద్దీన్‌ను అభినందిస్తూ, బాబాకు హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో బోరబండ డివిజం జూబ్లీహిల్స్ నియోజకవర్గం కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

## సీపీఐ(ఎం) నాయకుడి వివాహావార్షికోత్సవం

### ముఖ్యఅతిథిగా పాల్గొన్న జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్



నవతెలంగాణ-జూబ్లీహిల్స్

జూబ్లీహిల్స్ నియోజకవర్గం సీపీఐ(ఎం) సీనియర్ నాయకుడు చెన్నుపాటి చంద్రశేఖర్, సతీమణి విజయవాణి 50వ వివాహ వార్షికోత్సవాన్ని వెంగళరావునగర్ డివిజన్ మధుర నగర్ కమ్యూనిటీ హాల్లో ఘనంగా జరుపుకున్నారు. ఈ కార్య క్రమానికి జూబ్లీహిల్ల్ శాసనసభ్యులు, హైదరాబాద్ జిల్లా అధ్యక్షులు మాగంటి గోపీనాథ్ ముఖ్య అతిథిగా పాల్గొని దంపతు లను అభినందించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ(ఎం) నాయకులు, సీఐటీయూ నాయకులు, ప్రొఫెసర్ నాగేశ్వరరావు, స్టేట్ సెక్రటేరియట్ మెంబర్లు వీరయ్య, సుదర్శన్ రావు, జ్యోతి, డీజీ నర్సింగరావు ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. అనంతరం 'ఆశయపథంలో నేను' అనే పుస్తకాన్ని ఆవిష్కరించారు.

## ఆర్ట్స్ కళాశాల లింగ్విస్టిక్ ప్రొఫెసర్స్‌కు 20 లక్షల ఐసీఎస్ఎస్ఆర్ ప్రాజెక్టు

నవతెలంగాణ-ఓయూ

ఉస్మానియా విశ్వవిద్యాలయం, ఆర్ట్స్ కళాశాల లింగ్విస్టిక్ (బాషాశాస్త్ర ), ప్రొఫెసర్స్‌కు ప్రతిష్టాత్మకంగా రూ.20 లక్షల ఐసీఎస్ఎస్ఆర్ ప్రాజెక్టు మంజూరైనట్లు తెలిపారు. ఈ ప్రాజెక్టుకు కో ఆర్డినెటర్‌గా డా.కొర్ర.బాలు నాయక్, కో కోఆర్డినేటర్‌గా డా.కల్లోజి.సుశీల్ కుమార్ వ్యవహరించనున్నట్లు తెలిపారు. డా.బాలు, డా.సుశీల్ కుమార్‌లు "ఎతనోలింగిస్టిక్స్ పొట్రియల్: ఎ కంపారేటివ్ స్టడీ ఆఫ్ సవర, గొండి ట్రైబల్ పెయింటింగ్స్, కల్చరల్ రిప్రజెంటేషన్ " అనే అంశంపై పరిశోధన చేసి దాని సమగ్ర నివేదికను ఐసీఎస్-ఎస్ఆర్‌కు సమర్పించనున్నట్లు తెలిపారు.ఓయూ ఆర్ట్స్ కళాశాల సోషల్ సైన్సెస్‌లో ఇటువంటి ప్రతిష్టాత్మకమైన ఐసీఎస్ఎస్ఆర్ ప్రాజెక్టు కింద 20 లక్షల నిధులు మంజూరు కావడం ఇదే మెదటి సారి కావడం విశేషం. దీనితో పలువురు ప్రొపెసర్స్, విద్యార్థులు,ఉద్యోగులు డా.బాలు నాయక్, డా.సుశీల్ కుమార్‌లను అభినందించారు. త్వరలోనే ఈ అంశంపై తమ పరిశోధన జరపనునట్లు వారు చెప్పారు.

## కార్పొరేషన్ చైర్మన్ పదవుల్లో మాలలకు, మాల ఉపకులాలకు తీవ్ర అన్యాయం : అంసా

నవతెలంగాణ-ఓయూ



కార్పొరేషన్ పదవుల్లో మాల సామాజిక వర్గానికి తీవ్రమైన అన్యాయం జరిగిందని, ఈ ప్రభుత్వం సామాజిక న్యాయనికి తుట్లు పొడిచినట్టు ఉస్మాని యాయూనివర్సిటీ అల్ మాల స్టూడెంట్ అసోసి యేషన్ (ఏఎం ఎస్ ఏ) అధ్యక్షులు నామ సైదులు అన్నారు. ఈ ప్రజా ప్ర భుత్వంలో నిన్న ప్రకటించిన కార్పొరేషన్ చైర్మన్ పదవుల్లో మాల కులానికి ఒక్క చైర్మెన్ పదవి కూడా ఇవ్వకుండా కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం వ్యవహరిస్తుందని ఆయన తెలిపారు. సీఎం స్థాయిలో ఉన్న వ్యక్తి రేవంత్‌రెడ్డి వాళ్ల కులాలకు అధిక సంఖ్యలో కార్పొరేషన్ చైర్మెన్ కేటాయించారని గుర్తు చేశారు. అదే ఉప ముఖ్యమంత్రి స్థా యిలో ఉన్న బట్టి విక్రమార్క కనీసం ఒక్కటి కార్పొరేషన్ పదవి కల్పించకపో వడం యావత్ మాల జాతి మీద జరిగిన దాడిగా మేము పరిగణిస్తున్నట్లు ఆవేదన వ్యక్తం చేశారు.గత ప్రభుత్వంలో మాలలకు కొన్ని కార్పొరేషన్ చైర్మెన్ పదవులు ఇవ్వడం జరిగిందని, మాలలను పూర్తిగా విస్మరించారన్నారు. ఇప్పటికైన ప్రజాప్రతినిధులు స్పందించి మాలలకు న్యా యం చేయాలని కోరుతున్నామన్నారు. లేకపోతే రేపు జరగబోయే పార్లమెంట్ ఎన్నికల్లో మాలలు కాంగ్రెస్ పార్టీకి తగిన బుద్ధి చెప్పుతామని హెచ్చరించారు.

## నాకు బాధలేదు : దయాకర్



నవతెలంగాణ-ఓయూ

37మంది కార్పొరేషన్ చైర్మెన్ల లిస్టులో తన పేరు లేదని తనకు ఎలాంటి బాధ లేదని. కాంగ్రెస్ అధిష్ఠానంపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిపై పూర్తి నమ్మకం ఉందని టీపీసీసీ అధికార ప్రతినిధి చేనాగని దయాకర్ అన్నారు. పేరు లేనందున నాకు ఎలాంటి ఇబ్బందిగాని బాధకాని లేదని పార్టీ కోసం కష్టకాలంలో పోరాటం చేసి వారందరికి పార్టీ తప్పకుండా న్యాయం చేస్తుందని ధీమా వ్యక్తం చేశారు. ఈ పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ గెలుపు కష్టపడి పనిచేస్తాం అని ధీమా వ్యక్తం చేశారు.

## పైనుంచి ఉడి పడ్డ ఇటుకి.. విద్యార్థికి స్వల్ప గాయాలు

### మరమ్మతులు చేపట్టి 4 ఏండ్లు కాక ముందే ఇలా..



నవతెలంగాణ-ఓయూ

రేకుల సీలింగ్ నుండి ఊడిన ఇటుక పెళ్ళ సీలింగ్ పగిలి బెడ్ పై కూర్చోని ఉన్న ఆర్కియాలజీ విద్యార్థి రాజశేఖర్‌పై పడి కాలికి గాయమయిన ఘటన కావేరి వసతి గృహంలో (సీ) హాస్టల్ లో రూమ్ నెంబర్ 39లో ఆదివారం రాత్రి చోటు చేసు కుంది. ఇంతకు మునుపు కూడ ఇలాగే ఇదే హాస్టల్‌లో ఇలాగే ఉడి పడన ఘటనలు రెండు సార్లు జరిగినప్పటికీ అధికారులు పట్టించుకోలేదని విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇటీవలే 3 సంవత్సరాల కిందటే ఈ వసతి గృహన్ని రూఫ్ ఇతర మరమ్మతులు చేపట్టిన సంవత్సరాలు గడవక ముందే ఇలా పెచ్చులు ఇటుకలు ఉడి పడటంతో విద్యార్థులు కొంత భయభ్రాంతులకు గురౌతున్నారన్నారు. ఆదివారం రాత్రి జరిగిన ఈ ఘటనలో విద్యార్థి బెడ్‌పై నిద్రించి ఉంటే తలకు గాయాలు ఐయ్యేవి అని విద్యార్థులు అభిప్రాయాన్ని వ్యక్తం చేస్తున్నారు. విద్యార్థి అదృష్ట వశత్తు కూర్చొని ఉండటంతో స్వల్పంగా కాలికి గాయలయినట్లు తెలిపారు.

## 'మర్హం రెసొనేటింగ్ రెసిలెన్స్' ఆధ్వర్యంలో 'ఆటిజంపై ఆరా' సదస్సు




నవతెలంగాణ-బంజారాహిల్స్

ఆటిజం స్పెక్ట్రమ్ డిజార్డర్ (ఎఎస్‌డీ) ఉన్న వ్యక్తుల కోసం సేవలందించడానికి విశేషంగా కృషి చేస్తున్న ప్రముఖ స్వచ్ఛంద సంస్థ 'మర్హామ్-రెసొనేటింగ్ రెసిలెన్స్' ఆధ్వర్యంలో నగరం వేదికగా ప్రత్యేక కార్యక్రమం "ఆటిజం ఆరా"ను నిర్వహించింది. సామాజికంగా అందరినీ కలుపుకుపోవడానికి విజ్ఞానం, సాంస్కృతిక ప్రదర్శనలతో రూపొందించబడిన ప్రత్యేక కార్యక్రమం 'ఆటిజం ఆరా ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న 2-రోజుల జాతీయ సమావేశం "ఆటిజం ఒడిస్సీ" లో భాగంగా ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ప్రముఖ నటి-నిర్మాత లక్ష్మి మంచు, సంగీత దర్శకుడు-స్వరకర్త-గాయకుడు ఆర్పీపట్నాయక్ ముఖ్య అతిథులుగా హాజరై వారి భావాలను వ్యక్తపరిచారు. డాక్టర్ నబత్ లఖానీ మాట్లాడుతూ ఆటిజం స్పెక్ట్రమ్ డిజార్డర్‌తో బాధపడుతున్న వ్యక్తులకు అవగాహనతో పాటు అంగీ కారం-చేరికను పెంపొందించడంలో ఆటిజం ఆరా కీలక పురోగతిని సూచిస్తుందని అన్నారు.

ఈ ఉదాత్తమైన ప్రయ త్నంలో ప్రోత్సాహ మందించడానికి చేతులు కలపవలసింది గా వాటా దారులు, మద్దతుదారులను మర్హం ఆహ్వానిస్తుం దని తెలిపారు. ఈ సమావేశంలో కామిని సరాఫ్, మంజు కళానిధి, అర్చన సురేష్, తెలంగాణ సోషల్ ఇంపాక్ట్ గ్రూప్ డైరెక్టర్ (టీఎస్ఐజీ), తెలంగాణ ప్రభుత్వ సీఎస్ఆర్ విభాగం తరుణ్ తదితరులు ఉన్నారు.





సోమాజిగూడ పార్క్‌హెూ టల్‌లో విదేశీ విద్య ఉద్యోగ సదుపాయ అవగాహన సద స్సును కాలేజ్ దునియా సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించారు. విద్యా ర్థులు పాల్గొనీ వారి సమస్యలను సంస్థ సీఈవో రోహిత్ చాహల్ వర్చు వల్‌గా పాల్గొని మాట్లాడారు. బిజినెస్ రీమత్ సోనీ, కోర్‌టీం సిద్ధార్థ నాయర్, అబుజార్ జమల్,దేహన్ను, అంకుష్ కుమార్ గీతాశెట్టి,అలీ ముహులివల, విధు గోహయల్‌లు పాల్గొన్నారు. ఈ సమావేశంలో ప్రధాన యూనివర్సిటీలు యూఎస్ఏ, యూకే,ఆస్ట్రేలియా, జర్మనీ,కెనడా, వంటి దేశాల్లో వెళ్లాలనుకున్న విద్యార్థులు వారి సమస్యలను నివృత్తి చేసుకున్నట్లు తెలిపారు. సుమారుగా 2 వేల మంది విద్యార్థులు పాల్గొన్నట్లు తెలియజేశారు.

నవతెలంగాణ-బంజారాహిల్

# చేనేతను ప్రతి ఒక్కరు ఆదరించాలి



నవతెలంగాణ-బంజారా హిల్స్

గ్రామీణ హస్తకళా వికాస్ సమితి నేతృత్వంలో ఏర్పాటు చేసిన చేనేత ప్రదర్శనను ప్రతి ఒక్కరు ఆదరించాలనీ ప్రియాంక రామణ్ అన్నారు. ఆదివారం బంజారాహిల్స్ రోడ్ నెంబర్ 12 లో ని కళింగ కల్చరల్ హాలులో ఏర్పాటైన జాతీయ పట్టు వస్త్ర ప్రదర్శన టాలీవుడ్ నటి ప్రియాంక రామణ్ ప్రా రంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ భారతీయ సంస్కృతిలో సిల్క్, హ్యాండ్ లూమ్ వస్త్రో ఉత్పత్తులకు ఎంతో ప్రత్యేకత ఉందనీ, నేటికి వాటిపై వన్నె తగ్గలెదన్నారు. నేటి తరం యువతలో కూడా హ్యాండ్ లూమ్ ఉత్పత్తులను ఎంతో ఆదరిస్తున్నారన్నారు. చేనేత కారులు ఎంతో శ్రమతో రూపొందించే హ్యాండ్ లూమ్ వస్త్ర ఉత్పత్తులను అందరూ మరింత ఆదరించినప్పుడే వారి కష్టానికి తగ్గా ఫలితం దక్కుతుందన్నారు. ప్రదర్శన మేనేజర్ తిరుపతి సతీష్ మాట్లాడుతూ ఈ నెల 24వ తేదీ వరకు కొనసాగుతున్న ప్రదర్శనలో దేశం లోని 14 నగరాల నుండి చేనేత కారులు , చేతి పని బృందాలు తమ సిల్క్ హ్యాండ్ లూమ్ చీరలు, డ్రెస్ మెటిరియల్ వంటి 50 వేల రకాల వస్త్రో ఉత్పత్తులను అందుబాటులో ఉంచారని వివరించారు.

## జిరాక్స్ సెంటర్స్ మూసివేయాలి : ఇన్‌స్పెక్టర్

నవతెలంగాణ-ఓయూ

రాష్ట్రవ్యాప్తంగా నేటి ఉదయం నుండి పదవ తరగతి పరీక్షలు ప్రారంభమవుతుండగా పరీక్ష సెంటర్ల దగ్గర 144 సెక్షన్ అమలులో ఉంటుందని లాలగూడా ఇన్‌స్పెక్టర్ పల్లె పద్మ ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

లాలాగూడా పోలీస్ స్టేషన్ పరిధిలో నాలుగు పాఠశాలల నందు పదవ తరగతి పరీక్షలు జరుగనున్నాయని, పరీక్ష సెంటర్లకి దగ్గరలో సమీపంలో ఉన్న జిరాక్స్ స్కానింగ్ సెంటర్స్ మూసివే యాలని ఆయా నిర్వాహకులను ఆమె కోరారు.

## నాటి మేటి నటుల పాటలతో సందడి

**నవతెలంగాణ-కల్చరల్**

నాటి మేటి నటులు శోభన్ బాబు కృష్ణం రాజు కృష్ణ నటించిన చిత్రాలలోని పాటలతో గాయనీ గాయకులు సుమారు పది గంటలు పాటు సందడి చేశారు. శ్రీ త్యాగరాయ గాన సభలోని కళా దీక్షితులు కళా వేదిక పై ప్రముఖ సాంస్కృతిక సేవా సంస్థ విజయ క్రియేషన్స్ నిర్వహణలో మధురమైన పాటలను పేరి నాగేశ్వర రావు, విజయ లక్ష్మి ప్రధాన గాయకులుగా పలు పాటలు అలపించగ టీ ఎస్ రావు లలిత తదితరులు కూడా పాటలలో పాలు పంచుకున్నారు. ఈ సందర్భంగా జరిగిన సభా కార్యక్రమంలో అతిథులు గా గాయకుడు త్రినాథ రావు కళా భీమాని పేరి కామేశ్వర రావు వై. మణి దీప్ కందల శ్రీనివాస్ పాల్గొని మాట్లాడుతూ విజయ క్రియేషన్స్ స్థాపకులు నాగేశ్వర రావు ,విజయ లక్ష్మి సామాజిక సేవా కార్యక్రమాలు విస్తృతంగా చేస్తున్నారనీ ఇటీవల విద్య సంస్థలోని పిల్లలకు పుస్తకాలు విద్యార్థులకు అవసరమైన ఇతర వస్తువులు అందించి వారి సహృదయత చూపారన్నారు. సంస్కృతిక సంస్థలు సామాజిక కార్యక్రమాలు చేపట్టాలని ఇందుకు విజయ క్రియేషన్స్ ఆదర్శమన్నారు.

## 20న శ్రుతి లయ సీల్ వెల్ స్త్రీ శక్తి పురస్కారాలు

**నవతెలంగాణ-కల్చరల్**



ఈ నెల 20 న రవీంద్ర భారతి ప్రధాన వేదిక పై సీల్ వెల్ కార్పొరేషన్, ఆర్.ఆర్.ఫౌండేషన్ శ్రుతి లయ ఆర్ట్స్ నిర్వహణలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం పురస్కరించుకొని వివిధ రంగాలకు చెందిన ప్రముఖ మహిళలకు శ్రుతి లయ సీల్ వెల్ స్త్రీ శక్తి పురస్కారాలు ప్రదానం వుంటుందని సీల్ వెల్ బండారు సుబ్బారావు, యూ బ్లడ్ ఫౌండర్ జగదీష్ యలమంచిలి, ధన క్రాప్ సైన్సెస్ చైర్మన్ రవి కుమార్ పత్రికా విలేకరులకు తెలిపారు. ముఖ్య అతిథిగా రాష్ట్ర శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి పాల్గొనగా పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ పూర్వ చైర్మన్ కొలేటి దామోదర్, వీ .సుబ్ర హ్మణ్యం, హరి నారాయణ రెడ్డి, పద్మా రావు, లాల్‌బహదూర్ శాస్త్రి, కళా రఫీ తదితరులు అతిథులుగా పాల్గొంటారు. ఎవరీ చక్కనివాడు శీర్షికన శోభన బాబు నటించిన చిత్రాలలోని గీతాలను ప్రముఖ గాయకులు ఆమని అనూష, లలిత శాంతి, సుభాష్ రాజన్ తదితరులు ఆలపిస్తారు.

# పది పరీక్షలకు.. పది సూత్రాలు

**నవతెలంగాణ-సిటీబ్యూరో**



తెలంగాణలో రాష్ట్ర వ్యాప్తంగా పదవ తరగతి విద్యార్థులకు ఎస్ఎస్‌సీ బోర్డు నేటి నుంచి పరీక్షలు నిర్వహిస్తున్న విషయం తెలిసిందే. ఇప్పటికే విద్యార్థులు హాల్ టికెట్స్, తమ పరీక్ష కేంద్రాలు చూసుకునే ఉంటారు. అయితే పది పరీక్షలు ఒత్తిడి లేకుండా పదిలంగా రాయడానికి పది సూత్రాలను పాటించామని హైదరాబాద్ శ్రీ చైతన్య విద్యాసంస్థల ఏజీఎం సయ్యద్ ఖాసీం అలీ విద్యార్థులకు సూచిస్తున్నారు.

### సెల్ఫ్ మేనేజ్‌మెంట్ (స్వీయ నిర్వహణ)

ఆత్మవిశ్వాసంతో పది పరీక్షలను ఎదుర్కొటానికి సంపూర్ణంగా మీరు సిద్ధంగా ఉన్నారని గ్రహించండి. పరీక్షలకు కావలసిన మానసిక సంసిద్ధత మీకు ఉందని తెలుసుకోండి. అనవసరపు అనుమానాలకు అవకాశం ఇవ్వకండి. మిమ్మల్ని మీరు పూర్తిగా నమ్మండి. సంవత్సరమంతా మీరు చేసిన కష్టాన్ని తక్కువగా అంచనా వేయకండి. మన ఎమోషన్స్ మనమే నియంత్రించుకోవాలని గ్రహించండి. మిమ్మల్ని మీరు పూర్తిగా పరీక్షలకు సిద్ధం చేసుకున్నారని బలంగా నమ్మండి

### ప్రెషర్ మేనేజ్‌మెంట్ (ఒత్తిడి నిర్వహణ)

మీకంటే ముందు ఎన్నో ఏండ్లుగా లక్షల మంది విద్యార్థులు బోర్డు పరీక్షలు విజయవంతంగా రాసి తమను తాము నిరూపించుకున్నారని తెలుసుకోండి. మీరు కూడా ఎవరికంటే తక్కువ కాదని విశ్వసించండి. అనవసరపు ఒత్తిడిని దరిచేరనివ్వకండి. ఒత్తిడి వలన పాజిటివ్ థింకింగ్ తగ్గుతుందని తెలుసుకోండి. మీ పట్ల మీరు నమ్మకాన్ని కలిగి ఉండి ఆశావహ దృక్పథాన్ని పెంచుకోండి.

### టైం మేనేజ్‌మెంట్ (సమయ నిర్వహణ)

రాష్ట్రవ్యాప్తంగా అందరికీ ఒకే రకమైన సమయాన్ని విద్యాశాఖ కేటాయిస్తుందని తెలుసుకోండి. ఏ సబ్జెక్టు పేపర్ లో, ఏ సెక్షన్ లో, ఏఏ ప్రశ్నలకు ఎంత సమయంలో, ఎంత మేరకు సమాధానాలు రాయాలో ఈపాటికే మీరు అభ్యాసం చేసి ఉన్నారని గుర్తుంచుకోండి. పరీక్షల అనంతరం ఇంటి వద్ద మరుసటి రోజు పరీక్షకు తయారవ్వడానికి కచ్చితమైన సమయపాలనను పాటించండి. ఏ సమయంలో ఏం చేయాలో ఉపాధ్యాయులను, తల్లిదండ్రులను అడిగి తెలుసుకుని మన సమయాన్ని మనమే సక్రమంగా సద్వినియోగం చేసుకోవాలని అర్థం చేసుకోండి.

### హెల్త్ మేనేజ్‌మెంట్ (ఆరోగ్య నిర్వహణ)

మన ఆరోగ్యం మనం తినే ఆహారం, నిద్రించే సమయాన్నిబట్టి ఆధారపడి ఉంటుందని తెలుసుకోండి. మానసిక ఆరోగ్యానికి కూడా ప్రాధాన్యత ఇవ్వండి. నూనె పదార్థాలు, జంక్ ఫుడ్, సాఫ్ట్ డ్రింక్స్, మసాలా వంటలు ,పార్టీలు, ఫంక్షన్లు మొదలగు వాటికి దూరంగా ఉండండి. సొంతంగా ఎటువంటి వాహనాలను లైసెన్స్ లేకుండా, తల్లిదండ్రులు అనుమతి లేకుండా నడపకండి. అనవసరపు ఇబ్బందులు కొని తెచ్చుకోకండి. మన కోసం ఏ రోజూ పరీక్షలు ఆగవని గ్రహించండి

### టార్గెట్ మేనేజ్‌మెంట్ (లక్ష్య నిర్వహణ)

ముందుగా నిర్దేశించుకున్న లక్ష్యాన్ని చేరాలంటే అన్నిరకాల జాగ్రత్తలు తీసుకోవాలని అర్థం చేసుకోండి. ఏ ఒక్క విషయంలో, సబ్జెక్టులో నిర్లక్ష్యం చేసినా అనుకున్న లక్ష్యాన్ని సాధించలేమని తెలుసుకోండి. అన్ని రకాలుగా మనల్ని మనం నియంత్రించుకోవడం అత్యంత అవసరమని అర్థం చేసుకోండి. కొన్ని కొన్ని చిన్న త్యాగాలు, జాగ్రత్తలు, నియమాలు, పెద్దల సలహాలు, సూచనలు పాటించడం వల్ల మాత్రమే అనుకున్న లక్ష్యాన్ని ఛేదించగలమని గ్రహించండి. మనకు నచ్చిన విధంగా చేస్తే మనమే నష్టపోతామని తెలుసుకోండి

### సెల్ఫ్ ఎనాలసిస్ (స్వీయ విశ్లేషణ)

పది పరీక్షలకు అనుగుణంగా మీ బలాలు, బలహీనతలు మీరే విశ్లేషించుకోండి. మీ గురించి మీకంటే ఎక్కువగా తెలిసిన వ్యక్తి ఎవరూ లేరని తెలుసుకోండి. పరీక్షల విషయంలో మీ బలహీనతలను అభ్యాసం ద్వారా ఇప్పటికే దూరం చేసుకున్నారని నమ్మండి. మీరే స్వయంకృషితో మీ శక్తి యుక్తులను పెంచుకున్నారని విశ్వసించండి.

### క్వాలిటేటివ్ ఎనాలసిస్ (గుణాత్మక విశ్లేషణ)

మనం చేసే ప్రతి పనిలో క్వాలిటీ ఉండే విధంగా విశ్లేషించుకోవాలి. అందరూ చేసే పనిని మనం భిన్నంగా చేయాలి. ఈ లక్షణమే మనకు విజయాన్ని కలుగజేస్తుందని నమ్మండి. చేసే పని చిన్నదైనా పెద్దదైనా మనకంటే ఇంకెవరూ ఇంతకంటే బాగా చేయలేని విధంగా మనం చేయాలని రుజువు చేసుకోండి. ప్రశ్నలకు మీ సమాధానాలు మీ క్వాలిటీ ప్రిపరేషన్ ను తెలియజేసే విధంగా అందరికంటే భిన్నంగా ఉండాలి

### కంపేరిటివ్ ఎనాలసిస్ (తులనాత్మక విశ్లేషణ)

మీరు ఇప్పటివరకు రాసిన ప్రీ-ఫైనల్ పరీక్షలలో మీ సమాధానాలను మీకు మీరుగా పోల్చుకుంటూ తులనాత్మక విశ్లేషణ చేసుకోండి. ఒక్కొక్క పరీక్షలో మీరు ఏ విధంగా మిమ్మల్ని మీరు మెరుగుపరుచుకుంటూ వచ్చారో మననం చేసుకోండి. ఇప్పుడు ఇంకా మెరుగ్గా బోర్డు పరీక్షలు రాయబోతున్నారని గట్టిగా నమ్మండి. మిమ్మల్ని మీరు ఎప్పుడూ వేరెవరితోనూ పోల్చుకోకండి. మిమ్మల్ని మీతోనే పోల్చుకోండి. ఎందుకంటే ప్రతి ఒక్కరిలో కొన్ని ప్రత్యేకతలు ఉంటాయని అవి వారికి మాత్రమే సాధ్యమని తెలుసుకోండి. ఈ సృష్టిలో ఏ ఒక్కరూ తక్కువగా, అనవసరంగా సృష్టించబడలేదని అర్థం చేసుకోండి. మిమ్మల్ని మీతోనే పోల్చుకోండి

### ఎర్రర్ రెక్టిఫికేషన్ (పొరపాట్లను సరిదిద్దుకోవడం)

సంవత్సరమంతా మీరు రాసిన అన్ని పరీక్షలలో మీరు చేసిన పొరపాట్లను ఇప్పటికే సరిదిద్దుకున్నారని గుర్తు తెచ్చుకోండి. ఇవే తప్పులు బోర్డు పరీక్షలలో పునరావృతం కాకుండా జాగ్రత్త పడబోతున్నామని తెలుసుకోండి. ఏ సబ్జెక్టులో, ఏ సెక్షన్‌లో, ఏ ఏరియాలో, ఏ పొరపాటు చేసి ఏమరపాటుగా తక్కువ మార్కులు తెచ్చుకున్నామో, ఆ పొరపాట్లు మళ్లీ జరగకుండా చూసుకోండి.

### ప్రజెంటేషన్ స్కిల్స్ (సమర్పణ నైపుణ్యాలు)

మీరు సంవత్సరం అంతా ఎంత కష్టపడినా పరీక్షలలో మీరు మీ సమాధానాలను ప్రజెంట్ చేసిన విధానం ద్వారానే ఉత్తమ ఫలితాలను ఆశించబోతున్నారని అర్థం చేసుకోండి. చక్కటి గుండ్రటి చేతిరాత అత్యంత అవసరం. సబ్జెక్టును బట్టి ప్రశ్నలకు సమాధానాలు ఎంత నిడివిలో, ఎంత చక్కగా రాయాలో ఇప్పటికే మీ ఉపాధ్యాయులు ఎన్నోసార్లు మీతో అభ్యాసం చేయించి ఉంటారు. తెలుగు, హిందీ, ఇంగ్లీష్ పరీక్షలలో చేతిరాతకు, వ్యాకరణాంశాలకు, అక్షర దోషాలు లేకుండా రాయడానికి ఎక్కువ ప్రాధాన్యత ఉంటుందని మీకు తెలుసు. సోషల్ సబ్జెక్టులో మ్యాప్ పాయింటింగ్, సైన్స్ విభాగంలో చక్కటి బొమ్మలు గీసి భాగాలను గుర్తించటం, గణితంలో ఒక క్రమపద్ధతిలో సమాధానాలు రాబట్టడం వంటి ముఖ్యాంశాలకు తగు ప్రాధాన్యతను ఇవ్వడం అవసరమని గ్రహించండి. ఆబ్జెక్టివ్ ప్రశ్నలకు కూడా సమాధానాలను జాగ్రత్తగా ఆలోచించి రాయాలని గ్రహించండి..

పైవిషయాలను చక్కగా పాటించి బోర్డు పరీక్షలను ధీటుగా ఎదుర్కొని మన తెలంగాణ రాష్ట్ర విద్యార్థులందరూ చక్కటి ఫలితాలను సాధించబోతున్నారని మనస్ఫూర్తిగా విశ్వసిద్దాం. ఆల్ ద బెస్ట్.!

## ఎస్సీ కార్పొరేషన్ చైర్మెన్ ప్రీతంకు శుభాకాంక్షలు తెలిపిన పానుగంటి మహేష్ కుమార్



**నవతెలంగాణ- మేడ్చల్**

రాష్ట్ర ప్రభుత్వ ఎస్సీ కార్పొరేషన్ చైర్మెన్‌గా నియమితులైన నాగరి ప్రీతమ్‌ను మేడ్చల్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఏ బ్లాక్ ఎస్సీ సెల్ అధ్యక్షుడు పానుగంటి మహేష్ కుమార్ ఆదివారం వారి నివాసంలో మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు. పానుగంటి మహేష్ కుమార్ మాట్లాడుతూ నిరంతరం దళితుల అభ్యున్నతికి కృషి చేస్తున్న నాగరి ప్రీతమ్ కు ఎస్సీ సెల్ చైర్మెన్ పదవి రావడం యావత్ దళిత సామాజిక వర్గానికి సంతోషకరమైన విషయమన్నారు. ఎస్సీ కార్పొరేషన్ ద్వారా దళిత వర్గాలను ప్రగతి పదంలో నడిపిస్తూ ఉపాధి అవకాశాలను కల్పించాలని ఆశాభావం వ్యక్తం చేశారు. కలిసిన వారిలో మేడ్చల్ జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షులు పత్తి కుమార్, జిల్లా మహిళా కన్వీనర్ గండి సునీత, నాయకులు శ్రీనివాస్, మల్లేష్, వెంకటేష్, నర్సింగ్ రావు, నాగేందర్, రామలింగం,బాబు తదితరులు ఉన్నారు.



**నవతెలంగాణ కీసర**

రాష్ట్ర ఎస్సీ కార్పొరేషన్ నూతన చైర్మెన్‌గా నియమితులైన నాగరి ప్రితంను నాగారం మున్సిపల్ 18వ వార్డు కౌన్సిలర్ పంగ హరిబాబు మర్యాదపూర్వకంగా కలిసి ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షులు పత్తి కుమార్ , తోటకూర శ్రీకాంత్ ,జీవన్ తదితరులు పాల్గొన్నారు.

## సీఐని మర్యాదపూర్వకంగా కలిసిన కాంగ్రెస్ నాయకులు



**నవతెలంగాణ-జవహర్‌నగర్**

జవహర్ నగర్ సీఐగా బాధ్యతలు చేపట్టిన నాగరాజును ఆదివారం జవహర్ నగర్ మున్సిపల్ కార్పొరేషన్ గబ్బిలలాపేట కాంగ్రెస్ నాయకులు మర్యాద పూర్వకంగా కలిసి శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో గబ్బిలలాపేట కాంగ్రెస్ నాయకులు భవాని శంకర్, మబ్బు అంజయ్య, పౌల్, వెంకన్న, రామడుగు బాలరాజు, వంపుగూడ జయరాజ్, మాచర్ల సురేందర్, ఆనంద్, కిషన్, సురేందర్ రెడ్డి, రామగిరి శ్రీనివాస్, రాజు,నర్సింహా, రాజు, తదితరులు పాల్గొన్నారు.

## బీరప్ప గడ్డ వెస్ట్ కాలనీ అసోసియేషన్ అధ్యక్షులుగా రాచకొండ శివకుమార్



**నవతెలంగాణ-ఉప్పల్**

బీరప్పగడ్డ వెస్ట్ కాలనీ అసోసియేషన్ సమావేశం అధికారం కాలనీ నాయకులు నాగరాజు అధ్యక్షతన వెస్ట్ కాలనీ నూతన కమిటీనీ ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది. అధ్యక్షులుగా శివకుమార్ కార్యదర్శిగా పిట్ల శ్రీనివాస్, ఉపాధ్యక్షులు నవీన్ కుమార్, నరేందర్‌లు ఎన్నుకోవడం జరిగింది. ఈ సందర్భంగా నూతన అధ్యక్షులు శివకుమార్ మాట్లాడుతూ కాలనీ సమస్యలపై పోరాటం, చేస్తూ, కాలనీ అభివృద్ధికి కృషి చేస్తానన్నారు. తన ఎన్నికకు కృషి చేసిన ప్రతి ఒక్కరికి ధన్యవాదములు తెలిపారు.

## నూతన కాలనీల్లో మౌలిక సదుపాయాల కల్పనకు కృషి


- ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి

**నవతెలంగాణ-తుర్కయంజాల్**

నూతన కాలనీల్లో మౌలిక సదుపాయాల కల్పనకు కృషి చేస్తానని ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి అన్నారు. ఆదివారం తుర్కయంజాల్ మున్సిపాలిటీ పరిధి మునగనూర్ 15వ వార్డులో అంజనాపురి కాలనీ ముఖద్వారాన్ని స్థానిక కౌన్సిలర్ వేముల స్వాతి అమరేందర్ రెడ్డితో కలిసి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కాలనీవాసులు ఐక్యమత్యంతో కలిసిమెలిసి కాలనీలను అభివృద్ధి చేసుకోవాలని సూచించారు. నూతన కాలనీల్లో మౌలిక సదుపాయాల కల్పనకు కృషి చేస్తున్నామన్నారు. మున్సిపాలిటీ చైర్ పర్సన్ అనురాధ రాంరెడ్డి ఆధ్వర్యంలో ప్రతి వార్డును ఆదర్శంగా తీర్చిదిద్దుతున్నామని తెలిపారు. కాలనీలలో ఎలాంటి సమస్యలు ఉన్నా తమ దృష్టికి తీసుకురావాలన్నారు. కార్యక్రమంలో టీపీసీసీ సభ్యులు, కౌన్సిలర్ కాకుమాను సునీల్, కౌన్సిల్ కాంగ్రెస్ ఫ్లోర్ లీడర్ కొశికె ఐలయ్య, కౌన్సిలర్లు కొత్తకుర్మ మంగమ్మ శివకుమార్, నక్క శివలింగం గౌడ్, డైరెక్టర్ అంజయ్య, నాయకులు కుంట గోపాల్‌రెడ్డి, మేకం అంజయ్య, నక్క శ్రీనివాస్ గౌడ్, వెంకట్ రెడ్డి, రేవల్లె యాదగిరి, వాసు, కాలనీ అధ్యక్షుడు దొంతుల శ్రీకాంత్ రెడ్డి, ఉపాధ్యక్షులు గుర్రం రాజరత్నం, గంగాపురం కృష్ణ గౌడ్, ప్రధాన కార్యదర్శి ర్యాలి శ్రీనివాస్ రావు తదితరులు పాల్గొన్నారు

# తొవ్వారు..వదిలేశారు

- ఇబ్బందులు పడుతున్న వాహనదారులు
- పట్టించుకుని అధికారులు, ప్రజాప్రతినిధులు



- రోడ్డుకు మోక్షం ఎప్పుడు..?

**నవతెలంగాణ-తాండూరు రూరల్**

తాండూరు మండలం సిరిగిరిపేట, వీరరెడ్డిపల్లి, పర్వతాపూర్, గ్రామాలకు వెళ్లే రోడ్డు కంకరతో దర్శనిమిస్తున్నాయి. పర్వతాపూర్, గ్రామానికి వెళ్లే రోడ్డు, మంజూరై రెండు సంవత్సరాలు గడుస్తున్నా, కంకర వేసి వదిలేశారు. సిరిగిరిపేట, రోడ్డు ఆరు నెలల క్రితం మంజూరైంది. రోడ్డు నిర్మిస్తామని ఉన్న రోడ్డును తోవేశారు. వెంటనే ఎమ్మెల్యే ఎన్నికలు జరిగాయి అప్పటినుండి ఇప్పటివరకు దాని వైపు ఎవ్వరూ కన్నెతి చూడటం లేదు. దీంతో పాటు వీరరెడ్డిపల్లి గ్రామానికి కూడా రోడ్డు మంజూరైందని, పలుమార్లు చెబుతున్న మరమ్మత్తులు మాత్రం చేపట్టడం లేదు. కంకర, గుంతల రోడ్లతో నిత్యం ప్రయాణికులు నిత్యం ఇబ్బందులు ఎదుర్కొవాల్సి వస్తుంది. అత్యవసర సమయంలో ఈ గ్రామాలకు 108 వాహనం సైతం వెళ్లలేని పరిస్థితి ఏర్పడుతుంది. 8 ఏండ్ల నుంచి మరమ్మత్తు పనులు చేస్తామంటూ మభ్యబెడుతూ, ఆరు నెలల క్రితం మాత్రం రోడ్డు మంజూరైందని దాన్ని వెంటనే నిర్మిస్తామని, ఎన్నికల సమయంలో ఉన్న రోడ్డును తొవ్వేసి వదిలేశారు. నిత్యం ప్రయాణికులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి రోడ్డు నిర్మాణం వెంటనే చేపట్టాలని ఆయా గ్రామాల ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

## '10వ తరగతి విద్యార్థులు ప్రశాంత వాతావరణంలో పరీక్షలు రాయాలి'

**నవతెలంగాణ-కోట్‌పల్లి**



విద్యార్థులు ప్రశాంతమైన వాతావరణంలో పరీక్షలు రాయాలని మండల విద్యాధికారి చంద్రప్ప తెలిపారు. సోమవారం జరిగే ఈ పరీక్ష కేంద్రాలకు ఉదయం 9.30, గంటల నుండి, 12.30 వరకు ఉంటాయని విద్యార్థులు సమయానికి ముందే పరీక్ష కేంద్రాలకు చేరుకోవాలని తెలిపారు. కోట్‌పల్లి మండలంలో 1 సెంటర్, బంట్వారం మండలం లో 2 (పరీక్ష కేంద్రం)లు ఉన్నాయని తెలిపారు. బంట్వారం మండలంలో రెండు సెంటర్లు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పరీక్ష కేంద్రం, తెలంగాణ మోడల్ స్కూల్ పరీక్ష కేంద్రం మొత్తం 218 మంది విద్యార్థులు పరీక్ష రాయనున్నారని తెలిపారు. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల కోట్‌పల్లి మండల పరీక్ష కేంద్రంలో 174 మంది విద్యార్థులు పరీక్ష రాయనున్నట్టు తెలిపారు. మొత్తం 3 సెంటర్లకు గాను జిల్లా విద్యాశాఖ తరుపున అధికా రులను నియమించడం జరిగినదని తెలిపారు. విద్యార్థులకు తగిన ఏర్పాటు పూర్తి చేయడమైనదన్నారు. ఫర్నిచర్, శానిటేషన్, విద్యుత్ ఎలక్ట్రిసిటీ, సదుపాయాలు కల్పించడం జరుగుతుందని తెలిపారు .

# అల్వాల్‌లో 54వ వారం జ్ఞానమాల

**నవతెలంగాణ అల్వాల్**



అల్వాల్ కంటోన్మెంట్ సరిహద్దులోని విశ్వ రత్న డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహానికి 54వ వారం జ్ఞానమాల కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రజల సంఘటితం ఐక్యతతోటి లక్ష్యాలు సాధిస్తామని గద్దర్ ఫౌండేషన్ ప్రధాన కార్యదర్శి జీవి సూర్యకిరణ్ స్పష్టం చేశారు. ఆదివారం అల్వాల్ సర్కిల్ పరిధిలోని యాప్రాల్‌లో నిర్వహించిన జ్ఞానమాల కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ప్రజా సమస్యలు పరిష్కారం కావాలంటే ప్రజలు సంఘటితంగా ఐక్యంగా కలిసి పోరాడినప్పుడే లక్ష్యాలు సాధిస్తామని ఆయన వివరించారు. ప్రజా యుద్ధనౌక గద్దర్ కు యాప్రాల్‌తో విడదీయరాని బంధం ఉందని చెప్పారు. అల్వాల్ ప్రాం తంలో ప్రతి ఆదివారం జ్ఞానమాల నిర్వహిం చడం పట్ల ఆయన అభినందనలు తెలిపారు. అంబేద్కర్ మహాను భావుల స్ఫూర్తిని నేటి తరానికి తెలియజేయువ లసిన అవసరం ఉందని డాక్టర్ గద్దం శ్రీనివాస్ తెలిపారు. దేశంలోని అన్ని సమస్యలకు భారత రాజ్యాంగంలో పరిష్కార మార్గాలు ఉన్నాయని దాని అందిపుచ్చుకోవాల్సి బాధ్యత మనందరిపై ఉందని హక్కులు అధికారల పైన ప్రతి ఒక్క రిని చైతన్యవంతం చేయాలని ఆయన కోరారు . హక్కులు అధికారుల పైన ప్రతి ఒక్కరిని చైతన్య పరచట మే జ్ఞానమాల ఉద్దేశమని సీనియర్ జర్నలిస్టు ఆస శ్రీరా ములు తెలిపారు. సంవత్సరం క్రితం ప్రారంభమైన జ్ఞాన మాల నిర్వహణ హైదరాబాద్ నలుమూలల ప్రారంభమైందని మహానుభావుల విగ్రహాలు ఉన్న ప్రతి చోట నాన మాల కార్యక్రమం నిర్వహించాలని కోరారు. కార్యక్రమంలో యాప్రాల్, కౌకూర్ లోతుకుంట, బాలాజీ నగర్ జ్ఞానమాల నిర్మాణ కమిటీ సభ్యులు అడ్వైజర్ నర్సింగరావు, బి కృష్ణ, మహేష్ కుమార్ ప్రేమ్ కుమార్, బాలయ్య ఏ రామచంద్ర తదితరులు పాల్గొన్నారు.

## సీఎంను కలిసిన బర్రె రాజ్ కుమార్

**నవతెలంగాణ-రంగారెడ్డి ప్రతినిధి**

తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి ఏనుముల రేవంత్ రెడ్డిని ఆదివారం జూబ్లీహిల్స్ లోని తమ నివాసంలో కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ రంగారెడ్డి జిల్లా చైర్మన్ బర్రె రాజ్ కుమార్ పుష్ప గుచ్ఛాల్లాని అందజేసి మర్యాదపూ ర్వకంగా కలిశారు. ఈ సందర్భ ంగా ఆయన మాట్లా డుతూ కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మ్యానిఫెస్టోలో ప్రకటించిన విధంగా ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొద్ది రోజుల్లోనే హామీలు అమలు చేయడం శుభపరిణామం అన్నారు. కాంగ్రెస్ అంటే ఇచ్చిన మాటకు కట్టుబడి ఉండే నైజం అని రాష్ట్రంలో మరోసారి రుజువు అయ్యిందని అన్నారు. ఆర్థిక పరిస్థితి బాగా లేకున్నప్పటికీ ప్రభుత్వం హామీలను అమలు చేసేందుకు శ్రమిస్తూ ఉండటం అభినందనీయమన్నారు. సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలో రాష్ట్రం అన్ని రంగాల్లో బ్రహ్మాండంగా అభివృద్ధి చెందడం ఖాయమని అన్నారు. ఇక రాష్ట్రంలో కాంగ్రెస్ జనరంజక పాలన మొదలైందని అన్నారు.

## హైదరాబాద్ పబ్లిక్ స్కూల్‌కు అనుశ్రీ ఎన్నిక

**నవతెలంగాణ-కోడంగల్**

హైదరాబాద్ పబ్లిక్ స్కూల్‌కు 2023-24 విద్యా సంవత్సరానికి ఒకటవ తరగతిలో ప్రవేశం కోసం షెడ్యూల్ కులాల నుంచి దరఖాస్తు చేసుకున్న దౌల్తాబాద్ మండలం గుండె పల్లి గ్రామానికి చెందిన అనుశ్రీ లక్కీ డిప్ ద్వారా ఎన్నికైనట్టు ఏ ఎస్ డబ్ల్యో వీరనందం, వార్డెన్ హనుమంత్ రెడ్డిలు తెలిపారు, హైదరాబాద్ పబ్లిక్ స్కూల్‌కు అను శ్రీ ఎన్నికవ్వడంతో ఏ ఎస్ డబ్ల్యూ వీరనందం, వార్డెన్ హనుమంత్ రెడ్డిలు విద్యార్థి అనుశ్రీ గ్రామం గుండేపల్లికి వెళ్లి విచారించి తల్లి దండ్రుల వివరాలతో పాటు స్వగ్రామం వివరాలు తెలుసుకున్నారు. అను శ్రీ ఒకటవ తరగతికి ఎన్నిక కావడంతో తల్లిదండ్రులు, గ్రామస్తులు సంతోషం వ్యక్తం చేశారు.

## నిర్మాణం పూర్తి దశకు చేరుకున్న మేడ్చల్ ఎక్సైజ్ పోలీస్ స్టేషన్



నవతెలంగాణ-మేడ్చల్

మేడ్చల్ మండల పరిధిలోని పూడూరు గ్రామంలో ఏర్పాటు చేస్తున్న ఎక్సైజ్ పోలీస్ స్టేషన్ నిర్మాణ పనులు పూర్తి దశకు చేరుకున్నాయి. మేడ్చల్, ఉమ్మడి షామీర్‌పేట్ మండలాలకు కలిపి మేడ్చల్ పట్టణ కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయానికి సమీపంలో ఉన్న ఓ అద్దె భవనంలో ప్రస్తుతం ఎక్సైజ్ పోలీస్ స్టేషన్ కొనసాగుతోంది. కాగా గత కొన్ని సంవత్సరాలుగా అద్దె భవనంలోనే ఎక్సైజ్ పోలీస్ స్టేషన్ కొనసాగుతుంది. పార్లమెంట్ ఎన్నికలు ముగిసిన అనంతరం ఎక్సైజ్ పోలీస్ స్టేషన్ ప్రారంభమయ్యే అవకాశం ఉంది. ఈ లోపు నిర్మాణ పనులు మొత్తం పూర్తయి ప్రారంభానికి సిద్ధంగా ఉండనుంది.

## బహు సాహితీ ప్రక్రియల ప్రజ్ఞానిధి చిలకమర్తి లక్ష్మీనరసింహం

నవతెలంగాణ-కల్చరల్

పౌరాణిక నవలలు నాటకాలు ప్రహసనాలు అనువాదాలు పలు సాహితీ ప్రక్రియల ప్రజ్ఞా నిధి చిలకమర్తి లక్ష్మీనరసింహం అని విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ కాశీ విశ్వేశ్వరరావు అన్నారు. శ్రీ త్యాగరాయ గాన సభలోని కళా సుబ్బారావు కళా వేదికపై గాన సభ నిర్వహణలో జరుగుతున్న దశాబ్ది పూర్వ మహనీయులు యాదిలో భాగంగా చిలకమర్తి లక్ష్మీనరసింహం సంస్మరణ సమావేశం జరిగింది . ముఖ్య అతిథిగా జస్టిస్ విశ్వేశ్వర రావు పాల్గొని మాట్లాడుతూ రాజమండ్రిలో జన్మించిన చిలకమర్తి పలు సంఘ సంస్కరణ కార్యక్రమాలు చేపట్టి కందుకూరి వీరేశలింగం పంతులు అడుగు జాడలో ఆదర్శవంతంగా నిలిచారన్నారు. ఆయన నాడే దళిత వర్గాల విద్య కోసం విద్యాలయం స్థాపించి ఉచితంగా చదువులు చెప్పించారని వివరించారు. హాస్య అవధాని జర్నలిస్ట్ శంకర నారాయణ మాట్లాడుతూ హాస్య రచనలోనూ చిలకమర్తి దిట్టని అయన రచించిన గణపతి నవల ఇందుకు ఉదాహరణ అన్నారు. ఆంధ్ర విశ్వవిద్యాలయం చే కళా ప్రపూర్ణ అవార్డ్ అందుకున్న చిలకమర్తి రాసిన గయోపాఖ్యానం నాటకం నేటికి ప్రదర్శిస్తున్నారని తెలిపారు. గాన సభ అధ్యక్షుడు కళా జనార్దన మూర్తి అధ్యక్షత వహించిన సభలో కవి చక్రవర్తి తంగిరాల, సమాజిక వేత్త వైకుంఠం పాల్గొన్నారు.




# నేటి నుంచి పది పరీక్షలు

- ఏప్రిల్ 2వరకు పరీక్షల నిర్వహణ
- జిల్లాలో 361 పరీక్ష కేంద్రాల ఏర్పాటు
- పరీక్షలు రాయనున్న 76,575 మంది విద్యార్థులు
- మాస్‌కాపీంగ్‌కు తావులేకుండా సీసీ కెమెరాల ఏర్పాటు
- గంట ముందుగానే విద్యార్థులకు పరీక్ష కేంద్రాల్లోకి అనుమతి



నవతెలంగాణ-సిటీబ్యూరో

పదో తరగతి వార్షిక పరీక్షలు నేటి నుంచి ప్రారంభం కానున్నాయి. జిల్లా వ్యాప్తంగా 361 పరీక్ష కేంద్రాల్లో 76,575 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరుకానున్నారు. పరీక్ష విధుల కోసం 4600కుపైగా సిబ్బందిని నియమించారు. పరీక్షలు ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు జరగనున్నాయి. పరీక్షా కేంద్రాల్లో విద్యార్థులకు అసౌకర్యం తలెత్తకుండా ఫర్నిచర్, తాగునీరు, ఫ్యాన్లు, చీకటిలేకుండా ట్యూబ్‌లైట్లు ఏర్పాటు చేశామని జిల్లా విద్యాశాఖాధికారిణి ఆర్.రోహిణి తెలిపారు. కాగా విద్యుత్ సరఫరాలో ఎలాంటి అంతరాయం ఏర్పడకుండా సంబంధిత అధికారులతో మాట్లాడినట్టు చెప్పారు. మరోవైపు పరీక్షలు సమర్థవంతంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేశామని వివరించారు. ప్రస్తుతానికి ఎక్కడా ఎలాంటి సమస్యలు లేవన్నారు. కాగా జిల్లాలోని ఆయా పాఠశాల ప్రధానోపాధ్యాయుల ద్వారా ఇప్పటికే విద్యార్థులందరికీ హాల్‌టికెట్లు అందే ఏర్పాట్లు చేశామన్నారు. సకాలంలో పరీక్షా కేంద్రాలకు విద్యార్థులు చేరేలా తల్లిదండ్రులు సహకరించాలని కోరారు.

### పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్

జిల్లాలో విద్యార్థులు మంచి వాతావరణంలో పరీక్షలు రాసేలా అన్ని చర్యలు తీసుకున్నామని, ఎలాంటి ఇబ్బందులు కలగకుండా పకడ్బందీగా ఏర్పాట్లు చేశామని డీఈవో రోహిణి తెలిపారు. పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులకు ఎక్కడ ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఏర్పాట్లు చేశామన్నారు. అయితే విద్యార్థులు ఉదయం 8.30 గంటలకు పరీక్షా కేంద్రాలకు చేరుకోవాలని ఆమె సూచించారు. 9.35 తర్వాత ఎట్టి పరిస్థితుల్లోనూ లోనికి అనుమతించమని చెప్పారు. పరీక్షలు సజావుగా నిర్వహించేందుకు 15 ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలను సిద్ధం చేయగా.. 722 మంది చీఫ్ సూపరింటెండెంట్లు, డిపార్ట్‌మెంటల్ ఆఫీసర్లు, 76 కస్టోడియన్, జాయింట్ కస్టోడియన్లతో పాటు 3825 ఇన్విజిలేటర్లు విధులు నిర్వర్తించనున్నారు. పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలులో ఉండనుంది. కేంద్రాల సమీపంలోని జీరాక్స్, ఇంటర్నెట్ సెంటర్లు తెరవకుండా చర్యలు చేపట్టారు. పరీక్ష కేంద్రాలకు సీఎస్‌లు, డీవోలు మినహా ఇతర సిబ్బంది, ఇన్విజిలేటర్లు సైతం సెల్‌ఫోన్లు, ఇతర ఎలక్ట్రానిక్ పరికరాలు తీసుకురాకూడదు. అన్ని పరీక్ష కేంద్రాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. కాగా వేసవి తీవ్రతను దృష్టిలో ఉంచుకొని పరీక్షా కేంద్రాల్లో ఇద్దరేసి వైద్యసిబ్బందిని అవసరమైన మందులు, ఓఆర్‌ఆర్‌ఎస్ పాకెట్లతో సిద్ధం చేశారు. ఇదిలావుండగా పరీక్షా కేంద్రాలకు విద్యార్థులు సులువుగా చేరుకునేందుకు ఆర్టీసీ ప్రత్యేక బస్సులను నడపనుంది.

### హాల్ టికెట్, పాస్ ఉంటేనే ఉచిత ప్రయాణం: ఆర్టీసీ గ్రేటర్ హైదరాబాద్ జోన్ ఈడీ వెంకటేశ్వర్లు

పదో తరగతి వార్షిక పరీక్షల సందర్భంగా టీఎస్‌ఆర్టీసీ ప్రత్యేక బస్సులను నడపాలని నిర్ణయించింది. నేటి నుంచి ఏప్రిల్ 2 వరకు జరగనున్న టెన్త్ వార్షిక పరీక్షల నేపథ్యంలో విద్యార్థుల కోసం ఈ ప్రత్యేక బస్సులను నడపనున్నట్టు ఆర్టీసీ గ్రేటర్ హైదరాబాద్ జోన్ ఈడీ వి.వెంకటేశ్వర్లు ఆదివారం తెలిపారు. విద్యార్థులు పరీక్ష సెంటర్లకు వెళ్లేటప్పుడు తిరిగి వచ్చేటప్పుడు ఈ బస్సులు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకున్నట్టు చెప్పారు. అవసరమైన సమాచారాన్ని తెలియజేసేందుకు బస్సు స్టాండ్‌ల వద్ద ఆర్టీసీ అధికారులు, సూపర్ వైజర్లను పర్యవేక్షణ కోసం నియమించినట్టు ఆయన వివరించారు. పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులు తమ వెంట బస్సుపాసుతోపాటు హాల్ టికెట్లు తీసుకు రావాలని సూచించారు. హాల్ టికెట్ మాత్రమే ఉంటే కండక్టర్లు సాధారణ టికెట్‌ను తీసుకుంటారని చెప్పారు. అయితే మెట్రో ఎక్స్‌ప్రెస్‌లో ప్రయాణం చేయాలంటే, ఉచిత లేదా రాయితీ బస్సు పాస్ ఉన్నవారు కాంబినేషన్ టికెట్ తీసుకోవాల్సిందేనని, పాస్‌లు ఏవీ లేకుంటే పూర్తి స్థాయిలో టికెట్ తీసుకోవాల్సిందేనని స్పష్టం చేశారు. మహాలక్ష్మి పథకం అమలు నేపథ్యంలో మహిళ విద్యార్థులకు జీరో టికెట్ జారీ చేస్తామని ఈడీ తెలిపారు. ఇక విద్యార్థులకు ప్రయాణంలో ఏమైనా ఇబ్బందులు తలెత్తితే కోఠి బస్టాండ్-99592 26160, రేతిఫైల్-99592 26154 నెంబర్లలో సంప్రదించాలని సూచించారు. విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

### విద్యార్థులు ధైర్యంగా ప్రశాంతగా పరీక్షలు రాయాలి : ఆర్.రోహిణి, డీఈవో, హైదరాబాద్



విద్యార్థులు ఎలాంటి ఆందోళనకు గురి కాకుండా ధైర్యంగా ప్రశాంతంగా పరీక్షలు రాయాలి. ఉదయం 8.30 గంటల నుంచే పరీక్ష కేంద్రాల్లోకి అనుమతినిస్తాం. 9.35 తర్వాత ఎట్టి పరిస్థితుల్లోనూ సెంటర్ లోకి అనుమతి ఉండదు. పరీక్ష కేంద్రానికి వచ్చే ముందు ప్రత్యేకంగా హాల్ టికెట్‌తో పాటు పెన్, పెన్సిల్ వంటి ఉన్నాయో లేదో చూసుకోవాలి. విద్యార్థులు ఎలాంటి ఎలక్ట్రానిక్ పరికరాలు వెంట తీసుకురాకూడదు. ఉదయం అల్పహారం తీసుకోవాలి. ప్రశాంతంగా పరీక్షలు రాసి.. జిల్లా పేరును, తమ తల్లిదండ్రుల పేరును నిలుపాలని డీఈవో ఆకాంక్షించారు.

## కశ్మీర్‌లో ఏర్పడ్డ దుర్భర మౌనవేదనలో నుంచి పుట్టుకొచ్చిన మౌమితా ఆలం కవిత్వం

- ప్రొఫెసర్ హరగోపాల్



నవతెలంగాణ-ముషీరాబాద్

ఆర్టికల్ 370 రద్దయ్యాక కాశ్మీర్‌లో ఏర్పడ్డ దుర్భర మౌనవేదనలో నుంచి మౌమితా ఆలం కవిత్వం పుట్టుకొచ్చిందని పౌరహక్కుల సంఘం నేత ప్రొఫెసర్ హరగోపాల్ అన్నారు. ఆదివారం బాగ్‌లింగంపల్లి సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో మాతృక ప్రచురణలు, పాలమూరు అధ్యయన వేదిక ఆధ్వర్యంలో మౌమిత ఆలం ఆంగ్ల అనువాద గ్రంథం తెలుగులో రచించిన 'రాయగూడని పద్యం' పుస్తకావిష్కరణ సభ పివోడబ్ల్యు జాతీయ నాయకురాలు సంధ్య అధ్యక్షతన జరిగింది. పుస్తకాన్ని ఆవిష్కరించిన అనంతరం ప్రొఫెసర్ హరగోపాల్ మాట్లాడుతూ కశ్మీర్‌లో ఆమెకున్న ఒకే ఒక మిత్రుడిని కనీసం ఉత్తరం కూడా రాయలేని స్థితి ఏర్పడడంతో ఆ నిస్సహాయత, ఆక్రందనలో నుంచి ఆమె కవిత్వం ప్రభవించిందని, అందుకనే ఆమె కవిత్వానికి అంత పదును ఉందన్నారు. ప్రతిఘటనలోనే కవిత్వం ప్రభవించాలని మౌమితా ఆలం అన్నారు. ఆమె కవిత్వం పితృస్వామిక వ్యవస్థపై, ఫాసిస్ట్ వ్యవస్థపై, మేధావుల మౌనంపై, జాతీయ, అంతర్జాతీయ నిర్బంధాలపై సాగిందన్నారు. ఆమె రచనల్లో చిన్న చిన్న పదాలతో గొప్ప అర్థాన్ని చెబుతుందని. స్త్రీగా, ముస్లీం స్త్రీగా, ఉత్తర బెంగాల్ ప్రాంత ముస్లీంగా, ఒంటరి తల్లిగా, ప్రాంతాలు, భాషలు, దేశాలు, జాతులు, మతాలుదాటి విశ్వబాధితుల పక్షాన పలుకరిస్తుందన్నారు. ఏ మూలన అలజడిరేగినా, నిర్భయంగా, అత్యంత వేగంగా అక్షరబద్ధం చేసే మౌమిత ఆలం ఖచ్చితంగా నవతరానికి, యువతరానికి ప్రతినిధిగా నిలుస్తారన్నారు. ఎక్కడో పశ్చిమ బెంగాల్లోని మారుమూల ప్రాంతం సిలిగురి నుండి వచ్చిన మౌమితా అలం అనేక ప్రశ్నల్ని, నిషట్టురాలనీ, వేదలన్నీ ఒంటరితనాన్ని నిస్సహాయలతను వెంటేసుకొని అందరిని కవిత్వమై పలుకరిస్తుందన్నారు. 2019 నుంచి కవిత్వం ప్రారంభించి అతి తొందర్లోనే దేశంలోనూ, పశ్చిమ ఆసియా అంతట కూడా ప్రభంజనమై దూసుకొస్తున్న మౌమిత అలాం, కలంబట్టడానికి ఓ కథ ఉందన్నారు. మౌమిత అలం కవితల అనువాదాలు మలయాళీ, మరాఠి, తెలుగు, తమిళ, కన్నడ, హిందీ బాషల్లో ప్రచురితమైనాయని, ఆమె రాసిన కవితల్ని ఉదయమిత్ర తెలుగులో అనువాదం చేసి 'రాయకూడని పద్యం' అనే సంకలనాన్ని వెలుగులోకి తెచ్చారు.ఈ సమావేశంలో కవయిత్రి విమల, మాతృక సంపాదకులు రమాసుందరి, కవి పుప్పాల శ్రీరామ్, కవయిత్రి, విద్యార్థినీ సాత్విక నన్నెబోయిన, కవి, విద్యార్థి దొంతం చరణ్ తదితరులు పాల్గొన్నారు.

## సిటీ కళాశాలలో రసాయన శాస్త్రం-బహు శాస్త్రంతార పరిశోధన జాతీయ సదస్సు



నవతెలంగాణ-ధూల్‌పేట్

ప్రభుత్వ సిటీ కళాశాల రసాయన శాస్త్ర విభాగంలో మార్చి 19, 20 తేదీలలో అంతర్జాతీయ సదస్సు నిర్వహిస్తున్నదని ప్రిన్సిపాల్ ఆచార్య బాల భాస్కర్ తెలిపారు. 'రసాయన శాస్త్రం-బహు శాస్త్రంతార పరిశోధన అవకాశాలు' అనే అంశంపై నిర్వహిస్తున్న ఈ సదస్సుకు తెలంగాణ రాష్ట్ర ఉన్నత విద్యామండలి సౌజన్యం, లారస్ లాబ్స్, ఎస్ఎస్కె బయో సైన్సెస్ సహకారం అందిస్తున్నాయన్నారు. ఈ సదస్సు పోస్టర్‌ను కళాశాలలో రసాయన శాస్త్ర విభాగం ఆధ్వర్యంలో విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కెమిస్ట్రీ విభాగం అధ్యక్షులు డాక్టర్.ఏలూరి యాదయ్య సమన్వయం చేస్తున్న ఈ సదస్సులో రాష్ట్ర, రాష్ట్రేతర అధ్యాపకులు, ఆచార్యులు పాల్గొంటున్నారని తెలిపారు. 19న ప్రారంభ సభను ఐబీసీటీ సంచాలకులు డాక్టర్.డి.శ్రీనివాస రెడ్డి ప్రారంభిస్తారన్నారు. ఈ సదస్సులో ప్రముఖ పరిశోధకులు ఆచార్య సిహెచ్. సుబ్రహ్మణ్యం, డాక్టర్.కె.రాజేందర్ రావు, డాక్టర్.ఎన్. రవికుమార్ రెడ్డి, డాక్టర్.పి.దివాకర్ తదితరులు పాల్గొంటారని తెలిపారు. ఇతర దేశాల నుండి శాస్త్ర వేత్తలు ఆన్ లైన్ లో పత్ర సమర్పణ చేస్తారని తెలిపారు. డాక్టర్.విప్లవ్ దత్ శుక్లా, డాక్టర్.దయానంద్, వసంత, అనిల్ బూసి, డా.రత్న ప్రభాకర్, డాక్టర్.జె.నీరజ, డా.రవి కుమార్, డా.శంకర్, డా.భాస్కర్ సదస్సు నిర్వహణలో సహకరిస్తారని డాక్టర్.యాదయ్య తెలిపారు.

## అంబలి, దుస్తులు పంపిణీ



నవతెలంగాణ-ముషీరాబాద్

వేసవి తాపానికి ఇబ్బంది పడుతున్న పాదచారులు, వాహనదారులకు, రోడ్ల పక్కన జీవనం సాగిస్తూ అనాథలు, నిరాశ్రయులకు స్కై ఫౌండేషన్ ఆధ్వర్యంలో అంబలి, దుస్తులు, నీళ్ల ప్యాకెట్స్ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ప్రెసిడెంట్ డాక్టర్. వై. సంజీవ కుమార్, వైస్ ప్రెసిడెంట్ ఓ.పావని సేవ సభ్యులు శుభం, సాయికిరణ్, సిద్దార్థ పాల్గొన్నారు.

## విద్యార్థులు ప్రశాంత వాతావరణంలో పరీక్షలు రాయాలి

- చిక్కడపల్లి ఇన్‌స్పెక్టర్ సీతయ్య



నవతెలంగాణ-ముషీరాబాద్

పదవ తరగతి పరీక్షలకు విద్యార్థిని, విద్యార్థులు ఆందోళన చెందకుండా ప్రశాంత వాతావరణంలో పరీక్షలు రాయాలని చిక్కడపల్లి ఇన్‌స్పెక్టర్ సీతయ్య తెలిపారు. ఎగ్జామ్స్ సెంటర్లకు చేరుకోలేని పరిస్థితుల్లో ఉన్న విద్యార్థులకు లిఫ్ట్ ఇవ్వడం, ఇతర సాయం చేయాలని ఎందుకంటే వారు రాసేది పదవ తరగతి పరీక్షలు వాళ్ళ భవిష్యత్తు కూడా అని మర్చిపోవద్దన్నారు. విద్యార్థిని, విద్యార్థులు కూడా పోలీసుల సహాయాన్ని కోరవచ్చునన్నారు. హాల్ టికెట్లు, పెన్నులు ఎట్టి పరిస్థితుల్లో మర్చిపోవద్దని తెలిపారు. బస్సులలో పదవ తరగతి సెంటర్లకు చేరుకునే విద్యార్థులకు అనుకొని పరిస్థితులు ఎదురైతే వారికి సాయం చేసి పరీక్ష రాసే సెంటర్ దగ్గరి వరకు లిఫ్ట్ ఇచ్చి వారి ఆందోళన చెందకుండా మనోధైర్యం ఇవ్వాలని పదవ తరగతి పరీక్షలు జరిగే సెంటర్ వద్ద 144 సెక్షన్ ఉంటుందని ఎవరు కూడా గుంపులు గుంపులుగా వెళ్లడం తిరగడం చేయకూడదన్నారు.

## మహిళల్లో అపారమైన ప్రతిభ దాగి ఉంది

**ప్రజాశక్తి పూర్వ సంపాదకులు వినయ్ కుమార్, ప్రముఖ కవి డా. రాపోలు సుదర్శన్**



నవతెలంగాణ-ముషీరాబాద్

మహిళల్లో అపారమైన ప్రతిభ దాగి ఉం దని ప్రజాశక్తి పూర్వ సంపాదకులు వినయ్ కుమార్, ప్రముఖ కవి డాక్టర్ రాపోలు సుదర్శన్ అన్నారు. నాయీ బ్రాహ్మణ మహిళా సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షురాలు దుర్గా రాణి ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా నాయీ మహిళలకు ప్రతిభా పురస్కారాలు ప్రధానోత్సవ కార్యక్రమం బాగ్‌లింగంపల్లిలోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో నిర్వహించారు. వివిధ రంగాల్లో రాణిస్తున్న నాయి బ్రాహ్మణ మహిళలకు ప్రతిభా పురస్కారాలు అందించి ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ప్రజాశక్తి పూర్వ సంపాదకులు వినయ్ కుమార్, ప్రము ఖ కవి డాక్టర్ రాపోలు సుదర్శన్ ,వికారాబాద్ ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ రాఘవీణ, హాజరయ్యారు. ఈ సందర్భంగా వినయ్ కుమార్ మాట్లాడుతూ మహిళలు అన్ని రంగాల్లో రాణించినప్పుడే మహిళా సాధికత సాధ్యమవు తుందన్నారు. మహిళల్లో అపారమైనటువంటి సృజనాత్మక కళ దాగి ఉందని వారిని ప్రోత్సహిస్తే అద్భుతాలు చేస్తారని తెలిపారు. ఈ కార్యక్రమంలో సి డబ్ల్యూ ఎస్ డిపార్ట్మెంట్ కాచిగూడ సెంట్రల్ రైల్వే స్టేషన్ నాయి బ్రాహ్మణ మహిళా సంక్షేమ సంఘం గౌరవ అధ్యక్షులు అనిత, కమిట్ సొల్యూషన్ ఫైనాన్స్ అడ్వెంచర్ అనుపమ, రాష్ట్ర అధ్యక్షురాలు దుర్గారాణి,ఉపాధ్యక్షులు భాగ్యలక్ష్మి, ప్రధాన కార్యదర్శి ఉషారాణి, కోశాధికారి రేణుక, సంయుక్త కార్యదర్శి నాగరాణి, సహాయ కార్యదర్శి నవనీత, కార్యవర్గ సభ్యులు సిహెచ్ విద్య, అంబర్‌పేట కమిటీ సభ్యులు ఉమా రాణి తదితరులు పాల్గొన్నారు.

## బీసీ జాబితా నుంచి తొలగించిన నాగవంశ 26 కులాలను వెంటనే బీసీ జాబితాలో చేర్చాలి

- నాగవంశం ఉపకులాల సభ్యుల డిమాండ్



నవతెలంగాణ మెహిదీపట్నం

కేసీఆర్ ప్రభుత్వం 2014వ సంవత్సరంలో బీసీ కులాల జాబితా నుండి తొలగించి ఓసి జాబితాలో కలిపిన 26 నాగవంశ ఉప కులాలను ప్రస్తుత ప్రభుత్వం వెంటనే బీసీ కులాల జాబితాలో కలపాలని నాగవంశం ఉపకుల సభ్యులు డిమాండ్ చేశారు. మెహిదీపట్నం రామ్ సింగాపురం కెఎస్ ఫంక్షన్ హాల్ లో నాగవంశ కులస్తులను తిరిగి బీసీ జాబితాలో చేర్చాలని డిమాండ్ చేస్తూ ఆదివారం నాగవంశ ఉపకులస్తులు సభ నిర్వహించారు. ఈ సందర్భంగా నాగవంశ ఉప కులస్తుల నగర ఉపాధ్యక్షులు గరికె లక్ష్మణ్ మాట్లాడుతూ 2014వ సంవత్సరంలో తెలుగు రాష్ట్రాలు విడిపోయిన తర్వాత అప్పటి కేసీఆర్ ప్రభుత్వం తమ 26 ఉప కులాలని బీసీ జాబితా నుండి తొలగించి ఓసి జాబితాలోకి చేర్చి తమకు తీవ్ర అన్యాయం చేసిందని ఆవేదన వ్యక్తం చేశారు. తమ నాగవంశం కులము చాలా వెనుకబడిందని గత 35 సంవత్సరాలుగా తెలంగాణ ప్రాంతంలో భవన నిర్మాణ కార్మికులుగా, ప్రైవేట్ రంగాలలో చిరు ఉద్యోగులుగా, దినసరి కూలీలుగా జీవనం గడుపుతున్నామని ఇలాంటి తమని ఓసి జాబితాలోకి చేర్చడం తీవ్ర అన్యాయమన్నారు. నాగవంశకులస్తుల 500 కుటుంబాలు మెహదీపట్నం, హీరానగర్, కనకదుర్గ కాలనీ, మందలగూడ తదితర ప్రాంతాలలో నివాసముంటున్నామని ఆయన చెప్పారు. గతంలో రేవంత్ రెడ్డి కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే 100 రోజుల్లోనే తమను బీసీ జాబితాలోకి మారుస్తామని హామీ ఇచ్చారని ఆయన తెలిపారు. ఇప్పటికైనా రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం తమను బీసీ జాబితాలోకి మార్చాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ప్రభుత్వం వెంటనే చర్య తీసుకోకపోతే పోరాటాన్ని ఉధృతం చేస్తామని ఆయన హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో నాగవంశం సంక్షేమ సంఘం అధ్యక్షులు బుగత సాంబశివ, సెక్రటరీ తల్లాడ శ్రీనివాసరావు, సభ్యులు బాలకృష్ణ, తేజరావు, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు

## దేశంలో ఉన్న గ్రామీణ బ్యాంకులను అన్నింటిని కలిపి జాతీయ గ్రామీణ బ్యాంకుగా ఏర్పాటు చేయాలి

- ఆలిండియా రూరల్ బ్యాంక్ ఎంప్లాయిన్ అసోసియేషన్ సెక్రటరీ జనరల్ ఎన్. వెంకటేశ్వరరెడ్డి



నవతెలంగాణ-ముషీరాబాద్

దేశంలో ఉన్న గ్రామీణ బ్యాంకులను అన్నింటిని కలిపి జాతీయ గ్రామీణ బ్యాంకుగా ఏర్పాటు చేయాలని ఆలిండియా రూరల్ బ్యాంక్ ఎంప్లాయిస్ అసోసియేషన్ సెక్రటరీ జనరల్ ఎస్.వెంకటేశ్వరరెడ్డి డిమాండ్ చేశారు. ఆదివారం బాగ్‌లింగంపల్లి సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ఆంధ్రప్రదేశ్ గ్రామీణ వికాస్ బ్యాంక్ ఎంప్లాయిస్ యూనియన్ కార్యనిర్వాహక కమిటీ ఆధ్వర్యంలో ఏపీజీవీబీఈయు పూర్వ ప్రధాన కార్యదర్శి, ఆలిండియా రూరల్ బ్యాంక్ ఎంప్లాయిస్ యూనియన్ ఉపాధ్యక్షుడు కె. భిక్షమయ్య పదవీ విరమణ సభ ఏపీటీఆర్ఆర్ఈఎ అధ్యక్షుడు బి. రవికాంత్ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా వెంకటేశ్వరరెడ్డి మాట్లాడుతూ దేశంలో, రాష్ట్రంలో బ్యాంకింగ్ ఉద్యోగులకు సంబంధించిన పోరాటాల్లో 35 ఏళ్ళ పాటు బిక్షమయ్య లాంటి నాయకులు విశేషంగా సేవలందించారన్నారు. ఏపీజీవీపీ ప్రధానంగా బిక్షమయ్య 32 సంవత్సరాలుగా పనిచేస్తూ సంఘ కార్యక్రమాల్లో ముందుండి పనిచేస్తూ విజయవంతంగా సమస్యలను పరిష్కరించడంలో విజయం సాధించారన్నారు. భారతదేశంలో ఏర్పాటైనా గ్రామీణ బ్యాంకులు మొదటి నుంచి కూడా పోరాటాల నుంచి వచ్చాయని, ఒక ప్రయోగాత్మకంగా వాణిజ్య బ్యాంకుల పనితనాన్ని సహకార బ్యాంకుల కలుపుకుని ఒక కొత్త బ్యాంకింగ్ రంగాన్ని తెవాలనే ఉద్దేశ్యంతో ఉద్యోగులకు అడహక్ వేతనాలను అందిస్తూ ప్రారంభమైన గ్రామీణ బ్యాంకింగ్ వ్యవస్థ నేడు ఇతర బ్యాంకులతో సమానంగా సేవలందిస్తూ ముందుకు సాగుతున్నాయన్నారు. అదే విధంగా గ్రామీణ బాంకులలో పనిచేస్తున్న ఉద్యోగులకు సర్వీస్ కండీషన్లు, ఉద్యోగభద్రత, దేశంలో కార్మిక చట్టాలు అమలు చేయాలని, వాణిజ్య బ్యాంకులతో సమానంగా వేతనాలు ఇవ్వాలని వేసిన పోరాటల ఫలితంగా నేడు ఈ రంగంలో పనిచేస్తున్న వారందరికి వేతనాలు కూడా అందుతున్నాయన్నారు. గ్రామీణ బ్యాంకులు లేకపోతే మనుగడ ప్రశ్నార్థకమే రీతిలో సేవలను అందిస్తూ ముందుకు సాగుతున్నాయన్నారు. ప్రస్తుతం దేశవ్యాప్తంగా వివిధ గ్రామీణ బ్యాంకుల ద్వారా రూ.11లక్షల కోట్ల వ్యాపారం చేస్తున్నామని, అంటే స్టేట్ బ్యాంక్, పంజాబ్ నేషనల్ బ్యాంక్, బ్యాంక్ ఆఫ్ బరోడా వంటి వరుసలో ఆరవ స్థానంలో గ్రామీణ బ్యాంకులు ఉన్నాయని, ఆయా ప్రధాన వాణిజ్య బ్యాంకులతో పోలిస్తే గ్రామీణ బ్యాంకులు మంచి లాభాల్లో ఉన్నాయన్నారు. కశ్మీర్, ఈశాన్యరాష్ట్రాల్లో ఉన్న బ్యాంకులు తప్ప మొత్తంగా చూసుకుంటే అన్నిరంగాల్లో లాభాల్లో ఉన్నాయని, వ్యాపారరంగాల్లో మరింత గణనీయమైన ప్రగతి సాధిస్తూ ముందుకు సాగుతున్నాయని ఇది శుభపరిణామన్నారు. దేశవ్యాప్తంగా అన్ని జిల్లాలు, గ్రామాల్లో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న అభివృద్ధి సంక్షేమ పథకాలకు సంబంధించిన గుణాలు అందించడం పథకాలు అమలు చేయడంలో గ్రామీణ బ్యాంకులే వాణిజ్య బ్యాంకులకంటే ముందుంటాయన్నారు. ఈ సభలో ఆంధ్రప్రదేశ్ గ్రామీణ వికాస్ బ్యాంక్ చైర్మన్ కె. ప్రతాపరెడ్డి, ఏపీజీవీబీఈయు అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు పి.వేణు రావు, కెవిఎస్పీఎస్. రాజు, ఏపీజీవీబీఓఏ అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు కెకె. ముకుంద్, జి.అప్పలనాయుడు తదితరసంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

## గుర్తు తెలియని వ్యక్తి హత్య

- గ్రానైట్ రాయితో తలపై కొట్టి హత్య చేసిన దుండగులు



నవతెలంగాణ-ముషీరాబాద్

గ్రానైట్ రాయితో తలపై కొట్టి గుర్తు తెలియని వ్యక్తిని దుండగులు హత్య చేశారు. ఈ ఘటన చిక్కడపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. చిక్కడపల్లి పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ సీతయ్య తెలిపిన వివరాల ప్రకారం బాగ్‌లింగంపల్లిలోని మీనాక్షి హోటల్ ఎదురుగా ఉన్న ఫుట్‌పాత్‌పై కొందరు దుండగులు గుర్తు తెలియని వ్యక్తిని గ్రానైట్ రాయితో తలపై కొట్టి హత్య చేసిన దుండగులు అక్కడి నుంచి పరారయ్యారు. చిక్కడపల్లి పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని మృతదేహాన్ని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి నిందితులపై గాలింపు చేపట్టారు. గుర్తు తెలియని వ్యక్తి ప్రాథమికంగా లభిం చిన ఆధారాల ప్రకారం చనిపోయిన వ్యక్తి పేరు గోపాల్ రెడ్డి అని వయసు (72) సంవత్సరాలుగా ఉండి వైట్ అండ్ బ్లూ కలర్ చెక్స్ షర్ట్ నావీ బ్లూ కలర్ షార్ట్ ధరించి ఉన్నాడు. ఎవరైనా మృతుని గుర్తించినచో చిక్కడపల్లి పోలీస్‌స్టేషన్‌కు సమా చారం అందించాలని కోరారు.

## ప్రభుత్వ సంస్థల్లో జీవో 102 అమలు చేయాలి

- రజకులను ఎస్సీ జాబితాలో చేర్చాలి :
- తెలంగాణ రజక సంఘాల సమన్వయ కమిటీ చైర్మెన్ శంకర్




నవతెలంగాణ-సిటీబ్యూరో

ప్రభుత్వ సంస్థలలో దుస్తులను శుభ్రం చేసే విధులను రజకులకు సత్వరమే కేటాయించాలని తెలంగాణ రజక సంఘాల సమన్వయ కమిటీ చైర్మెన్ బస్వరాజు శంకర్ కోరారు. విధివిధానాలను ఖరారు చేసి జీవో 102ను అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఆదివారం బాగ్‌లింగంపల్లి సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో సమన్వయ కమిటీ రాష్ట్ర ముఖ్య నాయకుల సమావేశం కొన్నే సంపత్ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా బస్వరాజు శంకర్ మాట్లాడుతూ 18 రాష్ట్రాల్లో ఎస్సీ జాబితాలో ఉన్న రజకులను తెలం గాణ రాష్ట్రంలో ఎస్సీ జాబితాలో చేర్చాలని కోరారు. ఫెడరేషన్‌కు వెయ్యి కోట్ల నిధులు మంజూరు చేసి కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ముఖ్య మంత్రి రేవంత్ రెడ్డి ఇచ్చిన హామీ మేరకు ట్యాంక్ బండ్‌పై చాకలి ఐలమ్మ విగ్రహాన్ని నెలకొల్పి వచ్చే జయంతిని ఘనంగా జరపాలని బస్వరాజు శంకర్ విజ్ఞప్తి చేశారు. ఉప్పల్ భగాయత్‌లో రజకుల ఆత్మగౌరవ భవనానికి మూడెకరాల స్థలం కేటాయించి భవన నిర్మాణానికి పది కోట్లను కేటాయించాలని కోరారు. ఈ సమావేశంలో ఐలమ్మ మను మడు చిట్యాల రామచంద్రయ్య ముని మనుమరాలు శ్వేత, కమిటీ ప్రతినిధులు కొండూరు సత్యనారాయణ, బాలరాజ్, జయరాం, దుబ్బాక రమేష్, కుమారస్వామి, బ్రహ్మయ్య, గోపి, ముదిగొండ మురళి తదితరులు పాల్గొన్నారు.



**రాగి జావతో....**

రోజంతా ఉత్సాహంగా ఉండొచ్చు.
ఎదిగే పిల్లల మెదడు చురుగ్గా ఉంటుంది.
శరీర వేడిని తగ్గిస్తుంది.
శారీరక దృఢత్వాన్ని ఇస్తుంది.
బీపీ, షుగర్ అదుపులో ఉంటాయి.
కాలంతో సంబంధం లేకుండా దీన్ని తాగొచ్చు.

పాలు తాగటం ఆరోగ్యకరమైన అలవాటే కానీ, కచ్చితంగా పాలు తాగాలని ఏమీ లేదు. ఎందుకంటే తెల్ల నువ్వులలో కూడా పాలలో కన్నా ఎక్కువ కాల్షియం దొరుకుతుంది. కాబట్టి పాల మీద మనకున్న అవగాహనలో మార్పు రావాలి.



# ఓ మహిళా రైతు విజయగాథ



**43ఏండ్ల సువర్ణ భగవాన్ పాటిల్...**

**వ్యవసాయ జీవితం ఆమెకు కొత్త కాదు. ఓ రైతు కుటుంబంలో పుట్టి పెరిగిన ఆమె చాలా చిన్న వయసులోనే వ్యవసాయ మెళకువలు నేర్చుకుంది. వివాహం చేసుకొని మరో రైతు కుటుంబంలోకి అడుగుపెట్టింది. అత్తింట్లో కూడా వ్యవసాయంలో తన నైపుణ్యాలను ప్రదర్శించింది. మహారాష్ట్రలోని కొలాపూర్ జిల్లా గొండోలి గ్రామంలోని తన 2.5 ఎకరాల భూమిలో అనేక పంటలు పండిస్తున్న ఆమె పరిచయం నేటి మానవిలో...**

రాష్ట్రంలోనే ప్రఖ్యాతి గాంచిన షుగర్ బెల్ట్‌లో భాగంగా ఆమె చెరకు పండిస్తుంది. ఎన్నో ఏండ్లుగా వ్యవసాయంలో అనుసరిస్తున్న సంప్రదాయ పద్ధతుల వల్ల పంట నష్టపోతుందని ఆమె తెలుసుకుంది. దీర్ఘకాల పంట (12-14 నెలలు) కావడంతో చిన్న తరహా రైతు కుటుంబాలకు చెరకు సాగు కష్టతరంగా మారింది. ఇంటెన్సివ్ వ్యవసాయ కార్యకలాపాలు, పరిమిత ఆదాయంతో రైతులు అనేక ఇబ్బందులు పడుతున్నారు. అలాగే వాతావరణ మార్పులు కూడా వారి కష్టాలు మరింత పెరిగేలా చేసాయి.

### మార్పును అంగీకరించినపుడు

వ్యవసాయంలో కొత్త మార్పులు తీసుకురావాలనే నిర్ణయానికి వచ్చినపుడు దాన్ని ఎలా కొనసాగించాలనే సందిగ్ధంలో పడింది. అదే సమయంలో అంతర్జాతీయ నెట్‌వర్క్ సంస్థ అయిన సాలిడారిడాడ్ అండ్ దాల్మియా భారత్ షుగర్ ఇండస్ట్రీస్ లిమిటెడ్ (DBSIL) ఆధ్వర్యంలో ఉన్నతి మీరా సోనా ప్రాజెక్ట్‌ను గ్రామంలో నేల సారాన్ని మెరుగుపరచడంపై శిక్షణా సమావేశం ఏర్పాటు చేశారు. దాని SheTheDifference మహిళా సాధికార సంస్థ చొరవలో భాగంగా కోకా కోలా ఫౌండేషన్ నుండి మద్దతు తీసుకున్నారు. మహారాష్ట్రలోని సాంగ్లీ జిల్లాలోని నినైదేవిలో DBSIL యాజమాన్యంలోని మిల్లుకు చెరకు సరఫరా చేసే సువర్ణ వెంటనే శిక్షణ కోసం చేరిపోయారు. అక్కడ పునరుత్పత్తి వ్యవసాయ పద్ధతుల గురించి నిపుణులు చెప్పిన విషయాలను ఆమె ఓపికగా విన్నది. వర్మీ కంపోస్టింగ్, దాని వల్ల మట్టికి, రైతుకు కలిగే ప్రయోజనాల గురించి చెప్పిన విషయాలు ఆమెకు బాగా నచ్చాయి.

### పూర్తి అవగాహన వచ్చింది

నేల అవసరాలేంటి, సాంప్రదాయ పద్ధతుల వల్ల జరుగుతున్న నష్టం ఏంటనే దాని గురించి ఆమెకు శిక్షణా తరగతుల్లో పూర్తి అవగాహన వచ్చింది. పంటలకు వేసే రసాయన ఎరువుల మోతాదులు ఎక్కువయ్యాయని, ఖర్చు కూడా చాలా ఎక్కువే కాకుండా ఆ ఎరువులు పంటకు హాని కలిగిస్తున్నాయని అర్థం చేసుకుంది. అప్పటి నుండి వర్మీకంపోస్ట్‌పై పూర్తి శ్రద్ధ పెట్టింది. ఎందుకంటే ఒక బయోఫెర్టిలైజర్‌గా, వర్మీకంపోస్ట్ సమర్థవంతమైన పరిష్కారమని తెలుసుకుంది. దీనికి ఖర్చు కూడా చాలా తక్కువ. అలా ఆమె 2022లో తన వర్మీకంపోస్టింగ్ ప్రయాణాన్ని ప్రారంభించింది. అదే ఆమెను అంచలంచలుగా ఎదిగేలా చేసింది. రైతు వ్యాపారవేత్తగా మార్చేసింది.

### నేల ఆరోగ్యంగా ఉంటేనే...

'నేను మట్టిని ఆరాధిస్తాను. ఎందుకంటే మనం తినే ఆహారం మట్టి నుండే లభిస్తుందని నాకు తెలుసు. నేను భూమి తల్లిని ప్రేమిస్తున్నాను. నేల ఆరోగ్యంగా ఉంటే దానిపై పండే ఆహారం కూడా నాణ్యంగా ఉంటుంది. తద్వారా ఆ ఆహారాన్ని తినే మానవుల ఆరోగ్యం కూడా బాగుంటుందని నేను అర్థం చేసుకున్నాను. శిక్షణా కార్యక్రమంలో మట్టిపై వర్మీ కంపోస్ట్ వల్ల కలిగే ప్రయోజనాల గురించి తెలుసుకుని ఆ యూనిట్‌ని ఏర్పాటు చేయాలని నిర్ణయించుకున్నాను. దీని వల్ల మరో ప్రయోజనం ఏమిటంటే వానపాములు, కంపోస్ట్‌లను అమ్మడం వల్ల కూడా నా ఆదాయాన్ని పెంచుకున్నాను' అని సువర్ణ గుర్తు చేసుకుంది. సువర్ణకు వర్మీకంపోస్ట్ బెడ్ (లేదా వర్మి-బెడ్) ఇచ్చారు. యూనిట్‌లను ఏర్పాటు చేయడానికి నిపుణులైన శిక్షకులు అలాగే సాలిడారిడాడ్‌లోని ఫీల్డ్ సిబ్బంది ఆమెకు సహకారం అందించారు. నిపుణుల బృందం ఆమె పొలాన్ని క్రమం తప్పకుండా సందర్శించి నేల పురోగతిని పర్యవేక్షించేవారు. అలాగే ట్రబుల్షూటింగ్, యూనిట్లను నిర్వహించడం వ్యవసాయాన్ని మరింత అభివృద్ధి చేయడంలో సహాయం అందించింది.

### ఆదాయాన్ని పెంచుకుంది

ఐదు నెలల్లోనే నేల సారంలో మార్పు కనిపించింది. ఒక్క బెడ్‌లో 450 కిలోల వర్మీ కంపోస్టు వచ్చింది. సువర్ణ దీనిని తన చెరకు పంటకు మాత్రమే కాకుండా, తన ఇంటి పెరట్లో పెంచే కూరగాయల మొక్కలకు కూడా ఉపయోగించుకుంది. దీనికి కూడా ఫీల్డ్ టీమ్ ఆమెకు మద్దతు ఇచ్చింది. ఇప్పుడు ఆమె తన నలుగురు కుటుంబ సభ్యులకు అవసరమైన తాజా వంకాయలు, పచ్చి బఠానీలు, బెండకాయలు వంటి కూరగాయలను పండిస్తోంది. ఈ కార్యక్రమంలో భాగమైన ఏడాదిలోనే కష్టపడి పనిచేస్తూ రెండు వర్మీ-బెడ్‌ల నుండి 3,200 కిలోల వర్మీ కంపోస్ట్‌ను ఉత్పత్తి చేయడం మొదలుపెట్టింది. తన పొలంలో వినియోగించిన తర్వాత అదనపు మొత్తాన్ని ఇతర రైతులకు విక్రయిస్తుంది. తద్వారా తన ఆదాయాన్ని రూ.20,000 పెంచుకుంది. తన ఇంటి పశువుల పేడ దాదాపు 5,000 కిలోలు ఉంటుంది. దాన్ని వృథాగా పడేయకుండా వర్మికంపోస్ట్‌ను తయారు చేయడానికి ఉపయోగిస్తుంది.



### సివిల్స్‌కు సిద్ధమౌతున్న కొడుకు కోసం

'ఈ పద్ధతి మార్కెట్ ఎరువుల కోసం చేసే ఖర్చుల నుండి నన్ను కాపాడింది. ఇప్పుడు నా పంటకు నేను తయారు చేసిన వర్మీకంపోస్ట్‌తో పాటు సిఫార్సు చేసిన రసాయన ఎరువుల మోతాదును మాత్రమే ఉపయోగిస్తాను. ఈ విజయం ఆర్థికంగా నన్ను మరింత అభివృద్ధి చెందేందుకు ప్రోత్సహిస్తుంది. నా అదనపు ఆదాయంలో కొంత భాగాన్ని మరిన్ని వర్మీ-బెడ్‌లను కొనుగోలు చేయడానికి, వర్మి కంపోస్ట్‌ని విక్రయించడానికి ఉపయోగించాలనుకుంటున్నాను' అని ఆమె వివరిస్తుంది. ప్రస్తుతం సువర్ణ తాను పొదుపు చేసిన డబ్బును సివిల్ సర్వీసెస్ పరీక్షలకు సిద్ధమవుతున్న తన కొడుకు కోసం ఖర్చు చేయాలనుకుంటుంది.

### ఓ చోదక శక్తిగా...

ఓ మహిళా రైతుగా సువర్ణ విజయగాథ ఇతర రైతులకు, మహిళలకు కచ్చితంగా స్ఫూర్తినిస్తుంది. ఆమె తన ప్రాంతంలోని రైతు సమాజంలో ఓ చోదక శక్తిగా మారింది. 'వర్మి కంపోస్ట్‌కు మారిన తర్వాత నేను నా జీవితంలో తేడాను చూశాను. మా గ్రామంలోని ఇతర మహిళా రైతులు కూడా నా అభివృద్ధిని చూస్తున్నారు. వారు కూడా సొంతంగా వర్మీ-బెడ్‌లను ఏర్పాటు చేసుకుంటే వారి జీవితాల్లో కూడా కచ్చితంగా మార్పు వస్తుందని నేను నమ్ముతున్నాను. తద్వారా వారు కూడా అదనపు ఆదాయాన్ని పొంది మంచి జీవితాన్ని అనుభవించగలరు' అంటూ ఆమె తన మాటలను ముగించింది.

- సలీమ

# సీఏఏపై స్టే విధించాలి

(మొదటిపేజీ తరువాయి)

భారతదేశానికి వచ్చిన హిందువులు, సిక్కులు, బౌద్ధులు, జైనులు, పార్శీలు, క్రైస్తవులకు భారత పౌరసత్వం ఇవ్వాలి. అయితే, ఆ దేశాల నుంచి వచ్చిన ముస్లింలకు మాత్రం పౌరసత్వం నిరాకరించబడుతుందని పేర్కొంది. సవరణకు ముందు భారత దేశ పౌరసత్వ చట్టం మతపరమైన గుర్తింపు ఆధారంగా పౌరసత్వాన్ని ఇవ్వాలని ఎక్కడా చెప్పలేదు. కేంద్రంలో రెండోసారి నరేంద్ర మోడీ నేతృత్వంలోని బీజేపీ అధికారంలోకి వచ్చాక మతపరమైన గుర్తింపు ఆధారంగా పౌరసత్వం ఇచ్చేలా సవరణను తీసుకొచ్చింది. సీఏఏ నిబంధనలు రాజ్యాంగ విరుద్ధమని పేర్కొంటూ, కేరళ ప్రభుత్వం, "మత ప్రాతిపదికన పౌరసత్వం మంజూరు చేయడాన్ని సవాల్ చేసింది. కేరళ ప్రభుత్వం గతంలో ఒకసారి సీఏఏ చెల్లుబాటును ప్రశ్నిస్తూ సుప్రీంకోర్టులో కేసు వేసింది. తాజా పిటిషన్‌లో, "బంగ్లాదేశ్, పాకిస్తాన్ , ఆఫ్ఘనిస్తాన్ నుంచి వచ్చిన ముస్లిమేతరులకు మాత్రమే సీఏఏ ఫాస్ట్ ట్రాక్ పౌరసత్వాన్ని అందిస్తుంది.' కానీ, భారతదేశంలో శ్రీలంక, భూటాన్, మయన్మార్ వంటి పొరుగు దేశాల నుంచి వచ్చిన శరణార్థులు ఉన్నారు. వారి మాటేమిటి? చట్టంలో ఈ విషయంలో స్పష్టత లేదు. కేరళ ప్రభుత్వం తన పిటిషన్‌లో ఇంకా ఇలా పేర్కొంది, "మతపరమైన గుర్తింపు, ప్రాంతీయ గుర్తింపు ఆధారంగా వర్గీకరణ పూర్తిగా వివక్షతతో కూడిన చర్య. దేశం చాలా కాలంగా అనుసరిస్తూ వస్తున్న న్యాయ సూత్రాల ప్రకారం, ఒక చట్టం వివక్షపై ఆధారపడి ఉంటే అది చెల్లదు. సీఏఏను సస్పెండ్ చేయాలని, రద్దు చేయాలని కోరుతూ దాఖలైన పిటిషన్లను వచ్చే శుక్రవారం విచారిస్తామని సుప్రీంకోర్టు మొన్న తెలిపింది. కేరళ ప్రభుత్వ పిటిషన్ కూడా ఉంది. వివక్షాపూరిత సీఏఏకు వ్యతిరేకంగా 2019, 2020లో దేశవ్యాప్తంగా పెద్దయెత్తున నిరసనలు చోటుచేసుకున్నాయి.

అప్పుడు కోవిడ్ మహమ్మారి వ్యాప్తి చెందడంతో ఉద్యమం నిలిపివేయబడింది. ప్రభుత్వం కూడా దీనిపై ముందుకు సాగలేదు. అస్సాంతో సహా దేశంలోని వివిధ ప్రాంతాల్లో ఇప్పటికే సీఏఏకి వ్యతిరేకంగా నిరసనలు మొదలయ్యాయి. కేరళ, తమిళనాడు సహా పలు రాష్ట్ర ప్రభుత్వాలు సీఏఏను అమలు చేయబోమని చెప్పాయి.

# వాట్సాప్ గ్రూపులు సిద్ధం

(మొదటిపేజీ తరువాయి)

వీడియోను సమర్పించటానికి అనుమతిస్తుంది. ఎన్డీయే ప్రభుత్వ హయాంలో జరిగిన అభివృద్ధి పనులను హైలైట్ చేసే అనేక చిన్న వీడియోలకు ఇది వేదికగా ఉంటుంది. మరోవైపు, కాంగ్రెస్ పార్టీ కూడా తన వ్యూహాలతో ముందుకెళ్తున్నది. ఆ పార్టీ అగ్రనాయకుడు రాహుల్ గాంధీ వాట్సాప్ గ్రూప్‌ను పార్టీ నడుపుతున్నది. దీనిలో నాయకుడు ప్రజలతో సంభాషిస్తారనీ, వారి ప్రశ్నలకు సమాధానమిస్తారని పార్టీ వర్గాలు చెప్తున్నాయి. "ఏ రాజకీయ పార్టీ తన బ్యానర్‌లో ఎక్కువ వాట్సాప్ గ్రూపులను కలిగి ఉంటే అది ఓటర్లతో వేగంగా, మెరుగ్గా కమ్యూనికేట్ చేయగలదు. ఇది వారి విజయాలను పెద్ద సంఖ్యలో వినియోగదారులతో తక్షణమే హైలైట్ చేయటానికి, ప్రతిపక్షంతో సమాంతరంగా ఉండటం ద్వారా ఓటర్లను ప్రభావితం చేయటానికి వారికి సహాయపడుతుంది" అని ఎన్నికల విశ్లేషకులు అమితాబ్ తివారీ అన్నారు.

ఒకప్పుడు సోషల్ మీడియా ప్రచారానికి కీలక ప్లాట్‌ఫారమ్ అయిన ఫేస్‌బుక్.. రాజకీయ పేజీలలో ప్రకటనలపై అనేక పరిమితుల కారణంగా అది క్షీణించిందని ఆయన చెప్పారు. డేటా-సేకరణ, విజువలైజేషన్ ప్లాట్‌ఫారమ్ అయిన స్టాటిస్టికా ప్రకారం ఫేస్‌బుక్ 36.69 కోట్ల వినియోగదారులను కలిగి ఉన్నది. "పార్టీలు సోషల్ మీడియా ప్లాట్‌ఫారమ్‌లను ఎంచుకుంటాయి. ఇవి ఎక్కువ పరిమితులు లేకుండా తక్షణమే జనాలతో కనెక్ట్ అవ్వటానికి, ఎక్కువ సంఖ్యలో వినియోగదారులను కలిగి ఉండటానికి సహాయపడతాయి. ఇన్‌స్టాగ్రామ్,



ఎక్స్(ట్విట్టర్) వంటి అనేక ఇతర ప్లాట్‌ఫారమ్‌లు ఉన్నాయి. ఇవి నిర్దిష్ట ప్రేక్షకులకు, విభిన్న ఫార్మాట్‌లను కలిగి ఉంటాయి" అని ఆయన చెప్పారు. ఎన్నికల కమిషన్ డేటా ప్రకారం.. బీజేపీ 2019 లోక్‌సభ ఎన్నికల సమయంలో మీడియా ప్రకటనల కోసం (ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్, బల్క్ ఎస్ఎంఎస్, కేబుల్ వెబ్‌సైట్, టీవీ ఛానెల్ మొదలైనవి) మొత్తం రూ.325 కోట్లు ఖర్చు చేసింది. అయితే కాంగ్రెస్ ఖర్చు చేసిన ఖర్చు రూ.356 కోట్లుగా ఉన్నది.

ఇటు సోషల్ మీడియా ఇన్‌ఫ్లుయెన్సర్‌లకు కూడా గణనీయంగా గిరాకీ పెరుగుతున్నది. వారికి సంబంధించిన ప్లాట్‌ఫారమ్‌లపై రాజకీయ నాయకులు కనిపిస్తూ ఇన్‌ఫ్లూయెన్సర్ల సబ్‌స్క్రైబర్లు, ఫాలోవర్లు, అభిమానులనే గాక ఓటర్లను ప్రభావితం చేయటానికి చెమటోడుస్తున్నారు. గత కొన్ని నెలలుగా ఈ ట్రెండ్ అధికమైందని విశ్లేషకులు చెప్తున్నారు. కేంద్ర మంత్రులు ఎస్. జైశంకర్, స్మృతి ఇరానీ, పీయూష్ గోయల్, రాజీవ్ చంద్రశేఖర్ వంటి బీజేపీ నేతలు యూట్యూబ్‌లో 70 లక్షలకు పైగా ఫాలోవర్లను కలిగి ఉన్న పోడ్‌కాస్టర్ రణవీర్ అలహాబాడియాకు ఇంటర్వ్యూలు ఇచ్చారు. ట్రావెల్ అండ్ ఫుడ్ వీడియో పాడ్‌కాస్ట్ అయిన కర్లీ టేల్స్ వ్యవస్థాపకుడు కమియా జానీతో కాంగ్రెస్ నాయకుడు రాహుల్ గాంధీ కూడా భోజనం గురించి సంభాషణ చేశారు. సోషల్ మీడియా వినియోగంలో బీజేపీ మిగతా పార్టీలతో పోలిస్తే ముందు వరుసలో ఉన్నదని విశ్లేషకులు తెలిపారు. కాంగ్రెస్ నాయకుడు రాహుల్ గాంధీ 2015లో 'ఎక్స్' (అప్పట్లో ట్విట్టర్) లో చేరారు. ఇందులో 2.51 కోట్ల మంది ఫాలోవర్లను ఆయన కలిగి ఉన్నారు. 2009లో ఎక్స్‌లో చేరిన ప్రధాని మోడీని 9.63 కోట్ల మంది అనుసరిస్తున్నారు. ఇటు కేంద్ర హోం మంత్రి అమిత్ షా, యూపీ సీఎం యోగి, కాంగ్రెస్ నాయకురాలు ప్రియాంక గాంధీ లు కూడా తమ సోషల్ మీడియా ఖాతాల్లో అధిక సంఖ్యలో ఫాలోవర్లను కలిగి ఉన్నారని విశ్లేషకులు చెప్తున్నారు.

## తమిళనాడులో రెండు స్థానాలకు సీపీఐ(ఎం) అభ్యర్థులు..

నవతెలంగాణ-న్యూఢిల్లీ బ్యూరో

తమిళనాడులో సీపీఐ(ఎం) పోటీ చేసే రెండు లోక్‌సభ స్థానాలకు అభ్యర్థులను ప్రకటించింది. ఈ మేరకు సీపీఐ(ఎం) తమిళనాడు రాష్ట్ర కమిటీ రెండు లోక్‌సభ నియోజకవర్గాలకు అభ్యర్థులను ప్రకటిస్తూ ప్రకటన విడుదల చేసింది. మదురై నుంచి సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత, సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు, సిట్టింగ్ ఎంపీ ఎస్ వెంకటేశన్‌ను మళ్లీ బరిలోకి దింపింది. డిండిగల్ నియోజకవర్గం అభ్యర్థిగా డిండిగల్ జిల్లా కార్యదర్శి, రాష్ట్ర కమిటీ సభ్యుడు ఆర్ సచ్చితానందం ను నిలిపింది.

## వెబ్‌సైట్‌లో ఎలక్టోరల్ బాండ్ల డేటా

(మొదటిపేజీ తరువాయి)

చేయలేదో వివరణ ఇవ్వాలని ఆదేశించింది. ఈమేరకు ఎస్‌బీఐ ఇచ్చిన అదనపు సమాచారాన్ని ఎన్నికల సంఘం తన వెబ్‌సైట్‌లో ఉంచింది. ఈ డేటా ప్రకారం అధికంగా విరాళాలన్ని బీజేపీకే ముట్టాయి.

**బీజేపీకి చందాల రూపంలో..**

బీజేపీకి రూ.6,986.5 కోట్ల విలువైన ఎలక్టోరల్ బాండ్లు వచ్చాయి. 2019-20లోనే రూ.2,555 కోట్లు ఎలక్టోరల్ బాండ్లు వచ్చాయి. టీఎంసీ రూ.1,397 కోట్లు, కాంగ్రెస్‌కు రూ.1,334.35 కోట్లు, వైసీపీకి రూ.442.8 కోట్లు, టీడీపీకి రూ. 181.35 కోట్లు, బీఆర్ఎస్ కి రూ.1,322 కోట్లు, డీఎంకేకి రూ.656.6 కోట్లు, బీజేడీకి రూ.944.5 కోట్లు, జేడీఎస్ కి రూ.89.75 కోట్లు, శివసేన రూ.60.4 కోట్లు, ఆర్జేడీ రూ.56 కోట్లు, ఎస్పీకి రూ. 14.05 కోట్లు, అకాలీదళ్ కి రూ. 7.26 కోట్లు, అన్నాడీఎంకేకి రూ.6.05 కోట్లు, నేషనల్ కాన్ఫరెన్స్ కి రూ.50 లక్షలు వచ్చాయి. సీపీఐ(ఎం), సీపీఐ, సీపీఐఎంఎల్ పార్టీ ఎలక్టోరల్ బాండ్లు స్వీకరించలేదు. బీఎస్పీ, ఎంఐఎం పార్టీలకు ఎలాంటి విరాళాలను అందలేదు.

# కేజ్రీవాల్‌కు మరోసారి ఈడీ సమన్లు

(మొదటిపేజీ తరువాయి)

కేజ్రీవాల్ కోర్టు ముందు శనివారం హాజరయ్యారు. చీఫ్ మెట్రోపాలిటన్ మెజిస్ట్రేట్ ఆయనకు బెయిల్ మంజూరు చేశారు. ఆ మరుసటి రోజే ఈడీ తొమ్మిదోసారి కేజ్రీవాల్‌కు సమన్లు జారీ చేయడం గమనార్హం. ఇదే కేసులో బీఆర్ఎస్ నేత కె.కవితను రెండు రోజుల క్రితం ఈడీ అధికారులు అరెస్ట్ చేశారు. ఇప్పటికే ఈ కేసులో ఆప్ నేతలు మనీశ్ సిసోడియా, సంజయ్‌సింగ్, విజయ్ నాయర్‌లను ఈడీ అరెస్టు చేసింది.



**కేజ్రీవాల్‌పై మరో తప్పుడు కేసు : ఆప్ మంత్రి అతిషీ**

కేజ్రీవాల్‌పై మరో తప్పుడు కేసు బనాయించారని ఆప్ మంత్రి అతిషీ మండిపడ్డారు. ఆమె ఆదివారం మీడియాతో మాట్లాడుతూ మద్యంకేసులో కేజ్రీవాల్‌ను అరెస్ట్ చేయలేమని భావించిన కేంద్రం ఇప్పుడు మరో తప్పుడు కేసుతో కేజ్రీవాల్‌ను ఇబ్బంది పెట్టాలని చూస్తోందని అన్నారు. లోక్‌సభ ఎన్నికల్లో ప్రచారం చేయకుండా అడ్డుకునే ప్రయత్నం చేస్తోందని, అందులో భాగంగానే తాజాగా సమన్లు జారీ చేసిందని విమర్శించారు. కేజ్రీవాల్‌కు శనివారం సాయంత్రం ఈడీ నుంచి మరోసారి సమన్లు అందాయని, ఢిల్లీ జల్ బోర్డ్‌కు సంబంధించిన కేసులో మార్చి 21న ఈడీ కేంద్ర కార్యాలయంలో విచారణకు హాజరుకావాలని ఆ సమన్లలో పేర్కొన్నారని తెలిపారు. ఈ కేసు గురించి ఎవరికీ తెలియదని, ఇదో తప్పుడు కేసని అతిషీ పేర్కొన్నారు.


# కవితను కలిశారు

(మొదటిపేజీ తరువాయి)

హరీశ్ రావులు చేరుకున్నారు. వీరికి మద్దతుగా ఎంపీ వద్దిరాజు రవిచంద్ర, మాజీ మంత్రి ప్రశాంత్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే జీవన్ రెడ్డిలు వచ్చారు. అయితే... వద్దిరాజు రవిచంద్ర, జీవన్ రెడ్డిలకు ఈడీ ఆఫీస్ మెయిన్ గేట్ వరకు మాత్రమే పర్మిషన్ ఇచ్చారు. కాగా, న్యాయవాది మోహిత్ రావు కోర్టు ఆర్డర్స్‌ను ఈడీ ఆఫీస్ సిబ్బందికి చూపించి లోనికి వెళ్లేందుకు అనుమతి తీసుకున్నారు. అనంతరం భర్త అనిల్, కేటీఆర్, హరీశ్ రావుల వ్యక్తిగత సమాచారాన్ని తీసుకొని మొత్తం నలుగురిని లోనికి అనుమతించారు. అయితే తొలిరోజు ఈ ప్రక్రియ కారణంగా కవితను కలవడం కాస్త ఆలస్యమైంది. దీంతో సమయం ప్రకారం 6 నుంచి 7 గంటల వరకు అనుమతి ఉన్నా, అధికారులు అదనంగా మరికొంత సమయం ఇచ్చినట్టు ఈడీ వర్గాల ద్వారా తెలిసింది. దీంతో 7:33 కి మీటింగ్ రూం నుంచి కేటీఆర్, హరీశ్‌రావులు బయటకు రాగా భర్త అనిల్ కాసేపు ఆమెతో ఏకంతంగా మాట్లాడినట్లు సమాచారం. సుమారు 15 నిమిషాల తర్వాత అనిల్, అడ్వోకేట్ మోహిత్ బయటకు రావడంతో... అందరు కలిసి ఈడీ ఆఫీసు నుంచి వెళ్లిపోయారు. మీడియాతో మాట్లాడేందుకు నిరాకరించారు.

**భావోద్వేగానికి లోనైన కవిత... ఆరోగ్య పరిస్థితిపై ఆరా**

ఈడీ కస్టడీలో ఉన్న తనను కలిసేందుకు వచ్చిన కుటుంబ సభ్యులను చూడాగానే కవిత భావోద్వేగానికి గురైనట్టు తెలిసింది. ఈ సందర్భంగా కేటీఆర్, హరీష్ రావులు ఆమెకు భరోసా ఇచ్చినట్టు సమాచారం. తొలుత కుటుంబ సభ్యులను ప్రత్యేక రూంలో ఉంచిన అధికారులు, కవితను అక్కడికి తీసుకొచ్చారు. అనంతరం 40 నిమిషాల పాటు భేటీ జరిగింది. కస్టడీలో ఉన్న ఆమె ఆరోగ్య పరిస్థితి, అధికారులు వ్యవహరించిన తీరు, ప్రశ్నల వివరాలు, ఇతర అంశాలను అడిగి తెలుసుకున్నారు. ప్రధానంగా అరెస్ట్ చేసి ఢిల్లీకి తీసుకువచ్చిన తొలిరోజు ఉదయం 3:30 ప్రాంతంలో కవితకు అన్ నేం ఇంజక్షన్ ఇచ్చినట్లు విశ్వసనీయంగా తెలిసింది. ఆ తర్వాత ఆమెకు హైబీపీ, ఈసీజీ అబ్ నార్మల్ గా వచ్చింది. దీంతో కస్టడీలో ఉన్న ఆమె ఆరోగ్యంపై తొలుత అనిల్, కేటీఆర్, హరీశ్‌రావులు ఆరా తీసారు. అనంతరం ధైర్యంగా ఉండాలని, న్యాయ సహాయం తీసుకుందామని భరోసా కల్పించారు. కస్టడీలో ఒంటరిగా ఉన్నానని ఆందోళన చెందవద్దని, కుటుంబం తన వెంట ఉందని ధైర్యం నింపారు. కవితతో భేటి అనంతరం మరోసారి అనిల్, కేటీఆర్, హరీశ్‌రావులు న్యాయ నిపుణులతో చర్చలు జరిపారు.



**న్యాయవాదులతో కేటీఆర్, హరీశ్ భేటీ**

కవిత ఈడీ కస్టడీ నేపథ్యంలో ఆదివారం మధ్యాహ్నం కేటీఆర్, హరీశ్ రావు లు ఢిల్లీ వచ్చారు. కవితకు లీగల్ గా అందించాల్సిన సహాయంపై న్యాయ నిపుణులతో చర్చించారు. ఇందులో భాగంగా... ప్రస్తుతం కవిత కేసు వాదిస్తోన్న సీనియర్ న్యాయవాది విక్రమ్ చౌదరిని ఆయన కార్యాలయంలో కలిసారు. కాసేపు చర్చల అనంతరం... సుప్రీంకోర్టు సీనియర్ న్యాయవాదులు కపిల్ సిబల్, ముకుల్ రోహత్గిలు వర్చువల్ మోడ్ లో ఈ మీటింగ్ కు హాజరైనట్లు పార్టీ వర్గాల ద్వారా తెలిసింది. సుమారు అరగంట పాటు సాగిన ఈ భేటిలో కవిత అరెస్ట్ పై న్యాయపరంగా ఎలా ముందుకు వెళ్లాలని చర్చించినట్లు తెలిసింది. కవిత అరెస్ట్‌ను సవాల్ చేస్తూ సోమవారం(నేడు) సుప్రీంకోర్టు ను ఆశ్రయించే అంశంపై కూడా ఇందులో ఒక నిర్ణయానికి వచ్చారు. ఈ సందర్భంగా కస్టడీలో కవిత ఎదుర్కొంటున్న ఇబ్బందికర పరిస్థితులు, అధికారుల తీరును బెంచ్ దృష్టికి తీసుకెళ్లి, ఉపశమనం పొందేందుకు యోచిస్తున్నట్లు సమాచారం. ఒకవేళ సర్వోన్నత న్యాయస్థానంలో ప్రతికూల పరిస్థితులు ఎదురైతే... 19న (మంగళవారం) సుప్రీంకోర్టు ముందుకు రానున్న కవిత పిటిషన్ పై కొనసాగించాల్సిన వాదనలపై చర్చించారు.

**సింపుల్ గానే ముగిసిన తొలి రోజు.**

ఏడు రోజులు ఈడీ కస్టడీలో ఉన్న కవితకు తొలిరోజు సింపుల్ గానే ముగిసినట్లు తెలిసింది. ఒంటరిగా ఉన్నప్పటికీ... మొక్కవోని ధైర్యంతో ఆమె మొదటి రోజు ప్రారంభించినట్లు సమాచారం. కస్టడీలో ఉన్న మహిళలను ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు మాత్రమే విచారించాలని నిబంధనలు ఉన్నట్లు న్యాయనిపుణులు చెబుతున్నారు. ఈ నిబంధనలను అనుసరించి ఉదయం 10 గంటల తర్వాత ఆమెను ఈడీ అధికారులు క్వశ్చన్ చేసినట్లు తెలిసింది. డిప్యూటీ డైరెక్టర్ భానుప్రియ మీనా, ఈడీ ఆఫీసర్ తుమ్మోజీ వరలక్ష్మీ సమక్షంలో విచారించినట్లు సమాచారం. లిక్కర్ స్కాంకు సంబంధించి పలు అంశాలపై ఆమెను ప్రశ్నించారు. ఈ కేసులో మాజీ ఆడిటర్ బుచ్చిబాబు, అభిషేక్ బోయిన పల్లి, శ్రీనివాస్ ఇతరులు ఇచ్చిన వాంగ్మూలంపై ఆమె స్టేట్మెంట్ ను రికార్డు చేసినట్లు తెలిసింది. అయితే దాదాపు ఏడు గంటల విచారణ సమయంలో... ఎక్కువ సేపు కవితను ఒంటరిగానే వదిలేసినట్లు తెలిసింది. మరోవైపు ఆదివారం సెలవుదినం కావడంతో ఈడీ అధికారులు కవితను విచారించలేదని చర్చ జరిగింది. కానీ, నిబంధనల్లో ఇలాంటి మినహాయింపులు లేవని ఈడీ వర్గాలు తెలిపాయి.

# నవచిత్రం

## ఒసేయ్ అరుంధతి..


వెన్నెల కిషోర్

వెన్నెల కిషోర్, కమల్ కామరాజు, మోనికా చౌహాన్ ప్రధాన పాత్రల్లో రూపొందుతోన్న చిత్రం 'ఒసేయ్ అరుంధతి'. విక్రాంత్ కుమార్ దర్శకత్వంలో గూడూరు ప్రణయ్ రెడ్డి ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. సినిమా పోస్ట్ ప్రొడక్షన్ కార్యక్రమాలను జరుపుకుంటోంది.

ఈ సందర్భంగా నిర్మాత గూడూరు ప్రణయ్ రెడ్డి మాట్లాడుతూ, 'కమల్ కామరాజు, వెన్నెల కిషోర్, మోనికలతో ఫ్యామిలీ కామెడీ థ్రిల్లర్‌గా ఈ సినిమాను నిర్మిస్తుండటం ఆనందంగా ఉంది. సినిమా చిత్రీకరణ పూర్తయ్యింది. ప్రస్తుతం పోస్ట్ ప్రొడక్షన్ కార్యక్రమాలు జరుగుతున్నాయి. త్వరలోనే సినిమా రిలీజ్ డేట్‌ను అనౌన్స్ చేస్తాం' అని అన్నారు.

'హైదరాబాద్‌లోని మధ్యతరగతి కుటుంబానికి చెందిన ఇల్లాలు అరుంధతి పిల్లాడితో పాటు ఇంటి బాధ్యతలను చూసుకుంటూ ఉంటుంది. ఓసారి సత్యనారాయణ స్వామి వ్రతం చేయాలని అనుకుంటుంది. అయితే అనుకోకుండా అరుంధతికి ఓ సమస్య వస్తుంది. ఆ సమస్య నుంచి తనని తాను కాపాడుకుంటూ ఇంటి పరువును ఎలా కాపాడుకుంటుందనేదే ఈ సినిమా. థ్రిల్లింగ్ ఎలిమెంట్స్‌తో పాటు కామెడీ ప్రధానంగా సాగే చిత్రమిది. కుటుంబ సమేతంగా చూడదగ్గ చిత్రం' అని దర్శకుడు విక్రాంత్ కుమార్ చెప్పారు.

వెన్నెల కిషోర్, మోనికా చౌహాన్, కమల్ కామరాజు, పృథ్వీరాజ్, చిత్రం శ్రీను, అరియానా గ్లోరి, సునీతా మనోహర్, టార్జాన్ తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి నిర్మాత- గూడూరు ప్రణయ్ రెడ్డి, దర్శకత్వం - విక్రాంత్ కుమార్, సినిమాటోగ్రఫీ - సాయి చైతన్య మాటేటి, మ్యూజిక్ - సునీల్ కశ్యప్, ఎడిటర్ - మార్తాండ్ కె.వెంకటేష్, ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్ - వెంకట్ మద్దిరాల, లైన్ ప్రొడ్యూసర్ - ఎన్.మురళీధర్ రావు, ప్రొడక్షన్ కంట్రోలర్ - వాసు.

## ప్రేక్షకుల్ని మెప్పించే ఫ్యామిలీ స్టార్



హీరో విజయ్ దేవరకొండ నటిస్తున్న 'ఫ్యామిలీ స్టార్' సినిమా చిత్రీకరణ మొత్తం కంప్లీట్ చేసుకుంది. మూవీ టీమ్ గుమ్మడికాయ కొట్టేశారు. ఫ్యామిలీ స్టార్ చిత్రీకరణ కంప్లీట్ అని చెబుతూ మేకర్స్ ఒక వీడియోని రిలీజ్ చేశారు. అందులో మృణాల్, విజయ్, పరశురామ్ పెట్ల ఒకరినొకరు అఫెక్షన్‌తో హగ్ చేసుకుంటున్న క్లిప్ ఉంది.

విజయ్ సరసన మృణాల్ ఠాకూర్ హీరోయిన్‌గా నటిస్తున్న ఈ సినిమాను ప్రతిష్టాత్మక నిర్మాణ సంస్థ శ్రీ వెంకటేశ్వర క్రియేషన్స్ బ్యానర్‌లో దిల్ రాజు, శిరీష్ నిర్మిస్తున్నారు. ఈ సినిమాను హోల్ సమ్ ఎంటర్‌టైనర్‌గా డైరెక్టర్ పరశురామ్ పెట్ల రూపొందిస్తున్నారు. ఈ సినిమాకు క్రియేటివ్ ప్రొడ్యూసర్‌గా వాసు వర్మ వ్యవహరిస్తున్నారు. ఏప్రిల్ 5వ తేదీన గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్‌కు రంగం సిద్ధం చేస్తున్నారు.

ఇప్పటికే ఈ సినిమా నుంచి విడుదల చేసిన లిరికల్ సాంగ్స్, టీజర్‌కు సూపర్బ్ రెస్పాన్స్ వస్తోంది. సమ్మర్ బ్లాక్ బస్టర్ గ్యారంటీ అనే నమ్మకం ఈ పాజిటివ్ వైబ్స్‌తో ఏర్పడుతోంది అని మేకర్స్ ధీమా వ్యక్తం చేస్తున్నారు.

విజయ్ దేవరకొండ, పరశురామ్ కాంబోలో రూపొందిన 'గీతగోవిందం' తర్వాత వస్తున్న సినిమా కావడంతో అందరిలోనూ భారీ అంచనాలు ఉన్నాయి. ఆ అంచనాలకు మించి సినిమా ఉంటుందని చిత్రయూనిట్ తెలిపింది. విజయ్ దేవరకొండ, మృణాల్ ఠాకూర్ జంటగా నటిస్తున్న ఈ చిత్రానికి సినిమాటోగ్రఫీ : కేయూ మోహనన్, సంగీతం : గోపీసుందర్, ఆర్ట్ డైరెక్టర్ : ఏ ఎస్ ప్రకాష్, ఎడిటర్ : మార్తాండ్ కె వెంకటేష్.

## నయా షెడ్యూల్ మొదలైంది..



నాని

నాని, డైరెక్టర్ వివేక్ ఆత్రేయ సెకండ్ కొలాబరేషన్‌లో రాబోతున్న పాన్ ఇండియా ఫిల్మ్ 'సరిపోదా శనివారం'. 'అంటే సుందరానికీ' చిత్రంలో నాని సాఫ్ట్ పాత్రలో కనిపించగా, ఈ చిత్రంలో మునుపెన్నడూ లేని యాక్షన్-ప్యాక్డ్ క్యారెక్టర్‌లో ఆశ్చర్యపరచబోతున్నారు.

డివివి ఎంటర్‌టైన్‌మెంట్స్‌పై డివివి దానయ్య, కళ్యాణ్ దాసరి భారీ బడ్జెట్‌తో భారీ కాన్వాస్‌తో ఈ ప్రాజెక్ట్‌ని నిర్మిస్తున్నారు. ఇప్పటికే విడుదలైన టీజర్‌కు ట్రెమండస్ రెస్పాన్స్ వచ్చింది.

ప్రస్తుతం ఈ సినిమా చిత్రీకరణ శరవేగంగా జరుగుతోంది. ఈ చిత్రం నెక్స్ట్ షెడ్యూల్ నేటి (సోమవారం) నుంచి నుంచి ప్రారంభం కానుంది. హీరో నానితో పాటు ఇతర తారాగణం పాల్గొనే ఈ షెడ్యూల్‌లో పవర్ ప్యాక్డ్ యాక్షన్ సీన్స్ పాటు కొన్ని కీలక సన్నివేశాలని చిత్రీకరించనున్నారు. ఈ యాక్షన్ సీన్స్ సినిమాలో హైలెట్‌గా ఉండబోతున్నాయి. ఈ చిత్రంలో ప్రియాంక అరుల్ మోహన్ కథానాయిక. సూర్య కీలక పాత్ర పోషిస్తున్నారు. ఈ పాన్ ఇండియా చిత్రం ఆగస్ట్ 29న తెలుగు, తమిళం, కన్నడ, మలయాళం, హిందీ భాషల్లో గ్రాండ్ విడుదల కానుంది. ఈ చిత్రానికి రచన, దర్శకత్వం: వివేక్ ఆత్రేయ, సంగీతం: జేక్స్ బిజోయ్, డీవోపీ: మురళి జి, ఎడిటర్: కార్తీక శ్రీనివాస్, ఫైట్స్: రామ్-లక్ష్మణ్.

## సమ్మర్ స్పెషల్‌గా రిలీజ్


సూర్య తేజ, మీనాక్షి గోస్వామి

సూర్య తేజ ఏలే డెబ్యు మూవీ 'భరతనాట్యం'. దొరసాని ఫేమ్ కేవీఆర్ మహేంద్ర దర్శకత్వంలో పీఆర్ ఫిల్మ్ బ్యానర్‌పై పాయల్ సరాఫ్ నిర్మించారు. మీనాక్షి గోస్వామి హీరోయిన్‌గా నటిస్తున్న ఈ చిత్రంలో వైవా హర్ష, హర్షవర్ధన్, అజయ్ ఘోష్, సలీం ఫేకు, టెంపర్ వంశీ కీలక పాత్రలు పోషిస్తున్నారు.

లీడ్ పెయిర్ పై చిత్రీకరించిన రొమాంటిక్ నెంబర్ 'చేసావు ఏదో మాయను..' విడుదల చేసిన మేకర్స్ సినిమా విడుదల తేదీని కూడా అనౌన్స్ చేశారు. ఏప్రిల్ 5న వేసవిలో ప్రేక్షకులని అలరించడానికి ఈ సినిమా సిద్ధంగా ఉంది. సమ్మర్ హాలిడేస్‌ను సినిమా క్యాష్ చేసుకోబోతోంది. తన కథలో హీరోలా జీవితంలో చాలా సమస్యలను ఎదుర్కొనే ఔత్సాహిక ఫిల్మ్ మేకర్‌గా ఇందులో సూర్య తేజ కనిపించబోతున్నారు. ప్రోమోల్లో సూర్యతేజ తన నటనతో ఆకట్టుకున్నాడు. ఈ చిత్రానికి వివేక్ సాగర్ సంగీతం అందించగా, వెంకట్ ఆర్ శాకమూరి డీవోపీగా పని చేస్తున్నారు. రవితేజ గిరిజాల ఈ చిత్రానికి ఎడిటర్.గంగవ్వ, కృష్ణుడు, టెంపర్ వంశీ, నాగ మహేష్, టార్జాన్, మాణిక్ రెడ్డి, శివన్నారాయణ, సత్తన్న, సంతోష్ బాలకృష్ణ తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి దర్శకత్వం: కేవీఆర్ మహేంద్ర, నిర్మాత: పాయల్ సరాఫ్, కథ: సూర్య తేజ ఏలే, స్క్రీన్ ప్లే: సూర్య తేజ ఏలే, కేవీఆర్ మహేంద్ర, సంగీతం: వివేక్ సాగర్, డీవోపీ: వెంకట్ ఆర్ శాకమూరి, ఎడిటింగ్: రవితేజ గిరిజాల, ఆర్ట్: సురేష్ భీమగాని.

## మంచి సినిమా అని ఫీల్ అవుతున్నారు



కాన్సెప్ట్ ఫిలిమ్స్ బ్యానర్ పై ఈనెల 15న విడుదలైన సినిమా 'లంబసింగి'. భారత్ రాజ్, దివి హీరో హీరోయిన్‌గా నటించిన ఈ సినిమాను దర్శకుడు కళ్యాణ్ కృష్ణ నిర్మించగా, నవీన్ గాంధీ దర్శకత్వం వహించారు. ఈ చిత్ర సక్సెస్ మీట్ గ్రాండ్‌గా జరిగింది.

ఈ సందర్భంగా దర్శకుడు, నిర్మాత కళ్యాణ్ కృష్ణ మాట్లాడుతూ,'నేను ఒక దర్శకుడిగా ఉండి ఇంకో దర్శకుడితో సినిమా చెయ్యడానికి కారణం ఏంటంటే... టాలెంట్ ఉండి కూడా అవకాశాలు రాక చాలా మంది ఉంటారు, నేను కూడా అలా అవకాశాల కోసం ఎన్నో ఇబ్బందులు పడ్డాను. దీంతో నేను కొందరికి అవకాశం ఇద్దామని సినిమా నిర్మాణంలోకి అడుగు పెట్టాను. నేను అసిస్టెంట్ డైరెక్టర్‌గా ఉన్నప్పుడు డైరెక్షన్ చెయ్యడానికి ఏడేళ్ల వెయిట్ చేశాను. ప్రతిరోజు రేపే అనుకుంటూ గడిపే నాకు నాగార్జున నాకు అవకాశం ఇచ్చారు. ఆయనకు ఎప్పుడూ నేను రుణపడి ఉంటాను. నవీన్ గాంధీ తాను అనుకున్న కథను అద్భుతంగా తెరకెక్కించారు, ఆర్.ఆర్.ధ్రువన్ టాప్ మ్యూజిక్ డైరెక్టర్ అవుతారు. ఈ సినిమా కోసం సూపర్ మెలోడీస్ ఇచ్చారు. ఆర్ట్ ఝాన్సీ కెమెరామెన్ బుజ్జి ఇలా అందరూ కష్టపడ్డారు, వారి కష్టానికి ఫలితం ఈరోజు లభించింది, సినిమాను అందరూ చూసి ఎంకరేజ్ చెయ్యాలని కోరుకుంటున్నాను' అని తెలిపారు.

'ఈ కథ రాసినప్పుడు నేను ఏదైతే ఫీల్ అయ్యానో ఇప్పుడు ప్రేక్షకులు అదే బరువైన హృదయంతో బయటికి వస్తున్నారు. దర్శకుడు కళ్యాణ్ కృష్ణ నన్ను నమ్మి ఈ సినిమా చేసినందుకు ధన్యవాదాలు' అని దర్శకుడు నవీన్ గాంధీ చెప్పారు.

## అరుదైన అవార్డుల వేడుక



తెలుగు సినిమా అభివృద్ధికి పాటుపడిన ఎంతోమంది గొప్ప నటీనటులు, సాంకేతిక నిపుణులు, దర్శక, నిర్మాతలను సత్కరించేందుకు ఏర్పాటు చేసిన ఐకాన్స్ ఆఫ్ ఇండియన్ ఫిల్మ్ ఇండస్ట్రీ అవార్డ్స్ 2024 కార్యక్రమం హైదరాబాద్‌లో ఘనంగా జరిగింది. తెలుగు ఫిల్మ్ అండ్ టెలివిజన్ వెల్ఫేర్ ఫోరమ్ చైర్మన్ నాగబాల సురేష్ ఆధ్వర్యంలో ఈ అవార్డ్స్ కార్యక్రమాన్ని నిర్వహించారు. విజన్ వివికె హౌసింగ్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ అధినేత వి.వి.విజయ్ కుమార్ స్పాన్సర్‌గా వ్యవహరించారు. తెలంగాణ ఎలక్షన్ కమిషనర్ పార్థసారథి ఐ.ఎ.ఎస్. ముఖ్య అతిథిగా హాజరై అవార్డ్ విన్నర్స్‌ని అభినందించడం విశేషం.

నాగబాల సురేష్ మాట్లాడుతూ,'తెలుగు టి.వి. కార్మికుల సంక్షేమం కోసం ఏదైనా చేయాలని అనుకున్నప్పుడు విజన్ వివికె హౌసింగ్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ అధినేత విజయ్ ముందుకొచ్చి వివిధ విభాగాల కార్మికులకు వాళ్ల వెంచర్ నుంచి 101 ప్లాట్లను కేటాయించారు. తెలుగు ఫిల్మ్ అండ్ టెలివిజన్ వెల్ఫేర్ ఫోరమ్ పెట్టడానికి కూడా ఆయన సహకారం ఉంది. తెలుగు సినిమా లెజెండ్స్ జీవితాలపై డాక్యుమెంటరీస్ రూపొందించాను. వాళ్ల తెలుగు సినిమా అభివృద్ధికి తమ జీవితాలను త్యాగం చేశారని తెలుసుకున్నాను. ఒక చిన్న కెమెరా పట్టుకుని మొదలైన తెలుగు సినిమా ప్రస్థానం ఇవాళ అంతర్జాతీయ స్థాయికి చేరుకుంది. మన ఇండస్ట్రీకి సేవ చేసిన అలాంటి గొప్పవారిని స్మరించుకోవడం నేటి తరం బాధ్యత. ఆ ప్రయత్నంలో భాగంగానే ఘనంగా ఐకాన్స్ ఆఫ్ ఇండియన్ ఫిల్మ్ ఇండస్ట్రీ అవార్డ్స్ నిర్వహిస్తున్నాం' అని అన్నారు.

'సినిమా ఇండస్ట్రీకి మేము ఏం సేవ చేయలేదు. ఒక్కొక్కరం ఒక్కో ఆశతో ఇండస్ట్రీకి వచ్చాం. అయితే వచ్చాక కుటుంబ జీవితం కోల్పోయాం. ఉదయం ఇంటి నుంచే లొకేషన్ వెళ్తే ఎప్పుడు తిరిగి వస్తామో తెలియదు. అలా కొన్నేళ్లు గడిచిపోయాయి. 50 ఏళ్లుగా మేము ఇండస్ట్రీలో ఉంటున్నాం. మనం ఇలాంటి అవార్డ్స్ ఇవ్వలేకపోయాం. సురేష్, విజయ్ లాంటి వాళ్లు మొదలుపెట్టినప్పుడైనా సపోర్ట్ చేద్దాం. ఇవాళ ఈ కార్యక్రమానికి రాని వాళ్లకు ఇంటికి వెళ్లి మరీ అవార్డ్స్ ఇద్దాం. నెక్ట్ ఇయర్ అయినా వాళ్లంతా వచ్చేలా చేద్దాం' అని దర్శక, నిర్మాత తమ్మారెడ్డి భరద్వాజ చెప్పారు.

# ఉత్త మాటలే...!

- హోదా,విభజన హామీల ఊసెత్తని మోడీ
- విశాఖ ఉక్కు ప్రస్తావన లేదు
- చంద్రబాబు, పవన్‌లదీ అదే తీరు
- రాష్ట్రంలో అవినీతి సర్కారును ఓడించాలని పిలుపు
- వికసిత్ ఆంధ్రప్రదేశ్ లక్ష్యమని ప్రకటన
- ఇండియా బ్లాక్‌పై విమర్శలు







అమరావతి: గుంటూరు జిల్లా చిలకలూరిపేటలో 'ప్రజాగళం' పేరుతో జరిగిన ప్రధాని మోడీ సభ మాటల మాయాజాలానికే పరిమితమైంది. ఎన్‌డీఏ కూటమిలోని తెలుగుదేశం, జనసేన, బీజేపీ కలిసి రాష్ట్రంలో నిర్వహించిన తొలి సభ కావడంతో పాటు, ప్రధాని మోడీ హాజరవుతుండటంతో రెండు రోజుల ముందునుండే కార్పొరేట్ మీడియా విస్తృత ప్రచారం కల్పించింది. రాష్ట్రం ఎదుర్కొంటున్న అన్ని సమస్యలకు ఈ సభలోనే మోడీ పరిష్కారం చేస్తారన్నట్టుగా ఈ ప్రచారం సాగింది. అయితే, ఆదివారం సాయంత్రం జరిగిన సభలో మోడీ రాష్ట్రానికి సంబంధించిన అన్ని కీలక సమస్యలను విస్మరించారు. ప్రత్యేకహోదా, విభజన హామీలను కూడా ఆయన ప్రస్తావించలేదు. కొద్ది సంవత్సరాల క్రితం తాను స్వయంగా శంకుస్థాపన చేసి, పిడికెడు మట్టి, చెంబుడు నీళ్ల కుమ్మరించిన అమరావతికి కొన్ని కిలోమీటర్ల దూరంలోనే ఈ సభ జరిగినప్పటికీ రాజధాని అంశాన్ని మోడీ మాటవరసకి కూడా మాట్లాడలేదు. సంవత్సరాల తరబడి సాగుతున్న విశాఖ ఉక్కు ప్రయివేటీకరణ వ్యతిరేక పోరాటాన్ని ప్రస్తావించడం కానీ, రాష్ట్ర ప్రజల డిమాండ్‌కు అనుగుణంగా ప్రభుత్వ రంగంలోనే కొనసాగిస్తామని చెప్పడంకానీ చేయలేదు. అసలు అటువంటి ఆందోళనే రాష్ట్రంలో జరుగుతున్న విషయం తెలియని విధంగా ప్రధాని ప్రసంగం సాగింది. ఇతర ముఖ్యమైన సమస్యలను విస్మరించిన ప్రధాని 'వికసిత్ ఆంధ్రప్రదేశ్' తమ లక్ష్యమని చెప్పారు. సమస్యలు పరిష్కరించకుండా వికసిత రాష్ట్రం ఎలా సాధ్యమవుతుందో వివరించలేదు.

ప్రధానికి ముందు ప్రసగించిన టీడీపీ అధినేత చంద్రబాబునాయుడు, జనసేన అధ్యక్షులు పవన్ కల్యాణ్ కూడా ఈ అంశాలను నామమాత్రంగా కూడా ప్రస్తావించకపోవడంతో ఈ అంశాలపై ఎన్‌డీఏ కూటమి వైఖరి స్పష్టమైందన్న వ్యాఖ్యలు వినిపిస్తునాయి. తెలుగులో ప్రసంగాన్ని ప్రారంభించిన మోడీ రాష్ట్రంలో అవినీతి ప్రభుత్వం అధికారంలో ఉందని, దానికి చరమ గీతం పాడాలని పిలుపునిచ్చారు. రాష్ట్ర మంత్రులు అవినీతిలో ఒకరితో ఒకరు పోటీ పడుతున్నారని అన్నారు. కేంద్రంలో ఎన్‌డీఏకి మూడో సారి అధికారం ఇవ్వడం, రాష్ట్రంలో అవినీతి ప్రభుత్వానికి చరమగీతం పాడటమన్న రెండు సంకల్పాలను ప్రజలు తీసుకోవాలని చెప్పారు. వైసీపీ పాలనలో గడిచిన ఐదేండ్ల కాలంలో రాష్ట్ర అభివృద్ధి కుంటుపడిందని చెప్పారు.

ఎన్‌డీఏతోనే దేశ అభివృద్ధి, రాష్ట్ర అభివృద్ధి జరుగుతుందని చెప్పారు. ప్రభుత్వ వ్యతిరేక ఓటును చీల్చడానికి కాంగ్రెస్ ప్రయత్నిస్తోందన్నారు. రాష్ట్రంలో జగన్ పార్టీ, కాంగ్రెస్ పార్టీ వేర్వేరు కాదని, రెండు ఒకే కుటుంబం చేతిలో ఉన్న విషయాన్ని గుర్తుపెట్టుకోవాలని చెప్పారు. ఇండియా బ్లాక్‌లో పార్టీలు ఎవరికి వారుగా వ్యవహరిస్తుంటారని అన్నారు. ఎన్నికల అవసరాలకోసం ఏర్పాటైందని అన్నారు. పదేండ్ల తన పాలనలో రాష్ట్రానికి ఎంతో చేశానని చెప్పారు. అనేక జాతీయ విద్యాసంస్థలను ఇచ్చినట్లు తెలిపారు. దేశ వ్యాప్తంగా 30 కోట్ల మందిని పేదరికం నుంచి బయట పడేసినట్లు చెప్పారు. ఎన్‌డీఏకు 400కు పైగా ఎంపీ సీట్లు దాటాలని అప్పుడే వికసిత్ భారత్, ఆంధ్రప్రదేశ్ లక్ష్యం సాధ్యమవుతుందని చెప్పారు. చంద్రబాబు, పవన్ కల్యాణ్ ఇద్దరూ రాష్ట్ర వికాసానికి చేసిన కృషిని, పోరాటాన్ని ప్రజలు గుర్తించాలని అన్నారు. ఆంధ్రప్రదేశ్‌లోనూ డబుల్ ఇంజిన్ సర్కారు రావాలని చెప్పారు.

కోటప్ప కొండకు సమీపంలో సభ జరుగుతుండటంతో 'త్రిమూర్తుల' ఆశీర్వాదం తనకు లభిస్తోందని చెప్పారు. మూడవ సారి అధికారంలోకి వచ్చిన తరువాత మరిన్ని ధృడమైన నిర్ణయాలను తీసుకోవాల్సివుందన్నారు. మాజీ ప్రధాని పివి నరసింహరావును, టీడీపీ వ్యవస్థాపక అధ్యక్షులు ఎన్‌టి రామారావును తన ప్రసంగంలో మోడీ గుర్తు చేసుకున్నారు. ఎన్‌టిఆర్ రాముడి పాత్రలో జీవించారని, రైతుల కోసం, పేదల కోసం పోరాడారని అన్నారు. ఎన్‌టిఆర్ శతాబ్ది ఉత్సవాల వేళ ఆయన స్మారక నాణాన్ని విడుదల చేసినట్లు తెలిపారు. కాంగ్రెస్ పార్టీ విస్మరించిన, తెలుగుబిడ్డ పివి నరసింహరావుకు భారత రత్న ఇచ్చి గౌరవించినట్లు చెప్పారు.

# ఆటలు

## డబ్ల్యూపీఎల్ విజేత ఆర్‌సీబీ



### ఫైనల్లో చతికలబడ్డ ఢిల్లీ



న్యూఢిల్లీ : మహిళా ప్రీమియర్ లీగ్ (డబ్ల్యూపీఎల్) రెండో సీజన్‌లో రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు (ఆర్‌సిబి) విజేతగా నిలిచింది. ఆదివారం ఉత్కంఠభరితంగా జరిగిన ఫైనల్‌లో ఢిల్లీ క్యాపిటల్స్‌పై ఆర్‌సిబి ఎనిమిది వికెట్లతో ఇంకా మూడు బంతులు మాత్రమే మిగిలిఉండగా విజయం సాధించింది. ఢిల్లీ విధించిన 114 పరుగుల లక్ష్యాన్ని ఆర్‌సిబి 19.3 ఓవర్లల్లో రెండు వికెట్లు కోల్పోయిసాధించింది. అయితే స్వల్ప లక్ష్యాన్ని కూడా చివరి వరకూ కొనసాగించి ఢిల్లీ తన పోరాటాన్ని ప్రదర్శించింది. అయితే మొత్తంగా ఈ టోర్నీలో వరసగా రెండోసారి ఫైనల్‌కు చేరిన ఢిల్లీకి ఈ ఏడాది కూడా నిరాశ తప్పలేదు. గత ఏడాది జరిగిన డబ్ల్యూపీఎల్ తొలి సీజన్‌లో తుదిపోరులో ఢిల్లీపై ముంబయి ఇండియన్స్ విజయం సాధించింది టైటిల్‌ను గెలుచకున్న సంగతి తెలిసిందే.

కాగా, ఆదివారం లక్ష్యఛేదనలో ఆర్‌సిబికి ఓపెనర్లు సోఫియా డివేన్ 32 పరుగులు (27 బంతుల్లో ఒక సిక్స్, ఐదు ఫోర్లు), కెప్టెన్ స్మృతి మంధనా 31 పరుగులు (39 బంతుల్లో మూడు ఫోర్లు)తో శుభారంభం ఇచ్చారు. ఈ తరువాత ఎలీస్ పెర్రీ- వికెట్ కీపర్ రిచా గోష్ అజేయంగా



నిలిచి ఆర్‌సిబికి విజయాన్ని అందించారు. ఎలీస్ పెర్రీ 35 పరుగులు (37 బంతుల్లో నాలుగు ఫోర్లు) రిచా ఘోష్ 17 పరుగులు (14 బంతుల్లో రెండు ఫోర్లు) సాధించారు. ఎలీస్ పెర్రీ ఈ లీగ్‌లో అత్యధిక పరుగులు చేసిన బ్యాటర్లలో అగ్రస్థానంలో నిలిచింది. పెర్రీ మొత్తంగా 347 పరుగులు చేయడమే కాకుండా 7 వికెట్లూ పడగొట్టింది.

ఈ టోర్నీలో ముందుగా తడబాటును ఎదుర్కొన్నా ఆ తరువాత ఆర్‌సిబి బలంగా పుంజుకుని ఆఖరికి టైటిల్ విజేతగా నిలిచింది. లీగ్ దశలో 8 మ్యాచ్‌ల్లో నాలుగు చొప్పున విజయాలు, ఓటములతో మూడో స్థానంలో ఆర్‌సిబి నిలిచింది. ఎలిమినేటర్‌లో డిఫెండింగ్ ఛాంపియన్ ముంబయికి షాకిచ్చిన ఆర్‌సిబి ఫైనల్‌కు చేరుకుంది.

కాగా, ఆదివారం మ్యాచ్‌లో ముందుగా టాస్ గెలిచి బ్యాటింగ్‌కు దిగిన ఢిల్లీకి రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు బౌలర్లు చుక్కలు చూపించారు. ఆరంభంలో దూకుడుగా ఆడిన ఢిల్లీ జట్టును.. కట్టుదిట్టంగా బంతులు వేసి ఉక్కిరిబిక్కిరి చేశారు. ఫలితంగా ఢిల్లీ క్యాపిటల్స్ 18.3 ఓవర్లలో జట్టు 113 పరుగులకే ఆలౌటైంది. ఓపెనర్లు మెగ్ లానింగ్ (23), షెఫాలి వర్మ (44) మినహా ఎవరూ రాణించలేదు. వికెట్ నష్టపోకుండా పవర్ ప్లేలో 61 పరుగులు చేసిన ఢిల్లీకి సోఫీ మోలినక్స్ షాకిచ్చింది. 8వ ఓవర్‌లో వరుసగా 3 వికెట్లు పడగొట్టింది. ఆ తర్వాత కూడా ఢిల్లీ వికెట్ల పతనం ఆగలేదు. వచ్చినవాళ్లు వచ్చినట్టే పెవిలియన్ బాట పట్టారు. చివర్లో రాధా యాదవ్ (12), అరుంధతి రెడ్డి (10) బ్యాటు ఝుళిపించే ప్రయత్నం చేశారు. బెంగళూరు బౌలర్లలో శ్రేయాంకా పాటిల్ 4, సోఫీ మోలినక్స్ 3, ఆశా శోభన 2 వికెట్లు పడగొట్టారు.

## స్వదేశం తిరిగొచ్చిన కోహ్లి

ముంబయి : మరో కొన్ని రోజుల వ్యవధిలోనే ఐపీఎల్ ప్రారంభం కానున్న నేపథ్యంలో రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు అభిమానులకు శుభవార్త. ఆర్‌సీబీ కీలక ఆటగాడు విరాట్ కోహ్లి భారత్‌కు తిరిగొచ్చాడు. ముంబై విమానాశ్రయంలో విరాట్ కనిపించాడు. గత రెండు నెలలుగా కోహ్లి కుటుంబంతో కలిసి లండన్‌లో ఉన్నారు. ఐపీఎల్ 17వ ఎడిషన్ మార్చి 22 నుంచి ప్రారంభం కానుంది. ఇంకా వారం రోజులు కూడా లేదు. మొదటి మ్యాచ్ రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు, చెన్నై సూపర్ కింగ్స్ మధ్య జరగనుంది. ఈ క్రమంలో తొలి మ్యాచ్‌లో భారత క్రికెట్ జట్టు ఆటగాళ్లు ధోనీ, విరాట్ కోహ్లి ముఖాముఖి తలపడనున్నారు. ఈ ఏడాది ఐపిఎల్ ప్రారంభానికి ముందే కింగ్ కోహ్లి దేశానికి తిరిగి రావడంతో ఆర్‌సిబి అభిమానుల్లో ఆనందం నెలకొంది.

అలాగే ఈ ఐపీఎల్ సీజన్ విరాట్ కోహ్లికి చాలా ప్రత్యేకమని చెప్పవచ్చు. ఈ సీజన్‌లో విరాట్ నుంచి మంచి ప్రదర్శన ఉంటుందని అభిమానులు ఆశిస్తున్నారు. ఈ ఏడాదిలో జరిగే టీ20 ప్రపంచ కప్ కోసం విరాట్ ఎంపిక కూడా ఈ ఐపిఎల్‌లో ప్రదర్శనపై ఆధారపడి ఉంటుందని తెలుస్తోంది. 35 ఏండ్ల విరాట్ కోహ్లి భారత్ తరపున 117 అంతర్జాతీయ మ్యాచ్‌లు ఆడాడు. వీటిలో ఒక సెంచరీ, 37 హాఫ్ సెంచరీలతో 4037 పరుగులు చేశాడు.

## నేటి నుంచి ఐపిఎల్ టికెట్ల విక్రయం

చెన్నై : ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపిఎల్) పోటీలు ఈ నెల 22 నుంచి ప్రారంభం కానున్నాయి. తొలి మ్యాచ్ ఎంఎ చిదంబరం స్టేడియంలో రాత్రి 7:30 గంటలకు చెన్నై సూపర్ కింగ్స్ - రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు మధ్య జరగనుంది. ఈ మ్యాచ్ టిక్కెట్ల విక్రయం సోమవారం ఉదయం 9:30 గంటలకు ఆన్‌లైన్‌లో ప్రారంభం కానుంది. స్టేడియంలోని సి, డి, ఇ లోయర్ టికెట్టు ధర రూ.1,700, ఐ, జె, కె అప్పర్ రూ.4,000, ఐ, జె, కె లోయర్ రూ.4,500, సి, డి, ఇ అప్పర్ రూ.4,000, కెఎంకె టెర్రస్ టికెట్టు ధర రూ.7.500గా నిర్ణయించారు. ఆన్‌లైన్‌లో ఒకరు రెండు టిక్కెట్లు మాత్రమే కొనుగోలు చేయవచ్చని, పెటిఎం, చెన్నై సూపర్ కింగ్స్ వెబ్‌సైట్ ద్వారా టికెట్లు కొనుగోలు చేయవచ్చని సిఎస్‌కె చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ కెఎస్ విశ్వనాథన్ తెలిపారు. 22న మ్యాచ్ ప్రారంభోత్సవం సందర్భంగా ప్రత్యేక కార్యక్రమాలు జరగనున్నాయి.

## ఆసీస్ గొప్పేమీ లేదు

### పిచ్ వల్లే భారత్‌కు ఓటమి : కైఫ్

ముంబయి: వన్డే ప్రపంచ కప్ ఫైనల్ ఓటమి.. ప్రతి భారత క్రికెట్ అభిమానికి గుర్తుండే ఉంటుంది. వరుసగా పది మ్యాచ్‌లు గెలిచి సమరోత్సాహంతో తుది పోరుకు చేరిన రోహిత్ సేనకు ఆస్ట్రేలియా అడ్డుగా నిలిచింది. మూడోసారి వరల్డ్ కప్‌ను సొంతం చేసుకోవాలన్న ఆశలకు బ్రేక్ వేసింది. అహ్మదాబాద్ వేదికగా జరిగిన ఫైనల్‌లో టీమ్‌ఇండియా పరాజయం పాలైంది.

ఆసీస్ గొప్పగా ఆడటం కంటే .. భారత తప్పిదాలే ఎక్కువగా ఉన్నాయని ఓటమిపై కొందరి వాదన. ప్రత్యర్థి జట్టును ఇరుకున పెట్టాలని భావించి 'స్లో పిచ్' రూపొందిస్తే.. అదే బూమరాంగ్ అయిందని మాజీ క్రికెటర్లు విశ్లేషించారు. తాజాగా ఇదే అంశంపై టీమ్‌ఇండియా మాజీ ఆటగాడు మహమ్మద్ కైఫ్ ఓ చర్చా కార్యక్రమంలో స్పందించాడు.

Printed and Published by Nandayala Narsimha Reddy On behalf Of Navatelangna Printers Private Limited, Printed At M.H Bhavan, 1st Floor, Plot No. 21/1, Azamabad Near Rtc Kalyana Mandapam, Baghlingampally, Hyderabad-500020,Telangana State, Published at Navatelangana Printers Private Limited, M.H Bhavan,1st Floor No.21/1, Azamabad, Near Rtc Kalyana Mandapam, Baghlingampally, Hyderabad-500020, Telangana State, Editor : R.Sudha Bhaskar. TELTEL/2014/59462.